ఈనాడు



విజయవాడ 27-11-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 107
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో రాష్ట్రపతి ముర్ముతో పాటు రాజ్యాంగ పీఠిక చదువుతున్న కేంద్ర మంత్రి నడ్డా, ప్రధాని మోదీ, ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, లోక్‌సభ విపక్ష నేత రాహుల్‌గాంధీ

రాజ్యాంగమే మూలస్తంభం

- వలసవాద తత్వానికి ముగింపు పలికే ఆయుధం
- జాతీయవాద ఆలోచనలకు మార్గదర్శి
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వెల్లడి
- తెలుగు సహా 9 భాషల్లో రాజ్యాంగ డిజిటల్ ప్రతులు
- సంవిధాన్ సదన్‌లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
- ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ విధులే పునాది: లేఖలో మోదీ

దిల్లీ: దేశానికి రాజ్యాంగమే మూలస్తంభమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. జాతీయవాద ఆలోచనలకు అది మార్గదర్శి అని, వలసవాద మనస్తత్వాలకు ముగింపు పలికే ఆయుధమని చెప్పారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం పాత పార్లమెంటు భవనం (సంవిధాన్ సదన్) సెంట్రల్ హాల్లో జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లోని పార్లమెంటు ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబిస్తోందని, ఇది ఎన్నో దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. 'రాజ్యాంగం అనేది (మిగతా 3లో)



మాక్ అసెంబ్లీలో ప్రమాణం చేస్తున్న విద్యార్థులు

పిల్లల సభ భేష్!

- అమరావతిలో ఆసక్తికరంగా విద్యార్థుల మాక్ అసెంబ్లీ
- నిజమైన సభను తలపించిన 'ఏపీ పాఠశాల శాసనసభ'
- మంత్రులుగా సమాధానం ఇవ్వడంలో అదరగొట్టిన బాలలు
- సభాపతిగా ఆకట్టుకున్న స్వాతి
- పిల్లల కోసం రూపొందించిన భారత రాజ్యాంగం పుస్తకం ఆవిష్కరణ

శ్రమ, ధైర్యం.. మీ విజన్‌కు ఇంధనం

సంక్షోభాలు వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలి

విద్యార్థులకు చంద్రబాబు దిశానిర్దేశం

13లో

400 ఎకరాల్లో రిలయన్స్ డేటా సెంటర్

పల్లెల్లో వసతులు.. ప్రజల జీవితాల్లో వెలుగులే లక్ష్యం

రూ.6,787 కోట్లతో పల్లెపండుగ 2.0కు శ్రీకారం

మరో పదిహేనేళ్లు అధికారమిస్తే బంగారు భవిత అందిస్తాం

కోనసీమ అభివృద్ధికి రూ.100 కోట్లు

శివకోటి సభలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

3లో

- 1,000 మెగావాట్ల సామర్థ్యం
- రూ.98 వేల కోట్ల పెట్టుబడులు
- డిజిటల్ కనెక్షన్‌తో జాయింట్ వెంచర్
- 2030 నాటికి విశాఖలో అందుబాటులోకి



ఈనాడు - అమరావతి

విశాఖపట్నం మూడు నాలుగేళ్లలో డేటాసెంటర్ల హబ్‌గా మారనుంది. ప్రపంచ దిగ్గజ సంస్థలు డేటాసెంటర్ల ఏర్పాటుకు విశాఖకు వరుస కట్టాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ డిజిటల్ కనెక్షన్స్‌తో కలిసి జాయింట్ వెంచర్‌గా 1,000 మెగావాట్ల డేటాసెంటర్‌ను విశాఖలో 400 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనుంది. రూ.98 వేల కోట్లతో ఏఐ ఆధారిత డేటాసెంటర్‌ను 2030 నాటికి అందుబాటులోకి తేనుంది. నవంబరు 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో ఆ సంస్థ ప్రతినిధులు సీఎంను కలిసి ప్రతిపాదనపై చర్చించారు. డేటా సెంటర్ ఏర్పాటుకు అవసరమైన భూములు, ఇతర అంశాలపై తుది చర్చల అనంతరం ప్రభుత్వంతో రిలయన్స్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడులతో 1,000 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు గూగుల్ ఇప్పటికే ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మరో అంతర్జాతీయ దిగ్గజసంస్థ బ్రూక్‌ఫీల్డ్ సైతం రూ.1.10 లక్షల కోట్లతో విశాఖలో డేటాసెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. సిఫీ టెక్నాలజీస్ రూ.16వేల కోట్ల పెట్టుబడితో విశాఖలో డేటా సెంటర్ కాంప్లెక్స్ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించింది.

డేటాసెంటర్ ప్రత్యేకతలు

విశాఖలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ 400 ఎకరాల్లో డేటాసెంటర్‌ను ఏర్పాటు చేయబోతోంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఉన్న 1,000 మెగావాట్ల డేటాసెంటర్‌కు అనుబంధంగా ఇది పనిచేస్తుంది. మాడ్యులర్ సాంకేతికతల గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్ (జీపీయూ), టెన్సర్ ప్రాసెసింగ్ యూనిట్ (టీపీయూ), ఏఐ ప్రాసెసర్ల ద్వారా డేటా నిల్వచేసేలా అత్యాధునిక సాంకేతికతతో వివిధ సంస్థల అవసరాలకు అనుగుణంగా వాటిని సంస్థ తీర్చిదిద్దనుంది. సబ్‌స్టేషన్లు, అవసరమైన విద్యుత్ ఫీడర్లతో భవిష్యత్తు దశాబ్ద ఆవిష్కరణలకు వీలుగా దీన్ని ఏర్పాటు చేయనుంది. ఆసియాలో అత్యంత శక్తిమంతమైన ఏఐ మౌలిక సదుపాయాలున్న నెట్‌వర్క్‌లలో ఒకటిగా రిలయన్స్ డేటాసెంటర్ ఉండబోతోందని అధికారులు తెలిపారు.

లక్ష్యంలో సగం పూర్తి

విశాఖలో 6,000 మెగావాట్ల డేటాసెంటర్లు ఏర్పాటుచేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. వాటిని 2030 నాటికి అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే గూగుల్, రిలయన్స్ బ్రూక్‌ఫీల్డ్ కలిపి (మిగతా 3లో)





అగ్నికీలల్లో భవనాలు

హాంకాంగ్‌లో భారీ అగ్నిప్రమాదం

బహుళ అంతస్తుల భవన సముదాయంలో చెలరేగిన మంటలు

36 మంది మృతి.. 279 మంది గల్లంతు

12లో



స్వర్గలోకప్రాప్తి



జననం: 10-04-1943

మరణం: 26-11-2025

శ్రీమతి చింతకుంట రత్నమ్మ గారు

W/o. శ్రీ చింతకుంట మునిస్వామి నాయుడు గారు

మా మాతృమూర్తి **శ్రీమతి రత్నమ్మ** గారు తేది. 26-11-2025, బుధవారం ఉదయం 3.39 ని॥లకు మమ్మల్ని విడిచి, దైవసన్నిధికి చేరారని తెలియజేయుటకు చింతిస్తున్నాము. ఆమె జీవితకాలం చేసిన పుణ్యఫలాలు మాకు శ్రీరామ రక్ష. మాకు అందించిన మధురస్మృతులు మేము చిరకాలం స్మరిస్తూనే ఉంటాం. అమ్మ పవిత్ర ఆత్మకు నిత్యము శాంతి కలగాలని సదా శివుణ్ణి ప్రార్థిస్తూ...

కుమారులు	- కోడళ్ళు
CM సురేష్	- శకుంతల
CM రమేష్ MP - Anakapalli	- శ్రీదేవి
CM ప్రకాష్ (లేట్)	- జ్యోతి
CM రాజేష్	- ప్రకృతి

కుమార్తెలు	- అల్లుళ్ళు
శ్రీమతి గుమ్మళ్ళ మాధవి	- గోవర్ధన్ నాయుడు
శ్రీమతి పాటూరు విజయలక్ష్మి	- ధనుంజయ

మరియు కుటుంబ సభ్యులు

& STAFF- RITHWIK PROJECTS PRIVATE LIMITED

కార్యస్థలం: తేది. 27-11-2025 గురువారం ఉదయం 11 గంటలకు కడప జిల్లా, ఎర్రగుంట్ల మండలం, పోట్లదుర్తి గ్రామంలో అంతిమ సంస్కారములు నిర్వహించబడును.


హర్దిక్ రాఠీ

బాస్కెట్‌బాల్ మైదానంలో ఘోర విషాదం

ప్రాక్టీస్ చేస్తుండగా ఐరన్ పోల్ విరిగిపడి ఇద్దరు యువ క్రీడాకారుల దుర్మరణం

చండీగఢ్: హరియాణాలోని రెండు వేర్వేరు బాస్కెట్‌బాల్ మైదానాల్లో ఐరన్ పోల్‌లు ఛాతీపై పడి ఇద్దరు యువ క్రీడాకారులు ప్రాణాలు కోల్పోవడం కలకలం సృష్టిస్తోంది. ఈ రెండు సంఘటనలు దేశంలోని క్రీడా మౌలిక సదుపాయాలు ఎంత దారుణంగా ఉన్నాయో చెప్పడానికి నిదర్శనమని ఆటగాళ్లు, కోచ్‌లు విమర్శిస్తున్నారు. రోహ్‌తక్ జిల్లాకు చెందిన లాఖన్ మాజర్ గ్రామానికి చెందిన పదహారేళ్ల హర్దిక్ రాఠీ.. బాస్కెట్‌బాల్ క్రీడలో జాతీయ స్థాయి సబ్ జూనియర్ ఆటగాడు. ప్రాక్టీస్‌లో భాగంగా బాస్కెట్‌బాల్ హూప్‌ను పట్టుకొని వేలాడుతుండగా, ఐరన్ పోల్ అతనిపై పడింది. సహచర క్రీడాకారులు అతణ్ని వెంటనే ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాఠీ మంగళవారం మృతి చెందారు. ఈ విషాద సంఘటన సీసీటీవీ కెమెరాలో రికార్డైంది. పోల్ తుప్పుపట్టిందని, మరమ్మతు చేయమని ఎన్నో సార్లు అధికారులకు చెప్పామని, వారు పట్టించుకోలేదని హార్దిక్ సోదరుడు ఖడక్ సింగ్ వాపోయారు. భారత బాస్కెట్‌బాల్ జట్టుకు నేతృత్వం వహించడమే తన


విరిగిపడిన ఐరన్ పోల్

సోదరుడి కల అని పేర్కొన్నారు. ఝజ్జర్ జిల్లాలోని బహదూర్‌గఢ్‌లోని ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. హోషియార్ సింగ్ స్పోర్ట్స్ స్టేడియంలోని బాస్కెట్ బాల్ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న పదిహేనేళ్ల యువ క్రీడాకారుడు అమన్ ఛాతీపై ఐరన్ పోల్ పడింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆ క్రీడాకారుడు ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఈ రెండు ఘటనల్లో ఐరన్‌పోల్‌లు కూలిపోవడానికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

రాజ్యాంగమే మూలస్తంభం


రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంవిధాన్ సదన్ సెంట్రల్ హాలులో నిర్వహించిన వేడుకలకు హాజరైన పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ గౌరవానికి, గుర్తింపునకు నిలువెత్తు సాక్ష్యంగా నిలిచే పత్రం. దాని స్ఫూర్తితోనే సామాజిక, సాంకేతిక అభివృద్ధి జరుగుతోంది. రాజ్యాంగ వ్యవస్థకు అనుగుణంగానే శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు బలంగా పనిచేస్తున్నాయి. లోతైన రాజకీయ ఆలోచనల విషయంలో మిగతా ప్రజాస్వామ్యాలతో పోలిస్తే.. భారత ప్రజాస్వామ్యాన్ని సువర్ణాక్షరాలతో లిఖించవచ్చు' అని వివరించారు. తొమ్మిది భాషల్లో రూపొందించిన రాజ్యాంగ డిజిటల్ ప్రతులను ఆమె విడుదల చేశారు. తెలుగు, మలయాళం, మరాఠీ, నేపాలీ, పంజాబీ, బోడో, కశ్మీరీ, ఒడియా, అస్సామీ భాషల్లో దానిని రూపొందించారు.

ప్రతి పుటలో భారతీయ ఆత్మ: రాధాకృష్ణన్

ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ మాట్లాడుతూ- వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ దేశాన్నీ గొప్పగా మార్చలేమని, రాజ్యాంగంలోని ప్రతి పుటలో భారతీయ ఆత్మ కనిపిస్తుందని చెప్పారు. రాజ్యాంగం నిత్యనూతన పత్రమని, అది ప్రతి పౌరుడి బాధ్యతలను చూసుకుంటుందని స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. ప్రతి పౌరుడూ రాజ్యాంగ విధులను సంపూర్ణంగా నిర్వర్తించాలని, అవి బలమైన ప్రజాస్వామ్యానికి పునాదులని పేర్కొంటూ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. తాను వెనుకబడిన వర్గం నుంచి వచ్చి 24 ఏళ్లుగా ప్రభుత్వాలకు అధినేతగా ఉన్నానంటే అది రాజ్యాంగం ఇచ్చిన శక్తేనని అన్నారు.

రాజ్యాంగంపై భాజపా-ఆరెస్సెస్ దాడి: కాంగ్రెస్

రాజ్యాంగంపై భాజపా-ఆరెస్సెస్ దాడి చేస్తున్నాయని, దాని ప్రతిష్ఠను దిగజారుస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. రాజ్యాంగ విలువలను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా తుంగలో తొక్కుతున్నారని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని రాజ్యాంగ పరిరక్షణ దినంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగంపై దాడిని అడ్డుకుంటామని అందరూ ప్రతిజ్ఞ చేయాలని లోక్‌సభ విపక్షనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికీ ఇచ్చిన పవిత్ర హామీ అని స్పష్టంచేశారు.



సుప్రీంకోర్టులో విదేశీ న్యాయమూర్తుల సమక్షంలో..

సుప్రీంకోర్టులో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో వివిధ దేశాల ప్రధాన న్యాయమూర్తులు పాల్గొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ వారిని స్వాగతించారు. సీజేఐ, జస్టిస్ జోయ్‌మల్యాబాగ్చీల ధర్మాసనంలో కూర్చుని విదేశీ న్యాయమూర్తులు విచారణలను ఆలకించారు. భూటాన్, కెన్యా, మారిషస్, శ్రీలంక ప్రధాన న్యాయమూర్తులు, కెన్యా, నేపాల్, శ్రీలంక, మలేసియాల సీనియర్ న్యాయమూర్తులు హాజరయ్యారు.

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సుప్రీంకోర్టులో నిర్వహించిన వేడుకల్లో కెన్యా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మార్థా కూమెతో కరచాలనం చేస్తున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

భారత్ నుంచి వస్తున్న హెచ్-1బీ వీసా దరఖాస్తుల్లో

నకిలీవే అధికం

అమెరికన్ దౌత్యవేత్త మహవష్ సిద్దిఖీ ఆరోపణ

చెన్నై, న్యూస్‌టుడే: భారత్ నుంచి వస్తున్న హెచ్-1బీ వీసా దరఖాస్తుల్లో నకిలీవే అధికమని అమెరికన్ దౌత్యవేత్త మహవష్ సిద్దిఖీ ఆరోపించారు. గతంలో చెన్నైలోని అమెరికన్ కాన్సులేట్‌లో పనిచేసిన మహవష్ సిద్దిఖీ ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. 2005-2007 మధ్యకాలంలో 51 వేల నకిలీ వీసా దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. భారత్ నుంచి వస్తున్న హెచ్-1బీ వీసా దరఖాస్తుల్లో అత్యధికం నకిలీవేనన్నారు. నకిలీ ధ్రువపత్రాలతో దరఖాస్తు చేస్తున్నారని, కొందరు ముఖాముఖికి కూడా హాజరు కాకుండా మోసానికి పాల్పడుతున్నారని తెలిపారు. తాను చెన్నై కాన్సులేట్‌లో ఉన్నప్పుడు ఈ మోసాన్ని గుర్తించి విదేశీ వ్యవహారాల కార్యదర్శికి సమాచారం ఇచ్చామని, రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోనే అత్యధికంగా హెచ్-1బీ వీసా ఇప్పించడానికి ఓ నెట్‌వర్క్ ఉందని ఆరోపించారు. హెచ్-1బీ వీసా వ్యవహారంలో జరుగుతున్న మోసాలపై అమెరికా మాజీ ప్రతినిధి, ఆర్థిక నిపుణుడు డేవ్ బ్రాట్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఏడాదికి 85 వేల మందికి మాత్రమే హెచ్-1బీ వీసా అందించాలని అమెరికాలో పరిమితి చట్టం ఉందన్నారు. చెన్నైలోని అమెరికన్ కాన్సులేట్‌లో మాత్రం 2024లో 2.2 లక్షల వీసాలు మంజూరయ్యాయని తెలిపారు.

గ్రహం అనుగ్రహం

27-11-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, మార్గశిర మాసం, శుక్లపక్షం
సప్తమి: రా. 7-08 తదుపరి అష్టమి
ధనిష్ఠ: రా. 10-22 తదుపరి శతభిష
వర్జ్యం: తె. 5-32 నుంచి
అమృత ఘడియలు: ఉ. 11-47 నుంచి 1-24 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-56 నుంచి 10-41 వరకు
తిరిగి మ. 2-22 నుంచి 3-06 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.15; సూర్యాస్తమయం: సా.5.20

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	18.0	29.0
శ్రీకాకుళం	19.0	30.0
అనంతపురం	19.6	32.0
కడప	20.0	29.0
రాజమహేంద్రవరం	20.0	34.0
విశాఖపట్నం	20.4	30.0
కర్నూలు	20.8	31.9
నరసాపురం	21.4	31.2
విజయవాడ	21.9	30.0
ఒంగోలు	22.8	30.5
తిరుపతి	23.5	30.2
నెల్లూరు	23.6	31.3
గుంటూరు	24.0	31.0
తాడేపల్లిగూడెం	28.0	30.0

ఇదీ సంగతి!



ఆధార్ మీద ఫొటో కూడా అంత బాగుంటే డౌట్ రాదా..?!

పల్లెల్లో వసతులు..

ప్రజల జీవితాల్లో వెలుగులే లక్ష్యం



పల్లెపండుగ 2.0 కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ★ పాల్గొన్న ప్రజలు, అభిమానులు

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, రాజోలు, అల్లవరం: "గత వైకాపా ప్రభుత్వం అప్పులు, విధ్వంసం, దోపిడీ, అవినీతి మనకు వారసత్వంగా ఇచ్చింది. వారి ఐదేళ్ల పాలన గుర్తుచేసుకుంటే రోడ్లపై గుంతల్లో చేపల వేట, మరమ్మతులకు నోచుకోని కాలువలు.. కక్ష సాధింపులే గుర్తొస్తాయి. ఇప్పుడు సమస్యలు చెప్పడం హక్కుగా భావించే పరిస్థితికి ప్రజలు వచ్చారు. మరో పదిహేనేళ్లు అండగా ఉండండి. మీ జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత మాది" అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం శివకోటిలో బుధవారం పల్లెపండుగ 2.0కు శ్రీకారం చుట్టి మాట్లాడారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతేడాది ఆగస్టులో రూ.3,500 కోట్లతో పల్లెపండుగ 1.0 పూర్తి చేశామని, ఇప్పుడు రూ.6,787 కోట్లతో 2.0 ప్రారంభించామన్నారు. రూ.5,838 కోట్లతో 8,571 కి.మీ రోడ్లు, రూ.375 కోట్లతో 25 వేల మినీ గోకులాలు, రూ.16 కోట్లతో సామాజిక గోకులాలు, రూ.406 కోట్లతో 15 వేల బస్‌షెల్టర్లు, రచ్చబండలు, డ్రెయిన్లు, రూ.4 కోట్లతో మ్యాజిక్ డ్రెయిన్లు, రూ.20 కోట్లతో 10 డీపీఆర్సీ భవనాలు, రూ.128 కోట్లతో 400 పంచాయతీ కార్యాలయాలు నిర్మిస్తామన్నారు. కోనసీమ అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

ఉపాధి అవకాశాలతో అభివృద్ధి

"2000 సంవత్సరం తర్వాత పుట్టినవారి గురించి ఆలోచిస్తున్నా. సంక్షేమం.. పథకాలు.. అభివృద్ధి ఉండాలి. అయితే ఉచిత పథకాలే ఓట్లు తీసుకురావు. విడగొట్టి పాలిస్తే నమ్మేందుకు ఈ జనరేషన్ సిద్ధంగా లేదు. ఉపాధి అవకాశాలు మెరుగుపడితే రాష్ట్రం, దేశం అభివృద్ధి సాధిస్తాయి. యువతకు నైపుణ్య శిక్షణ కల్పించాలి. స్వశక్తిపై ఆధారపడాలి' అని పవన్ కల్యాణ్ అన్నారు. యువత ఒత్తిడిని అధిగమించేందుకు యుద్ధక్రీడలు నేర్చుకోవాలన్నారు. ప్రతి రాజకీయ నాయకుడికి శల్య పరీక్షలు పెట్టాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించనివారిని ఉపేక్షించేది లేదని.. అది జనసేన, కూటమి పార్టీలైనా సరే.. వారిని వదులుకుంటాం తప్ప ప్రజలను కాదన్నారు. కొందరు వైకాపా నేతలు బూతులు మానలేదని.. పిచ్చి ప్రేలాపనలు చేస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయన్నారు.

వైకాపా అధికారంలో ఉంటే తిరుగుబాటు వచ్చేది

"నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక తరహాలో ఇక్కడ కూడా తిరుగుబాటు వచ్చేందుకు కొందరు యత్నిస్తున్నారు. మరో ఏడాది వైకాపా అధికారంలో ఉంటే అదే జరిగేది. రాజోలు గడ్డపై చెబుతున్నా.. మరో పదిహేనేళ్లు మేమే అధికారంలో ఉంటాం. గత ప్రభుత్వానికి అండగా ఉన్న పత్రికలు మీడియా చేశారని మాట్లాడుతున్నారు. మేం వారిలా దోచేయలేదు. పిటిషన్ ఇస్తే భయపెట్టలేదు. సకాలంలో జీతాలిస్తున్నాం. బలంగా నిలబడి ఉన్నాం" అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

పీఎం భద్రతా సిబ్బంది తట్టుకోలేకపోతున్నారు

ప్రధాని కర్నూలు పర్యటనకు వెళ్లినా ఇబ్బంది ఉండదుగాని.. మీరున్న సభకు రావాలంటే జనసేన అభిమానుల ఉత్సాహాన్ని ఎలా ఆపాలో తెలియడం లేదని మోదీకి రక్షణ కల్పించే ఎస్పీజీ బృందం తనతో అన్నారని పవన్ వ్యాఖ్యానించారు. 'మీరు ఎంత ప్రేమ చూపుతారో.. గొడవ పెట్టుకున్నా అలాగే ఉంటుంది. గత ప్రభుత్వంతో పెట్టుకోవడం వల్లే పల్లె పండుగకు ఇక్కడ శ్రీకారం చుట్టాం' అని అన్నారు. అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, ఎమ్మెల్యేలు దేవ వరప్రసాద్, గిడ్డి సత్యనారాయణ, ఆనందరావు, బండారు సత్యానందరావు, కలెక్టర్ మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

కొబ్బరి రైతు రోడ్డున పడకూడదు

45 రోజులు సమయమివ్వండి.. పరిష్కారం చూపిస్తా

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హామీ
- కోనసీమలోని కేశనపల్లిలో దెబ్బతిన్న చెట్ల పరిశీలన

ఈనాడు-రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే-రాజోలు, మామిడికుదురు: కోనసీమలో ఉప్పునీటి ప్రభావం వల్ల దెబ్బతిన్న కొబ్బరిచెట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని, ఇందుకు 45 రోజులు సమయమివ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రైతులను కోరారు. డ్రెయిన్ల ఆధునికీకరణతో అది సాధ్యమేనని, మరో రెండు దఫాలు కలిసి చర్చిద్దామని పేర్కొన్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లిలో కొబ్బరిచెట్లు చనిపోవడానికి కారణమైన శంకరగుప్తం డ్రెయిన్‌తో పాటు తోటలను బుధవారం ఆయన పరిశీలించారు. అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఉద్యానశాఖ కమిషనర్ కె.శ్రీనివాస్, కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్, జలవనరుల శాఖ అధికారులు సమస్య తీవ్రతను వివరించారు. ఎదిగిన చెట్టు తల లేకుండా కనిపిస్తుంటే.. ఎదిగిన బిడ్డ చనిపోయినంత బాధ అనిపిస్తుందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితిని చక్కదిద్దాలంటే రెండేళ్లు పడుతుందన్నారు.

సమగ్ర నివేదిక ఇవ్వండి

ఉప్పునీళ్లతో రాజోలు నియోజకవర్గ తీరగ్రామాల్లో లక్షల కొబ్బరిచెట్లు నాశనమయ్యాయని, జిల్లాలోని అన్ని డ్రెయిన్లలో ఇదే పరిస్థితి ఉన్నందున శాశ్వత పరిష్కారం చూపాలని పవన్ అన్నారు. రూ.22 కోట్లతో కాలువ పనులు చేస్తే తాత్కాలికంగా సమస్య తీరుతుందన్నారు. డ్రెయిన్ల ప్రక్షాళనే లక్ష్యమని, రూ.3,500 కోట్లు అవసరమవుతాయని కలెక్టర్ చెప్పినట్లు పేర్కొన్నారు.

అధికారులకు చురకలు

శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ స్వరూపం, ఆక్రమణలపై అధికారులకు సమగ్ర అవగాహన లేకపోవడంపై ఉప ముఖ్యమంత్రి చురకలు వేశారు. విశ్రాంత సీఈ టీసీ రోశయ్య ఇచ్చిన నివేదికను చూడాలని కలెక్టర్‌కు సూచించారు. 14 రోజుల్లో నివేదిక సిద్ధం చేయాలన్నారు.

కొబ్బరికి దిష్టి తగిలింది

'గోదావరి జిల్లాలు అన్నపూర్ణగా భాసిల్లుతున్నాయి. రాష్ట్రం విడిపోవడానికి కారణం వీటి పచ్చదనమే. నిత్యం పచ్చగా ఉంటుందని తెలంగాణ నాయకులంతా అంటారు. ఇప్పుడు కొబ్బరికి దిష్టి తగిలినట్లుంది' అని పవన్ వ్యాఖ్యానించారు. కొబ్బరిబోర్డు ఏర్పాటును కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్నారు. మలికిపురం మండలం చింతలమోరిలో ప్రారంభమయ్యే శంకరగుప్తం డ్రెయిన్ 23 కి.మీ. తర్వాత గోదావరిలో కలుస్తుందని, 8 కి.మీ. మినహా మిగతాచోట పూడిక తీశారని రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్ తెలిపారు.

"శంకరగుప్తం డ్రెయిన్ వల్ల 50 ఏళ్ల వయసున్న 2వేల ఎకరాల్లోని 2లక్షల కొబ్బరిచెట్లు దెబ్బతిన్నాయి' అని కేశనపల్లి సర్పంచి యెనుముల నాగు ఉపముఖ్యమంత్రికి వివరించారు.



కేశనపల్లిలో దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్ ★ శివకోటిలో నిర్వహించిన పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. చిత్రంలో అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్, రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ మహేశ్‌కుమార్

తప్పిన 'సెన్యార్' ముప్పు!

- శ్రీలంక సమీపంలో మరో వాయు'గండం'
- 29 తర్వాత రాష్ట్రానికి భారీ నుంచి అతిభారీ వర్ష సూచన

ఈనాడు, విశాఖపట్నం: మలక్కా జలసంధి, ఇండోనేసియా సమీపంలోని తీవ్ర వాయుగుండం బుధవారం తుపానుగా బలపడింది. దీనికి భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సెన్యార్‌గా నామకరణం చేసింది. ఇది పశ్చిమ దిశగా కదులుతూ అతి తక్కువ సమయంలోనే ఇండోనేసియాలో తీరం దాటింది. గురువారం సాయంత్రం వరకు తీవ్రత కొనసాగుతుందని, తర్వాత బలహీనపడుతుందని అంచనా. ఇది దిశ మార్చుకుని.. తిరిగి మలేసియా వైపు వెళ్లే అవకాశముందని ఐఎండీ పేర్కొంది. దీని ప్రభావం భారత భూభాగంపై ఉండదని స్పష్టం చేసింది. మలక్కా జలసంధి సమీపంలో తుపాను ఏర్పడడం చాలా అరుదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. 1842 తర్వాత అక్కడ తుపాను బలపడడం ఇదే తొలిసారని అభిప్రాయపడుతున్నారు.

తమిళనాడు వైపు కదిలే అవకాశం

నైరుతి బంగాళాఖాతంలో శ్రీలంక సమీపంలో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది క్రమంగా ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ గురువారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. తర్వాత అదే దిశలో పయనిస్తూ.. శనివారం నాటికి ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాల వైపు కదులుతూ మరింత బలపడుతుందని అంచనా వేస్తోంది. ఇది తుపానుగా బలపడే అవకాశముందని కొన్ని వాతావరణ నమూనాలు సూచిస్తున్నాయి.

మత్స్యకారులకు హెచ్చరిక

దీని ప్రభావంతో శనివారం నుంచి సోమవారం వరకూ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. శనివారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, ప్రకాశం, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని తెలిపింది. ఆదివారం నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, యానాంతోపాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. గురువారం తీరం వెంబడి గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. శుక్ర, శని, ఆదివారాల్లో గరిష్ఠంగా 60 కి.మీ. నుంచి 70 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో ఆదివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

ఏజెన్సీలో పెరిగిన చలి

ఏజెన్సీ ప్రాంతాల్లో చలి తీవ్రత మళ్లీ పెరిగింది. మంగళవారం రాత్రి అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులో అత్యల్పంగా 8.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అన్నమయ్య, చిత్తూరు, శ్రీసత్యసాయి, విజయనగరం జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 16 డిగ్రీల్లోపు నమోదయ్యాయి. కళింగపట్నం, గన్నవరం, కడప, ఆరోగ్యవరం తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1 నుంచి 2 డిగ్రీలు తగ్గాయి.

లోకేశ్‌తో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ రామ్‌లాల్ భేటీ


మంత్రి లోకేశ్‌తో ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ రామ్‌లాల్‌జీ భేటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్‌తో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) అఖిల భారత సంపర్క్ ప్రముఖ్ రామ్‌లాల్ బుధవారం భేటీ అయ్యారు. ఈ మేరకు ఉండవల్లిలోని మంత్రి నివాసానికి వెళ్లిన ఆయన్ను మంగళగిరి శాలువాతో లోకేశ్ సత్కరించారు. బాలల రాజ్యాంగ పుస్తకాన్ని బహూకరించారు. ఆర్‌ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ రంగాల ప్రముఖులతో రామ్‌లాల్ సమావేశం అవుతున్నారు. దేశవ్యాప్తంగా ఆర్‌ఎస్ఎస్ చేపట్టిన కార్యక్రమాలు, సంస్థ విశిష్టతను ఈ సందర్భంగా రామ్‌లాల్ వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రామనారాయణరెడ్డి, అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎన్ఎండీ ఫరూక్, అనిత, సంధ్యారాణి, సవిత, కొండపల్లి శ్రీనివాస్, రాంప్రసాద్‌రెడ్డి, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, సత్యకుమార్ యాదవ్, పార్థసారథి, వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు.

400 ఎకరాల్లో రిలయన్స్ డేటా సెంటర్

(మొదటి పేజీ తరువాయి)

3,000 మెగావాట్ల డేటాసెంటర్ల ఏర్పాటుకు ముందుకొచ్చాయి. మరో మూడు ప్రముఖ అంతర్జాతీయ సంస్థలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాయి. వాటికి అవసరమైన భూములు, ఇతర సదుపాయాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. రాబోయే మూడు నెలల్లో వాటికీ అనుమతులు ఇచ్చేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

రిలయన్స్ పెట్టుబడి సంతోషాన్ని కలిగిస్తోంది

విశాఖలో 1,000 మెగావాట్ల హైపర్‌స్కేల్ డేటాసెంటర్ ఏర్పాటుకు రిలయన్స్-డిజిటల్ కనెక్షన్ జాయింట్ వెంచర్ రూ.98వేల కోట్ల పెట్టుబడి పెడుతుందన్న విషయాన్ని వెల్లడించడం సంతోషాన్ని కలిగిస్తోందని మంత్రి లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. విశాఖ భారతదేశ డేటా రాజధానిగా అవతరించబోతోందని పేర్కొన్నారు.

ఈనాడు


ఎక్కడపడితే అక్కడే జీవ వ్యర్థాలు!

దేశీయంగా జీవ వ్యర్థాల నిర్వహణలో మేటవేస్తున్న దారుణ అలసత్వం కలవరపరుస్తోంది. నిబంధనల ప్రకారం ఆసుపత్రులు ఆ ప్రమాదకర చెత్తను వేర్వేరు రంగుల డబ్బాల్లో నిల్వ చేసి, నిర్ణీత సమయంలోగా ఉమ్మడి శుద్ధి కేంద్రాలకు(సీబీడబ్ల్యూటీఎఫ్)లకు తరలించి నిర్మూలించాలి. అందుకోసం సీబీడబ్ల్యూటీఎఫ్‌లకు అవి నిర్ణీత రుసుమును చెల్లించాలి. దీన్ని భారంగా భావిస్తున్న పలు ప్రైవేట్ వైద్యశాలలు వాడిన సిరంజులు, కాటన్, డ్రెస్సింగ్ మెటీరియల్స్, కాలం చెల్లిన ఔషధాలు, సూదులు, బ్లేడులు, నెత్తుటి అవశేషాలతో కూడిన ఇతర చెత్తాచెదారాన్ని చుట్టుపక్కల చెరువులు, ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నాయి. లేదంటే మున్సిపల్ వ్యర్థాల్లో కలిపేసి చేతులు దులుపుకొంటున్నాయి. సర్కారీ ఆసుపత్రులు సైతం జీవ వ్యర్థాలను రోజుల తరబడి తమ ప్రాంగణాల్లోనే పేరబెడుతున్నాయి. దానివల్ల గాలి, నీరు, నేల విషపూరితమవుతున్నాయి. బయో మెడికల్ వ్యర్థాల మూలంగా హెచ్ఐవీ, హెపటైటిస్ వంటి వాటితో పాటు రకరకాల వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో జీవ వ్యర్థాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 141 ఆసుపత్రులకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి తాఖీదులు జారీ చేసింది. బయో వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తూ ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందే!

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వార్షిక నివేదిక ప్రకారం- 2023లో దేశవ్యాప్తంగా రోజుకు 743 టన్నుల జీవ వ్యర్థాలు ఉత్పత్తి అయ్యాయి. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే అవి అయిదు శాతం పెరిగాయి. తెలంగాణలో ప్రతి రోజూ సుమారు 31 టన్నుల బయో వేస్ట్ పోగుపడుతోంటే- ఏపీలో అది 20 టన్నులకు పైగా లెక్కతేలుతోంది. వీటి శుద్ధికి సంబంధించి 2023 నాటికి దేశవ్యాప్తంగా రెండొందల ముప్పైకి పైగా సీబీడబ్ల్యూటీఎఫ్‌లు అందుబాటులో ఉన్నాయి. కానీ, ఆ ఏడాది ఇరవై వేలకు పైగా ఆసుపత్రులు, శుద్ధికేంద్రాలు జీవ వ్యర్థాల నియమావళిని తుంగలో తొక్కాయి. దేశీయ అవసరాలకు సరిపడా సామర్థ్యం శుద్ధి కేంద్రాలకు ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నా- పలు రాష్ట్రాలు, చిన్న పట్టణాల్లో అవి తగిన సంఖ్యలో ఏర్పాటు కాలేదు. ఉన్నవాటిలోనూ కొన్నిచోట్ల దహన యంత్రాలు ఉద్గార ప్రమాణాలకు లోబడి లేవు. వ్యర్థాల సేకరణ, తరలింపు తదితరాల్లోనూ ఉదాసీనత రాజ్యమేలుతోంది. ఈ క్రమంలోనే తమ బాధ్యతకు నీళ్లొదిలిన తొమ్మిది సీబీడబ్ల్యూటీఎఫ్‌లకు తెలంగాణ పీసీబీ నోటీసులు పంపింది. నిత్య పర్యవేక్షణతో శుద్ధి కేంద్రాల పనితీరును గాడిన పెట్టడం కాలుష్య నియంత్రణ మండళ్ల కనీస బాధ్యత!

బయో మెడికల్ వ్యర్థాలను పక్కాగా సేకరిస్తున్న జర్మనీ, స్విట్జర్లాండ్ వంటి దేశాలు అధునాతన విధానాల్లో వాటిని వదిలించుకుంటున్నాయి. జపాన్ సైతం కఠిన చట్టాల ద్వారా జీవ వ్యర్థాలు పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి శాపంగా మారకుండా జాగ్రత్త పడుతోంది. స్వీడన్ వంటి చోట్ల ప్లాస్టిక్ మెడికల్ వ్యర్థాల పునర్వినియోగంపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఇండియాలో మాత్రం ఎక్కడికక్కడ పేరుకుపోతున్న జీవ వ్యర్థాలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయి. కొవిడ్ రోజుల్లో వాటి మూలంగా వైరస్ విస్తరించబట్టే పలువురు ఆ మహమ్మారి గుప్పిట చిక్కి ప్రాణాలు కోల్పోయినట్లు కథనాలు వెలువడ్డాయి. అలాంటి మరణ మృదంగం మళ్లీ మోగకుండా జీవ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడంపై ప్రభుత్వాలు దృష్టిసారించాలి. ఆసుపత్రుల నుంచి వెలువడే బయో వ్యర్థాలను 48 గంటల్లోగా తరలింపజేయాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాజాగా యంత్రాంగాన్ని ఆదేశించడం హర్షణీయం. అన్ని రాష్ట్రాలూ ఇదే విధంగా చొరవ చూపాలి. జీవ వ్యర్థాల సక్రమ శుద్ధికి అవసరమైన మౌలిక వసతులను అన్నిచోట్లా కల్పించాలి!

సైన్స్ నేర్చుకోవాలంటే ఆయా అంశాలను వివరించే ప్రయోగాలు చేయాలి. అప్పుడే నిత్యజీవితంలో జరిగే పనుల వెనక ఉన్న విజ్ఞాన సూత్రాలు అర్థమవుతాయి. చూడకుండా, అర్థం చేసుకోకుండా సైన్స్ పాఠాలు కంఠతా పట్టడం వల్ల ఉపయోగం లేదు.



– ప్రొఫెసర్ యశ్‌పాల్, శాస్త్రవేత్త

అయిదు ప్రమాదాలు

చదువుల్లో ఎంతగా రాణించినా, అంతులేని సంపదలతో తులతూగినా అజ్ఞానమనే అంధకూపంలో ఎప్పుడో ఒకప్పుడు పడిపోక తప్పదు. నేను, నాది అనే స్వార్థభావన తలకెక్కిన మనిషి దానవుడిలా ప్రవర్తిస్తాడు. ధన గర్వంతో కళ్లు మూసుకుపోయి అహంకారంతో విర్రవీగుతాడు. తమస్సు, మోహం, మహామోహం, తామిస్రం, అంధతామిస్రం అనే అవిద్యలు దాడిచేస్తే వాటి కబంధ హస్తాల్లో మనిషి ఎలా నలిగిపోతాడో దత్తపురాణం వివరిస్తోంది.

కార్చిచ్చులా కమ్మేసి మనిషిని అంధకారంలోకి నెట్టేది తమస్సు. ఆ స్థితిలోని వ్యక్తి కన్నూ మిన్నూ కానక ప్రవర్తిస్తాడు. విజ్ఞత మాత్రమే ఈ సంకట స్థితి నుంచి బయటికి రప్పించేది. జీవితం అశాశ్వతమని గుర్తించి వివేకాన్ని ఆశ్రయించేవారే విజ్ఞులు. మనిషిని దుర్బలుణ్ని చేసి తనవైపు లాగే సాలెగూడు మోహం. 'నా' అనే వలలో చిక్కి ఆ బంధనాలనుంచి విడివడలేక విలపిస్తాడు మనిషి. అగ్నికి ఆహుతయ్యే మిడతలా మోహానికి దాసుడై ఇహపరాలకు భ్రష్టుడై అశాంతి పాలవుతాడు. దేహం భ్రాంతి అని తెలిసేనాటికి జీవితం ముగిసిపోతుంది. మహామోహం అత్యంత ప్రమాదకరం.



అంతర్యామి

అంతులేని భోగలాలస మనిషిని పాతాళానికి తొక్కేస్తుంది. తప్పొప్పుల గురించి ఆలోచించకుండా ఆర్జనలో మునిగితేలే వ్యక్తి అశాశ్వత భోగాలే నిజమని నమ్మి మోసపోతాడు. అవిద్యావరణంలో మనిషిని పట్టిపల్లార్చే తామిస్రం అనారోగ్యం పాలుచేస్తుంది. అంతులేని కోపం అనర్థహేతువు. అది పరమశత్రువని తెలిసినా మనిషి దాని సాంగత్యం కోరుకుంటాడు. క్షణికావేశానికి లోనై చేయరాని తప్పులు చేసి చరిత్రహీనుడిగా మిగిలిపోతాడు. అంధ తామిస్రం మనిషిని మృత్యుముఖం వైపు నడిపిస్తుంది. రేయింబగళ్లు కష్టపడి కడుపు కట్టుకుని సిరిసంపదలు ఆర్జిస్తాడు మనిషి. చోరులవల్లో, సంతానంవల్లో, ప్రకృతి వైపరీత్యాలవల్లో అవి దూరమైతే తట్టుకోలేడు. కుంగిపోతాడు. ఆ చింత చితిగా మారి అతణ్ని దహించివేస్తుంది.

సృష్టి ప్రారంభమైన తొలినాళ్లలో ఉద్భవించినవారే సనక సనందనాదులు. ధర్మపరాయణులు, అంతర్ముఖులు. వీరితో కాదని, అనంతముఖాలుగా సృష్టి వృద్ధి కావాలని భావించిన బ్రహ్మ రవ్వంత అవిద్యావరణాన్ని సృష్టించాడు. ఆ భావన రాగానే చిత్రంగా తానే దానికి లోనయ్యాడు. జ్ఞానం నశించింది. సకల వేదాలను చివరికి గాయత్రి మంత్రాన్నే మరిచిపోయాడు. ఎలాగో తెలివి తెచ్చుకుని జగదంబ రేణుకామాతను ప్రార్థించాడు. ఆమె ప్రత్యక్షమై త్రిమూర్తిరూపుడైన దత్తుణ్ని శరణుకోరమంది. సహ్యాద్రి శిఖరంపై కృష్ణామలక(నల్ల ఉసిరి) చెట్టు కింద స్వామి దర్శనమిచ్చి బ్రహ్మపై దయావృష్టిని కురిపించాడట. వెంటనే సమస్త వేదాలు సాకల్యంగా స్ఫురించాయట బ్రహ్మకు. అవిద్యాబాధితులైన మహాపురుషులెందరో మనకు పురాణాల్లో కనిపిస్తారు. రకరకాల సాధనల వల్ల, దైవకృపవల్ల బయటపడినవారి కథలెన్నో. అరిషడ్వర్గాలను అదుపులో ఉంచుకుని సంచరించేవారి దారిదాపులకి కూడా రాదు అవిద్య. తెలివి, విజ్ఞత ఉపయోగించి దానికి దూరంగా ఉండాలి. జీవితం విలువైందన్న అవగాహన పెంచుకుని జీవనయానం సాగించాలి. అప్పుడే బతుకు నందనవనంగా మారుతుంది.

– మాడుగుల రామకృష్ణ

విత్తనాలు మనవి... పెత్తనం మరొకరిదా!?

ఆహార పంటలు, ఇతర వ్యవసాయ వంగడాల జన్యు వనరులను రైతులకు అందించడానికి ఉద్దేశించిన అంతర్జాతీయ ఒప్పందం 2004 నుంచి అమలులోకి వచ్చింది. ఐరాస ఆధ్వర్యంలో కుదిరిన ఈ ఒప్పందం అమలు తీరుపై 11వ సమీక్షా సమావేశం పెరూ రాజధాని లిమాలో నవంబరు 24 నుంచి 29వ తేదీ వరకు జరుగుతోంది. ఈ విత్తన ఒడంబడికకు మార్పుచేర్పులు చేసే విషయమై పెరూ సమావేశంలో చర్చలు సాగుతున్నాయి. ఒప్పందానికి ఏ సవరణలు జరిగినా, అవి విత్తనాలపై భారత్‌కు ఉన్న అదుపును, రైతుల హక్కులను, ఆహార భద్రతను సవాలు చేసే ప్రమాదం ఉంది.

ప్రస్తుతం ప్రపంచమంతటా 64 ఆహార పంటలు విత్తన ఒప్పంద పరిధిలో ఉన్నాయి. వాటిని బహుళ పక్ష వ్యవస్థ లేదా ఉమ్మడి నిధిలో భాగంగా పరిగణిస్తున్నారు. ఇందులో భాగస్వాములైన దేశాలు తమ విత్తనాలను పరస్పరం పంచుకుంటాయి. ఈ నిధిని దాదాపు అన్ని పంటలకూ విస్తరించాలని పెరూ సభలో సన్నాహాలు జరుగుతున్నాయి. అంటే భారత దేశంలో పండే పంటలన్నింటి విత్తనాల జన్యు సమాచారం అంతర్జాతీయ ఉమ్మడి నిధికి ధారాదత్తం చేయాల్సి వస్తుందన్నమాట. ఇదేదో ఇచ్చిపుచ్చుకోవడంగా కనిపించవచ్చు కానీ, వాస్తవంలో ఏదైనా దేశం ఒకసారి ఒప్పందంపై సంతకం చేసింది అంటే, ఇక తనకంటూ ఏ ఒక్క పంటనూ అట్టిపెట్టుకోకూడదు. భారత్ కనుక సంతకం చేస్తే రేపు ఎప్పుడైనా పలానా పంటల జన్యు సమాచారాన్ని, విత్తనాలను ఇవ్వబోమని చెప్పే వీలు ఉండదన్నమాట!

సార్వభౌమ హక్కులకు భంగం

విత్తనాలకు సంబంధించి భారతదేశానికి సొంత చట్టాలున్నాయి. 2001నాటి మొక్కల రకాలూ రైతు హక్కుల రక్షణ చట్టం, 2002లో తెచ్చిన జీవవైవిధ్య రక్షణ చట్టం మన సంప్రదాయ పంటలకు మన



రైతులే యజమానులనీ, తన జీవ వనరులపై హక్కు భారతదేశానికే సొంతమని ఉద్ఘాటిస్తున్నాయి. పంటల జన్యు సమాచారాన్ని ఎవరికి, ఏ షరతులపై పంచుకోవాలో ఈ చట్టాలు నిర్దేశిస్తున్నాయి. పెరూలో జరుగుతున్న ఒప్పంద సమీక్ష పర్యవసానంగా భారత్ తన సమస్త పంటల జన్యు సమాచారాన్ని ఉమ్మడి నిధికి బదలాయిస్తే దానిపై భారత్ అదుపు కోల్పోతుంది. సంపన్న దేశాల్లోని విత్తన, బయోటెక్ కంపెనీలు, పరిశోధనా సంస్థలు భారతీయ పంటల జన్యు ద్రవ్యం(జెర్మ్ ప్లాజం)పై అదుపు సాధించి, వాటిలో మార్పుచేర్పులు చేసి కొత్త వంగడాలను సృష్టించి, వాటిని మళ్లీ మనకే అమ్మవచ్చు. ఆ వంగడాలపై భారత్‌కు ఎటువంటి అదుపూ ఉండదు. అది మన చట్టాలను, మన సార్వభౌమత్వంపై సమ్మెట పోటు అవుతుంది.

పెరూ సభ సవరించే ఒప్పందానికి తలొగ్గితే సోయా, టమాటా, ఆయిల్ పామ్ వంటి వాటి జన్యు సమాచారాన్ని విదేశీ సంస్థల నుంచి పొందగలుగుతామనే అధికారులు ఉన్నారు. కానీ, ఈ పంటల జన్యు క్రమం ఇప్పటికే మనకు అందుబాటులో ఉంది. ఇతర పంటల జన్యు సమాచారం, జన్యు ద్రవ్యాలను వివిధ దేశాలతో నేరుగా ఒప్పందాలు కుదుర్చుకుని సంపాదించవచ్చు. ఏవో కొన్నింటికోసం మన పంటల సమస్త జన్యుసమాచారాన్ని వదులుకోవడం వివేకమనిపించుకోదు. అది మంచి బేరమూ కాదు. అసలు ఇంతవరకు ఈ ఒప్పందం వల్ల మనకేమైనా ఒరిగిందా అన్నది తరచిచూసుకోవాలి. భారతదేశం ఇప్పటికే నాలుగు లక్షలకు పైగా విత్తనాల జన్యు సమాచారాన్ని ఉమ్మడి నిధికి సమర్పించుకుంది. ఇప్పుడు రైతులు సొంతంగా ఉత్పన్నం చేసుకున్న వంగడాలూ ఉన్నాయి. మరి దీనికి ప్రతిఫలంగా ఏం సాధించామనేది ప్రశ్న!

విదేశీ కంపెనీలకే లాభం

ఈ డిజిటల్ యుగంలో కొత్తగా ముందుకొచ్చిన ముప్పు- విత్తనాల జన్యు సమాచారాన్ని ఆన్‌లైన్‌లోనే తస్కరించడం. ఒక విత్తనాన్ని విదేశాలకు పంపనవసరం లేకుండానే దాని జన్యుసమాచారాన్ని డిజిటల్‌గా భద్రపరుస్తారు. దీన్ని జన్యు సీక్వెన్స్ డేటా(జీఎస్‌డీ) అంటారు. ఎటువంటి నియంత్రణలు లేకపోతే విదేశీ కంపెనీలు భారతీయ విత్తనాల జీఎస్‌డీని ఉపయోగించి కొత్త ఉత్పత్తులను సృష్టించి, పేటెంట్లు పొంది లాభాలు దండుకోగలుగుతాయి. ఆ లాభాల్లో భారత్‌కు కానీ, మన రైతులకు కానీ వాటా ఇవ్వకుండా ఎగవేయగలుగుతాయి. నేడు ఏ దేశం విత్తనాల జన్యుసమాచారాన్ని ఎవరు ఎప్పుడు ఎందుకు సేకరించారు, దాన్ని ఏం చేస్తున్నారో నిఘా వేసి, అక్రమాలను అరికట్టే యంత్రాంగం లేదు. భారతీయ విత్తనాల జీఎస్‌డీని ఎలా ఉపయోగిస్తున్నారో తెలుసుకోలేని పరిస్థితి ఉంది. ఇక ప్రతిపాదిత సవరణలు నెగ్గితే- గతంలో విత్తనాలు అందించిన భారత్ వంటి దేశాలకు కూడా చెప్పకుండా కొత్తగా జన్యుసమాచారాన్ని ఉపయోగించుకునేందుకు వీలు కుదురుతుంది. ఇది డిజిటల్ జీవ చౌర్యానికి (బయోపైరసీకి) తలుపులు బార్లా తెరుస్తుంది.

కోరి ప్రమాదంలో పడినట్లే!

వర్ధమాన దేశాల రైతుల హక్కులు, జీవవైవిధ్య రక్షణ కోసం కట్టుబడి ఉన్నానని భారతదేశం పెరూ సభలో తన మాటలను చేతల్లో చూపాలి. వ్యవస్థాపరమైన జాగ్రత్తలు, పారదర్శకత, నిష్పాక్షికత, జవాబుదారీతనం లేకపోతే అన్ని పంటల జన్యుసమాచారాన్ని ఇతరులతో పంచుకునే ప్రసక్తి లేదని తెగేసి చెప్పాలి. ఉమ్మడి నిధి నుంచి ఏయే దేశాలు ఏయే పంటల జన్యుసమాచారాన్ని తీసుకున్నదీ, దానితో ఏం చేసినదీ ఎప్పటికప్పుడు తెలియజేసే పర్యవేక్షణ ఉండాలి. భారత్ నుంచి సేకరించిన పంటల జీఎస్‌డీని గట్టి నిఘా ఉంచే డేటా బేస్‌లలో మాత్రమే భద్రపరచాలని డిమాండ్ చేయాలి. ప్రస్తుత వ్యవస్థలోని లొసుగులను సవరించడానికి కొత్త యంత్రాంగమేదీ ఏర్పాటుచేయకుండానే ఇతర వర్ధమాన దేశాలతో కలిసి పట్టుబట్టాలి. భారతదేశ విత్తనాలు తరాలుగా రైతులు, ఆదివాసీలు ప్రయోగాలు చేసి మరీ సృష్టించుకున్నవి. అంతర్జాతీయ ఒప్పందం పేరిట మన పంటల జన్యు వారసత్వాన్ని ఒకసారి వదులుకుంటే మళ్లీ దానిపై అదుపు సాధించడం అసాధ్యం. మన రైతుల నెత్తిపై అంతర్జాతీయ విత్తన కంపెనీల పెత్తనాన్ని కోరి అనుమతించినట్లు అవుతుంది. దేశ ఆహార భద్రతకు ముప్పు తెచ్చుకున్నవాళ్లమవుతాం. ఈ ప్రమాదాలను నివారించడానికి పెరూ సభలో భారత్ తగిన జాగ్రత్తలు తీసుకుంటూ తన ప్రయోజనాలను కాపాడుకోవాలి.



సీఆర్ సుకుమార్
సీనియర్ పాత్రికేయులు, న్యాయవాది



ఏఐ ఉచ్చులో...

ఆదిమ సమాజాలు గుహల గోడల మీద గీసిన చిత్రాల్లోనే, అత్యాధునిక కృత్రిమ మేధ మూలాలున్నాయా? అని ఆశ్చర్యపోయేలా చేస్తుంది అరణ్య సహాయ్ సినిమా... 'హ్యూమన్స్ ఇన్ ద లూప్'. ఇప్పటికే అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంటూ, ఆస్కార్ బరిలో దూసుకుపోతున్న ఈ చిత్రం మూలాలు ఝార్ఖండ్‌లోని ఒక ఆదివాసీ గ్రామంలో ఉన్నాయి. ఒరాన్ తెగకు చెందిన నెహ్మా రాంచీ నివాసితో కొన్నేళ్లు సహజీవనం చేసి విడిపోతుంది. పన్నెండేళ్ల కూతురు ధాను, ఏడాది కొడుకు గుంటులను తీసుకుని పుట్టి పెరిగిన పల్లెకు తిరిగొస్తుంది. అనివార్యమైన పరిస్థితుల్లో నెహ్మా స్థానిక డేటా- లేబులింగ్ కేంద్రంలో ఉద్యోగంలో చేరుతుంది. కొత్త పని నేర్చుకునే ప్రయత్నంలో ఒంటరి తల్లి, అడవి బడిలో ఇమడలేని పట్నవాసి కూతురు... వారిద్దరి సంఘర్షణ కథను సహజంగా నడిపిస్తుంది.

ఏఐ వ్యవస్థలకు శిక్షణ ఇచ్చేందుకు ఫొటోలు, వీడియోలను లేబుల్ చేయడం నెహ్మా పని. కృత్రిమ మేధస్సుకు, తన సహజ జ్ఞానానికి మధ్య అంతరాలను ఆమె గ్రహిస్తుంది. గొంగళిపురుగును చీడపురుగుగా నెహ్మా లేబుల్ చేయదు. అందుకు పర్యవేక్షకురాలు అల్కా నిలదీస్తుంది. 'అది చీడపురుగు కాదు. ఆకులో కుళ్లిపోయిన భాగాన్నే తిని, మొక్కను ఆరోగ్యంగా ఉంచుతుంది, ఏఐ పిల్లల లాంటిది. తప్పుగా నేర్పితే, తప్పే నేర్చుకుంటుంది' అని నెహ్మా బదులిస్తుంది. 'క్లయింట్ దాన్ని చీడపురుగు అంటే, అది చీడపురుగే. లేబులింగ్ చేయడమే నీ పని. బుర్రను ఎక్కువగా వాడకు' అని అల్కా కోప్పడుతుంది. వాస్తవానికి తాము చేస్తున్న పని పర్యవసానాలేంటో, ఈ డేటా లేబులింగ్‌ని ఎవరు ఎలా వాడుతున్నారో ఆమెకీ తెలియదు. మానవ సహజ జ్ఞానాన్ని తోసిపుచ్చి, మనకు తెలియకుండానే మెడచుట్టూ ఏఐ ఉచ్చును మనమే ఎలా బిగించుకుంటున్నామో ఈ చిన్న సంభాషణ సూచిస్తుంది.

అడవి బడికి అలవాటుపడటానికి ధాను పడే సంఘర్షణను ఎంతో సున్నితంగా చిత్రించారు. కూతురికి అడవి రహస్యాలను, ప్రకృతి జ్ఞానాన్ని నేర్పాలని నెహ్మా తపనపడుతుంటే, ఆమె భర్త రాంచీకి తీసుకువెళ్లాలని ప్రయత్నిస్తుంటాడు. ధాను తమ్ముడితో సహా అమ్మనుంచి, అడవినుంచి పారిపోవాలనుకుంటుంది. తల్లీబిడ్డలను తిరిగి కలుపుతుంది నెహ్మా చిన్నప్పటి నేస్తం ముళ్లపంది.

కందమూలాలను తవ్వుకు రావడం, ముళ్లపంది నడిచిన దారులు గుర్తించడం... లాంటి చిన్న చిన్న అంశాలను కూడా కథనంలో అద్భుతంగా భాగం చేశారు. గుంటు తొలి అడుగులు వేయడం... ఏఐకి పాఠంలా మారుతుంది. సర్వత్రా చర్చనీయాంశమైన ఏఐ నిర్మాణంలో మన దేశంలోని మారుమూల పల్లెల్లోని సామాన్య మహిళా ఉద్యోగుల అనామక పాత్ర ఏంటో ఈ సినిమా వెలుగులోకి తెచ్చింది. పితృస్వామ్య స్వభావాలను, సామాజిక అంతరాలను చర్చించింది. కృత్రిమ మేధస్సులో కొరవడిన మానవస్పర్శ ఈ సినిమాలో మన హృదయాలను తాకుతుంది. కొత్త ఆలోచనలను రేకెత్తిస్తుంది. ఇంతకీ, ఉచ్చు వేస్తున్నదెవరు? ఊపిరాడకుండా బిగిస్తున్నదెవరు? అది తెలియాలంటే, సినిమా చూడాలి మరి!

– చంద్రలత

విమర్శించకూడదట!

అమెరికాకు చెందిన 'ది ఫ్యూచర్ ఆఫ్ ఫ్రీ స్పీచ్' సంస్థ 33 దేశాల్లో ఇటీవల ఓ ఆన్‌లైన్ సర్వే చేసింది. భావప్రకటనా స్వేచ్ఛకు ఆయా సమాజాల్లో ఉన్న మద్దతు గురించి తెలుసుకునేందుకు చేపట్టిన అధ్యయనమది. అందులో భాగంగా 'ప్రభుత్వ విధానాలను బహిరంగంగా విమర్శించే అవకాశం ప్రజలకు ఉండాలా?', 'అలాంటి అభిప్రాయాలను ప్రభుత్వాలు నిరోధించవచ్చా?' అని ప్రశ్నించారు. యూకే, డెన్మార్క్, నార్వే, స్వీడన్, స్పెయిన్, అర్జెంటీనా, బ్రెజిల్, జర్మనీ తదితరాలకు చెందినవారిలో 90శాతం మందికిపైగా మొదటి దానికే ఓటేశారు. అమెరికా, ఇజ్రాయెల్‌లలోనూ 89శాతం మంది సర్కారీ విధానాలను విమర్శించడం ప్రజల హక్కు అని తేల్చిచెప్పారు. కానీ, మన దేశంలోనేమో 37శాతం మంది విమర్శనాత్మక స్వరాలను పాలకులు కట్టడి చేయవచ్చునన్నారు. ఈవిధంగా ప్రభుత్వాల తరఫున వకాల్తా పుచ్చుకున్నవారు ఎక్కువగా ఉన్న దేశాలేంటంటే (శాతాల్లో)...

ఇండియా	37	పాకిస్థాన్	27
దక్షిణాఫ్రికా	29	ఫిలిప్పీన్స్	26
కెన్యా	28	నైజీరియా	26
టునీసియా	28	(ఆధారం: 'హు ఇన్ ది వరల్డ్ సపోర్ట్స్ ఫ్రీ స్పీచ్' నివేదిక)	

నగర భారతానికి సాంకేతిక నగిషీలు

సుసుము కిటగావా, రిచర్డ్ రాబ్సన్, ఒమర్ ఎం. యాగీలు ఈ సంవత్సరంలో రసాయన శాస్త్రంలో నోబెల్ సాధించారు. వారు అభివృద్ధి చేసిన మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్(ఎంవోఎఫ్)లు గాలిలోని తేమను గ్రహించడం ద్వారా నీటి తయారీకి ఉపయోగపడతాయి. వాతావరణంలోని విషపూరిత కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించడానికీ అవి అక్కరకొస్తాయి. ఎంవోఎఫ్‌ల తయారీకి శాస్త్రవేత్తలు 1989లోనే 'పోరస్ కోఆర్డినేషన్ పాలిమర్స్' అనే సిద్ధాంతాన్ని రూపొందించారు. ఆ మేరకు వాయువులను వేరు చేయడం, నిల్వ చేయడం, వినియోగించడంపై దృష్టి కేంద్రీకరించారు. ఇందుకు అవసరమైన సంక్లిష్టమైన అణువుల తయారీకి ఎంతో శ్రమించారు. వాటి అంతర్గత స్వరూపం స్ఫటిక నిర్మాణంలా ఉండి, ఇతర అణువులను తమలో పట్టి ఉంచుతాయి. కాబట్టే, వాటితో తయారైన ఎంవోఎఫ్‌లు స్పాంజ్ నీటిని పీల్చుకున్నట్లుగా గాలిలోని వివిధ వాయువులను సంగ్రహిస్తాయి.

వాయు నాణ్యతను పెంచడానికి...

మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్‌లతో ఉపయోగాలు అన్నీఇన్నీ కావు. 'కాల్ఫ్-20'గా పిలిచే ఎంవోఎఫ్ పారిశ్రామిక వ్యర్థాలు, అక్కడి పరిసరాల్లోని కార్బన్ డయాక్సైడ్‌ను సమర్థంగా గ్రహిస్తుంది. ఎంవోఎఫ్-303 ఏమో రాత్రిపూట వాతావరణంలోని నీటి ఆవిరిని గ్రహించి, తరవాత సూర్యకాంతిలో దాన్ని విడుదల చేస్తుంది. తద్వారా తాగునీరు ఉత్పత్తి అవుతుంది. అలా ఎడారి ప్రాంతాలు, నగరాల్లో నీటి కొరతను తీర్చవచ్చు. నీళ్లలోంచి రసాయనాలను, వ్యర్థ జలాల నుంచి అరుదైన లోహాలూ కాలుష్య కారకాలను విడగొట్టే ఫ్రేమ్‌వర్క్‌లూ ఉన్నాయి. ఇంకొన్ని ఎంవోఎఫ్‌లు ఒక మోస్తరు పీడనం దగ్గర హైడ్రోజన్, మీథేన్ వాయువులను సురక్షితంగా నిల్వ చేయగలవు. కాబట్టి శుద్ధ ఇంధన రంగంలో ఈ సాంకేతికతలు బాగా ఉపయుక్తమవుతాయి. ఎంవోఎఫ్‌లను జలశుద్ధి వ్యవస్థల్లో వినియోగిస్తే- నీటి నుంచి లెడ్, ఆర్సెనిక్ వంటి భార లోహాలతో పాటు కాలుష్య కారకాలనూ వేరు చేయవచ్చు. అధిక జనసాంద్రత, విపరీతమైన వాహనాల రద్దీ నెలకొన్న ప్రాంతాల్లో ఎంవోఎఫ్‌ల వినియోగం వాయు నాణ్యతను పెంపొందిస్తుంది. ఎంవోఎఫ్‌లోని 'హై ఇంటర్నల్ సర్ఫేస్ ఏరియా' పరిశ్రమల నుంచి వెలువడే కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి నిల్వ చేస్తుంది. తద్వారా పర్యావరణాన్ని పరిశుభ్రపరుస్తుంది. సూపర్ కెపాసిటర్లు, బ్యాటరీల్లో మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్స్‌ను వాడటం వల్ల అర్బన్ పవర్ గ్రిడ్లు, విద్యుత్ వాహనాల్లో

ఈ ఏడాది భౌతిక, రసాయన శాస్త్రాల్లో నోబెల్ పురస్కారాలు పొందిన శాస్త్రవేత్తలు క్వాంటమ్ టన్నెలింగ్, మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్‌వర్క్ వంటి సాంకేతికతలను అభివృద్ధి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా నగర సమాజాలు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను అవి సమర్థంగా పరిష్కరించగలవు. వాటిని అందిపుచ్చుకుంటే భారతీయ నగరాలు సైతం గణనీయమైన వృద్ధిని సాధించగలుగుతాయి. జనజీవన నాణ్యత కూడా మెరుగుపడుతుంది.



కరెంటును సురక్షితంగా నిక్షిప్తం చేయడం వీలవుతుంది. నీటి సరఫరా పైపులు, భవనాల పైకప్పుల మీద ఎంవోఎఫ్ పూత పూయగలిగితే, అవి దీర్ఘకాలం మనగలుగుతాయి. ఈ విధంగా నగర మౌలిక వసతుల నిర్మాణం, నిర్వహణలో ఎంవోఎఫ్‌లు బాగా సాయపడతాయి.


భౌతికశాస్త్రంలో నోబెల్ సాధించిన జాన్ క్లార్క్, మిషెల్ డివోరెట్, జాన్ ఎం.మార్టినిస్‌లు 'సబ్-అటామిక్ క్వాంటమ్ టన్నెలింగ్'పై పరిశోధనలు చేశారు. అవి క్వాంటమ్ సాంకేతిక విప్లవానికి బాటలు పరిచాయి. సాధారణంగా మనం ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, పరమాణువులు, పరమాణు కేంద్రకాల వంటి పదార్థ మూలకణాల ప్రవర్తనను నేరుగా గమనించలేం. వాటికి ఏమైనా అడ్డంకులు ఎదురైనప్పుడు పైనుంచో, పక్క నుంచో కాకుండా... తమకు అడ్డుగా ఉన్నవాటిని సొరంగంలా చీల్చుకుని ముందుకు వెళ్తాయి. ఈ ప్రక్రియనే క్వాంటం టన్నెలింగ్ అంటారు. 'జోసెఫ్సన్ జంక్షన్' అనే బుల్లి ఎలక్ట్రిక్ సర్క్యూట్ ద్వారా శాస్త్రవేత్తలు దీన్ని రుజువు చేశారు. ఈ ప్రయోగం సూపర్ కండక్టింగ్ ప్రాసెసర్లు, క్వాంటం సెన్సర్ల తయారీకి దారి తీసింది. వీటి వల్ల ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ వంటి వైద్య పరీక్షలను అత్యంత కచ్చితత్వంతో చేపట్టడం వీలవుతోంది. నావిగేషన్, జియోలాజికల్ సర్వేల్లోనూ 'క్వాంటం టన్నెలింగ్'ను ఉపయోగిస్తారు.

లోపాలను పసిగట్టగలవు...

క్వాంటం టన్నెలింగ్ సూత్రాల ఆధారంగా రూపొందించిన సాంకేతికతలు నగరభారతం ఎదుర్కొంటున్న సంక్లిష్ట సమస్యలను సమర్థంగా పరిష్కరించగలవు. క్వాంటం అల్గారిథమ్‌లు వాహనాల రద్దీని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తాయి. సిగ్నలింగ్, దారి మార్పు సూచనల ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తాయి. ప్రజారవాణా, అత్యవసర సేవలు, వ్యర్థాల సేకరణ, నీటి సరఫరా వ్యవస్థలను మరింత మెరుగ్గా మార్చడానికీ దోహదపడతాయి. సూపర్ కండక్టింగ్, క్వాంటం ఇంటర్నెట్ ఉపకరణాలు నగర భద్రతను పర్యవేక్షిస్తాయి. పైపులు, కేబుల్స్ వంటి భూగర్భ వసతులను మ్యాపింగ్ చేయడానికి ఉపకరిస్తాయి. వంతెనలు, సొరంగాలు, భవనాల్లో నిర్మాణ లోపాలను పసిగట్టి మరమ్మతులనూ సూచిస్తాయి. క్వాంటం డిస్ట్రిబ్యూషన్ టెక్నాలజీ ఏమో సైబర్ దాడుల నుంచి ఆసుపత్రులు, అత్యవసర సేవలు, బ్యాంకుల కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లకు భద్రత కల్పించగలదు. నగరాల వికాసానికీ, అక్కడి జీవన ప్రమాణాల పెంపునకు దోహదపడగల ఎంవోఎఫ్‌లు, క్వాంటం సాంకేతికతలను అందిపుచ్చుకోవడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి.



పుల్లూరు సుధాకర్
పట్టణాభివృద్ధి వ్యవహారాల నిపుణులు



ఈనాడు మీతోడు

చిన్నారి భద్రం.. ఆరోగ్యం పదిలం

★ ప్రభుత్వ బడుల్లో వైద్య శిబిరాలకు అనూహ్య స్పందన
★ స్వచ్ఛందంగా వచ్చి సేవలందించిన వైద్యులు


విజయవాడ తూర్పు: బాబూ జగ్జీవన్‌రామ్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో చిన్నారికి దంత పరీక్షలు


సీతన్నపేట: పరుశురాములు నగరపాలక సంస్థ పాఠశాలలో మందులు, పేస్టులు పంపిణీ చేస్తున్న హాజరత్తయ్యగుప్తా

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం 'ఈనాడు' నడుంబిగించింది. పాఠశాలల్లో ప్రత్యేకంగా శిబిరాలను ఏర్పాటు చేయించి.. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సమాజంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి విద్యార్థులకు వైద్య సేవలు అందించారు. సాధారణ జ్వరాల నుంచి, కళ్లు, ముక్కు, చెవి, గొంతు, దంతాలకు సంబంధించిన వైద్య పరీక్షలను నిర్వహించారు. ఉచితంగా రూ.లక్షల విలువైన మందులు, టూత్‌బ్రషులు, పేస్టులు, కళ్లద్దాలు లాంటివి అందజేశారు. **కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని 35 పాఠశాలల్లో** వైద్య శిబిరాలను 'ఈనాడు' ఏర్పాటు చేయగా.. **3,760 మంది** విద్యార్థులకు ఉచితంగా సేవలు అందించారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల వైద్య సిబ్బందితో పాటు, పలు ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు కూడా ఈ శిబిరాల్లో పాల్గొన్నారు. జనరల్ ఫిజీషియన్, ఈఎన్‌టీ, దంత, చర్మ, కళ్లకు సంబంధించిన వైద్యులు ఈ శిబిరాల్లో పాల్గొని.. చిన్నారులకు వైద్య సేవలు అందించారు. **- న్యూస్‌టుడే, గాంధీనగర్, విజయవాడ సిటీ**

రైతన్నా.. తెలుసుకో..

★ రీసర్వే చిక్కులకు కూటమి సర్కారు పరిష్కారం

వైకాపా ప్రభుత్వ హయాంలో చేసిన రీసర్వే వల్ల వచ్చి పడిన జాయింట్ ఎల్‌పీఎం సమస్యకు కూటమి సర్కారు చక్కని పరిష్కారం చూపిస్తోంది. అన్నదాత సుఖీభవ వంటి పథకాలు వర్తించక.. రిజిస్ట్రేషన్లు చేసే వీలు లేక.. చివరికి బ్యాంకు రుణం కూడా రాని దైన్యానికి ముగింపు పలుకుతోంది. గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు.. అధికారులే వచ్చి సర్వే చేసి నంబర్లు విడగొడతారు. **– ఈనాడు, అమరావతి**



ఫీజు సైతం మాఫీ: ★ సాధారణంగా ఒక రైతు పొలానికి ఒక ఎల్‌పీఎం నంబరు ఉండాలి. వైకాపా పాలనలో చేసిన రీ సర్వేలో ఒకే ఎల్‌పీ నంబరులో ఎక్కువ మంది భూములు చూపిస్తోంది. దీంతో రైతులకు వ్యవసాయ సంబంధిత ఏ పథకాలు రావడం లేదు. బ్యాంకు రుణాలు ఇవ్వడం లేదు. క్రయ విక్రయాలకు అవకాశం లేదు. ★ ఈ సమస్య పరిష్కారంపై కూటమి సర్కారు దృష్టి సారించింది. ఎల్‌పీఎం నంబర్లు విడగొట్టేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 6,753 జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్నాయి. ఈ నంబర్లలో వేలాది ఎకరాల భూమి ఉంది. ★ దీన్ని వేరు చేయడానికి రైతులు స్థానిక సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ ద్వారా దరఖాస్తు చేయాలి. దీనికి నిబంధనల ప్రకారం రూ.550 రుసుం చెల్లించాలి.

జిల్లా	ఎల్‌పీ
ఎన్టీఆర్	3,123
కృష్ణా	3,630
మొత్తం	6,753

డిసెంబరు-31

దరఖాస్తు చేసిన 15 రోజుల్లోగా సర్వేయర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కరిస్తారు. రైతులకు అవగాహన కల్పించేందుకు అధికారులు గ్రామసభలు నిర్వహించినా పూర్తి స్థాయిలో రైతులకు సమాచారం తెలియదు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 450 మంది దరఖాస్తు చేసుకున్నారు. డిసెంబరు-31 వరకే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.

రైతులపై భారం తగ్గించేందుకు ప్రభుత్వం రూ.500 ఫీజు రద్దు చేసింది. కేవలం రూ.50 చెల్లిస్తే దరఖాస్తు చేస్తారు.

ఐదేళ్ల దోపిడీ.. అడగలేని తీరిది..

ఈనాడు, అమరావతి

▼ రూ.కోట్లు విలువైన మట్టి కొట్టేస్తే నోటీసులతో సరి

వైకాపా హయాంలో విచ్చలవిడిగా అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడిన వారిని గుర్తించి.. వరుసగా షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులను ఈ ఏడాది ఆరంభంలోనే ఇచ్చారు. ప్రధానంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలోని మైలవరం, గన్నవరం నియోజకవర్గాల పరిధిలో సర్వే నంబర్ల వారీగా ఎక్కడెక్కడ ఎంత మట్టి తవ్వేశారు. దానికి ప్రభుత్వానికి ఎంత చెల్లించాలి, జరిమానా ఎంత కట్టాలనే వివరాలతో నోటీసులను బాధ్యులైన వారికి జారీ చేశారు. అంతే అక్కడితో తమ పని అయిపోయిందన్నట్టుగా ఎన్టీఆర్ జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారులు చేతులెత్తేశారు. ★ కొత్తూరుతాడేపల్లి, వెలగలేరు, వేమవరం, జక్కంపూడి, పాతపాడు, జి.కొండూరు మండలం, విజయవాడ రూరల్ మండలాల్లో 2019-24 మధ్యలో భారీగా అక్రమ మైనింగ్ జరిగింది. పొలాలు, గుట్టలు, కొండలను వదలకుండా తవ్వేసి లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తరలించుకుపోయారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక దీనిపై వరుస ఫిర్యాదులతో అధికారులు స్పందించి అక్రమార్కులను గుర్తించినా నోటీసులతో సరిపెట్టారు.


వైకాపా హయాంలో వేమవరం పరిధిలో రూ.31 కోట్ల మట్టి తవ్వేశారిలా..

కొత్తూరు తాడేపల్లి గ్రామ పరిధిలో.. 40, 41, 35, 36, 39, 227, 256, 260, 255, 260 సహా మరికొన్ని సర్వే నంబర్లలో 10.43లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు జరిగాయి. దీనికి బాధ్యులైన 33మందికి.. రూ.57.86కోట్లు చెల్లించాలంటూ షోకాజు, డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ★ కొత్తూరు గ్రామ పరిధిలో 3.90లక్షల క్యూ.మీ. మట్టిని ఎత్తుకుపోయారంటూ.. మరొకరికి రూ.21.62కోట్ల నోటీసులు జారీ చేశారు. ★ వెలగలేరు పరిధిలో 501/2, 504/4ఈ, 508/ఎ.డి, 509/1, 510, 511, 512, 520, 521, 522, 523, 524, 525 సహా పలు సర్వే నంబర్ల పరిధిలో 5.75లక్షల క్యూ.మీ.ను తవ్వేసినట్టు నిర్ధారించి 59మందికి.. రూ.31.91కోట్లు చెల్లించాలంటూ నోటీసులిచ్చారు. ★ విజయవాడ రూరల్ మండలం నైనవరం పరిధిలో 2.60లక్షల క్యూ.మీ.ను తవ్వేసినందుకు.. రూ.14.42కోట్లను చెల్లించాలని తాఖీదులిచ్చారు. ★ వేమవరం పరిధిలో సర్వే నంబరు 147లో 5.59లక్షల క్యూ.మీ.ను తవ్వేసినందుకు 18మందికి రూ.30.99కోట్లను చెల్లించాలంటూ నోటీసులిచ్చారు.

తాజాగా పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదులు

ఎన్టీఆర్ జిల్లాలో వైకాపా హయాంలో జరిగిన అక్రమ మైనింగ్‌పై ఎలాంటి చర్యలు ఇంతవరకూ తీసుకోలేదంటూ తాజాగా పీజీఆర్ఎస్‌లో కొత్తూరు తాడేపల్లికి చెందిన మెండెం జమలయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై జాయింట్ కలెక్టర్ స్పందించి మైనింగ్ అధికారులను పిలిచి వివరణ అడిగారు.

మయూరం.. వయ్యారం



నగరంలోని అంబేడ్కర్ స్మృతి వనంలో ఏర్పాటు చేసిన పెద్ద సైజు మయూరం బొమ్మల మీద నుంచి కింద పింఛం వరకు వచ్చేలా చిన్నపాటి కుండీల్లో మొక్కలు పెంచారు. వీటిని నిత్యం ఎంతో శ్రద్ధగా నిర్వహిస్తుండడంతో ఆ మొక్కలు పూలు పూసి సరికొత్త అందాలను సంతరించుకున్నాయి. స్మృతివనానికి వచ్చే సందర్శకులకు ఇవి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. **–ఈనాడు, అమరావతి**

మనది కాని క్షణం.. ఆగదు ప్రమాదం..





ద్విచక్ర వాహనాలపై సామాన్లు తరలిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వాహనం వెనుక కూర్చున్న వారు పెద్దసైజు వస్తువులను తీసుకెళ్లే సమయంలో ఏమాత్రం అదుపు తప్పినా వాహనం నడిపే వారితో పాటు వెనుక వచ్చే వాహనదారులకు సైతం ప్రమాదమే. విజయవాడ కృష్ణలంక, ఆటోనగర్‌లలో కనిపించిన దృశ్యాలివి. **-ఈనాడు, అమరావతి**

మిగిలిందే దారి.. సర్దుకుంటేనే సవారీ..


ప్రధాన రోడ్డుపై రోజుల తరబడి చెత్త పేరుకుపోయినా కనీసం పట్టించుకునేవారే లేరు. **-ఈనాడు, అమరావతి**

అడిగేవారు లేరని ఆటోనగర్ రోడ్లపై ఎవరు ఇష్టమొచ్చినట్లు వారు రాత్రిపూట చెత్త తీసుకొచ్చి గుమ్మరిస్తున్నారు. ఇది రోడ్డు అని చెప్పుకోవడానికి సిగ్గుపడేలా భారీగా పేరుకున్న చెత్త కుప్పలకు పోగా మిగిలిన దారిలో వాహనాలు తిరగాల్సిన దుస్థితి. ఆటోనగర్-కానూరు

ఇబ్రహీంపట్నంలో గంజాయి కలకలం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : నిత్యం రద్దీగా ఉండే ఇబ్రహీంపట్నం రింగు కూడలిలో భారీగా గంజాయి లభ్యం కావడం సంచలనంగా మారింది. పక్కా సమాచారంతో పోలీసులు 5 కేజీలకు పైగా సరకును పట్టుకోవడం చర్చనీయాంశమైంది. సేకరించిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రింగు కూడలి స్వర్ణా థియేటర్ సమీపంలో ముగ్గురు వ్యక్తులు ఓ స్కూటీపై అనుమానాస్పదంగా తిరగడం పోలీసులు గమనించారు. అప్పటికే వారికి కొంత సమాచారం వచ్చింది. అక్కడకు వెళ్లి స్కూటీని ఆపడంతో.. ముగ్గురిలో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. బండి నడిపే వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా.. 5 కేజీల గంజాయి లభ్యమైంది. అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పరారైన వారిలో ఒకరు మైనర్ ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయమై సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పరారైన వారి కోసం వెతుకుతున్నామని చెప్పారు. నిందితుడి వద్ద ఉన్న ద్విచక్ర వాహనం.. దొంగిలించిందేనని వెల్లడించారు.

ప్రధాన దారి.. గుల్లబారి..



గురునానక్‌కాలనీ అంటే విజయవాడలో పెద్దపేరు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఎక్కువ మంది ఉంటారు. అలాంటి ప్రదేశంలో రోడ్డు ఎక్కడ ఉందో వెతుక్కుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గుంతల్లో బురద నీరు నిలిచి పాదచారులు, సైకిళ్లు, ద్విచక్ర వాహనదారులపై చిందుతోంది. **-ఈనాడు, అమరావతి**

నయన మనోహరం.. సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆలయ ఈవో


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి కల్యాణ మహోత్సవం బుధవారం మోపిదేవిలో ఘనంగా జరిగింది. క్రతువులో 349 కుటుంబాలు పాల్గొన్నాయి. 35 వేల మంది స్వామిని దర్శించుకొని నాగపుట్టలో పాలుపోశారు. - **మోపిదేవి, న్యూస్‌టుడే**

రాజధానికి ప్రత్యామ్నాయ మార్గాలు

జనవరి నాటికి సిద్ధం కానున్న ఈ3 బీఆర్టీ రోడ్డు


ఈ3 రెండో దశ రోడ్డు బీఆర్టీ మార్గం

అమరావతి రోడ్డు అనుసంధాన మార్గాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రస్తుతం సాగుతున్న రోడ్ల పనుల పూర్తికి చాలా సమయం పట్టే అవకాశం ఉండడం.. త్వరలో మరో ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభంకానున్న దృష్ట్యా ప్రత్యామ్నాయ రోడ్లను అందుబాటులోకి తేనుంది. హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు, ప్రముఖుల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా ఇతర మార్గాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే మూడు బీటీ రోడ్లు నిర్మించారు. రద్దీ నియంత్రణకు ఇవి ఉపయోగపడతాయి.

ఈ3 బీఆర్‌టీ రోడ్డుపై... మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం నుంచి ఉండవల్లి వరకు 3.9 కిలోమీటర్ల నిడివితో ఈ3 రహదారి రెండో దశ పనులు ఇటీవల మొదలయ్యాయి. అన్ని సదుపాయాలతో పూర్తి కావాలంటే ఏడాదిన్నర సమయం పట్టొచ్చు. ఈ నేపథ్యంలో రహదారి మధ్యలోని 11 మీటర్ల వెడల్పు ఉన్న బీఆర్టీ మార్గాన్ని శరవేగంగా పూర్తి చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ మార్గంలో పలుచోట్ల రైతులు భూములివ్వలేదు. ప్రస్తుతం 1.8 కిలోమీటర్ల మేర ఇబ్బందుల్లేకపోవడంతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 2.1 కిలోమీటర్ల నిర్మాణానికి అవసరమైన భూమి ఏడీసీఎల్ చేతికి రాలేదు. ఇది పరిష్కారమైతే ఉండవల్లి వరకు బీఆర్టీ మార్గం జనవరి నాటికి సిద్ధమవుతుంది. కొండవీటివాగు ఎత్తిపోతల పథకం వెనుక రోడ్డును అనుసంధానించేందుకు కృష్ణా పశ్చిమ కాలువపై వంతెన నిర్మిస్తున్నారు.

రెండో ఎత్తిపోతల పనులు ప్రారంభమైతే..

కొండవీటి వాగుకు వచ్చే వరద నీటిని ఎత్తిపోసేందుకు ఉండవల్లిలో మరో ఎత్తిపోతల పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి. ఇందుకోసం కొన్నాళ్లపాటు కరకట్ట మార్గాన్ని మూసేస్తారు. దీనివల్ల విజయవాడవైపు నుంచి రాజధానికి వెళ్లే ప్రముఖులు, సామాన్యులకు ఇబ్బంది లేకుండా ఈ3 రోడ్డులోని బీఆర్టీ మార్గం ప్రత్యామ్నాయంగా ఉపయోగపడుతుంది. కరకట్ట రోడ్డు విస్తరణ పనులు మొదలైతే.. ఈ మార్గాన్ని పూర్తిగా నిలిపేస్తారు. రాజధానికి వెళ్లే వాహనాలను ఈ3 బీఆర్టీ మార్గంలోకి మళ్లిస్తారు. ఉండవల్లి గుహలు ఎదురుగా కరకట్టకు వెళ్లే మార్గాన్ని వెడల్పు చేసి బీటీ వేశారు. ఇది సీఎం చంద్రబాబు నివాసం దాటి... నేరుగా కరకట్ట వరకు వెళ్తుంది. మంతెన ఆశ్రమం సమీపంలో కరకట్ట దిగువ నుంచి మరో మార్గాన్ని ఈ3 రోడ్డుకు అనుసంధానించారు. కరకట్ట వెంబడి పొలాల నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు వరకు ఇంకో రోడ్డు వేశారు. అవసరాలను బట్టి మరికొన్నింటిని నిర్మించే యోచనలో అధికారులున్నారు. **– ఈనాడు, అమరావతి**

నిజంగా రైలు నడుపుతున్నట్లే..!

ఈటీసీసీలో అత్యాధునిక శిక్షణ

సత్యనారాయణపురం (గాంధీనగర్), న్యూస్‌టుడే

నిత్యం కోట్లాది మంది రైలు ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడంలో చోదకుల పాత్ర కీలకం. కళ్లు ఆర్పకుండా నిత్యం అప్రమత్తతతో వ్యవహరిస్తూ.. రైళ్లు నడుపుతారు లోకో పైలెట్లు (రైలు డ్రైవర్లు). ప్రమాదాలు జరగకుండా వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చే కేంద్రం.. ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్(ఈటీసీసీ) సత్యనారాయణపురంలో ఉంది. దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన వాటిల్లో ఇది ఒకటిగా ఘనత సాధించింది. 1979 సంవత్సరంలో ఇది ఏర్పాటైంది. సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఏటా 4 వేల మందికి పైగా లోకోపైలెట్లు, సహాయ లోకోపైలెట్లు, సాంకేతిక సిబ్బంది తర్ఫీదు పొందుతారు. గూడ్స్ నుంచి ప్రయాణికుల రైళ్లకు అప్‌గ్రేడ్ అయినప్పుడు, డీజిల్ ఇంజిన్ నుంచి లోకో ఇంజిన్ల వైపు మారినప్పుడు.. తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. బ్యాచ్‌ల వారీగా ఏడాది పొడవునా ఇక్కడ శిక్షణార్థులు ఉంటారు. వీరిలో ఆర్ఆర్‌బీ ద్వారా సహాయ లోకోపైలెట్లుగా ఎంపికైనా వారితో పాటు పదోన్నతులు పొందిన వారు ఉంటారు.


నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సిమ్యులేటర్ (రైలు ఇంజిను)

భద్రతకే ప్రాధాన్యం..

✪ ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యంగా శిక్షణ ఉంటుంది. ఇంజిన్లలో తలెత్తే 120 రకాల మరమ్మతులపై అవగాహన కల్పిస్తారు. ప్రయాణంలో ఎదురుగా ఉన్న సిగ్నల్ వ్యవస్థ, లెవల్ క్రాసింగ్ గేట్లు, పొగ మంచు ఉన్నప్పుడు రైలు ఎలా నడపాలి, వాతావరణం సరిగా లేకపోతే ఎలా వ్యవహరించాలో చెబుతారు. ప్రమాదాలు జరిగినప్పుడు స్పందించే తీరు, అనుకోని విధంగా రైల్లో మంటలు చెలరేగినప్పుడు వాటిని ఆర్పడం, ఎదురుగా వస్తున్న రైళ్లను గమనించడం.. వంటివి నేర్పిస్తారు. ✪ ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా తాజా విశేషాలను ఎప్పటికప్పుడు లోకో పైలెట్లకు తెలియజేస్తారు. మహిళా లోకోపైలెట్ల సంఖ్య ఇటీవల గణనీయంగా పెరిగింది. ✪ అత్యుత్తమ శిక్షణ, నిర్వహణకు గత ఐదేళ్లుగా ఈటీసీసీ రైల్వే బోర్డు, జీఎం అవార్డులను కైవసం చేసుకుంది.

4 విభాగాల్లో..

నాలుగు విభాగాలుగా శిక్షణ ఉంటుంది. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లోకో ఇంజిన్ల మరమ్మతులు, ఏవైనా ప్రమాదాలు జరిగినప్పుడు ఆ మార్గాల పునరుద్ధరణ, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తారు. నిపుణులైన అధ్యాపకులు ఉన్నారు. వీరంతా గతంలో రైల్వేలో సుదీర్ఘకాలం పని చేసి ప్రతిభ కనబర్చినవారే. తొలుత కంప్యూటర్ల ద్వారా బోధన ఉంటుంది. వేలాది పుస్తకాలతో ప్రత్యేకంగా ఒక గ్రంథాలయం ఉంది. పరీక్షలన్నీ ఆన్‌లైన్ విధానంలోనే ఉంటాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక సిమ్యులేటర్(రైలు ఇంజిన్) ఉంది. ఇది నిజమైన రైలు ఇంజిన్‌ను పోలి ఉంటుంది. రైలు నిజంగా నడుపుతున్నట్లు అనిపిస్తుంది. కోట్లాది రూపాయలు విలువచేసే ఈ సిమ్యులేటర్లను ఫ్రాన్స్, ఆస్ట్రేలియా నుంచి రప్పించారు. ప్రత్యేక విద్యుత్తు లైను, సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు.



విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, ఎంపీ కేశినేని శివనాథ్ తదితరులు


అసమాన మేధావి.. అంబేడ్కర్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తి, అసమాన మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ అని వక్తలు కొనియాడారు. ఆయన మేధస్సు, దూరదృష్టి భారత ప్రజాస్వామ్యానికి పునాదులు వేశాయని పేర్కొన్నారు. బుధవారం రాత్రి నగరంలోని అంబేడ్కర్ స్మృతివనంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, అంబేడ్కర్‌వాది జేబీ రాజు, తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు. వక్తలు భారత రాజ్యాంగం గొప్పతనం, విశిష్టత, రాజ్యాంగ రూపకల్పనలో అంబేడ్కర్ కృషి, త్యాగాలను కొనియాడారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని అంబేడ్కర్ కాకుండా ప్రపంచంలో మరెవ్వరూ రాయలేరని, దేశం ఉన్నంత వరకు మర్చిపోలేని మహనీయుల్లో ఆయన ముందు వరుసలో ఉంటారని ప్రశంసించారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వంగా రాజ్యాంగాన్ని తీసుకువచ్చారన్నారు. రచన కమిటీలో ఏడుగురు సభ్యులున్నా.. మొత్తం బాధ్యతనంతా తన భుజస్కంధాలపై వేసుకుని రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. స్మృతివనంలో ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాల కార్యక్రమాలతో పాటు విద్యార్థులు సందర్శించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తరాలకు రాజ్యాంగ విలువలు గుర్తు చేసేలా ఈ ప్రాంతాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నవనీతం సాంబశివరావు, దేవతోటి నాగరాజు, ఎరుబోతు రమణారావు, బెజ్జం జయపాల్, వేల్పుల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అంతస్తు.. అవినీతి కంపు

బాండ్లతో కార్పొరేషన్‌కు టోకరా

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే


నిబంధనలకు విరుద్ధంగా ప్లాను పొంది నిర్మిస్తున్న భారీ కట్టడం

నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగంలో కొందరు అధికారులు, ఓ లైసెన్స్‌డు టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ), వైకాపా నాయకుడొకరు కుమ్మక్కై, అక్రమంగా ప్లాను పొంది, ఓ భారీ నిర్మాణానికి తెర లేపారు. అదనపు అంతస్తులకు ఉపయోగించిన రూ.లక్షల విలువ గల ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్లతో కార్పొరేషన్‌కు టోపీ పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఈ అక్రమాల గుట్టు రట్టు అయింది.

★ పశ్చిమంలోని విద్యాధరపురానికి చెందిన స్థిరాస్తి వ్యాపారి ఒకరు భవనాలు నిర్మించి విక్రయిస్తుంటాడు. ఇతను మరో ఇద్దరితో కలిసి కామకోటినగర్‌లో 250.81 చదరపు మీటర్ల విస్తీర్ణం గల స్థలాన్ని కొని.. అదనపు అంతస్తుల నిర్మాణ ప్లాను పొందేందుకు అడ్డదారి ఎంచుకున్నాడు. నిబంధనలకు మించి అదనపు అంతస్తులు చేపట్టాలంటే, టీడీఆర్ బాండ్లు జత చేయాలి. వాటి కొనుగోలుకు రూ.లక్షల్లో వ్యయం అవుతుంది.

★ దీంతో వీరు అక్రమ పద్ధతిని ఎంచుకున్నారు. భవానీపురానికి చెందిన ఓ వైకాపా నాయకుడితో జతకట్టి దొడ్డి దారిన ప్లాను పొందారు. ఒప్పంద పద్ధతిన బిల్డింగ్ ఇన్‌స్పెక్టరుగా పని చేసి, లైసెన్స్‌డు టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ)గా ప్రస్తుతం ప్లాన్లు గీస్తున్న వ్యక్తి, క్షేత్రస్థాయి ప్రణాళికాధికారి కలిసి అక్రమాలకు పథక రచన చేశారు. ఆ స్థలంలో స్టిల్ట్, జీ+2 నిర్మాణానికి మాత్రమే ప్లాను మంజూరు అవుతుంది. అదనపు అంతస్తులకు కచ్చితంగా బాండ్లు జత చేయాలి. రెండు అదనపు ఫ్లోర్ల నిర్మాణానికి అవసరమైన బాండ్లు కొనేందుకు రూ.59.04 లక్షలు అవుతుంది. నిర్మాణ ఎత్తు 18 మీటర్లు కాగా, షట్‌బ్యాక్ కలిపి నిర్మిస్తున్నందున మరో రూ.36.90 లక్షల బాండ్లు జత చేయాలి.

★ ఇలా రూ.95.94 లక్షల విలువ గల బాండ్ల కోసం ఖర్చు చేయాల్సి ఉండగా వీరు ఇప్పటికే ఉపయోగించిన బాండ్లను తిరిగి జత చేసి ప్లాను పొందారు. ఫీజుల కింద రూ. 3,61,575 మాత్రమే చెల్లించారు. కీలకంగా 200 మీటర్ల విస్తీర్ణం, 18 మీటర్ల ఎత్తు ఉన్న నిర్మాణ ప్లాను పొందేందుకు భవనంలో 10 శాతం కార్పొరేషన్‌కు తనఖా చేయాల్సి ఉన్నా చేయలేదు. ఈ వ్యవహారం బయట పడకుండా ఓ మహిళా ఎల్‌టీపీ లాగిన్‌ను అక్రమంగా వినియోగించినట్లు తేలింది. ఈ వ్యవహారం తెలుసుకున్న ఆ ఎల్‌టీపీ తన లాగిన్ నుంచి ప్లానును ఉపసంహరిస్తున్నట్లు అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ అక్రమ ప్లాను వ్యవహారంలో రూ.లక్షల్లో చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఎల్‌టీపీని బ్లాక్ లిస్టులో పెడతాం

చందు అనే ఎల్‌టీపీపై పలు ఫిర్యాదులు వచ్చాయి. అతడు తప్పించుకునేందుకు వేరొకరి లాగిన్ ఉపయోగిస్తున్నాడు. అతని లాగిన్ బ్లాక్ చేసి, బ్లాక్‌లిస్టులో పెడతాం. అక్రమ నిర్మాణాన్ని ఆపించి చర్యలు తీసుకుంటాం. **- సంజయ్ రత్నకుమార్, చీఫ్ సిటీప్లానర్**

స్వేచ్ఛను దుర్వినియోగం చేయవద్దు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : భారత రాజ్యాంగం మనకు ఎన్నో హక్కులు, స్వేచ్ఛ కల్పించిందని.. వాటిని దుర్వినియోగం చేయవద్దని వినియోగదారుల ఫోరం-2 ఛైర్మన్ వల్లభరెడ్డి సూచించారు. బుధవారం బెజవాడ బార్ అసోసియేషన్‌లో భారతీయ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న ఫోరం ఛైర్మన్ వల్లభరెడ్డి. వేదికపై వరాహలక్ష్మి, శశికళ, బాషా, గుప్తా

బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాషా మాట్లాడుతూ మనం జీవించేందుకు భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను పొందుపరిచారని తెలిపారు. వాటి విశిష్టతను సుప్రీం కోర్టు కాపాడుతోందన్నారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాల సాధనకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కాగా ప్రజల సందర్శనార్థం ప్రాంగణంలో రాజ్యాంగ పీఠిక నమూనా, రాజ్యాంగ పుస్తకాన్ని ఉంచారు. కోర్టుకు వచ్చిన న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు వాటి వద్ద ఫొటోలు దిగి ఆనందించారు. ఫోరం సభ్యురాలు శశికళ, వేముల హజరత్తయ్యగుప్తా, నామాల కోటేశ్వరరావు, వరాహలక్ష్మి, చలసాని అజయ్‌కుమార్, ఎ.ఎస్.ఎస్.రాంప్రసాద్, పిచుక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు


ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రాకేష్

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఆర్యవైశ్యుల మనోభావాలను గౌరవించిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు అని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ తెలిపారు. పెనుగొండను వాసవీ పెనుగొండగా నామకరణం చేసిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు వ్యక్తం చేస్తూ బుధవారం సితార సెంటరు సమీపంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు ఆర్యవైశ్య సంఘం నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా రాకేష్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు వి.వి.కె. నరసింహారావు, సి.ఎల్.అరుణ్, రామ్మోహనరావు అరవేటి నిర్మల, మారం రోజా, ఆకుల రూపవాణి పాల్గొన్నారు.

'కృష్ణా జలాలపై తెలంగాణది అర్థం లేని వాదన'

ఈనాడు, అమరావతి: 'కృష్ణా జలాలపై ఆధారాలు లేకుండా తెలంగాణ చేస్తున్న వాదనలకు విలువ లేదు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట ఏపీ ప్రభుత్వం సమర్థ వాదనలు వినిపించింది' అని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు తెలిపారు. ఈ అంశంపై ఆయన ప్రకటన విడుదల చేశారు. 'ఏపీ వాదనలు వినిపించకుండానే మాజీ సీఎం జగన్, రైతు సంఘాల ముసుగులోని కొందరు నాయకులు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శలు చేయడం ఆశ్చర్యంగా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు వాడుకునేందుకు రెండు రాష్ట్రాలు ఒప్పందంలో చేసిన సంతకం ఒప్పటి తెదేపా ప్రభుత్వానిదే. ఈ కేటాయింపులు తిరగదోడేలా చేసింది వైకాపా సర్కారు. 2020లో నిర్వహించిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నీటి కేటాయింపులు సమీక్షించాలని, తమకు అన్యాయం జరిగిందని కేసీఆర్ డిమాండ్ చేసినా జగన్ నోరుమెదపలేదు. తెలంగాణ ప్రభుత్వం 700పైగా టీఎంసీలు తమకు కేటాయించాలని కోరడం సహేతుకం కాదు. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువలు, ప్రకాశం బ్యారేజీ కింద ఉన్న 30 లక్షల ఎకరాల ఆయకట్టు రైతుల నీటి హక్కులను కాపాడేందుకు ఏపీ ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది' అని తెలిపారు.

'కార్పొరేట్ కంపెనీల అనుకూల చట్టాలు రద్దు చేయాలి'

గాంధీనగర్, న్యూస్‌టుడే : కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా భారత ప్రభుత్వం చట్టాలు చేయడాన్ని మానుకోవాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏలూరు లాకుల సెంటర్‌లోని ధాకలి బసవపున్నయ్య విగ్రహం నుంచి ధర్నాచౌక్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. బహిరంగ సభలో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ఏటా వేల లక్షల మంది పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని దుయ్యబట్టారు. నాడు జమీందారీ వ్యతిరేక రైతాంగ పోరాటాల వల్ల భూ పంపిణీ జరిగిందని.. నేటి ప్రభుత్వాలు రైతు భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నాయని ధ్వజమెత్తారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ.. నూతన విద్యుత్ చట్టం, మార్కెట్ విధానాలు రైతుల పాలిట ఉరితాళ్లుగా మారతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం దండగ అనే పద్ధతిలో ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాయితీలు, అన్ని పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.


ప్రదర్శనలో శోభనాద్రీశ్వరరావు, ఈశ్వరయ్య, కేశవరావు, యలమందరావు, వివిధ సంఘాల నాయకులు

లేబర్ కోడ్ల నోటిఫికేషన్‌పై మండిపాటు.. లేబర్ కోడ్లపై నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్.నర్సింగరావు తీవ్రంగా ఖండించారు. యాజమాన్యాలకు అనుకూల చట్టాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ.. రైతులకు మేలు చేయని ఏ ప్రభుత్వం ఎంతోకాలం మనగడ సాగించలేదన్నారు. వివిధ సంఘాల నాయకులు ఎస్.వెంకటసుబ్బయ్య, ఎ.వి.నాగేశ్వరరావు, కె.పోలారి, డి.హరినాథ్, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగించారు. మల్నీడు యలమందరావు, మూలి సాంబశివరావు, సి.హెచ్.శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో రైతులు, కార్మికులు, చేతివృత్తిదారులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరుకు వినతిపత్రం అందజేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో రూ.ల్లో)

[illegible]

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం గేటు గుడ్ల ధర 100 గుడ్లకు రూ. 660 (వాణిజ్య & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.102/-.

తండ్రీ కుమారుల మృతదేహాలు లభ్యం

కృష్ణలంక, న్యూస్‌టుడే : కృష్ణానదిలో మునిగిపోయి మృతి చెందిన తండ్రీ కుమారుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు కృష్ణలంక పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. హోటల్‌లో పనిచేసే కరుణాకర్ (34) కుటుంబంతో గుంటూరు జిల్లాలో నివాసం ఉంటున్నాడు. అతనికి భార్య, ఇద్దరు సంతానం. సుమారు నెల క్రితం అతడు హైదరాబాద్‌లోని హోటల్‌లో పని నిమిత్తం వెళ్లి ఇటీవల ఇంటికి తిరిగొచ్చారు. ఈక్రమంలో ఈనెల 23న భార్య రాధిక, కూతురు సోఫియా, కుమారుడు భగవాన్ (7)తో కలిసి సీతమ్మ వారి పాదాల సెంటర్‌కు వచ్చారు. తండ్రీ కుమారులు నదిలో స్నానానికి వెళ్లగా తల్లీ, కూతురు ఒడ్డున ఉన్నారు. ఎంతసేపటికీ లోపలికి వెళ్లిన ఇద్దరు తిరిగి రాకపోవడంతో [illegible] వెళ్లి ఆచూకీ కోసం వెతికారు. కాగా బుధవారం కృష్ణానది వద్ద [illegible] రెండు మృతదేహాలు [illegible] స్వాధీనం చేసుకున్నట్లు చెప్పడంతో కృష్ణలంక పోలీసులను ఆశ్రయించారు. ఆ మృతదేహాలు కరుణాకర్, భగవాన్‌విగా నిర్ధారించుకున్నారు. ఈత నిమిత్తం నదిలోకి దిగి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి ప్రాధాన్యం

ధాన్యం కొనుగోళ్లకు సహాయ కేంద్రం


వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా

పాయకాపురం, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రవేశపెట్టిన 'రైతన్నా.. మీకోసం' కార్యక్రమం స్ఫూర్తితో ముందుకు సాగాలని కలెక్టర్ జి.లక్ష్మీశ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో ఖరీఫ్ 2025-26 ధాన్యం కొనుగోళ్లపై జేసీ ఎస్.ఇలక్కియతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. రైతులకు ఇబ్బందులు రాకూడదని పేర్కొన్నారు. గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాట్సప్ 73373 59375 నెంబరుపై సేవలపైనా అవగాహన కల్పించాలని చెప్పారు.

24 గంటల్లో సొమ్ము జమ.. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే రూ.49.70 కోట్ల విలువైన 20,818 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము జమ చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోళ్లకు సంబంధించి సమస్యలుంటే 77020 03571 నంబరుకు సహాయ కేంద్రం అందుబాటులో ఉందని చెప్పారు. ఏ సమస్య ఉన్నా రైతులు ఫోన్ చేయవచ్చని కోరారు. రబీ యాక్షన్ ప్లాన్ అంచనాలను ఇప్పటి నుంచే సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల డీఎం సతీష్ కుమార్, పౌర సరఫరా జిల్లా అధికారి ఎ.పాపారావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి డీఎంవీ విజయకుమారి, సమన్వయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడడం అందరి బాధ్యత

పాయకాపురం, న్యూస్‌టుడే : భారతీయులకు తోడు నీడగా ఉంటున్న రాజ్యాంగం ఔన్నత్యాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం చూపిన బాటలో నడిచి, ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. పీఠికలోని ప్రతి అక్షరం.. రాజ్యాంగ విశిష్టతను చాటిచెబుతోందన్నారు. ప్రతి రోజు వాటిని గుర్తు చేసుకుంటూ.. ప్రగతి పథంలో పయనించాలని సూచించారు. రాజ్యాంగ రూపకల్పనకు విశేష కృషిచేసిన అంబేడ్కర్ వంటి మహనీయుల బాటలో యువత నడవాలని, భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు.

శాఖల ప్రగతిలో ముందడుగు

పాయకాపురం, న్యూస్‌టుడే : స్వర్ణాంధ్ర-2047 సాధనలో భాగంగా ఆయా శాఖల సూచికల్లో పురోగతి కనిపిస్తోందని, ఏ గ్రేడ్ సాధించేలా చూడాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులను సూచించారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో కీలక ప్రగతి సూచికల(కేపీఐ)పై వ్యవసాయ అనుబంధ రంగాలు, మహిళా-శిశు సంక్షేమం, వైద్యారోగ్యం, విద్య తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. కొన్ని శాఖలు ఇంకా బి, సి గ్రేడ్‌లలో ఉన్నాయని, పటిష్ఠ ప్రణాళికతో ఏ గ్రేడ్‌కు చేరేలా చూడాలని కోరారు. సమావేశంలో సీపీఓ వై.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ పనుల దృష్ట్యా పలు రైళ్ల రద్దు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: విజయవాడ డివిజన్ పరిధిలోని గోదావరి, రామమండ్రి, కడియం సెక్షన్లలో నిర్వహణ పనుల దృష్ట్యా వచ్చే ఏడాది జనవరిలో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ★ రైలు నంబరు 12717/12718 విజయవాడ-విశాఖపట్నం(జనవరి 29వ తేదీ నుంచి 31 వరకు) ★ 67262/67261 విజయవాడ-రాజమహేంద్రవరం(29వ తేదీ). ★ 17249/17250 రేణిగుంట-కాకినాడపోర్ట్(28, 29 తేదీల్లో) ★ 17239/12240 గుంటూరు-విశాఖపట్నం(28వ తేదీ నుంచి 31 వరకు). ★ 12805/12806 లింగంపల్లి-విశాఖపట్నం(28వ తేదీ నుంచి 30 వరకు). ★ 17480/17479 తిరుపతి-పూరి(27, 28 తేదీల్లో). ★ 12775/12776 కాకినాడటౌన్-లింగంపల్లి(27, 28 తేదీల్లో). ★ 22708/22707 విశాఖపట్నం-తిరుపతి(28, 29 తేదీల్లో). ★ 17257/17258 విజయవాడ-కాకినాడపోర్ట్(29వ తేదీ నుంచి 31 వరకు). ★ 67201/67202 విజయవాడ-రాజమహేంద్రవరం(29వ తేదీ). ★ 17219/17220 మచిలీపట్నం-విశాఖపట్నం(28వ తేదీ నుంచి 30వరకు). ★ 22875/22876 గుంటూరు-విశాఖపట్నం(31వ తేదీ).

'క్రీడా స్టేడియాలను తీర్చిదిద్దుతాం'


అధికారులతో చర్చిస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను నగరంలో నిర్వహించేలా క్రీడా మైదానాలు, ఇండోర్ స్టేడియాలను తీర్చిదిద్దుతామని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. పటమట సీహెచ్ ఆర్కే వీఎంసీ ఇండోర్ స్టేడియం ఆధునికీకరణను బుధవారం వారు పరిశీలించారు. ఎంపీ మాట్లాడుతూ విజయవాడ నగరంలోని క్రీడా వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, జాతీయ స్థాయి క్రీడా పోటీలు ఇక్కడ నిర్వహించాలని సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయించినట్లు చెప్పారు. వచ్చే నెల 22 నుంచి జాతీయ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ నగరంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 2029 జాతీయ క్రీడలను విజయవాడలో నిర్వహించేలా అన్ని స్టేడియాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్పొరేటర్లు ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘ కార్యదర్శి పి.అంకమ్మ చౌదరి, 11వ డివిజన్ తెదేపా అధ్యక్షుడు నాదెళ్ల రాజేష్, కార్యదర్శి బంగారు మురళి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సీఈ సతీష్‌కుమార్, ఈఈ సామ్రాజ్యం, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి బెయిల్ సడలింపుపై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి : పార్లమెంటు శీతాకాల సమావేశాలకు హాజరయ్యేందుకు వీలుగా బెయిల్ షరతులను సడలించాలన్న వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. మద్యం కేసులో నిందితుడిగా ఉన్న మిథున్‌రెడ్డి.. బెయిల్‌పై విడులయ్యే సమయంలో విధించిన షరతులను సవరించాలని వేసిన పిటిషన్‌పై బుధవారం.. ఏసీబీ కోర్టులో ఇరుపక్షాల వాదనలు పూర్తి అయ్యాయి. ఈనెల 28వ తేదీ నుంచి వచ్చే 20వ తేదీ వరకు పార్లమెంటు శీతాకాల సమావేశాలు జరగనున్నాయని, వీటికి హాజరుకావాల్సి ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వాదనలు ముగియడంతో తీర్పు నిమిత్తం ఈనెల 27వ తేదీకి న్యాయాధికారి భాస్కరరావు వాయిదా వేశారు. తాము సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వచ్చే 15వ తేదీ వరకు ఊరట లభించిందని, నిందితులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ.. బుధవారం ఏసీబీ కోర్టులో ఇంటిమేషన్ మెమో దాఖలు చేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో అనిశా కోర్టులో బుధవారం లొంగిపోవాల్సి ఉంది. ఇదే కేసులో బాలాజీ కుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై సిట్ కౌంటర్ దాఖలు చేసింది. వీటిపై వాదనల నిమిత్తం గురువారానికి న్యాయాధికారి వాయిదా వేశారు.

విజయ్‌భాస్కర్‌రెడ్డి కస్టడీ పిటిషన్ వాయిదా

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: వైకాపా సోషల్ మీడియా కార్యకర్త మాలపాటి విజయ్ భాస్కర్‌రెడ్డి కేసు వ్యవహారంలో మరింత లోతైన విచారణ చేసేందుకు రెండో విడత పోలీసుల కస్టడీకి ఇవ్వాలని దాఖలైన పిటిషన్ వాయిదా పడింది. సామాజిక మాధ్యమాల్లో కూటమి నేతల కుటుంబ సభ్యులు, మహిళలు, న్యాయమూర్తులపై అసభ్య పోస్టులు పెట్టి అరెస్టు అయిన విజయ్‌భాస్కర్‌రెడ్డిని ఇటీవల నెల్లూరు జిల్లా వెంకటాచలం ఠాణాలో పోలీసులు రెండు రోజుల కస్టడీలోకి తీసుకొని విచారించారు. విచారణకు నిందితుడు సహకరించలేదు. ప్రతి ప్రశ్నకు తెలియదు.. సంబంధంలేదు.. సామాజిక మధ్యమాల ఖాతాలు హ్యాక్ చేశారు. కుట్ర చేసి కేసులో ఇరికించారంటూ డొంకతిరుగుడు సమాధానాలు చెబుతూ తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. 'అసభ్యకర పోస్టుల వెనుక ఎవరున్నారు. విజయ్‌భాస్కర్‌రెడ్డితో పాటు పాత్రధారులెవరు.. ఇలాంటి చేష్టలతో ఎవరికి ప్రయోజనం'.. తదితర విషయాల్లో లోతైన విచారణ చేసేందుకు రెండో విడత పోలీసు కస్టడీకి ఇవ్వాలని ప్రాసిక్యూషన్ పిటిషన్ దాఖలు చేసింది. బుధవారం దీనిపై ఇరువర్గాల వాదనలు విన్న రెండో ఏసీజేఎం కోర్టు న్యాయాధికారి తీర్పును గురువారానికి వాయిదా వేశారు.

కొండలరావు కస్టడీ పిటిషన్ తదుపరి విచారణ 1న

ఈనాడు, అమరావతి : అగ్నిమాపక శాఖలో వెబ్‌సైట్, యాప్ తయారీ, ట్యాబ్‌ల కొనుగోలులో అక్రమాల కేసులో కొండలరావు (ఏ4) కస్టడీ పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. ఈ కేసుకు సంబంధించి నిందితుడి నుంచి మరిన్ని ఆధారాలు సేకరించాల్సి ఉందని, ఏడు రోజులు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ అధికారులు పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై బుధవారం ఇరువర్గాల వాదనలు ముగిశాయి. శుక్రవారం ఉత్తర్వులు ఇస్తామని న్యాయాధికారి ప్రకటించారు. నిందితుడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణ డిసెంబరు 1వ తేదీకి వాయిదా పడింది. జైలులో వెస్టర్న్ టాయిలెట్, బెడ్, కుర్చీ, తదితర వసతులు కల్పించాలని వేసిన పిటిషన్‌పై ఉత్తర్వుల నిమిత్తం శుక్రవారానికి న్యాయాధికారి వాయిదా వేశారు.

మధిర బ్రాంచి కెనాల్‌కు 780 క్యూసెక్కుల జలాలు

గంపలగూడెం: ఎన్నెస్పీ రెండో జోన్ పరిధిలోని మధిర బ్రాంచి కెనాల్‌కు బుధవారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం 72వ కి.మీ నియంత్రణ నుంచి 780 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదల చేసినట్లు ఏఈ మహేష్‌బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 332 క్యూసెక్కులు చేరగా దిగువన మేజర్ వారీగా గంపలగూడెం 20, ఊటుకూరు-1కి 40, పెడకొమిర 25, మదిర 50, నరసాపురం 20 క్యూసెక్కులు చొప్పున సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

డిసెంబరు 19న ఏపీఎన్జీవోస్ ఎన్నికలు

తిరువూరు టౌన్: ఏపీఎన్జీవోస్ తిరువూరు యూనిట్ ఎన్నికలు డిసెంబరు 19న నిర్వహించనున్నట్లు ఏపీ ఎన్జీవోస్ సంఘ తిరువూరు సభ్యుడు మాతంగి ప్రసాద్‌బాబు తెలిపారు. డిసెంబరు 8న ఓటరు తుది జాబితా ప్రకటించి, 12న నామినేషన్ల స్వీకరణ, అదే రోజు ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. మొత్తం 12 మంది సభ్యుల్లో ఓ మహిళ.. కార్యవర్గంలో ఉంటారని తెలిపారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పాల సొసైటీ అధ్యక్షులకు సన్మానం

జి.కొండూరు, న్యూస్‌టుడే: జాతీయ పాల దినోత్సవం సందర్భంగా బుధవారం వీరవల్లి మిల్క్ ప్రాజెక్టులో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో పాల సొసైటీ అధ్యక్షులుగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిని కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు ఘనంగా సత్కరించారు. జి.కొండూరు మండలం కుంటముక్కల, కోడూరు గ్రామాల పాల సొసైటీ అధ్యక్షులు లంకా రామకృష్ణప్రసాద్, గుడిపూడి సాంబశివరావులను ముఖ్య అతిథులుగా విచ్చేసిన మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావులు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారని జి.కొండూరు రామకృష్ణప్రసాద్ తెలిపారు.

బాలల ఆరోగ్యానికి భరోసా

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వైద్య శిబిరాలు

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో 'ఈనాడు, ఈటీవీ' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలకు మంచి స్పందన లభిస్తోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పోషకాహార ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఈనాడు మీతోడు



చంద్రాలలో విద్యార్థినిని పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యురాలు అరుణ, పక్కన ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు

చంద్రాల (మైలవరం): బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యకరంగా ఉంటారని మండలంలోని చంద్రాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఎం.అరుణ పేర్కొన్నారు. చంద్రాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రియాంక, సిబ్బంది సహకారంతో, స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 6-10వ తరగతి వరకు 90 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. రక్త గ్రూపు, హిమోగ్లోబిన్ శాతం, అవసరమైన ఇతర పరీక్షలు చేశారు. కొందరు తలనొప్పిగా ఉంటోందని చెప్పగా, వారికి కంటి పరీక్షలు చేయించాలని వైద్యురాలు సూచించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరదా శ్రీనివాసరావు, పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మణిబాబు

రెడ్డిగూడెం: విద్యార్థులు నిత్యం పోషకాహారం తీసుకోవాలని రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.మణిబాబు పేర్కొన్నారు. రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు 100 మంది పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువులో రాణిస్తారని చెప్పారు. పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్‌పీ రమణ విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు సైరాబాను, సీహెచ్‌వో శ్యాంసుందరరావు, హెల్త్ ఎస్ రాంకుమార్, హెల్త్ భవాని, హెల్త్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



రెడ్డిగూడెం: విద్యార్థినులకు మందులు పంపిణీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



సత్యాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో..

సత్యాలపాడు (గంపలగూడెం): మండలంలోని సత్యాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో గంపలగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి శ్రుతి పాల్గొన్నారు. 40 మంది బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. సరైన పోషకాహారం తీసుకోకపోతే అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. పదో తరగతి తుది పరీక్షల్లో 550కు పైగా మార్కులు సాధించే ప్రతి ఒక్కరికి రూ.వెయ్యి చొప్పున బహుమతి అందజేస్తానని వైద్యాధికారిణి శ్రుతి ప్రకటించారు. ప్రధానోపాధ్యాయుడు చావా సతీష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఉపాధ్యాయులు వెంకట్రామయ్య, ఏడుకొండలు, కృష్ణారెడ్డి, మురళీకృష్ణ, వీరారెడ్డి పాల్గొన్నారు.

ప్రసంగించి.. ప్రతిభ చాటి!



బహుమతులు సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్ సురేష్, ప్రిన్సిపల్ రమేష్

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులు అనర్గళ ప్రసంగాలతో ప్రతిభ చాటితేనే బహుమతులు సాధించగలరని స్థానిక గౌతమ్ పాఠశాల కరస్పాండెంట్ గొల్లపూడి సురేష్ సూచించారు. 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా బుధవారం ఆ పాఠశాలలో 'విద్యార్థుల జీవితాలపై సెల్‌ఫోన్ ప్రభావం' అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. తొమ్మిదో తరగతికి చెందిన కె.రిషితకుమార్, సీహెచ్ కార్తికేయ, ఎం.మోక్షితాదేవి వరుసగా మొదటి మూడు స్థానాలు సాధించి బహుమతులు అందుకున్నారు. కరస్పాండెంట్ సురేష్, ప్రిన్సిపల్ రమేష్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు.

దారంతా దుమ్ము.. ఎవరిదీ పాపం!



మైలవరం, న్యూస్‌టుడే: అధ్వానంగా మారిన మైలవరం-నూజివీడు రహదారితో మండలంలోని వెల్వడం వాసులు, వాహనదారులు నెలల తరబడి నరకయాతన అనుభవిస్తున్నారు. గోతుల మరమ్మతుల నిమిత్తం ఆర్నెళ్ల కిందట తారు తవ్వేసి, వెట్‌మిక్స్‌తో నింపారు. ఒకవైపు గోతులు, మరోవైపు వాహనాలు వెళ్లే సమయంలో రేగుతున్న దుమ్ముతో స్థానికులు ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. భారీ వాహనాలు వెళ్లే సమయంలో వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలకు దారి కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు.

దరఖాస్తుకు నాలుగు రోజులే గడువు!

స్థలం ఉన్న లబ్ధిదారుల ఎంపికకు సర్వే చేస్తున్న అధికారులు

గంపలగూడెం, న్యూస్‌టుడే

గ్రామీణ ప్రాంతాల్లో సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకునేందుకు మరో నాలుగు రోజులే గడువు ఉంది. సచివాలయంలో అర్జీ అందజేస్తే అదేరోజు గృహనిర్మాణ సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తారు. అనంతరం నిబంధనల మేరకు అర్హులను ఎంపిక చేసి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన ప్లస్‌లో ఆర్థికసాయం అందించేందుకు నివేదిక పంపుతారు. తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు మండలాలకు చెందిన సుమారు 8వేల మంది దరఖాస్తు చేసుకోగా 7120 స్థలాల సర్వే పూర్తి చేశారు.

★ తిరువూరు నియోజకవర్గంలో అర్జీదారుల స్థలాలను గుర్తించేందుకు గృహ నిర్మాణ సంస్థ అధికారులు, ఉద్యోగులు సర్వే చేస్తున్నారు. పీఎం ఆవాస్ యోజన 2.0లో ఎంపికైన లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష వరకు ఇచ్చేందుకు ప్రతిపాదనలు చేశారు. కేంద్రం ఇచ్చే ఆర్థిక సాయంలో ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పనికల్పిస్తూ వేతనం, స్వచ్ఛభారత్‌లో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.30 వేల వరకు ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తే సొంత స్థలదారుడు ఇంటి నిర్మాణానికి రూ.2.50లక్షలు లబ్ధి పొందే అవకాశం ఉంది. రానున్న రెండేళ్లలో ఎంపికైన లబ్ధిదారులు తమ గృహాలు పూర్తి చేసుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

నియోజకవర్గంలో వివరాలు

మండలం	గ్రామాలు	సర్వే చేసినవి స్థలాలు
గంపలగూడెం	24	2100
తిరువూరు	20	1570
ఎ.కొండూరు	1	1800
విస్సన్నపేట	12	1650



ఊటుకూరులో సర్వే చేస్తున్న గృహ నిర్మాణ సంస్థ అధికారులు

నిబంధనల మేరకు అర్హుల ఎంపిక: క్షేత్రస్థాయిలో అర్జీదారునికి సొంత స్థలం ఉందో లేదో విచారించి నమోదు చేస్తున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులను ఎంపిక చేస్తాం. నెలాఖరు లోపు రేషన్‌కార్డు, స్థల ధ్రువీకరణ పత్రం, భార్యాభర్తల ఆధార్ కార్డులు, బ్యాంక్ ఖాతా నకలు సచివాలయంలో ఇస్తే వెంటనే సర్వే చేయిస్తాం.

-ఎం.విజయభాస్కరరాజు, గృహనిర్మాణ సంస్థ ఈఈ, తిరువూరు డివిజన్


రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపిక



ఉపాధ్యాయులతో విద్యార్థి చరణ్

మైలవరం, న్యూస్‌టుడే: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-17 కబడ్డీ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు తమ పాఠశాల విద్యార్థి ఇనపనూరి చరణ్ ఎంపికైనట్లు స్థానిక ఎస్వీఆర్‌జీఎన్నార్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్.సతీష్ తెలిపారు. ఇటీవల కర్నూల్‌లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటడం ద్వారా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కిందని వివరించారు. విద్యార్థిని, పీడీ శాంతకుమారిని ఉపాధ్యాయులు, పాఠశాల దాత ఎస్వీ సుధాకరరావు అభినందించారు.

కర్షకుల ఆదాయం పెంచేందుకు చర్యలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉమా

గొల్లపూడి, న్యూస్‌టుడే: రైతుల ఆదాయం పెంచి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. రైతన్నా మీకోసం కార్యక్రమం గొల్లపూడిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం, పంట మార్పిడి, ఆధునిక సాంకేతికత వినియోగంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిచేస్తుందన్నారు. తెదేపా నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంటల అధిక దిగుబడికే పంచ సూత్రాలు

జి.కొండూరు: రైతులు పండించే పంటల అధిక దిగుబడుల నిమిత్తం ప్రభుత్వం పంచ సూత్రాల కార్యక్రమం నిర్వహిస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు అన్నారు. పినపాక గ్రామంలో బుధవారం స్థానిక అధికారులు, నాయకులతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గాలి శ్రీనివాసరావు, దుర్గా జగదీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి పథకాలు



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు

మైలవరం: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు (జేడీ) హనుమంతరావు పేర్కొన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని తోలుకోడులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ రంగాల ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీ హరిహరనాథ్, మాజీ సర్పంచి శోభన్‌బాబు పాల్గొన్నారు.

విస్సన్నపేట: తాతకుంట్ల ఎస్సీ కాలనీలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తేగా.. గ్రామ కార్యదర్శి గోపాలకృష్ణ స్పందించి.. పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

లేబర్ కోడ్‌ల జీవో ప్రతుల దహనం



గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం తిరువూరు పట్టణంలోని శాంతినగర్‌లో సంబంధిత జీవో ప్రతుల నకళ్లను దహనం చేశారు. నాలుగు చట్టాలతో కార్మికులకు నష్టం జరుగుతుందని ఆరోపించారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు టి.కృష్ణయ్య, ఎస్కే. నాగుల్ మీరా, ఎం.ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని కీర్తిరాయునిగూడెంలో ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. ఆ గ్రామానికి చెందిన బట్టు గోపరాజు (22) మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తూ, రెడ్డిగూడెం మార్గంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టాడు. బుధవారం ఉదయం, రోడ్డు పక్కన పడి ఉన్న అతడి మృతదేహాన్ని చూసిన స్థానికులు, కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి తల్లి రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి నేత్రాలు దానం



నరసింహారావు (పాతచిత్రం)

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణానికి చెందిన గూడవల్లి రామగోపాలనరసింహారావు (72) బుధవారం మృతి చెందగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు విజయవాడ ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు, కొమ్మినేని రాజేష్‌ఖన్నాలు నేత్రదానం ప్రాధాన్యంను వివరించడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. మృతుడి కార్నియాలను ఆస్పత్రి వైద్యులు సేకరించి తీసుకెళ్లారు.



కొండపల్లి బాలికోన్నత పాఠశాలలో..



తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రమాణం చేయిస్తున్న కె.మాధురి

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న తిరువూరు కోర్టు జూనియర్ సివిల్ న్యాయమూర్తి సూర్యతేజ

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని పాఠశాలలు, విద్యాసంస్థల్లో రాజ్యాంగ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ప్రమాణం చేయించారు. వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. మాక్ అసెంబ్లీ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. తిరువూరు ఆర్డీవో మాధురి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, పాల్గొన్నారు. ★ తిరువూరు జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తి కె.సూర్యతేజ పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు, న్యాయవ్యవస్థ పాత్ర, పౌరుల బాధ్యతలపై వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. -న్యూస్‌టుడే, బృందం



సత్యాలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో..



గొల్లపూడిలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న రైల్వే డీఎస్పీ రత్నాకర్ తదితరులు



పశ్చిమ ఇబ్రహీంపట్నంలో మాక్ అసెంబ్లీలో విద్యార్థులు

రైతుల ప్రయోజనాలకు ప్రభుత్వం పెద్దపీట



కొనుగోలు కేంద్రంలో కాటాలు ప్రారంభిస్తున్న కుమార్‌రెడ్డి, నాయకులు

పుల్లూరు (మైలవరం), న్యూస్‌టుడే: రైతుల ప్రయోజనాలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఏఎంసీ మాజీ ఛైర్మన్ వజ్రాల కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పుల్లూరులో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పలువురు రైతులు తెచ్చిన ధాన్యానికి కాటాలు వేసి, మిల్లులకు తరలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు.

ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లోనే వసూలు చేయాలి



కూనపరాజుపర్వలో వానపాముల ఎరువును పరిశీలిస్తున్న డీపీవో లావణ్యకుమారి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఇంటి పన్నులు ఆన్‌లైన్‌లోనే వసూలు చేయాలని డీపీవో లావణ్యకుమారి సూచించారు. బుధవారం రెడ్డిగూడెం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించారు. మండల పరిషత్తు కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కూనపరాజుపర్వ గ్రామంలో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. స్వామిత్వ సర్వే తీరును పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు ఎం.రాణి, ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో పి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం



ఎ.కొండూరు మండలం కంభంపాడు శివాలయంలో

మైలవరం, న్యూస్‌టుడే: సుబ్రహ్మణ్యస్వామి షష్ఠిని పురస్కరించుకుని బుధవారం స్థానిక భ్రమరాంబిక సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం ద్వారకాతిరుమల దేవస్థానం ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.



గంపలగూడెం మండలం తోటమూల గుడిలో..

గంపలగూడెం, తిరువూరు, ఎ.కొండూరు: గంపలగూడెం, ఎ.కొండూరు, తిరువూరు మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు చేశారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పదీక్షాధారుల ఇరుముడులు

రంగాపురం (రెడ్డిగూడెం): మండలంలోని రంగాపురం గ్రామంలోని రామాలయంలో బుధవారం అయ్యప్పస్వామి దీక్షాధారుల ఇరుముడుల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 15 మంది ఇరుముడులు కట్టించుకొన్న అనంతరం అయ్యప్పస్వామిని దర్శించుకునేందుకు శబరిమలకు తరలివెళ్లారు.



పెనుగొలనులో..

పెనుగొలను (గంపలగూడెం): మండలంలోని పెనుగొలనులో బుధవారం అయ్యప్పస్వామి దీక్ష తీసుకున్న 50 మంది భక్తులు ఇరుముడి ధరించి శబరిమలై యాత్రకు తరలివెళ్లారు. శివాలయ ప్రాంగణంలో గురుస్వామి జి.వెంకటేశ్వర్లు, అర్చకులు డి.రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఇరుముడి స్వీకరించారు. ఆలయ ప్రాంగణం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది.



అయ్యప్పస్వామికి లక్ష తులసీ దళార్చన

మేడూరు (గంపలగూడెం): మండలంలోని మేడూరు అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అర్చకులు బాదంపూడి రామలింగేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి వారి మూలవిరాట్‌కు లక్ష తులసీ దళాలతో అర్చన నిర్వహించారు. దీక్షాధారులు, భక్తుల సమక్షంలో మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేశారు.

మాక్ అసెంబ్లీలో మైలవరం విద్యార్థిని

మైలవరం: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్ విద్యార్థిని షేక్ గుల్షన్ ఆరా పాల్గొంది. నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, మూడ్రోజుల ప్రభుత్వ శిక్షణ అనంతరం మాక్ అసెంబ్లీలో పాల్గొనడం ఆనందంగా ఉందని విద్యార్థిని పేర్కొంది. అరుదైన అవకాశాన్ని పొందిన ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ ఛైర్మన్ బాబూరావు అభినందించారు.

సచివాలయ భవనం పూర్తయ్యేదెప్పుడో?

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

నాలుగేళ్ల కిందట ప్రారంభించిన ఇబ్రహీంపట్నం ఒకటో సచివాలయ భవన నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్టీటీపీఎస్ ఎ, సి, సెక్యూరిటీ కాలనీలతో పాటు ఇబ్రహీంపట్నంలోని కొంత భాగాన్ని ఒకటో సచివాలయం పరిధిగా చేసి అద్దె భవనంలో కార్యాలయాన్ని ప్రారంభించారు. రైతు బజారులో కొంత స్థలాన్ని సచివాలయ భవన నిర్మాణం కోసం కేటాయించి రూ.40 లక్షలు మంజూరు చేశారు. రైతుబజారు ఏర్పాటుకు ఉచితంగా స్థలాన్ని మంజూరు చేసిన ఎన్టీటీపీఎస్ సంస్థ ఇందుకు అభ్యంతరం తెలిపింది. దీంతో సచివాలయ వ్యవస్థ, ఎన్టీటీపీఎస్‌కు చెందిన అధికారుల మధ్య వివాదం నెలకొనడంతో పాటు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో భవన నిర్మాణ పనులను గుత్తేదారుడు మధ్యలోనే నిలిపివేశారు. నాటి నుంచి అరకొర వసతులున్న భవనంలోనే సిబ్బంది ఇబ్బందులు పడుతూ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్థల వివాదాన్ని పరిష్కరించి, నిర్మాణ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పోలీసుశాఖలో 11,639 పోస్టుల భర్తీపై నిర్ణయం తీసుకోండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: పోలీసుశాఖలో వివిధ క్యాడర్ల కింద ఖాళీగా ఉన్న 11,639 పోస్టుల భర్తీ విషయంలో ఆరు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. స్థాయి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేసింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

★ పోలీసుశాఖలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ 'హెల్ప్ ది పీపుల్ ఛారిటబుల్ ట్రస్ట్' మేనేజింగ్ ట్రస్టీ కిలారి అఖిల్ శ్రీగురుతేజ గత ఏడాది హైకోర్టులో పిల్ వేశారు. పోలీసుశాఖలో 19,999 ఖాళీలు ఉన్నట్లు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం ఇచ్చిందన్నారు. ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. మరోవైపు ఇదే వ్యవహారంపై హైకోర్టు సుమోటోగా విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే.

★ ఈ రెండు ప్రజాహిత వ్యాజ్యాలు బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చాయి. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి వాదనలు విని పిస్తూ.. వివిధ క్యాడర్ల కింద 11,639 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రాధాన్యక్రమంలో భర్తీ చేసేందుకు అనుమతివ్వాలని కోరుతూ డీజీపీ ఈ ఏడాది సెప్టెంబర్ 29న హోంశాఖ ముఖ్య కార్యదర్శికి లేఖ రాశారన్నారు. దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు.



షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు. చిత్రంలో శ్రీచైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి, ఎమ్మెల్యే గణబాబు తదితరులు

రూ.3 కోట్లతో సింహగిరిపై షెడ్డు

శ్రీ చైతన్య విద్యాసంస్థల తరఫున నిర్మాణం

విశాఖపట్నం (సింహాచలం), న్యూస్‌టుడే: శ్రీచైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి రూ.3 కోట్లు వెచ్చించి సింహగిరిపై నిర్మించిన టీఎంఎస్ (టెన్సిల్ మెంబ్రేన్ షెల్టర్) షెడ్డు ప్రారంభోత్సవం బుధవారం సింహగిరిపై జరిగింది. ఝాన్సీ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి.గణబాబు పాల్గొని షెడ్డును ప్రారంభించారు. ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ వంద రోజుల వ్యవధిలో నాణ్యతలో రాజీ పడకుండా నిర్మాణాన్ని పూర్తి చేశారని అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు వై.శ్రీధర్, బి.సుష్మ, టి.నాగేంద్రకుమార్, కె.వి.రమణ, దేవస్థానం అధికారులు పలువురు పాల్గొన్నారు.

నీలం సాహ్ని ఎస్ఈసీగా కొనసాగడంపై పిల్

కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వం, సాహ్నికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: విశ్రాంత ఐఏఎస్ అధికారి నీలం సాహ్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా కొనసాగడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్‌లో హైకోర్టు స్పందించింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు నీలం సాహ్నిని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. 65 ఏళ్లు పైబడిన సాహ్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా కొనసాగడానికి వీల్లేదంటూ గుంటూరుకు చెందిన పిడికిటి వెంకట మల్లికార్జునరావు హైకోర్టులో పిల్ వేశారు. 65 ఏళ్లు పైబడినవారు ఎస్ఈసీగా కొనసాగడం అధికరణ 14, 243(కె)లకు విరుద్ధమన్నారు. ఆమెను ఆ పదవి నుంచి తొలగించాలని కోరారు. బుధవారం జరిగిన విచారణలో ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు సమయం కావాలని కోరారు.

'ఈ-స్టాంప్ అక్రమాల' కేసుల్లో నివేదిక ఇవ్వండి: హైకోర్టు

ఈనాడు, అమరావతి: అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో ఈ-స్టాంప్ విక్రయాల్లో జరిగిన అక్రమాలపై నమోదైన కేసుల దర్యాప్తులో పురోగతిని తెలియజేస్తూ నివేదిక ఇవ్వాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. దర్యాప్తును సీబీఐకి అప్పగించాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. వ్యాజ్యంలో ప్రతివాదిగా ఉన్న కల్యాణదుర్గం తెదేపా ఎమ్మెల్యే సురేంద్రబాబు తదితరులకు నోటీసులు జారీచేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. కల్యాణదుర్గంలో ఈ స్టాంప్ విక్రయంలో భారీ కుంభకోణం జరిగిందని, సీబీఐతో దర్యాప్తు చేసేలా ఆదేశాలు జారీచేయాలని అనంతపురం వైకాపా మాజీ ఎంపీ తలారి రంగయ్య హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు.



అలాంటివారికి ఉజ్వల భవిష్యత్తు

శరవేగంగా మారుతున్న ఈ ప్రపంచంలో నెగ్గుకురావాలంటే ఎప్పటికప్పుడు మనల్ని మనం మెరుగుపర్చుకోవాల్సిందే. నిత్య విద్యార్థిలా ఉంటూ ఎక్కువ నైపుణ్యాలు నేర్చుకోవడం ఎంత ముఖ్యమో, వాటిని సృజనాత్మక శైలిలో అనుసంధానం చేసి అత్యుత్తమ ఫలితాలు పొందడం కూడా అంతే కీలకం. అలాంటివారికి ఉజ్వల భవిష్యత్తు ఖాయం.

– రాబర్ట్ గ్రీన్, రచయిత

నీళ్లన్నీ ఇచ్చేస్తే ఆంధ్రప్రదేశ్ ఏమైపోవాలి?

- రాజధాని లేదు, హైదరాబాద్ లేదు.. పరిశ్రమలూ లేవు
- ఏపీకి కేటాయించిన నీళ్లు ఇచ్చేస్తే ప్రజలు ఏమవ్వాలి
- ట్రైబ్యునళ్ల కేటాయింపులకు అర్థం లేదంటే ఎలా?
- బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట సీనియర్ న్యాయవాది వాదనలు

ఈనాడు, అమరావతి: 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజనతో ఏపీకి రాజధాని హైదరాబాద్ లేకుండా పోయింది. కొత్తగా రాజధాని నిర్మించుకోవాలి. రాష్ట్రానికి పరిశ్రమలు లేకుండా పోయాయి. ఇప్పుడు మా నీటి కేటాయింపులు తొలగించి తమకు ఇవ్వాలని తెలంగాణ అంటే ఎలా? ఏపీలో లక్షల మంది రైతులు, ప్రజలు ఏమైపోవాలి? 130, 150 ఏళ్ల నుంచి అభివృద్ధి చెందిన ఆయకట్టు ఏమైపోవాలి?' అని సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా ఉద్వేగభరితంగా వాదించారు. బ్రిజేష్ ట్రైబ్యునల్ ఎదుట రెండోరోజూ బుధవారం ఆయన వాదనలు కొనసాగించారు. అనేక కీలక ప్రశ్నలను లేవనెత్తారు. విభజన చట్టం ఏం చెబుతోంది? ట్రైబ్యునళ్లు ఇంతకుముందు ఏ నిర్ణయాలు తీసుకున్నాయి? విభజన చట్టం సెక్షన్ 89 ప్రకారం ఏం చేయాలి? అసలు ఈ ట్రైబ్యునల్‌కు నీటి కేటాయింపులు పునఃపరిశీలించే అధికారం ఎందుకు లేదనే అంశాలను జయదీప్ గుప్తా విశ్లేషించారు. ఆయన వాదనలు ఇలా ఉన్నాయి..

★ ఏపీ ఇప్పటికే భారీగా నష్టపోయింది. ప్రపంచ స్థాయి సంస్థలను హైదరాబాద్‌లోనే ఏర్పాటుచేశారు. రాష్ట్రవిభజనతో ఏపీ హైదరాబాద్‌ను కోల్పోయి ఎంతో నష్టపోయింది. పరిశ్రమలు లేవు.. వ్యవసాయమే మిగిలింది. ఇప్పుడు తెలంగాణ వద్దీ నీటి కేటాయింపుల సమయంలో తాము పార్టీగా లేమని, ఆ నీళ్లన్నీ తమకు ఇచ్చెయ్యాలంటే ఎలా కుదురుతుంది? ఏపీ ప్రజలను ఉండి ఏం చేస్తుందంటారు?

★ ఏపీలో వ్యవసాయం ఎప్పుడో కృష్ణా తొలి ట్రైబ్యునల్ కేటాయింపులు నాటి నుంచే ఉంది. ఇప్పుడు కేటాయింపులు ఎత్తేసే అసలు నీటి కేటాయింపులు లేకుండా ఎలా చేస్తారు? కృష్ణా తొలి, రెండో ట్రైబ్యునళ్ల నిర్ణయాలు ఇప్పటికే వెలువడ్డాయి. ఇప్పుడు తెలంగాణ ఆ తీర్పులను బుట్టదాఖలు చేయాలంటుందా? చట్టబద్ధమైన ట్రైబ్యునళ్ల తీర్పులకు, కేటాయింపులకు గుర్తింపు లేకుండా ఎలా ఉంటుంది?

★ ప్రస్తుత ట్రైబ్యునల్ నీటి కేటాయింపులను తిరగతోడటానికి లేదు. ఉమ్మడి ప్రాజెక్టులకు గంపగుత్తగా కేటాయించిన నీళ్లనే ప్రాజెక్టులవారీగా ఎంతెంతో తేల్చి చెప్పాలి. ఉమ్మడి ప్రాజెక్టులు నాలుగే ఉన్నాయి. శ్రీశైలం, నాగార్జునసాగర్, తుంగభద్ర, పులిచింతల. వీటివద్ద నీటి ఆవిరి కింద నష్టపోయేది ఎంతో ట్రైబ్యునల్స్ చెప్పాయి. అలా పోయే నీటిలో ఎవరి వాటా ఎంతో ట్రైబ్యునల్ తేల్చాలి.

★ శ్రీశైలంలో నీటి ఆవిరి కింద నష్టపోయేది 33 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 16 టీఎంసీలుగా గతంలో ట్రైబ్యునళ్లు పేర్కొన్నాయి. ఇందులో ఏపీ, తెలంగాణ వాటాలను ట్రైబ్యునల్ చెప్పాలి. తుంగభద్రలో ప్రాజెక్టుల వారీగా ఇప్పటికే కేటాయింపులు ఉన్నాయి. నాగార్జునసాగర్ జవహర్ కాలువకు 132 టీఎంసీలు, లాల్‌బహదూర్ కాలువకు 132 టీఎంసీలు ఇచ్చారు. లాల్‌బహదూర్ కాలువలో ఏపీకి 32.25 టీఎంసీలు కేటాయించారు. నాగార్జునసాగర్ వద్ద ప్రాజెక్టుల వారీగా ఎవరి వాటా ఎంతో తేల్చాలి. పులిచింతల ప్రాజెక్టు ఏపీలో పూర్తిస్థాయిలో ఉంది. ఆ ప్రాజెక్టు నీటి ఆవిరి 9 టీఎంసీలు ఏపీకే కేటాయించాలి.

★ ప్రస్తుతం అమల్లో ఉన్న ప్రాజెక్టులకే కృష్ణా తొలి ట్రైబ్యునల్ నీటి కేటాయింపులు చేసి, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నవే. విభజన చట్టం 11వ షెడ్యూల్‌లో పేర్కొన్న ఆరు ప్రాజెక్టులు తెలుగుగంగ, హంద్రీనీవా, వెలిగొండ, గాలేరు నగరి, నెట్టెంపాడు, కల్వకుర్తి.. ఇవే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు. ఆ తర్వాత కొత్త ప్రాజెక్టులు. ఇప్పుడు నిర్మాణంలో ఉన్న ఆరు ప్రాజెక్టులకే నీళ్లు లేవు. ఇక కొత్త ప్రాజెక్టులకు ఎక్కడి నుంచి వస్తాయి?

★ ఇప్పటికే కృష్ణా ట్రైబ్యునల్ సగటున 2,578 టీఎంసీలను భాగస్వామ్య రాష్ట్రాలకు పంచేసింది. మిగిలిన జలాలపై అత్యంత దిగువ రాష్ట్రానికే హక్కులు ఉంటాయి. అది ఆంధ్రప్రదేశే. మిగులుజలాలు ఏపీకే దక్కుతాయి.

గ్రామాల స్వయం సమృద్ధికి పాడి పరిశ్రమ దోహదం

సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం తగదు • మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు. చిత్రంలో కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తదితరులు

వీరవల్లి (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే: "ప్రజాస్వామ్యంలో కోఆపరేటివ్ వ్యవస్థది ప్రత్యేక స్థానం. సహకార సంఘాల్లో రాజకీయ జోక్యం తగదు. పాడి రైతుల ప్రగతే లక్ష్యంగా శ్వేత విప్లవ స్ఫూర్తితో కృష్ణా మిల్క్ యూనియన్ మరింత అభివృద్ధి చెందాలి" అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణా జిల్లా వీరవల్లిలోని విజయా డెయిరీ కామధేను ప్రాజెక్ట్ ఆవరణలో బుధవారం నిర్వహించిన జాతీయ పాల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. 650 కిలోవాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్‌ను ప్రారంభించారు. కేంద్ర మాజీ హోం మంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు, ఛైర్మన్ చలసాని ఆంజనేయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్య సాధనకు గ్రామాల స్వయం సమృద్ధికి పాడి పరిశ్రమ ఎంతో దోహదపడుతుందని చెప్పారు. మహిళా సంఘాలను ప్రోత్సహించేలా యూనియన్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 1965లో 646 లీటర్లతో ప్రారంభమైన కృష్ణామిల్క్ యూనియన్.. ఏటా 11 కోట్ల లీటర్ల పాలు సేకరిస్తూ రూ.1,220 కోట్ల వ్యాపారం చేయడం శుభపరిణామం అన్నారు. విజయా డెయిరీ అంటే తనకు మండవ జానకిరామయ్య గుర్తుకు వస్తారని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. శ్వేత విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్ అడుగుజాడల్లో రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ పనిచేస్తోందని ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. అనంతరం రూ.11.06 కోట్ల బోనస్ చెక్కులను వెంకయ్యనాయుడి చేతుల మీదుగా పాల సొసైటీలకు అందజేశారు. కార్యక్రమంలో ఎండీ కొల్లి ఈశ్వరబాబు, ప్రెస్ అకాడమీ ఛైర్మన్ సురేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇక స్వదేశీ నౌకా ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థ

అభివృద్ధి చేసిన ఐఐటీ మద్రాస్ పరిశోధకులు

వడపళని, న్యూస్‌టుడే: ఓడరేవుల కోసం దేశంలో మొదటి స్వదేశీ నౌకా ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను ఐఐటీ మద్రాస్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దీనిని అభివృద్ధి చేసినట్లు ఐఐటీ మద్రాస్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ వ్యవస్థను ఇప్పటికే కేరళలోని విఝింజమ్ ఇంటర్నేషనల్ సీపోర్ట్ లిమిటెడ్(వీఐఎస్ఎల్)లో అమలు చేశారు. పశ్చిమ తీరంలోని మరో రెండు ఓడరేవుల్లోనూ అమలుకు ఐఐటీ మద్రాస్‌తో చర్చలు జరుపుతున్నాయి. వివిధ సవాళ్లకు అత్యంత సముచితమైన పరిష్కారాలను అందించడానికి, ముప్పులను వేగంగా ట్రాక్ చేయడానికి తాము రూపొందించిన వ్యవస్థ వీలు కల్పిస్తుందని ఐఐటీ మద్రాస్ అచార్యుడు, నేషనల్ టెక్నాలజీ సెంటర్ ఫర్ పోర్ట్స్, వాటర్‌వేస్ అండ్ కోస్ట్స్ (ఎన్‌టీసీపీడబ్ల్యూసీ) విభాగం అధినేత కె.మురళి తెలిపారు. "ఈ వ్యవస్థతో ఓడల కదలికలకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం లీక్ అవకుండా చూడొచ్చు. దేశంలోని సముద్ర రంగంలో సాంకేతికత, నైపుణ్యాల స్వదేశీకరణకు ప్రోత్సాహం కలిగించడంతో పాటు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది" అని ఆయన వెల్లడించారు.

కళ్లాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం!

- తేమ పేరుతో బస్తాకు 4 నుంచి 8 కిలోల కోత
- ధర, తరలింపుపై రైతులే మిల్లర్లతో మాట్లాడుకోవాల్సిన స్థితి
- నిమిత్తమాత్రులుగా రైతు సేవా కేంద్రాల సిబ్బంది

ఈనాడు, అమరావతి, యంత్రాంగం: మొంథా తుపాను దెబ్బకు వరి నేల వాలింది. కోత ఖర్చులు మూడు రెట్లు పెరిగాయి. నూర్పిడి చేసిన ధాన్యం విక్రయిద్దామంటే.. తేమ సాకుతో కొనుగోలుదారులు ధరలో కోత పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. రైతు సేవా కేంద్రాలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయి. పైగా.. కొన్నిచోట్ల గోతాలు అందుబాటులో లేవు. రవాణా చేద్దామంటే లారీలు లేవంటున్నారు. వాస్తవానికి గతేడాది ఖరీఫ్‌తో పోలిస్తే.. 2025 ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ పెరిగింది. 2024 నవంబరు 26 నాటికి రూ.1,082 కోట్ల విలువైన 5.05 లక్షల టన్నుల ధాన్యం సేకరించగా.. ఈ ఏడాది రూ.1,612 కోట్లతో 7.40 లక్షల టన్నులు కొనుగోలు చేశారు. రైతులకు సొమ్ము చెల్లింపులు 4 నుంచి 24 గంటల్లోనే జమ అవుతున్నాయి. కానీ, ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సమస్యలు వెంటాడుతున్నాయి. 75 కిలోల బస్తాకు మద్దతు ధర ప్రకారం రూ.1,777 దక్కాల్సి ఉంటే.. రైతుకు సగటున రూ.1,450 మాత్రమే లభిస్తోంది.

ఉమ్మడి తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాలోని కొన్ని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది అంతా మిల్లర్లకే అప్పగించారు. ధాన్యం నూర్పిడి చేయిస్తే రైతే.. మిల్లరు దగ్గరికి వెళ్లి నమూనా చూపించి, ధర మాట్లాడుకోవాలి. తేమ 17% కంటే ఎక్కువ ఉంటే.. ఒక శాతానికి 2 కిలోల చొప్పున అదనంగా ధాన్యం సమర్పించుకోవాల్సిందే. అందుకు అంగీకరిస్తేనే ధాన్యం మిల్లుకు తరలే అవకాశం ఉంటోంది. ఇంత జరిగాకా.. రైతు సేవా కేంద్ర సిబ్బంది వచ్చి.. ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించినట్లు చూపిస్తున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో కొందరు సిబ్బంది బహిరంగంగానే మిల్లర్లతో మాట్లాడుకోవాలని రైతులకు సూచిస్తున్నారు.

ఎంత ఆరబెట్టినా.. తేమ తగ్గదే

అధిక శాతం రైతులు ధాన్యాన్ని రోజుల తరబడి ఆరబెడుతున్నారు. అయినా.. రైతు సేవా కేంద్రంలో చూపించే తేమ కంటే.. మిల్లుల్లో అధికంగా చూపిస్తోంది. రెండు చోట్లా ఒకే కంపెనీకి చెందిన తేమ యంత్రాలు ఏర్పాటు చేశామని మంత్రి మనోహర్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఎవరి లెక్క వారిదే అన్నట్లుంది. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం దుళ్లలో రైతు సేవా కేంద్రంలో 16% తేమ చూపిన ధాన్యాన్ని మిల్లుకు తీసుకెళ్తే 18% ఉందని తేల్చారు. దీనిపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. కొన్నిచోట్ల తేమ శాతం ఎంతో తెలియజేసే స్లిప్పులు ఇవ్వడం లేదు. నంద్యాల జిల్లాలో సన్న రకాల్లోనూ తేమ అధికంగా ఉందంటూ ధరలో కోత పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అందని బ్యాంకు గ్యారంటీలు

మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీల సమర్పణలో జాప్యం జరుగుతోంది. బాపట్ల జిల్లాలోనూ 74 బ్యాంకు గ్యారెంటీలకు 10 మందే ఇచ్చారు. శ్రీకాకుళంలో 264 బ్యాంకు గ్యారెంటీలకు 82 మాత్రమే వచ్చాయి. 406 కొనుగోలు కేంద్రాలు తెరవాల్సి ఉంటే ఇప్పటికీ 220 మాత్రమే ప్రారంభమయ్యాయి. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోసుకొని నిరీక్షిస్తున్నారు.


కోత ఖర్చులు తడిసిమోపెడు

వరి కోతలు ఒకేసారి మొదలు కావడంతో ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో కోత యంత్రాలకు డిమాండు పెరిగింది. ఎకరం వరి కోసేందుకు కొన్నిచోట్ల గంటకు రూ.3 వేల నుంచి రూ.3,500 వరకు వసూలు చేస్తున్నారు. సాధారణంగా ఎకరం గంటలో కోయొచ్చు. కానీ, తుపానుకు వరి పడిపోవడంతో 2 నుంచి 3 గంటలవుతోంది. దీంతో ఎకరం వరి కోతకు సుమారు రూ.10 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది.

సంచుల కొరత ఉంది


నాలుగున్నర ఎకరాల వరి కోశాం. రైతు సేవా కేంద్రాలకు వెళ్తే సంచుల కొరత ఉందని, సంచులు దొరికే వరకు ధాన్యం ఆరబెట్టుకోవాలని చెబుతున్నారు. లారీలూ అందుబాటులో లేవంటున్నారు. వర్షాలు పడితే ధాన్యం తడుస్తుందని భయంగా ఉంది.

– రైతు సంగిశెట్టి నాగభూషణం, భట్లపెనుమర్రు, కృష్ణా జిల్లా



రామబాణం అంత దృఢం..

అయోధ్యలో రామాలయం నిర్మాణ పనులు మంగళవారం జరిగిన ధ్వజారోహణ కార్యక్రమంతో పూర్తయ్యాయి. వేల ఏళ్లు నిలిచేలా ఒక యజ్ఞంలా చేపట్టిన ఈ నిర్మాణంలో దేశంలోని వేర్వేరు ప్రాంతాల నుంచి అత్యుత్తమ సామగ్రిని సేకరించి పూర్తిచేశారు. ఆలయంలో ఏర్పాటు చేసిన కిటికీలను అత్యంత పటిష్ఠమైన టైటానియంతో రూపొందించారు. హైదరాబాద్‌లోని మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) వీటిని ప్రత్యేకంగా తయారు చేసింది. ఒక నిర్మాణంలో టైటానియం వినియోగించడం ఇదే మొదటిసారి. మొత్తం 31 టైటానియం కిటికీలను ఆలయ ప్రదక్షిణ కారిడార్‌లో అమర్చారు. నాలుగు దశాబ్దాలుగా దేశ వ్యూహాత్మక అవసరాల కోసం టైటానియం మిశ్రధాతువులను మిధాని అభివృద్ధి చేసి వైమానిక, రక్షణరంగ అవసరాలకు అందిస్తోంది. వైడ్ ప్లేట్‌మిల్‌పై హాట్ రోలింగ్, కచ్చితమైన ఆకృతి కోసం వాటర్ జెట్ కటింగ్.. కాంప్లెక్స్ సీఎన్‌సీ మ్యాచింగ్, ప్రత్యేకమైన ఫ్యాబ్రికేషన్ తదితర ప్రక్రియలను ఉపయోగించి కిటికీలను తీర్చిదిద్దారు. సంప్రదాయ నిర్మాణంలో ఒదిగిపోయేలా బంగారు వర్ణంలో రూపొందించారు. వారసత్వం, శాస్త్రపరిజ్ఞానం, ఆవిష్కరణల ప్రత్యేక కలయికకు ఇది నిదర్శనమని మిధాని వర్గాలు వెల్లడించాయి.



అసాధారణ దృఢత్వం, తక్కువ బరువు, తుప్పు నిరోధకత, ఎక్కువ కాలం మన్నికకు టైటానియం గుర్తింపు పొందింది. వాతావరణ, రసాయన, తేమ సంబంధిత పర్యావరణ పరిస్థితులను తట్టుకోవడం దీని ప్రత్యేకత. సాటిలేని మన్నిక, కనీస నిర్వహణ, కాలాతీత ఆకర్షణ కలిగి ఉంటుంది.

– ఈనాడు, హైదరాబాద్

తితిదేకు మంతెన రామలింగరాజు రూ.9 కోట్ల విరాళం



దాత మంతెన రామలింగరాజుతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు. చిత్రంలో తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి

తిరుమల, న్యూస్‌టుడే: అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు, ప్రముఖ వ్యాపారవేత్త మంతెన రామలింగరాజు తన కుమార్తె నేత్ర మంతెన, అల్లుడు వంశీ గాదిరాజుల పేరు మీదుగా రూ.9 కోట్ల విరాళం అందించినట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. బుధవారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. విరాళాన్ని తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం 1, 2, 3ల్లో మౌలిక సదుపాయాల ఆధునికీకరణకు వినియోగించాలని దాత సూచించినట్లు తెలిపారు. భవిష్యత్తులోనూ తన సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన రామలింగరాజును ఆయన అభినందించారు. అనంతరం దాత మాట్లాడుతూ.. 2012లో తితిదేకు రూ.16.06 కోట్లు విరాళంగా అందించామని చెప్పారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, తితిదే అదనపు ఈవో వెంకయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీవారి ఆలయం ఎదుట జస్టిస్ వి.గోపాలకృష్ణారావు, కుటుంబ సభ్యులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో దర్శన సమయంలో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి, శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

గ్రూప్-1 అక్రమాలు నిగ్గుతేల్చేందుకు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ

హైకోర్టు కీలక నిర్ణయం

ఈనాడు, అమరావతి: ఏపీపీఎస్సీ గ్రూప్-1 జవాబు పత్రాల మూల్యాంకనంలో అక్రమాల నిగ్గుతేల్చేందుకు హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కేజీ శంకర్ ఛైర్మన్‌గా, బార్ కౌన్సిల్ మాజీ ఛైర్మన్ గంటా రామారావు, ఆచార్య నాగార్జున వర్సిటీ పూర్వ వీసీ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ సభ్యులుగా స్వతంత్ర కమిటీని నియమించింది. మంగళగిరి సమీపంలోని హాయ్‌ల్యాండ్ రిసార్ట్స్‌లో మూల్యాంకనం జరిగిందా లేదా, ఓఎంఆర్ షీట్లపై మార్కులు నమోదు చేశారా లేదా అనే విషయాలను కమిటీ సమక్షంలో పరిశీలించేందుకు న్యాయవాదులకు అనుమతి ఇచ్చింది. డిసెంబరు 4న హైకోర్టు ఆధీనంలో ఉన్న జవాబుపత్రాలు, ఓఎంఆర్ షీట్లను పరిశీలించే సమయంలో రిజిస్ట్రార్ జ్యుడిషియల్, అడ్వొకేట్ జనరల్, ఏపీపీఎస్సీ అధికారులు ఉండాలని ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.



ఎన్టీఆర్ జిల్లా మునగపాడు గ్రామం వద్ద పనులు జరుగుతున్న తీరిది

విజయవాడ- ఖమ్మం హైవే పనులు పూర్తయ్యేదెన్నడు?

- నత్తనడకన మూడో ప్యాకేజీ పనులు
- 9 హెక్టార్ల ఎసైన్డ్ భూమిని అప్పగించని రెవెన్యూశాఖ

ఈనాడు, అమరావతి: ఉత్తరాది రాష్ట్రాల నుంచి విజయవాడను అనుసంధానం చేసే కీలక హైవే పనులు ఎన్టీఆర్ జిల్లా పరిధిలో నత్తనడకన సాగుతున్నాయి. ఆరు నెలల కిందటే కొంత భూమి అప్పగించినా.. ఇదిగో, అదిగో అంటూ గుత్తేదారు మొక్కుబడిగా పనులు చేస్తున్నారు. మరోవైపు ఖమ్మం జిల్లా పరిధిలో పనులు ఊపందుకోగా, ఏపీలో మాత్రం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఎకనామిక్ కారిడార్‌లో భాగంగా విజయవాడ నుంచి ఖమ్మం, వరంగల్ మీదుగా నాగ్‌పూర్ వరకు నాలుగు వరసల యాక్సెస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే (నంబరు-163జి)ను నిర్మిస్తున్నారు. ఇందులో ఖమ్మం నుంచి విజయవాడ మధ్య 90 కి.మీ. రహదారిని మూడు ప్యాకేజీలుగా విభజించారు. వీటిలో 1, 2 ప్యాకేజీలు ఖమ్మం జిల్లాలో ఉన్నాయి. మూడో ప్యాకేజీ 30 కి.మీ. కాగా, ఇందులో 26 కి.మీ. ఎన్టీఆర్ జిల్లా పరిధిలో, మిగిలిన 4 కి.మీ.ఖమ్మం జిల్లా పరిధిలో ఉంది. రూ.745 కోట్ల విలువైన ఈ మూడో ప్యాకేజీ పనులను మేఘా ఇన్‌ఫ్రా దక్కించుకుంది.

ఏడు నెలల్లో పురోగతి ఏది?

★ రహదారి పనులు చేపట్టేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో మేఘా సంస్థ ఒప్పందం చేసుకోగా, కొంతమేర పనులు చేసేందుకు ఈ ఏడాది మే 7న ప్రొవిజనల్ అపాయింటెడ్ డేట్ ఇచ్చారు. అప్పటికి 60 శాతం భూసేకరణ జరగడంతో అందులో పనులు చేసేందుకు వీలు కల్పించారు. మిగిలిన భూమిని ఐదారు నెలల్లో అప్పగిస్తామని అప్పట్లో చెప్పారు.

★ ఇప్పటికి 80 శాతం భూమి అప్పగించారు. మేఘా సంస్థ మాత్రం అక్కడక్కడ బాక్స్ కల్వర్టుల నిర్మాణం, మరికొన్ని ఇతర పనులు మాత్రమే చేస్తోంది. పూర్తిస్థాయిలో చేపట్టలేదు.

★ ఖమ్మం జిల్లా పరిధిలోని ప్యాకేజీ-1లో దినేశ్‌చంద్ర ఆర్.అగర్వాల్ ఇన్‌ఫ్రాకాన్ సంస్థ ఇప్పటికి 20 శాతం మేర పనులు పూర్తి చేసింది. అక్కడ రెండో ప్యాకేజీ మేఘా సంస్థే చేపట్టగా, అందులో 6 శాతం పురోగతి ఉంది.

★ ఏపీలోని మూడో ప్యాకేజీలో ఒక్క శాతం మేర కూడా పనులు పూర్తి కాలేదు. పూర్తిస్థాయిలో భూమి అప్పగించలేదని, వరసగా భారీవర్షాలు కురిశాయని.. పలు కారణాలు చెబుతూ గుత్తేదారు సంస్థ జాప్యం చేస్తోంది.

ఎసైన్డ్ భూముల సేకరణలో తీవ్ర జాప్యం

ఈ ప్రాజెక్టుకు ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ అధికారులు 130.91 హెక్టార్ల భూమి సేకరించి, ఎన్‌హెచ్‌ఏఐకి అప్పగించాల్సి ఉంది. ఇందుకోసం రూ.222.43 కోట్లను రెవెన్యూ అధికారుల వద్ద డిపాజిట్ చేశారు. అయితే జి.కొండూరు, విజయవాడ గ్రామీణ మండలాల పరిధిలో ఇంకా 8.79 హెక్టార్ల పట్టా భూమి, 9.24 హెక్టార్ల ఎసైన్డ్ భూమిని సేకరించడంలో జాప్యం జరుగుతోంది. ఎసైన్డ్ భూముల్లో కొన్ని చేతులు మారడంతో వీటికి పరిహారం చెల్లింపు వ్యవహారం కొలిక్కి రావడంలేదు. ఈ సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించలేకపోతున్నారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టిపెడితే.. ఈ పనులు పరుగులు పెట్టే అవకాశం ఉంటుంది.

★ ఈ హైవే విజయవాడ పశ్చిమ బైపాస్‌లో జక్కంపూడి వద్ద నుంచి మొదలవుతుంది. ఇది రెండు హైవేల కలయిక పాయింట్ కావడంతో.. అక్కడ ట్రంపెట్ ఇంటర్ ఛేంజ్ నిర్మించేలా డిజైన్ చేశారు.

★ వెలగలేరుపై 130 మీటర్ల మేర వంతెన కూడా నిర్మించనున్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

రాత్రి భోజనంగా పండ్లు తినొచ్చా!

మావారు ఓ ప్రైవేట్ ఉద్యోగి. ఉద్యోగ రీత్యా వివిధ షిఫ్టుల్లో పనిచేస్తుంటారు. సమయం కుదరట్లేదనీ, జీర్ణ సమస్యలు వస్తున్నాయనీ రాత్రి భోజనాన్ని యాపిల్‌తో సరిపెడుతున్నారు. రాత్రిపూట ఇలా పండ్లు తినడం మంచిదేనా? ప్రత్యామ్నాయంగా ఇంకేం తినొచ్చు.

– కల్యాణి, గుంటూరు.

రాత్రి భోజనంగా కేవలం యాపిల్ తినడం లేదా డిన్నర్‌ని పండ్లతో భర్తీ చేయడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. పనివేళల దృష్ట్యా రాత్రి భోజనం ఆలస్యం అవుతుంటే సులభంగా జీర్ణం అయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. రాగి వంటి చిరుధాన్యాలతో చేసిన జావలు తాగితే మంచిది. ఓట్స్, బార్లీలో కూరగాయల్ని కలిపి సూప్ చేసుకుని కూడా తాగొచ్చు. ఇవి తీసుకుంటూనే రోజూ 100గ్రా. చొప్పున సీజనల్ పండ్లను తినొచ్చు. గింజలు, నట్స్ వంటి వాటిని ఆహారంలో భాగం చేసుకోవచ్చు. అయితే ఇవి ఎంత మొత్తంలో తినాలి అనేది మీ వారి వయసు, బరువు, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. అంతే కానీ, రాత్రి భోజనం పూర్తిగా మానేయడం సరికాదు.

డియర్ వసుంధర



డాక్టర్ లతాశశి
పోషకాహార నిపుణులు

శోధిత

మన మాటల వెనక...



మగవాళ్లకన్నా మహిళలు ఎక్కువగా మాట్లాడతారనే అపోహ అంతటా ఉంది. ఇది కొంతవరకూ నిజమే. అయితే దానికో కారణముంది అంటున్నారు అరిజోనా యూనివర్సిటీ పరిశోధకులు. సాధారణంగా స్త్రీ, పురుషులిద్దరూ రోజుకి 16 వేల పదాలు మాట్లాడతారట. 25-65 ఏళ్ల మధ్య వయసులో మాత్రమే ఆడవాళ్లు మగవాళ్ల కన్నా రోజుకి 3 వేల పదాలు ఎక్కువగా మాట్లాడుతున్నట్లు ఆ అధ్యయనంలో తేలింది. అదే 25 ఏళ్లలోపూ 65 ఏళ్లు దాటిన తర్వాతా ఈ వ్యత్యాసం కనిపించలేదట. దీనికోసం 10 - 94 ఏళ్ల వయసు వాళ్లని ఎంపిక చేసి, వాళ్ల రోజువారీ మాటల్ని కొన్నేళ్లపాటు రికార్డు చేసి మరీ విన్నారట. అందులో కేవలం ఆ నిర్దిష్ట వయసులోనే మహిళలు ఎక్కువగా మాట్లాడినట్లు గుర్తించారు. పిల్లల పెంపకం, కుటుంబ బాధ్యతలు... వంటి వాటివల్లే ఆ వయసులో వాళ్లు ఎక్కువగా మాట్లాడాల్సి వచ్చిందనేది పరిశోధకుల అభిప్రాయం. పైగా లింగ వ్యత్యాసంతో సంబంధం లేకుండా ఇటీవల ఇద్దరిలోనూ రోజువారీ మాట్లాడే మాటల సంఖ్య 16 నుంచి 13 వేలకు పడిపోయిందట. సోషల్‌మీడియా చూడటం, టెక్స్ట్ చేయడం పెరగడమే ఇందుకు కారణమని భావిస్తున్నారు. సో, మనం ఎక్కువగా మాట్లాడటం వెనకా ఒక ప్రయోజనం ఉందన్న విషయాన్ని మగవాళ్లు అర్థం చేసుకోవాలని స్పష్టం చేస్తుంది పరిశోధన!

బంగారం - వెండి

26న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,29,460	1,17,650	1,63,440
విజయవాడ	1,27,170	1,17,250	1,63,000
ప్రొద్దుటూరు	1,25,900	1,15,830	1,63,000
రాజమహేంద్రవరం	1,27,910	1,17,250	1,76,000
విశాఖపట్నం	1,27,450	1,17,250	1,65,000
తమిళనాడు	-----	1,18,000	1,76,000

ఆధునిక మహిళ... అంతరిక్షంలోకి వెళ్లినా... సప్త సముద్రాల్నీ ఈదేస్తున్నా... వేధింపుల్ని తప్పించుకోలేకపోతోంది. సాధికారత దిశగా నడిపిస్తుందనుకున్న సాంకేతికత... ట్రోలింగ్, డాక్సింగ్, పోర్నోగ్రఫీ... అంటూ కొత్త రూపాల్లో ఆమెను హింసిస్తోంది. ఈ డిజిటల్ హింసను అడ్డుకోవడానికి యూఎన్ విమెన్ 'యునైట్' అంటూ 16 రోజుల ప్రచారం ఆరంభించింది. అందులో సినీనటి సమంత కూడా భాగమయ్యారు. ఈ సందర్భంగా...

డిజిటల్ హింసను అడ్డుకోవాల్సిందే!



బడికెళ్లే బాలికల నగ్నచిత్రాలు సామాజిక మాధ్యమాల్లో తిరుగుతున్నాయి. మహిళా ఆంత్రప్రెన్యూర్లపై డీప్‌ఫేక్ దాడులు భయపెడతున్నాయి. సినీతారలు, జర్నలిస్టులు, రాజకీయ నాయకురాళ్లు... తమపై జరిగే ట్రోలింగ్‌తో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురు మహిళా జర్నలిస్టుల్లో ఒకరు, ప్రతి ముగ్గురు పార్లమెంటు సభ్యుల్లో ఒకరు... శారీరక హింస, మరణ బెదిరింపులను ఎదుర్కొంటున్నారని యూఎన్ విమెన్ కథనం చెబుతోంది. అలా తన వ్యక్తిగత, వృత్తిగత విషయాల్లో... అనేకసార్లు ఆన్‌లైన్ వేధింపులకు గురైన సినీతారల్లో సమంత ఒకరు. వాటిని ధైర్యంగా ఎదుర్కొన్న ఆమె... తాజాగా యూఎన్ విమెన్ ఇండియాతో కలిసి ఈ హింసకు వ్యతిరేకంగా తన గళం విప్పుతున్నారు. అవగాహన పెంచడం, మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడటమే లక్ష్యంగా పనిచేయనున్నారు.

డిజిటల్ హింస రూపాల్లో సైబర్ స్టాకింగ్, లొకేషన్ ట్రాకింగ్, ఆన్‌లైన్ కార్యకలాపాలపై నిఘా, ఫొటోలు దుర్వినియోగం, డీప్‌ఫేక్ చిత్రాలు-వీడియోలు, హింసాత్మక పోర్నోగ్రఫీ, ట్రోలింగ్, డిజిటల్ డేటింగ్, గ్రూమింగ్, డాక్సింగ్ వంటివి మహిళల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 16-58శాతం మంది మహిళలు ఆన్‌లైన్ వేధింపులు ఎదుర్కొంటున్నారని సర్వేలూ చెబుతున్నాయి. ఆన్‌లైన్ డీప్‌ఫేక్‌ల్లో 90-95 శాతం మహిళలవే అన్నది మరో అంచనా.

పరిష్కారమెలా?

ఇప్పటికే యూకే ఆన్‌లైన్ సేఫ్టీయాక్ట్, మెక్సికో లే ఒలింపియా, ఈయూ డిజిటల్ సేఫ్టీ యాక్ట్ వంటివి తీసుకొచ్చి మార్పు దిశగా పయనిస్తున్నాయి. 117 దేశాలు డిజిటల్ హింసను పరిష్కరించే ప్రయత్నాలు చేస్తున్నామని చెబుతున్నాయి. అపరాధులను శిక్షించడం, టెక్ వేదికలు బాధ్యత తీసుకునేలా చేయడమే కీలకం. అందుకే, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు ఏఐ టూల్స్, భద్రత, నైతిక ప్రమాణాలకు అనుగుణంగా పాలసీలు అవసరమని యూఎన్ విమెన్ చెబుతోంది. సురక్షితమైన ఆన్‌లైన్ స్పేస్‌ని క్రియేట్ చేయడానికీ, హానికరమైన కంటెంట్‌ను త్వరగా తొలగించడానికీ ఎక్కువమంది మహిళలను టెక్ కంపెనీలు నియమించుకోవాలని సూచిస్తోంది. అంతేకాదు, బాలికలు, స్త్రీలకు డిజిటల్ అక్షరాస్యత, ఆన్‌లైన్ భద్రతలపై అవగాహన కల్పించాలంటోంది.

16 రోజుల క్యాంపెయిన్...

సాంకేతికత... స్త్రీల అస్తిత్వానికి ప్రశ్నార్థకం కాకుండా... సాధికారత, సమానత్వహోదాను అందుకునే దిశగా నడిపించే శక్తిగా మారాలని యూఎన్ విమెన్ కోరుతోంది. ఇందుకోసమే లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా 16 రోజుల కార్యాచరణను యునైట్ పేరుతో ప్రచారం చేస్తోంది. ప్రతి సంవత్సరం మహిళలపై హింస నిర్మూలనా దినోత్సవాన్ని(నవంబర్ 25) మానవహక్కుల దినోత్సవం(డిసెంబర్ 10)తో కలుపుతూ దీన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది డిజిటల్ అబ్యూజ్‌పై సమర శంఖాన్ని పూరించింది. హాష్‌ట్యాగ్ నోఎక్స్‌క్యూజ్ ఫర్ ఆన్‌లైన్ అబ్యూజ్‌తో సాగుతోంది.

జాతీయ స్థాయిలో పాలసీ అవసరం...



సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ అందరూ ఆన్‌లైన్ వేధింపుల బాధితులే. సెలబ్రిటీలు ఎప్పుడో ఒకసారైనా నోరువిప్పి తాము ఎదుర్కొంటోన్న హింస గురించి చెబుతున్నారు. కానీ, సాధారణ మహిళల పరిస్థితి ఇందుకు భిన్నం. తప్పు తమది కాకపోయినా లోలోపల కుంగిపోతున్నారు. అందుకే, దీనిపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. భవిష్యత్తులో ఈ ముప్పుని మరింతగా ఎదుర్కోవాల్సి రావొచ్చు. మనమేంటో మనకి తెలిసినప్పుడు ధైర్యాన్ని కోల్పోకూడదు. కుటుంబాలూ ఆడపిల్లలకు అండగా ఉండాలి. చిన్నప్పటి నుంచే పిల్లలకు ఫోన్‌ని ఎలా జాగ్రత్తగా వాడాలి? ఏం షేర్ చేయకూడదు? అన్న విషయాలను నేర్పించాలి. అప్పుడే సమస్యకు అడ్డుకట్ట పడుతుంది. ఈ ఆన్‌లైన్ హింసను కట్టడి చేయడానికి జాతీయ స్థాయిలో ఓ పాలసీ అవసరం.

- రాయపాటి శైలజ, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, ఆంధ్రప్రదేశ్

ఆ బాధ్యత వారిదే...



పెరుగుతోన్న సాంకేతికత... మహిళకు నిత్యం సవాళ్లు విసురుతూనే ఉంది. ఈ వేధింపులను అరికట్టడానికి అవగాహన మాత్రమే సరిపోదు. స్త్రీలపై హింస, వేధింపులను ప్రోత్సహించే కంటెంట్‌ని తక్షణం తొలగించే బాధ్యతను ఆ సాంకేతిక వేదికలు తీసుకోవాలి. ఏం పోస్ట్ చేయాలి? ఏం షేర్ చేయాలి? సామాజిక మాధ్యమాలను ఎలా ఉపయోగించాలి? అన్న విషయంపై దేశవ్యాప్తంగా ఒక గైడ్‌లైన్స్ అవసరం. ఆడవారిపై వేధింపులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు ఉండాలి. త్వరలో దీనిపై ఓ రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం. మహిళలకు అండగా నిలవాల్సిన విభాగాలన్నీ ఒక గొడుగు కింద ఉండేలా చేయమని ప్రభుత్వానికి విన్నవించుకుంటాం. ఇది బాధిత స్త్రీలకు భరోసానిస్తుంది.

- నేరెళ్ల శారద, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, తెలంగాణ

తప్పులు ఎంచొద్దు...



ఇన్‌స్టా రీల్స్‌లో, వాట్సాప్ స్టేటస్‌లో చూసినప్పుడు అల్గారిథమ్‌తో రూపొందించిన 'పర్‌ఫెక్ట్ కపుల్'గా కనిపిస్తారు కొందరు! కానీ ఇద్దరే ఉన్నప్పుడు చూస్తేనే అర్థమవుతుంది మనసుల మధ్య ఎంత దూరం ఉందో! ఇలాంటి వాళ్ల బంధం తిరిగి పట్టాలెక్కాలంటే...

రేఖ ఇంటీరియర్ డిజైనర్, ఆమె భర్త రవి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. రేఖ తన వర్క్‌ను ఆన్‌లైన్లో ప్రమోట్ చేస్తుంది. దానికోసం కొన్నిసార్లు అర్ధరాత్రి వరకూ కూర్చొంటుంది. రవి... ఆఫీసు పనిని దాదాపుగా ఇంటికి తీసుకురాడు. తొందరగా నిద్రపోయి, ఉదయాన్నే నిద్ర లేచే రకం. అలాగని రేఖమీద ఫిర్యాదులు చేయడు. తనూ కెరియర్ కోసం కష్టపడుతోందని చెబుతాడు. కానీ, రేఖ అలా కాదు, 'ఎన్ని పనులున్నా ఎలా చక్కబెట్టుకోగలుగుతున్నాడు. నేను అతన్ని అందుకోలేనా' అనుకుంటుంది. అచ్చం ఇలాంటి సమస్యే కాకపోయినా చాలా మంది దంపతుల మధ్య ఈ పోల్చుకోవడాలు ఎక్కువైపోయాయి. వాటిని దూరం చేసుకోవడానికి నిపుణులు ఇచ్చే సలహా ఏంటంటే...

- ఎవరూ మొదట్నుంచీ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్'లా ఉండరు. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ క్రమంగా బంధాన్ని దృఢపరుచుకుంటారు. దీనికి అవగాహన, నిజాయతీ కావాలి.
- ఎవరైతే కెరియర్‌లో వెనకంజ వేస్తున్నామని భావిస్తారో... వాళ్లు ముందుగా ఆత్మనిందని మానుకోవాలి. విజయం అసూయతో రాదు. ప్రణాళికతో అడుగులు వేస్తే వస్తుంది. అయినా, పోలిక ఎందుకు... ఎవరి కెరియర్ వాళ్లది. మీరు ఉన్నది వివాహ బంధంలో.
- మీ భాగస్వామి ఎదుగుదలను మీతో పోల్చుకోకండి. వీలైతే వాళ్లకు ఎలా సాధ్యమవుతోందో అడిగి తెలుసుకోండి. వాటిలో మీరు ఆచరించదగ్గవి ఉంటే పాటించండి. కెరియర్‌లో వెనకబాటు లోపం కాదు, అది ఎప్పటికీ అలాగే ఉండిపోదు.
- అభిప్రాయభేదాల్ని నేరుగా చర్చించుకుని పారదోలాలి. అలా కాకుండా, అక్కడా చాట్‌ల స్క్రీన్‌షాట్లూ, ఎమోజీల్ని ఉపయోగించాల్సిన పనిలేదు. నిజమైన బంధం షేర్‌చేసే ఫొటోలూ, వీడియోలు కాదు, ఇంట్లో మీరెలా ఉంటారో అది. ఫోన్ ప్రస్తావన లేని ఉదయపు నడక, డిన్నర్ మీ బంధాన్ని తిరిగి పట్టాలెక్కిస్తాయి.
- నేను వెనకబడిపోతున్నా, నాకు సక్సెస్ రావడంలేదు, నీ అంత ఎదుగుదల లేదు... ఇలా భాగస్వామి చెబితే వాటిని ఆరోపణలుగా కాకుండా, మీ సాయం కోరుతున్నారని అర్థం చేసుకోవాలి.

ప్రమాద తీవ్రతను తగ్గిస్తుందట..!



ఉదయం నిద్రలేచి మంచం మీద నుంచి పాదం కింద పెట్టాలంటేనే భయం. అరికాలు, మడమ విపరీతమైన నొప్పితో జివ్వుమంటుంది. రెండు మూడు గంటలు విలవిల్లాడుతుంది ప్రాణం. దీనికి కారణం ప్లాంటార్ ఫాషియాటిస్. శీతకాలంలో మహిళల్లో ఎక్కువగా కనిపించే సమస్య ఇది. ఎక్కువసేపు నిల్చొని పనులు చేసే వాళ్లని, వయసు మళ్లిన వాళ్లని వేధిస్తుంటుంది. దీనికి 'ఆషీయూ' జపనీయుల విధానం పరిష్కారమంటున్నారు నిపుణులు. అదేనండి ఫుట్‌బాత్... రోజూ రాత్రుళ్లు గోరువెచ్చని నీటిలో ఉప్పు, ఎప్సమ్ సాల్ట్ వేసుకుని, 15-20 నిమిషాలు పాదాలు ఉంచమంటున్నారు. దీనివల్ల రక్తప్రసరణ మెరుగై ప్లాంటార్ ఫాషియాటిస్ నుంచి ఉపశమనం లభిస్తుందట. సమస్య ఎక్కువగా ఉంటే ఉదయం లేచాక కూడా ఇది చేయొచ్చు. దీనివల్ల బీపీ, ఒత్తిడీ నియంత్రణలో ఉంటాయట. ఈ విధానం కార్డియోవాస్కులర్ వ్యాధుల ప్రమాదాన్నీ తగ్గిస్తుంది అంటున్నారు నిపుణులు. ప్రయత్నించి చూడండి మరి!

బొమ్మలు సర్దడం లేదా?

ఇంట్లో పిల్లలు ఉన్నప్పుడు బొమ్మలన్నీ చిందరవందరగానే ఉంటాయి. వాటిని సర్దడం ఒక్కోసారి తలకు మించిన భారంగా మారుతుంది. అలాకాకుండా గది ఎప్పుడూ శుభ్రంగా, అందంగా ఉండాలంటే...



- కేటగిరీలుగా విభజించండి. ఉడ్ బ్లాక్స్, డాల్స్, కార్లు, పజిల్స్, సాఫ్ట్ టాయ్స్, ఆర్ట్ మెటీరియల్స్... ఇలా వేటికవే వేరు చేసి పెట్టండి. వీటిని అలానే ప్లాస్టిక్ షూ బాక్సులు, జిప్ బ్యాగుల్లో సర్దండి. వీలైనంతవరకూ అవి పారదర్శకంగా ఉండేలా చూసుకుంటే సరి. లోపల ఏమున్నాయో తెలుస్తుంది. తీయడం, పెట్టడం సులువు.
- మీరు ఏయే బాక్సుల్లో ఏమి సర్దారో తెలియడానికి లేబుల్స్ అతికించండి. దాన్ని పిల్లలు చూసినా అర్థం చేసుకోవడానికి ఓ బొమ్మ ఫొటో పెడితే సరి. వీటిని పిల్లలకు చేయి అందే ఎత్తులో పెడితే... కావలసినప్పుడు తీసుకుని మళ్లీ అక్కడే పెట్టే అలవాటవుతుంది.
- చిన్నారులు అన్ని బొమ్మల్నీ ఒకేసారి తీసి కింద వేయకుండా... ఒక బొమ్మ తీసి ఆడుకున్నాకే మరో బొమ్మ అనే రూల్‌ని అమలు చేయండి. దీనివల్ల ఇల్లు చిందరవందర కాదు. వాళ్లకీ బోర్ కొట్టదు. అవి పాడవ్వవు కూడా. పిల్లలతో కలిసి ఆర్నెల్లకోసారి వాటిని రివ్యూ చేయాలి. ఆడుకోని బొమ్మలను ఎవరికైనా ఇవ్వడమో, సెకండ్ సేల్‌లో అమ్మడమో చేస్తే ఇంటి నిండా చెత్త పేరుకోదు. అంతేకాదు రోజూ పడుకునే ముందు ఐదు నిమిషాలు వాళ్ల బొమ్మలు వాళ్లు సర్దుకునేలా చూడండి. వాళ్లకి క్రమశిక్షణా అలవడుతుంది.

సేవ చేయాలనే..!



డాక్టర్ కావాలన్నది ఆమె చిన్నప్పటి కల. దాన్ని సాకారం చేసుకోవడానికి రేయింబవళ్లు శ్రమించారు డా. బారెడ్డి సాయి త్రిషారెడ్డి. అనుకున్నట్లుగానే ప్రముఖ కాలేజీలో ఎంబీబీఎస్ చదివే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఇటీవల ఐఎన్ఐ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్)కంబైన్డ్ ప్రవేశ పరీక్షను రాశారు. దానిలో ఆల్‌ఇండియా 7వ ర్యాంకు... దక్షిణ భారత దేశం నుంచి మొదటి ర్యాంకు సాధించారీమె.



మాది ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా. నాన్న బారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, రియల్ ఎస్టేట్ వ్యాపారి. అమ్మ అనంతలక్ష్మి, టీచర్. నాన్న వ్యాపారరీత్యా హైదరాబాద్‌లోనే ఉంటున్నాం. అమ్మ సైన్స్ టీచర్ కావడం... నాన్న స్నేహితుల్లో చాలామంది వైద్యులు ఉండడంతో చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలని కలలు కనేదాన్ని. అందుకు తగినట్లే చదువుల్లో చురుకుగా ఉండేదాన్ని. విజ్ఞాన్‌లో ప్లస్‌టూ పూర్తిచేశా. తర్వాత అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడ్డాను. అయినా పట్టుదలతో చదివా. తెలంగాణ ఎంసెట్‌లో రెండో ర్యాంకు, నీట్ ఆల్‌ఇండియా 14వ ర్యాంకు సాధించా. దిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీట్ వచ్చింది. నా లక్ష్యం కూడా ఇదే. ఊహ తెలిసినప్పట్నుంచి మంచి కాలేజీల్లో సీటు సంపాదించాలి. చదువు పూర్తిచేసుకుని, మంచి కెరియర్‌ను నిర్మించుకోవాలి అనుకునేదాన్ని. ఎంబీబీఎస్ పూర్తయ్యాక, ఇక్కడే ఇంటర్న్‌గా అవకాశం వచ్చింది. హౌస్‌సర్జన్‌గా చేస్తూనే.. పీజీకి సన్నాహాలు మొదలుపెట్టా. ఎయిమ్స్, జిప్‌మర్ కాలేజీల్లో పీజీ మెడిసిన్ చదవాలనుకున్నా. కానీ అదంత సులభం కాదు. ఐఎన్ఐ సెట్‌లో టాప్ 10 ర్యాంకులు వచ్చిన వాళ్లకే ఇక్కడ అవకాశం ఉంటుంది. చాలామంది దీనికోసం పూర్తి సమయాన్ని కేటాయిస్తుంటారు. లాంగ్‌టర్మ్ కోచింగ్‌లూ తీసుకుంటారు. కానీ నేను ఓవైపు హౌస్‌సర్జన్‌గా సేవలందిస్తూనే... ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. ఉదయాన్నే నాలుగు గంటలకు లేచి చదువుకునేదాన్ని. సామాజిక మాధ్యమాలకు పూర్తిగా దూరంగా ఉన్నాను. ఏ కొద్ది సమయం దొరికినా చదవడానికే కేటాయించేదాన్ని. వీటన్నింటి ఫలితమే... ఆల్ ఇండియా 7వ ర్యాంకు దక్కించుకున్నా. టాప్10లో ఇద్దరే అమ్మాయిలు. అందులో దక్షిణ భారతదేశం నుంచి నేను ఉండటం గర్వంగా ఉంది. ఒత్తిడిగా అనిపించినా, డీలా పడినా పెయింటింగ్స్ వేసేదాన్ని. ఈ క్రమంలో అమ్మానాన్నల ప్రోత్సాహం మరచిపోలేను. సొంతంగా ఆస్పత్రి నిర్మించి, పేదలకు తక్కువ మొత్తానికి నాణ్యమైన వైద్యాన్ని అందివ్వాలనేదే నా లక్ష్యం.

– భూపతి సత్యనారాయణ, నరసరావుపేట

జంతువులంటే ఎంత ప్రేమో!



ఆమెకేమో చదువుకోవాలని కోరిక... కానీ సొంతూళ్లో హైస్కూల్ లేదు. అయినా చదువు ఆపలేదు. జంతువుల గురించి తెలుసుకోవడం ఎంతో ఇష్టం. అక్కడా ఆంక్షలే. ఈ సవాళ్లను అధిగమించి జంతు సంరక్షకురాలిగా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు ప్రేమ్ కన్వర్ శక్తావత్.



రాజస్థాన్, కోటాలోని అటవీశాఖలో అసిస్టెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు ప్రేమ్ కన్వర్. తన బాల్యాన్ని మధ్యప్రదేశ్‌లోని నీముచ్ జిల్లాలోని జమునియా రావు గ్రామంలో గడిపారు. ఊరి బడిలో ఎనిమిదో తరగతి వరకు మాత్రమే ఉంది. పైచదువుల కోసం బయటకు వెళ్లడానికి ఇంట్లో అనుమతించలేదు. దాంతో ప్రైవేటుగానే, పన్నెండో తరగతి పూర్తి చేశారు. మొదటి నుంచీ అడవుల గురించి ఆసక్తిచూపేవారు ప్రేమ్. పుస్తకాల్లో చదివినవి ప్రత్యక్షంగా చూడాలని అనుకునేవారట. కానీ చిన్నప్పుడు ఇంట్లో అనుమతించేవారు కాదు. కొన్నాళ్లకు వీళ్ల కుటుంబం రాజస్థాన్‌లోని చిత్తోడ్‌గఢ్‌కు మారింది. అక్కడే డిగ్రీ కళాశాలలో చేరారు. ఈ సమయంలో, అటవీశాఖలో ఉద్యోగానికి ఎంపికై... 2011లో భైన్స్‌రోర్‌గఢ్‌లో ఫారెస్ట్ గార్డ్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

విదేశాల్లో శిక్షణ...

భైన్స్‌రోర్‌గఢ్ అభయారణ్యంలో పనిచేస్తున్నప్పుడు మొసళ్లు సహా అనేక ప్రమాదకరమైన జంతువులను రక్షించారు ప్రేమ్. మొసళ్ల రెస్క్యూ టీమ్‌లో ఏకైక మహిళ ఈమె. అయినా అద్భుతమైన ధైర్యాన్ని చూపేవారు. 'ఈ శాఖకు మొదట్లో సరైన వనరులు లేవు. తాత్కాలిక పద్ధతులను ఉపయోగించి రెస్క్యూలు నిర్వహించేవాళ్లం. మాతోపాటు అడవి జంతువులూ గాయపడేవి. కానీ ఇప్పుడు వనరులు అందుబాటులో ఉండటంతో, రక్షణ చర్యలు సులభంగా చేపడుతున్నాం' అని చెబుతారు ప్రేమ్. నేపాల్ వేదికగా 2019లో జరిగిన ప్రపంచ అటవీ రేంజర్ల సమావేశానికి హాజరై తన అనుభవాలను పంచుకున్నారీమె. 2024లో ఆస్ట్రేలియాలోని డార్విన్ ప్రభుత్వం ప్రేమ్‌ను ప్రత్యేకంగా ఆహ్వానించింది. అక్కడ సముద్రం నుంచి ఉప్పునీటి మొసళ్లను రక్షించడం నేర్చుకున్నారు. కోటాలో అటవీశాఖ నిర్మించిన బోను సహాయంతో మొసళ్లను పట్టుకోవడానికి ఆమె ఈ సాంకేతికతను ఉపయోగిస్తున్నారు.

ఏడేళ్లపాటు మొసళ్ల ప్రవర్తన, ఆవాసాలు, అలవాట్లు, కుటుంబంపై దృష్టి సారించి, వాటిని అధ్యయనం చేసి వాటిపై ఒక నివేదికనూ ఇచ్చారు ప్రేమ్. అడవి జంతువుల ఉనికికి సంబంధించిన పాదముద్రలు, గుహలు, గీతలు... తదితర గుర్తులపైనా అధ్యయనం చేశారు. తన సేవలకుగానూ 2020లో 'వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్' నుంచి 'వైల్డ్‌లైఫ్ ఫ్రెండ్', 2023లో జరిగిన ఆసియా రేంజర్ కాంగ్రెస్‌లో 'వన దుర్గ' అవార్డులను అందుకున్నారు. వృత్తిలో భాగంగా ఇప్పటివరకూ మొసళ్లతో సహా 500కు పైగా జంతువులను రక్షించారు ప్రేమ్. దీపాలీ అతుల్ దేష్కర్ రాసిన 'రేంజర్స్: విమెన్ రీషేపింగ్ ది కన్జర్వేషన్' పుస్తకంలో చోటు దక్కించుకున్నారు.

ఈటీవీ భారత్

ముద్ద నందివర్ధనం.. మురిపిస్తోంది!



హాయినిచ్చే పరిమళం, ఆహ్లాదాన్ని పంచే మంచులాంటి తెల్లటి రంగుతో భలేగా ఆకట్టుకుంటాయి ముద్దరేకల నందివర్ధనం పూలు. ఈ మొక్కని ఇంటి ముంగిట పెంచుకుంటే ఎంత కళగా ఉంటుందో..! అదెలాగో మరి చదివేయండి.

ఇంటి తోట


ఈ నందివర్ధనం అపోసినేసియా కుటుంబానికి చెందిన మొక్క. ఇందులోనే ముద్ద రేకల రకమూ ఒకటి. ప్రాంతాన్ని బట్టి చాందినీ, తగర్, పంచ కర్పూర పువ్వు, చంద్రమణి వంటి పేర్లతోనూ పిలుస్తారు. ఇది పొదలా గుబురుగా పెరుగుతుంది. మనం కోరుకున్న ఎత్తులో కత్తిరింపుల ద్వారా నియంత్రించుకోవచ్చు. నిగనిగలాడే పచ్చటి ఆకులు, మెత్తగా మందమైన పొరల్లో పూసే పూలు, హాయినిచ్చే సువాసనతో ప్రత్యేక గుర్తింపు అందుకున్న ఈ మొక్కకు ఔషధ గుణాలూ ఎక్కువేనట. అందుకే, ప్రాచీన కాలం నుంచీ ఆయుర్వేదంలో వాడుతున్నారు. ఇది మన దేశంతోపాటు శ్రీలంక, దక్షిణ చైనాలోనూ ఎక్కువగా కనిపిస్తుంది.

సంరక్షణ ఇలా... నందివర్ధనం మొక్క ఆరోగ్యంగా ఎదగాలంటే... దానికి కనీసం నాలుగైదు గంటలైనా సూర్యకాంతి అందేలా చూసుకోవాలి. కుండీల్లో పెంచుకోవాలనుకుంటే... నీరు నిలవని సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. తొట్టె కూడా కాస్త పెద్ద పరిమాణంలో ఉన్నదే వాడండి. నీళ్లు ఎక్కువైతే మొక్క దెబ్బతినే అవకాశం ఉంది. తేమ లేదనుకున్నాకే తడి అందించండి. పోషకాలు సరిగా అందితే పూలూ బాగా పూస్తుందీ మొక్క. ఎక్కువ రోజులూ తాజాగా ఉంటుంది. అందుకే, రెండు మూడు వారాలకోసారి పొటాషియం మోతాదు ఎక్కువ ఉండే ఎన్‌పీకే సమగ్ర ఎరువుని క్రమం తప్పకుండా అందించాలి. కొమ్మ కత్తిరింపులు, విత్తనాల ద్వారా కొత్త మొక్కల్ని మొలకెత్తించవచ్చు. పూత పూయడం ఆగిపోయాక 40 శాతం వరకూ కొమ్మల్ని కత్తిరించుకోవాలి. అఫిడ్స్, మిలీబగ్స్, ఎర్ర సాలీడు, ఆకు ముడతతో పాటు వేరు కుళ్లు తెగులూ వచ్చే అవకాశం ఉంది. వీటిని నివారించడానికి లీటరు నీటిలో సబ్బు ద్రావణం, పది గ్రాములు వెల్లుల్లి పేస్టు, కాస్త వంటనూనె కలిపి సాయంత్రం పూట స్ప్రే చేస్తే సరి.









రాజధాని అమరావతిలో శ్రీవారి ఆలయ విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్

మహా రాజగోపురం.. ఆలయ ప్రాకారం

- తిరుమల తరహాలో అమరావతి శ్రీవారి ఆలయం అభివృద్ధి
- రూ.260 కోట్లతో విస్తరణ పనులు
- నేడు భూమి పూజ చేయనున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో కృష్ణా నది ఒడ్డున తిరుమల తరహాలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రెండు దశల్లో రూ.260 కోట్లతో ఆలయ విస్తరణ పనులు ప్రారంభించనుంది. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం శ్రీవారి ఆలయాన్ని రూ.185 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా.. దానిని రూ.36 కోట్లకు కుదించింది. తాజాగా అధికారంలోకి వచ్చిన కూటమి.. ఆలయాన్ని 2014-19 నాటి ప్రణాళికను మించి సకల హంగులతో అభివృద్ధి చేసేందుకు అడుగు ముందుకేసింది. ఈ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం భూమిపూజ చేయనున్నారు. సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేశారు.



ప్రస్తుతం విద్యుద్దీపాల అలంకరణలో ఇలా..

రూ.140 కోట్లతో మొదటి దశ పనులు..: మొదటి దశలో రూ.140 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారాన్ని నిర్మిస్తారు. రూ.48 కోట్లతో ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, వాహన మండపం, రథ మండపం, పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మిస్తారు.

- రెండో దశలో శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్‌రోడ్డు, అన్నదానం కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులు, సిబ్బంది క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలన భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ వంటి పనుల్ని చేపడతారు. వీటికి రూ.120 కోట్ల వ్యయం కానుంది.

182 గంటల్లో 164 గంటలు సామాన్య భక్తులకే

- తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, న్యూస్‌టుడే: డిసెంబరు 30 నుంచి జనవరి 8 వరకు శ్రీవారి ఆలయంలో 10 రోజుల పాటు నిర్వహించే వైకుంఠద్వార దర్శనాల కోసం విస్తృత ఏర్పాట్లు చేశామని, సామాన్యులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 10 రోజులకు గాను మొత్తం 182 గంటలు అందుబాటులో ఉండగా 164 గంటలు సామాన్య భక్తులకే కేటాయించినట్లు చెప్పారు. రూ.300, శ్రీవాణి టికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేస్తామన్నారు. భక్తులు తితిదే సూచనలు పాటించి ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రతి రోడ్డు ప్రమాదంపై థర్డ్‌పార్టీ ఆడిట్ చేయాలి

- వెహికల్ ట్రాకింగ్ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్
- వేగాన్ని గుర్తించేందుకు సీసీ కెమెరాలు
- రహదారి భద్రతా మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు



రాష్ట్రస్థాయి రోడ్డు భద్రత సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో జరిగే ప్రతి రోడ్డు ప్రమాదంపైనా థర్డ్ పార్టీతో ఆడిటింగ్ నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ప్రమాదానికి కారణం వాహనమా? డ్రైవరా? రోడ్డు ఇంజినీరింగ్‌లో లోపమా? లేదా ఇతర అంశాలా అనేది గుర్తించేలా ఈ ఆడిటింగ్ జరగాలని స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం రోడ్డు భద్రతా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో రోడ్డు భద్రతా ఏజెన్సీలు, రహదారి భద్రతా నిధి ఏర్పాటు, రహదారులపై బ్లాక్ స్పాట్‌లు లేకుండా చేయడం, డ్రైవర్లకు శిక్షణ వంటి అంశాలపై సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. వాటిల్లో పురోగతి పై ప్రతి మూడు నెలలకోసారి సమీక్షిస్తామని చెప్పారు. సీఎం ఆదేశాల్లోని ప్రధానాంశాలివి.

ఆ జిల్లాల్లో ప్రమాదాలు ఎక్కువగా ఉండటంపై విశ్లేషించండి

- 'ఈ ఏడాది ఇప్పటివరకూ 15,462 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. వాటిల్లో 6,433 మంది మృతిచెందడం, రోడ్డు ప్రమాదాల్లో రాష్ట్రం దేశంలో 8వ స్థానంలో ఉండటం ఆందోళనకరం. నెల్లూరు, తిరుపతి, పల్నాడు, అన్నమయ్య, కాకినాడ జిల్లాల్లో రోడ్డు ప్రమాద మరణాల సంఖ్య ఎందుకు ఎక్కువగా ఉందో విశ్లేషించండి.
- అతివేగాన్ని నియంత్రించేందుకు వాహనాల్లో స్పీడ్ గవర్నర్లు ఏర్పాటు చేయాలి. వాహనాల వేగాన్ని ఎప్పటికప్పుడు గుర్తించేందుకు వీలుగా జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రతీ అర కిలోమీటరు పరిధిని కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వీటిని ఆర్టీజీఎస్‌తో అనుసంధానం చేయాలి. వాహన ట్రాకింగ్ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ నెలకొల్పాలి.
- హెచ్చరికలు బేఖాతరు చేసి అతివేగంతో ప్రయాణించే వాహనాలను సీజ్ చేయాలి. మూడు నెలల్లోగా వేగ నియంత్రణ చర్యలు చేపట్టాలి.
- దర్శి, ఆదోనిల్లో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలి. మిగిలిన చోట్ల కూడా ఆధునిక డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రంలోని జాతీయ రహదారులపై ఉన్న 680 బ్లాక్ స్పాట్‌లను సరిదిద్దాలి.

ఈశాన్య రాష్ట్రాల్లో ఎందుకు రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు..?

- నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో చేసే మార్పులు చేర్పులపై కఠినంగా వ్యవహరించాలి. బస్ బిల్డింగ్ కోడ్ ప్రకారం అనధికారిక ఆల్టరేషన్లు ఉండేందుకు వీల్లేదు. ఈ సమస్య అధిగమించడానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలి. అనధికారికంగా మార్చేసిన స్లీపర్ బస్సుల కారణంగా ప్రమాదాల తీవ్రత మరింత పెరుగుతోంది.
- నాగాలాండ్ తదితర ఈశాన్య రాష్ట్రాల్లో స్లీపర్ బస్సులు రిజిస్ట్రేషన్లు చేయించడానికి గల కారణాలపై అధ్యయనం చేయాలి. రాష్ట్ర రెవెన్యూ దెబ్బతినకుండా ఏపీలోనూ అవసరమైన మార్పులు తీసుకురావాలి. స్లీపర్ బస్సులకు వివిధ రాష్ట్రాల్లో వాహన పర్మిట్లు జారీ చేయటంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలి.
- రోడ్డు ప్రమాదాల సమయంలో బాధితులను అత్యంత వేగంగా సమీపంలోని ఆసుపత్రులకు తరలించేందుకు 108 అంబులెన్స్‌లు, జాతీయ రహదారుల అంబులెన్స్‌లను ఇంటిగ్రేట్ చేయాలి. బాధితుల్ని ఆసుపత్రులకు తరలించేవారిని ప్రోత్సహించేలా చర్యలు ఉండాలి.

అతివేగం వల్లే 79 శాతం ప్రమాదాలు..

'అతి వేగం కారణంగా 79, రాంగ్ సైడ్ డ్రైవింగ్ వల్ల 3, మద్యం తాగి, మొబైల్ ఫోన్లలో మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల 1 శాతం చొప్పున ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారులపై 42, రాష్ట్ర రహదారులపై 21 శాతం మేర ప్రమాదాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో జరిగిన ప్రమాదాల్లో మూడో వంతు ద్విచక్ర వాహనాల వల్లే జరిగాయి. 53 శాతం ప్రమాదాలు కార్లు, ద్విచక్ర వాహనదారుల సెల్ఫ్ యాక్సిడెంట్లు' అని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వారు చెప్పిన ఇతర అంశాలివి.

- 'అనధికారికంగా ఆల్టరేషన్ చేసిన ఆల్ ఇండియా టూరిస్ట్ పర్మిషన్ ఉన్న 134 బస్సులను సీజ్ చేశాం. పాఠశాల బస్సుల్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం.
- వాహనాల్లో స్పీడ్ గవర్నెన్స్ విధానం ఏర్పాటుపై కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం

ఏటా రోడ్డు భద్రతా కార్యక్రమం

- డ్రైవింగ్ నిబంధనలు ఉల్లంఘించిన కేసుల్లో వారికి జరిమానాలు విధించడం కంటే ముందు హెచ్చరికలు జారీ చేయాలి. ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి.
- రాష్ట్ర రహదారులు, మున్సిపాలిటీల్లో ట్రాఫిక్, రోడ్ మార్కింగ్‌లు సరిచేయాలి. వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల కోసం ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలి.
- రీహాబిలిటేషన్ సెంటర్‌ను ఏపీలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి.
- రోడ్డు భద్రతపై విస్తృతంగా ప్రచారం చేయాలి.
- ఏటా నవంబరు నెలలో మూడో ఆదివారం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో రోడ్డు భద్రతా కార్యక్రమం నిర్వహిద్దాం' అని సీఎం ఆదేశించారు.

- 5 సార్లు కంటే ఎక్కువగా నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేసేలా త్వరలోనే కేంద్రం నోటిఫికేషన్ జారీ చేయనుంది' అని అధికారులు తెలిపారు.

ఏపీ లింక్‌ను ఆర్థికంగా బలోపేతం చేయాలి

ఈనాడు, అమరావతి: ఏపీ లాజిస్టిక్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీ లింక్)ను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని రహదారులను గుంతలు లేకుండా తీర్చిదిద్దడమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అంశమని పేర్కొన్నారు. సచివాలయంలో ఆర్ అండ్ బీ శాఖపై ఆయన బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. 'ఏపీ లింక్ సంస్థ ద్వారా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. రహదారులు, భవనాల శాఖకు వివిధ మార్గాల్లో వచ్చే ఆదాయాలను ఎంత వరకు లాజిస్టిక్స్ కార్పొరేషన్ బలోపేతానికి వినియోగించుకోవచ్చో చూడాలి. లాజిస్టిక్స్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించడం ద్వారా సంస్థను ఆర్థికంగా బలోపేతం చేయడం సాధ్యం అవుతుంది. రాష్ట్రంలోని నెట్‌వర్క్‌తో పాటు ఇతర మౌలిక సదుపాయాలను అద్భుతంగా తీర్చిదిద్దొచ్చు" అని పేర్కొన్నారు. జాతీయ రహదారులపైనా అధికారులు దృష్టిపెట్టి.. భూసేకరణ, ఇతర అంశాల్లో కేంద్రానికి పూర్తిగా సహకరించాలని సూచించారు.

దెబ్బతిన్న రోడ్లు ప్రాధాన్యతగా పూర్తిచేయాలి: తుపానులో దెబ్బతిన్న రోడ్లు, వంతెనల పునర్నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని చంద్రబాబు ఆదేశించారు. "ఈ ఏడాది మార్చిలో ఆమోదించిన రోడ్ల నిర్వహణ, పాత్‌హోల్స్(గుంతలు) పనులు 10-15 శాతం పూర్తయ్యాయి. ఇటీవల ఆమోదించిన పనులు వచ్చే నెల నుంచి ప్రారంభించాలి. దీనికోసం డ్రోన్లు, శాటిలైట్ సర్వే ద్వారా రోడ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు గుర్తించాలి. పీపీపీ విధానంలో చేపట్టనున్న రోడ్ల జాబితా సిద్ధం చేయాలి. నిబంధనల మేరకు వయబులిటీ గ్యాప్ ఫండ్ ఏయే రోడ్లకు ఇవ్వాలనేది పరిశీలించాలి. వైట్ టాపింగ్ రోడ్ల నిర్మాణంపై పైలట్ ప్రాజెక్టులు చేపట్టాలి. రోడ్ల నిర్మాణం, నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కాంట్రాక్టర్లు చేసే తప్పులు, నాణ్యతలో రాజీపడే వారిని గుర్తించాలి. ఇంజినీర్లు జవాబుదారీతనంతో పనిచేయాలి" అని సూచించారు.

హైదరాబాద్‌లో శాఫ్రన్ ఎంఆర్‌వో కేంద్రం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ
- భారత్‌కు త్వరలో విమాన తయారీ కంపెనీలు: రామ్మోహన్‌నాయుడు



ఎస్ఏఈఎస్ఐ కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించి మాట్లాడుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో శాఫ్రన్ బోర్డ్ గ్రూపు ఛైర్మన్ రాస్ మెక్‌ఇన్నెస్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు, జీఎంఆర్ గ్రూపు ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు

ఈనాడు బిజినెస్ బ్యూరో: హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాంగణంలోని జీఎంఆర్ ఏరోస్పేస్, ఇండస్ట్రియల్ పార్క్ సెజ్‌లో రూ.1,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన శాఫ్రన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా(ఎస్ఏఈఎస్ఐ) కేంద్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృశ్య మాధ్యమ పద్ధతి(వీడియో కాన్ఫరెన్స్)లో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "ఫ్రాన్స్‌కు చెందిన శాఫ్రన్ ఏర్పాటు చేసిన విమాన లీప్ ఇంజిన్ల నిర్వహణ, మరమ్మతు, సమగ్ర సేవల(ఎంఆర్‌వో) కేంద్రం భారత్‌ను ఈ రంగంలో నూతన హబ్‌గా మారుస్తుంది. విమానయాన రంగంలో యువతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశీయ విమానయాన మార్కెట్లలో భారత్ ఒకటి. మూడో అతిపెద్ద మార్కెట్ కూడా. ఈ విస్తరణ వేగం కారణంగా ఎంఆర్‌వో అవసరాలూ పెరుగుతున్నాయి. ఇప్పటివరకు మన విమానాల మరమ్మతులు 85% విదేశాల్లోనే జరుగుతున్నాయి. దీనివల్ల ఖర్చు పెరుగుతోంది. సమయమూ వృథా అవుతోంది. అందుకే, భారత ప్రభుత్వం ఇప్పుడు దేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ఎంఆర్‌వో కేంద్రంగా అభివృద్ధి చేస్తోంది. కేవలం విమానయాన రంగంతోనే ఆగిపోవడం లేదు. నౌకలకు సంబంధించిన ఎంఆర్‌వో వ్యవస్థపైనా చాలాపెద్ద స్థాయిలో పనిచేస్తున్నాం. ఇవన్నీ దక్షిణ భారత యువతకు అనేక ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి" అని అన్నారు.

రూ.15,000 కోట్ల విదేశీ మారక ద్రవ్యం ఆదా: రామ్మోహన్ నాయుడు

భారత విమానయాన రంగం గత పదకొండేళ్లలో రెట్టింపు వృద్ధిని సాధించిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఉడాన్ పథకాన్ని కేంద్రం మరో పదేళ్లకు పొడిగించిందని... 19, 42, 72 సీట్ల చిన్న విమానాలతో వచ్చే అంకురాలనూ ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. శాఫ్రన్ ఎంఆర్‌వో కేంద్రం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... "ప్రస్తుతం లీప్ ఇంజిన్ల నిర్వహణ, ఇతర సేవల కోసం విమానయాన సంస్థలు సింగపూర్, మలేసియా, ఇండోనేసియాపై ఆధారపడుతున్నాయి. ఇకపై ఇదంతా హైదరాబాద్‌లోనే జరుగుతుంది. దీనివల్ల రూ.15,000 కోట్లకు పైగా విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది. శాఫ్రన్ ఎంఆర్‌వో కేంద్రం వచ్చినట్లుగానే త్వరలో భారత్‌కు విమాన తయారీ కంపెనీలూ వస్తాయి. హైదరాబాద్ విమానాశ్రయం కోసం విశాలమైన భూమిని సేకరించిన అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ముందుచూపు గొప్పది. ఈ కారణంగానే ఇప్పుడు అనేక సంస్థలు హైదరాబాద్‌లో వాటి అంతర్జాతీయ కేంద్రాలను నెలకొల్పేందుకు ముందుకొస్తున్నాయి. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమూ ఈ రంగం వృద్ధికి ఎంతో తోడ్పాటునందిస్తోంది. దేశంలో చాలా ఏవియేషన్ హబ్‌లు ఏర్పాటవుతున్నాయి. తెలంగాణ, కర్ణాటకలతోపాటు ఆంధ్రప్రదేశ్ కూడా ఈ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది" అని తెలిపారు. సభలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాఫ్రన్ గ్రూపు సీఈవో ఒలివియర్ ఆండ్రీస్ మాట్లాడారు.

ధాన్యం సేకరణ, చెల్లింపుల్లో ఇబ్బందులు రానివ్వద్దు

- సమీక్షలో సీఎం చంద్రబాబు
- పత్తి కొనుగోలులో ఇబ్బందులపై కేంద్ర టెక్స్‌టైల్స్‌శాఖ కార్యదర్శికి ఫోన్

ఈనాడు, అమరావతి: ధాన్యం సేకరణ, నగదు చెల్లింపుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని.. నిధుల విషయంలో ఆర్థికశాఖతో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. భారీవర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులకు గోతాలు అందించి సేకరణ చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పండించే పంటలకు ధరలు తగ్గకుండా చూడాలని.. పత్తి, అరటి, జొన్న రైతుల ఇబ్బందులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. బుధవారం రాత్రి సచివాలయంలో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలపై సీఎం సమీక్షించారు. ధాన్యం కొనుగోలుకు రూ.13,451 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు సీఎంకు వివరించారు. పత్తి కొనుగోలులో సీసీఐ విధానాల కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. దీంతో చంద్రబాబు కేంద్ర టెక్స్‌టైల్స్ శాఖ కార్యదర్శి నీలం రావుతో ఫోనులో మాట్లాడారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. పత్తి కొనుగోలులో ఎదురవుతున్న ఇబ్బందులపై కేంద్రంతో నిత్యం సంప్రదింపులు జరిపే బాధ్యతను కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుకు అప్పగించాలని చంద్రబాబు సూచించారు.

అమరావతిలో కాస్మోస్ ప్లానెటేరియం

తుళ్లూరు, న్యూస్‌టుడే: 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్' అమరావతిలో ప్లానెటేరియం ఏర్పాటుచేయనుంది. ఈ మేరకు ఏపీ సీఆర్డీఏ అధికారులతో గురువారం ఆస్ట్రోఫిజిక్స్ ఎంవోయూ చేసుకోనుంది. గురువారం అమరావతిలో పలు బ్యాంకుల ప్రధాన కార్యాలయాల నిర్మాణ పనుల శంకుస్థాపనకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకానున్న నేపథ్యంలో ప్లానెటేరియం ఏర్పాటుకు ముందడుగు పడనుంది. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ కార్యకలాపాలు సైతం మొదలుకానున్నాయి. పర్యాటక మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టులతో విద్య, వైద్య పర్యాటక రంగాల్లో అమరావతి ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందబోతుందని సీఆర్డీఏ కమిషనర్ కార్యాలయం బుధవారం రాత్రి ఒక ప్రకటనలో పేర్కొంది. ప్లానెటేరియం ఏర్పాటైతే విశ్వం, గ్రహాలు, నక్షత్రాలు, గెలాక్సీల వంటి విషయాలను విద్యార్థులు స్పష్టంగా దృశ్యరూపంలో అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది.

అవమానకర ఉద్యోగ హోదాలకు స్వస్తి

- గౌరవప్రదమైన హోదా పేర్లు సూచించాలంటూ ప్రభుత్వ ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: ప్రస్తుత కాలానికి అనుగుణంగా లేని.. అవమానకరంగా, వివక్ష చూపేలా ఉన్న ఉద్యోగుల హోదాల పేర్లు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, బోర్డులు, ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికీ ఫిట్టర్, చౌకీదార్, మసాల్చి, స్కావెంజర్, స్వీపర్ కమ్ చౌకీదార్, హెల్పర్, అటెండర్, ప్లంబర్, ట్రేసర్, బేరర్, క్లీనర్, బట్లర్, ధోబీ, మాలి, గేట్ కీపర్, ప్యాకర్, బోయ్, జూ వాచ్‌మన్, హెడ్ యానిమల్ కీపర్, బ్లాక్‌స్మిత్, బుకింగ్ క్లర్క్, లేబరర్ తదితర పేర్లు ఉన్నాయి. ఉద్యోగుల గౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా పేర్లు మార్చాలని ప్రభుత్వం నిర్ణయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆర్టికల్ 21 ప్రకారం, సుప్రీంకోర్టు తీర్పులను అనుసరించి అందరికీ గౌరవంగా జీవించే హక్కు ఉన్నందున.. ప్రభుత్వ నియామకాల్లో ఇలాంటి పేర్లను కొనసాగించడం రాజ్యాంగ విలువలకు, ఆధునిక పరిపాలన సూత్రాలకు విరుద్ధమని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకు అనుగుణంగా గౌరవప్రదమైన కొత్త హోదా పేర్లు సూచిస్తూ వారం రోజుల్లో సంబంధిత శాఖలు పంపాలని పేర్కొంది. అన్ని శాఖల ప్రతిపాదనలు క్రోడీకరించి రాష్ట్రప్రభుత్వ బిజినెస్ రూల్స్-2018 ప్రకారం మొత్తం పేర్ల మార్పు ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తిచేయాలని సీఎస్ విజయానంద్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సొంత ఖర్చులతోనే లోకేశ్ విమాన ప్రయాణాలు

- సహ చట్టం ద్వారా వెల్లడి

ఈనాడు, అమరావతి: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి లోకేశ్ పర్యటనల నిమిత్తం విమాన ప్రయాణ ఖర్చులకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వధనాన్ని వినియోగించలేదు. వివిధ ప్రాంతాలకు అధికారిక పర్యటనలు, పెట్టుబడుల సాధనకు వెళ్లినప్పుడు స్పెషల్, రెగ్యులర్ విమానాల్లో ప్రయాణానికి ఆయన సొంత నిధులనే ఖర్చుపెట్టారు. లోకేశ్ పర్యటనలకు ఎంత ఖర్చు అయిందని ఆర్టీఐ కార్యకర్త సురేశ్‌బాబు సమాచార హక్కు చట్టం కింద అడిగారు. ఆయన పర్యటనలకు ప్రభుత్వ సొమ్ము వెచ్చించలేదని ఆయా శాఖలు బదులిచ్చాయి.

సరికొత్తగా పార్సిల్ రవాణా సేవలు: ద.మ.రైల్వే

ఇంటి నుంచే పికప్, డెలివరీ

ఈనాడు, హైదరాబాద్: రైళ్ల ద్వారా పార్సిల్ రవాణా సేవలను మరింత సులభతరం చేయనున్నట్లు ద.మ.రైల్వే తెలిపింది. రైలు ద్వారా పార్సిళ్లు బుక్ చేసుకోవాలనుకునే వారికి ఇంటి వద్దనే పికప్, డెలివరీ సౌకర్యం కల్పించేలా అప్లికేషన్ ఆధారిత పార్సిల్ లాజిస్టిక్స్ సిస్టమ్‌ను అభివృద్ధి చేసినట్లు పేర్కొంది. ఈ సౌకర్యాన్ని హైదరాబాద్ డివిజన్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించనున్నట్లు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ డిజిటల్ సేవతో ఫస్ట్‌మైల్(పికప్), మిడ్ మైల్(రైల్వే రవాణా), లాస్ట్‌మైల్(డెలివరీ) సేవలను ఒకే ప్లాట్‌ఫామ్‌పై ఉంటాయని తెలిపింది. ఈ సరికొత్త సేవలకు అనుగుణంగా లాజిస్టిక్స్, ఫ్లీట్ సర్వీస్ ప్రొవైడర్లను భాగస్వాములుగా ద.మ.రైల్వే ఆహ్వానించింది. 'నెక్స్ట్ జెన్ రైల్ పార్సిల్' యాప్.. పార్సిల్ సరకులను బుకింగ్ చేయడానికి, ట్రాక్ చేసేందుకు వన్-స్టాప్ ప్లాట్‌ఫామ్‌గా ఉపయోగపడుతుంది. ఇది ఎవరైనా సాధారణ ప్రజలు కూడా తమ ఇంటిలో కూర్చుని దేశంలోని ప్రతి చోటుకు పార్సిల్ సరకులను పంపించడానికి దోహదపడుతుందని తెలిపింది. ఈ సేవల్లో భాగస్వామ్యం కావాలనుకునే ఏజెన్సీలు హైదరాబాద్ డివిజన్ కమర్షియల్ విభాగాన్ని మెయిల్ లేదా ప్రత్యక్షంగా సంప్రదించాలని ద.మ.రైల్వే కోరింది.

కాలేయం దెబ్బతిన్నా.. ఇక పునరుజ్జీవం!

- మందు కనుగొన్న మన పరిశోధకులు
- జంతువులపై ప్రయోగాలు విజయవంతం
- 'రీ-జనరేటివ్ మెడిసిన్'లో ప్రచురితం



మూలకణాలు



ఎక్సోజోమ్‌లు

ఈనాడు, హైదరాబాద్: తీవ్రమైన అనారోగ్యంతో కాలేయం దెబ్బతిన్నా.. దాన్ని పునరుజ్జీవింపజేసే మందును హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని ఆస్పైర్ బయోనెస్ట్, తులసి థెరప్యూటిక్స్ అంకుర సంస్థ, నిమ్స్ ఆసుపత్రి వైద్యనిపుణులు, పరిశోధకులు కనుగొన్నారు. ఈ మేరకు కొద్దినెలలుగా వారు జంతువులపై చేసిన ప్రయోగాలు విజయవంతమయ్యాయి. ఈ పరిశోధనలను ప్రముఖ అంతర్జాతీయ జర్నల్ 'రీ-జనరేటివ్ మెడిసిన్' ప్రచురించింది. దీర్ఘకాలికంగా కాలేయ వ్యాధితో బాధపడుతున్నవారికి కాలేయ మార్పిడి చికిత్స మాత్రమే ప్రత్యామ్నాయం కాగా.. ఈ మందు కాలేయాన్ని పునరుజ్జీవింపజేయనుందని పరిశోధకులు తెలిపారు. దీనికి 'తులసి-28ఎక్స్' అని పేరుపెట్టారు. ఈ మేరకు ప్రపంచంలోనే తొలిసారిగా మూలకణాలు, ఎక్సోజోమ్‌లతో జంతువులకు చికిత్స చేశారు. మనుషులపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించాక.. రెండేళ్లలో మందును అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. జంతువులకు పరిశోధకులు మూలకణాలు, ఎక్సోజోమ్‌తో కూడిన (కనిపెట్టిన) మందును ఇవ్వగా. . వందశాతం కోలుకున్నాయి. క్రమంగా వాటిలో కాలేయం పునరుజ్జీవమైంది. అమెరికాలోని ఇండియానా యూనివర్సిటీ ప్రొఫెసర్ డా.నాగ చలసాని, చండీగఢ్‌లోని పీజీఐఎమ్ఈఆర్‌కి చెందిన డా.అజయ్ దుసేజా ఈ ప్రయోగాలను పర్యవేక్షించారు.

అతి తక్కువ ఖర్చుతోనే..



– డాక్టర్ సాయిరామ్ అట్లూరి, తులసి థెరప్యూటిక్స్ వ్యవస్థాపకులు

తక్కువ ఖర్చుతోనే బాధితులకు సాంత్వన కలిగించేందుకు ఈ మందును కనిపెట్టాం. ప్రపంచవ్యాప్తంగా కాలేయ వ్యాధితో చనిపోతున్నవారిలో 20% మంది భారతీయులే. కామెర్లు, మద్యపానం, జీవనశైలి, పలు ఆహారపు అలవాట్ల కారణంగా కాలేయం దెబ్బతింటోందని గుర్తించాం. కాలేయ సంబంధిత మరణాలు తగ్గించేందుకే పరిశోధనలు నిర్వహించి మందును కనుగొన్నాం.



వ్యాయామాలు సరే.. నిద్ర సంగతేంటి?

మీరు ఉదయం 5 గంటలకే లేచి వ్యాయామాలు చేస్తే మంచిదే. కానీ అంతకన్నా ముందు మీరు రాత్రి ఎన్ని గంటలు నిద్రపోయారన్నది మరీ ముఖ్యం. 5 గంటలే నిద్రపోయి, పొద్దున ఎన్ని రకాల కసరత్తులు చేసినా వృథా. కంటి నిండా నిద్రపోవడమనేది ఆరోగ్య పరిరక్షణకు పునాది లాంటిది. అందుకే దాన్ని నిర్లక్ష్యం చేయొద్దు.

– క్రిస్టీ లియాంగ్, ఫిజీషియన్



సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ విలీనానికి రికార్డు తేదీ డిసెంబరు 8

ఈనాడు, హైదరాబాద్: సీక్వెంట్ సైంటిఫిక్‌లో, వియాష్ లైఫ్‌సైన్సెస్ విలీనానికి రంగం సిద్ధమైంది. దీంతో పాటు మరో 8 కంపెనీలు కూడా సీక్వెంట్‌లో కలిసిపోనున్నాయి. దీనిపై ఇప్పటికే నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ ఆమోదించిన విలీన పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చేందుకు సీక్వెంట్ సైంటిఫిక్ సన్నాహాలు చేస్తోంది. ఈ విలీనానికి డిసెంబరు 8ని రికార్డు తేదీగా నిర్ణయించారు. ఆరోజుకు వియాష్ లైఫ్ వాటాదార్లుగా ఉన్నవారికి, సీక్వెంట్ సైంటిఫిక్ షేర్లు కేటాయిస్తారు. ప్రతి 100 వియాష్ లైఫ్ షేర్లకు 56 సీక్వెంట్ సైంటిఫిక్ షేర్లు ఇస్తారు. సీక్వెంట్ సైంటిఫిక్ షేరు ముఖ విలువ రూ.2 కాగా, వియాష్ లైఫ్ షేరు ముఖవిలువ రూ.10.

అమెరికాలోకి మళ్లీ ర్యానిటిడిన్ ట్యాబ్లెట్

ఈనాడు, హైదరాబాద్: కడుపులో అల్సర్లను అదుపు చేయడానికి వినియోగించే ర్యానిటిడిన్ ట్యాబ్లెట్, అమెరికాలో మళ్లీ అందుబాటులోకి రానుంది. ఎస్ఎంఎస్ ఫార్మాస్యూటికల్స్‌కు అసోసియేటెడ్ కంపెనీ అయిన వీకేటీ ఫార్మా తిరిగి రూపొందించిన (రీ-ఫార్ములేటెడ్) ర్యానిటిడిన్ 150ఎంజీ, 300 ఎంజీ ట్యాబ్లెట్లకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ఎఫ్‌డీఏ) అనుమతి మంజూరు చేసింది. దీంతో దాదాపు ఆయిదేళ్ల తర్వాత ఈ ట్యాబ్లెట్ తిరిగి అమెరికాలో ప్రవేశించనుంది. విస్తృత స్థాయిలో ప్యాకేజీలు నిర్వహించడం కాకుండా ఎన్‌డీఎంఏ (ఎన్-నైట్రోసోడిమెథైలమైన్) మలినాలకు సంబంధించి గతంలో తలెత్తిన ఆందోళనలకు పరిష్కారం కనుగొన్నాక, ర్యానిటిడిన్‌కు తిరిగి అనుమతి ఇస్తున్నట్లు యూఎస్ఎఫ్‌డీఏ పేర్కొంది. కాగా.. ఈ వార్తల నేపథ్యంలో బీఎస్ఈలో ఎస్ఎంఎస్ ఫార్మా షేరు 19% పెరిగి, రూ.322 వద్ద స్థిరపడింది.

సాంకేతిక నైపుణ్యాలపై పేద యువతకు శిక్షణ

● ఐబీఎం, నాస్కామ్ ఫౌండేషన్ జట్టు

పరిశ్రమలకు అవసరమైన ఆధునాతన సాంకేతిక నైపుణ్యాలపై పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఐబీఎంతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు నాస్కామ్ ఫౌండేషన్ తెలిపింది. 87,000 మందికి పైగా యువతకు కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక కోర్సుల పైన ఐబీఎం స్కిల్ బిల్డ్ ప్రోగ్రామ్ కింద ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. పాఠ్యాంశాలతో పాటు మెంటార్‌షిప్, సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడానికి అనుభవం కలిగిన వారితో మార్గదర్శకత్వాన్ని అందించడం, వృత్తి పరమైన విశ్వాసాన్ని కల్పించడం లాంటివి ఇందులో ఉంటాయని తెలిపింది. నేరుగా విశ్వ విద్యాలయాలతో జట్టుకట్టడంతో పాటు ఆయా సంస్థల సాంకేతికతల్లో నైపుణ్యాలు నేర్పేవారితోనూ భాగస్వామ్యం ద్వారా శిక్షణ ఇస్తారు.

అక్రమ డ్రోన్లపై నిఘా నేత్రం.. 'ఇంద్రజాల్ రేంజర్'

దేశంలో మొదటి అటానమస్ యాంటీ డ్రోన్ గస్తీ వాహనం విడుదల




హైదరాబాద్ (రాయదుర్గం), న్యూస్‌టుడే: 'దేశ సరిహద్దులు, బహిరంగ ప్రదేశాలు, జనసమ్మర్థ స్థలాలు, డ్రోన్ దాడి ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలపై నిఘా పెడుతుంది. మాదక ద్రవ్యాలు, ఆయుధాలు అక్రమంగా సరఫరా చేసే డ్రోన్లను నాశనం చేస్తుంది. అవసరమైతే అదుపులోకి తీసుకుంటుంది'.. అదే దేశంలోనే మొదటి యాంటీ డ్రోన్ గస్తీ వాహనం 'ఇంద్రజాల్ రేంజర్' ప్రత్యేకత. ఇంద్రజాల్ డ్రోన్ డిఫెన్స్ ఇండియా ఆధ్వర్యంలో రూపొందించిన ఈ వాహనాన్ని రాయదుర్గం టీ హబ్‌లో బుధవారం భారత ఆర్మీ విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ దేవేంద్ర ప్రతాప్ పాండే, ఇంద్రజాల్ సంస్థ వ్యవస్థాపకుడు కిరణ్ రాజు ఆవిష్కరించారు. శత్రుదేశం నుంచి వచ్చే డ్రోన్లను గుర్తించి నాశనం చేయడంలో ఇంద్రజాల్ రేంజర్ చక్కగా పనిచేస్తుందని దేవేంద్ర అన్నారు. 10 కి.మీ. పరిధిలో ఏకకాలంలో 50 డ్రోన్లను ఇది గుర్తిస్తుందని కిరణ్ రాజు తెలిపారు. ప్రస్తుతం ఒక వాహనాన్ని అందుబాటులోకి తెచ్చామని, మరో 12 వాహనాలను తయారు చేస్తున్నట్లు తెలిపారు.

బుల్ బరాబర్

ఎఫ్ఐఐ కొనుగోళ్లు.. రూ. 4778.03 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు.. రూ. 6247.93 కోట్లు

- దూసుకెళ్లిన సూచీలు
- అమెరికా ఫెడ్ రేట్ల కోతపై తాజా అంచనాల నేపథ్యం
- రూ.5.50 లక్షల కోట్లు పెరిగిన సంపద



సెన్సెక్స్ ▲1023 85610 | నిఫ్టీ ▲321 26205

మూడు రోజుల వరస నష్టాల మొత్తాన్ని తుడిచిపెడుతూ, స్టాక్ మార్కెట్ బుధవారం భారీ లాభాలతో ముగిసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతపై అంచనాలు పెరగడంతో, విదేశీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడం ఇందుకు ప్రధానంగా తోడ్పడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ తన జీవనకాల గరిష్ఠానికి చేరువైంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ ఎలాంటి మార్పు లేకుండా 89.22 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 0.13% నష్టంతో 62.40 డాలర్ల వద్ద ట్రేడవుతోంది

● బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.5.50 లక్షల కోట్లు పెరిగి రూ.474.92 లక్షల కోట్ల (5.32 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

కాసేపే నష్టాల్లో..

ఉదయం బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 84,587.01) స్వల్ప నష్టంతో 84,503.44 పాయింట్ల వద్ద ఆరంభమైంది. వెంటనే లాభాల్లోకి వచ్చి... క్రమంగా పెంచుకుంది. ఒక దశలో 85,644.19 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 1022.50 పాయింట్ల లాభంతో 85,609.51 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 320.50 పాయింట్లు పెరిగి 26,205.30 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 25,842.95 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 26,215.15 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది.

2 మినహా మిగతావి లాభాల్లో

సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగతా కంపెనీల షేర్లన్నీ లాభాల్లో ముగిశాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ 2.63%, బజాజ్ ఫైనాన్స్ 2.52%, టాటా స్టీల్ 2.04%, రిలయన్స్ 1.99%, టీఎంపీవీ 1.92%, యాక్సిస్ బ్యాంక్ 1.91%, సన్‌ఫార్మా 1.87%, ఇన్ఫోసిస్ 1.81%, మారుతీ సుజుకీ 1.71%, టెక్ మహీంద్రా 1.67% చొప్పున లాభపడ్డాయి.

ఇవి కలిసొచ్చాయ్..

● అమెరికా రిటెయిల్ విక్రయ గణాంకాలు అంచనాల కంటే తక్కువగా నమోదుకావడం.. ఆ దేశ వినియోగ గిరాకీ నెమ్మదించడంతో డిసెంబరులో అమెరికా ఫెడ్ రిజర్వ్ కీలక రేట్లను తగ్గించొచ్చనే అంచనాలు పెరిగాయి. ఫలితంగా అమెరికా మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగియగా.. ఆసియా, ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలో కదలాడటం... మన మార్కెట్‌కూ ఉత్తేజాన్నిచ్చింది.

● బ్యాంకింగ్, లోహ షేర్ల రాణింపు కలిసొచ్చింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ బ్యాంక్ 1.22% పెరిగి 59,554.95 పాయింట్ల వద్ద కొత్త జీవనకాల గరిష్ఠాన్ని చేరింది.

● విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) తిరిగి కొనుగోళ్ల బాట పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలోపేతం చేసింది.

● ఉక్రెయిన్- రష్యా మధ్య యుద్ధ విరమణ ఒప్పందం దాదాపుగా ఖరారు కావొచ్చనే అంచనాలు, ముడి చమురు ధరలు తగ్గడమూ ప్రభావం చూపింది.

ఆర్ఐఎల్ @ రూ.21 లక్షల కోట్లు

రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మార్కెట్ విలువ రూ.21 లక్షల కోట్ల మైలురాయిని అధిగమించింది. బుధవారం బీఎస్ఈలో ఈ షేరు 1.99% పెరిగి రూ.1,569.75 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 2.12% పెరిగి రూ.1,571.80 వద్ద 52 వారాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీ మార్కెట్ విలువ రూ.21,24,259.89 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 29 శాతానికి పైగా రాణించింది.

రూ.10,000కు ఎంసీఎక్స్ షేరు

మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీ (ఎంసీఎక్స్) షేరు తొలి సారిగా రూ.10,000ను తాకింది. బుధవారం బీఎస్ఈలో ఈ షేరు ఒక దశలో రూ.10,309.05 వద్ద తాజా జీవనకాల గరిష్ఠాన్ని చేరింది. చివరకు 4.08% లాభంతో రూ.10,274.60 వద్ద ముగిసింది.

ఎక్సెల్‌సాఫ్ట్ టెక్ షేర్ల శుభారంభం

స్టాక్ మార్కెట్లో ఎక్సెల్‌సాఫ్ట్ టెక్నాలజీస్ షేర్లు శుభారంభం చేశాయి. ఇష్యూ ధర రూ.120తో పోలిస్తే, బుధవారం 12.5% అధికంగా రూ.135 వద్ద ఈ షేర్లు నమోదయ్యాయి. ఒకదశలో 18.87% పెరిగి రూ.142.65 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరాయి. చివరకు 4.95% లాభంతో రూ.125.95 వద్ద ముగిశాయి.

✦ అమెరికా టారిఫ్‌లు ఇబ్బంది పెడుతున్నా, జీఎస్‌టీ సంస్కరణల ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలు పెరిగి, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధిరేటు 6.6 శాతంగా నమోదు కావచ్చని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పేర్కొంది.

- ఈనాడు వాణిజ్య విభాగం

అరుదైన భూ అయస్కాంతాల తయారీకి రూ.7,280 కోట్ల ప్రోత్సాహక పథకం



అరుదైన భూ అయస్కాంతాల తయారీని ప్రోత్సహించేందుకు రూ.7,280 కోట్ల పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 'స్కీమ్ టు ప్రమోట్ మానుఫ్యాక్చరింగ్ ఆఫ్ సింటెర్డ్ రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్స్'కు అనుమతి లభించింది. 'ఈ పథకం అరుదైన భూ అయస్కాంతాల తయారీని ప్రోత్సహిస్తుంది. ఏడాదికి 6,000 మెట్రిక్ టన్నుల సామర్థ్యం సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నామ'ని సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. విద్యుత్తు వాహనాలు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, వైద్య పరికరాలు, రక్షణ వంటి ప్రధాన రంగాల్లో వాడే అరుదైన భూ అయస్కాంతాల కోసం దిగుమతులపై ఆధారపడుతున్నాం. దీన్ని అధిగమించేందుకు మంత్రివర్గం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పథకం కింద అంతర్జాతీయ పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా అయిదుగురు లబ్ధిదారులకు 1,200 మెట్రిక్ టన్నుల చొప్పున సామర్థ్యాన్ని నిర్దేశిస్తారు. ప్రభుత్వ/ప్రైవేటు కంపెనీలు పోటీ పడొచ్చు. ఈ పథకం కాల వ్యవధి 7 ఏళ్లు. ఇందులో రేర్ ఎర్త్ పర్మనెంట్ మ్యాగ్నెట్స్ (ఆర్ఈపీఎం) తయారీ ప్లాంట్ ఏర్పాటు కోసం రెండేళ్ల సమయాన్ని (గెస్టేషన్ పీరియడ్) కూడా కలిపారు. ఆర్ఈపీఎం విక్రయాలపై 5 ఏళ్లు ప్రోత్సాహకాలు చెల్లిస్తారు.

ఆర్‌బీఐ రేట్ల కోత విధించినా నికర వడ్డీ మార్జిన్ లక్ష్యాన్ని సాధిస్తాం

ఎస్‌బీఐ ఛైర్మన్ శ్రీనివాసులు శెట్టి



దిల్లీ: వచ్చే వారం జరగబోయే పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును 0.25% తగ్గించినా.. నికర వడ్డీ మార్జిన్(ఎన్ఐఎమ్) లక్ష్యమైన 3 శాతాన్ని సాధించగలమని ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'వచ్చే నెల 5న ఆర్‌బీఐ కీలక రేటును 0.25% తగ్గించొచ్చని ఎస్‌బీఐ భావిస్తోంది. ఇది మా మార్జిన్లపై పెద్ద ప్రభావం చూపిస్తుందని అనుకోవట్లేద'ని ఆయన అన్నారు. అక్టోబరులో ద్రవ్యోల్బణ రేటు 0.29 శాతానికి చేరడానికి ముందు మాత్రం ఎస్‌బీఐ అంచనాలు ఇలా లేవు. డిసెంబరులో రెపోరేటు మార్చకపోవచ్చని, ఫిబ్రవరిలో రేట్ల కోత ఉండొచ్చని అప్పట్లో తెలిపింది. తాజా అంచనాల్లో మాత్రం డిసెంబరులో రెపోరేటు తగ్గుతుందనే అంచనా వేస్తోంది. జీడీపీ వృద్ధి 2025-26 రెండో త్రైమాసికంలో 7.5%, పూర్తి ఆర్థిక సంవత్సరంలో 7 శాతంగా నమోదవుతుందని ఎస్‌బీఐ అంచనా వేస్తున్నట్లు శెట్టి తెలిపారు. అధిక వృద్ధి, తక్కువ ద్రవ్యోల్బణం నేపథ్యంలో.. రెపోరేటుపై నిర్ణయం తీసుకోవడం ఆర్‌బీఐకి కత్తిమీద సాములాంటిదేనని ఆయన అభిప్రాయపడ్డారు.



27న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)


హైదరాబాద్	650	తూ/ప గోదావరి	645
వరంగల్	652	విశాఖపట్నం	635
విజయవాడ	660	చిత్తూరు	673

ఐఏ, ఆర్ఏగా పట్టభద్రులెవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు: సెబీ



పెట్టుబడి సలహాదార్లు (ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్-ఐఏ), పరిశోధనా విశ్లేషకులకు (రీసెర్చ్ అనలిస్టులు-ఆర్ఏ) విద్యార్హతల నిబంధనల్లో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సడలింపులు ఇచ్చింది. కోర్సుతో సంబంధం లేకుండా, పట్టభద్రులెవరైనా ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్స్, రీసెర్చ్ అనలిస్టులుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. అయితే ఎన్ఐఎస్ఎమ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్) సర్టిఫికేషన్ పరీక్షలో ఉత్తీర్ణులు కావడం తప్పనిసరి అని పేర్కొంది. ప్రస్తుతం ఫైనాన్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్, అర్థ శాస్త్రం లేదా కేపిటల్ మార్కెట్లలో డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన వాళ్లకే ఐఏ, ఆర్ఏగా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది.

భారత విపణిలోకి రెడ్ రాక్ డాలి చిప్స్



తన స్నాక్స్ విభాగాన్ని విస్తరించే వ్యూహంలో భాగంగా, అంతర్జాతీయంగా ప్రాచుర్యం ఉన్న 'రెడ్ రాక్ డెలి' చిప్స్ బ్రాండును భారత విపణిలోకి పెప్సికో ఇండియా తీసుకొచ్చింది. తొలుత ఆస్ట్రేలియాలో ఈ చిప్స్ తయారయ్యాయి. ఆ తర్వాత ఇతర దేశాల విపణుల్లోనూ ఆదరణ పొందాయి. ఇప్పుడు భారతీయల కోసం వీటిని పలు రుచుల్లో తయారు చేసి, అందుబాటులోకి తేనున్నట్లు పెప్సికో తెలిపింది.

డిసెంబరులో రూ.40,000 కోట్ల ఐపీఓలు



నిధుల సమీకరణ పరంగా గత సంవత్సర రికార్డును భారత పబ్లిక్ ఇష్యూ మార్కెట్ ఈ ఏడాది బద్దలు కొట్టేలా కనిపిస్తోంది. డిసెంబరులోనూ పబ్లిక్ ఇష్యూల సందడి భారీగా కొనసాగనుండటం ఇందుకు నేపథ్యం. వచ్చే నెలలో సుమారు రూ.35,000- 40,000 కోట్ల ఐపీఓలు రానున్నాయని అంచనా. ఇందులో మీషో, ఫ్రాక్టల్ అనలిటిక్స్ లాంటి సంస్థలూ ఉన్నాయి. జనవరి నుంచి ఇప్పటివరకు కంపెనీలు రూ.1.54 లక్షల కోట్లను ఇష్యూల ద్వారా సమీకరించాయి. డిసెంబరు సమీకరణ కూడా అనుకున్నట్లు జరిగితే, ఈ ఏడాది పబ్లిక్ ఇష్యూల ద్వారా మొత్తం నిధుల సమీకరణ రూ.1.85- 1.90 లక్షల కోట్లకు చేరుతుంది. ఇదే జరిగితే ఇప్పటివరకు మనదేశంలో ఐపీఓల ద్వారా ఒక ఏడాదిలో అత్యధిక నిధుల సమీకరణ ఇదే అవుతుంది. 2024లో దాదాపు రూ.1.70 లక్షల కోట్లను కంపెనీలు పబ్లిక్ ఇష్యూల ద్వారా సమీకరించాయి.

డేటా కేంద్రాల వ్యాపారం పేరు మార్చిన ఎల్అండ్‌టీ

తన డేటా కేంద్రాల వ్యాపారానికి ఎల్అండ్‌టీ- వ్యోమాగా పేరు మార్చినట్లు ఎల్అండ్‌టీ తెలిపింది. సంస్కృతంలో 'ఆకాశం' అనే అర్థం వచ్చే పదాన్ని ప్రేరణగా తీసుకుని, ఈ మార్పు చేసినట్లు తెలిపింది. 2024లో ఎల్అండ్‌టీ తన డేటా కేంద్రాల వ్యాపారాన్ని ప్రారంభించింది. ఇంతవరకు దీని పేరు ఎల్అండ్‌టీ- క్లౌడ్‌ఫినిటిగా ఉండేది.

హరిత వ్యవస్థలోకి రూ.365 లక్షల కోట్ల పెట్టుబడులు



● 4.8 కోట్ల మందికి ఉద్యోగాలు

● 2047కు సీఈఈడబ్ల్యూ అంచనాలివీ

పర్యావరణ అనుకూల రంగాల్లోకి 2047 నాటికి భారత్ 4.1 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.365 లక్షల కోట్ల) పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉందని, తద్వారా 4.8 కోట్ల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని కౌన్సిల్ ఆన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (సీఈఈడబ్ల్యూ) అధ్యయనం వెల్లడించింది. 2047 కల్లా భారత్‌లో వార్షిక హరిత మార్కెట్ 1.1 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.98 లక్షల కోట్ల)కు చేరొచ్చని అంచనా వేసింది. వికసిత్ భారత్ ప్రయాణంలో, హరిత ఆర్థిక వ్యవస్థ కీలకంగా మారనుందని పేర్కొంది. సౌర ప్యానెళ్లు, విద్యుత్ వాహనాలతో బయో ఆధారిత మెటీరియల్స్, ఆగ్రోఫారెస్ట్రీ, హరిత నిర్మాణాలు, సస్టెయినబుల్ టూరిజం, సర్క్యులర్ మ్యానుఫ్యాక్చరింగ్, వ్యర్థాల పునర్వినియోగం, ప్రకృతి ఆధారిత జీవనాలు కూడా హరిత ఆర్థిక వ్యవస్థ కిందకే వస్తాయి. ఇలా ప్రతి ఒక్కటీ వచ్చే రెండు దశాబ్దాల్లో బిలియన్ డాలర్ల (సుమారు రూ.8,900 కోట్ల) రంగాలుగా మారతాయని అధ్యయనం వెల్లడించింది.

✦ ఇంధన పరివర్తన (ఎనర్జీ ట్రాన్సిషన్) విభాగమే 1.66 కోట్ల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది. రెన్యూవబుల్స్, స్టోరేజ్, డిస్ట్రిబ్యూటెడ్ ఎనర్జీ, క్లీన్ మొబిలిటీ మానుఫ్యాక్చరింగ్ విభాగాలు కలిపి 3.79 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.337 లక్షల కోట్ల) పెట్టుబడులను ఆకర్షిస్తాయి.

✦ హరిత ఆర్థిక వ్యవస్థలో విద్యుత్ వాహన రంగంలో అత్యధిక ఉద్యోగాలొస్తాయి. మొత్తం ఇంధన పరివర్తన విభాగాల్లో 57 శాతానికి పైగా వాటా ఈ విభాగానిదే. బయో ఆర్థిక వ్యవస్థ, ప్రకృతి ఆధారిత సొల్యూషన్స్ 2.3 కోట్ల మందికి ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది. 415 బిలియన్ డాలర్ల (సుమారు రూ.36.94 లక్షల కోట్ల) మార్కెట్ విలువ సాధిస్తాయి.

✦ రసాయన రహిత వ్యవసాయ, బయో-ఇన్‌పుట్ రంగంలో 72 లక్షల మందికి, ఆగ్రోఫారెస్ట్రీ -సస్టెయినబుల్ ఫారెస్ట్ మేనేజ్‌మెంట్‌లో 47 లక్షల మందికి, వెట్‌ల్యాండ్ మేనేజ్‌మెంట్‌లో 37 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

✦ మనదేశ చమురు అవసరాల్లో 87% దిగుమతులే తీరుస్తున్నాయి. విద్యుత్ వాహనాలు, సౌర విద్యుత్, తదుపరి తరం బయోఇథనాల్, బయోడీజిల్‌తో ఇంధన దిగుమతులు సున్నా శాతానికి చేరొచ్చు. లిథియం, నికెల్, కోబాల్ట్ 100%, రాగి 93% ప్రస్తుతం దిగుమతి అవుతోంది. పునర్వినియోగంతో ఇవీ పూర్తిగా పరిహరించొచ్చు. ఎరువుల్లో పొటాష్ మొత్తం దిగుమతి అవుతోంది. యూరియా కూడా ప్రత్యక్షంగా-పరోక్షంగా 88% దిగుమతి అవుతోంది. వ్యవసాయం కోసం బయో-ఇన్‌పుట్‌లు, బయో ఆర్థిక వ్యవస్థతో ఆహార భద్రత, మెటీరియల్ అవసరాలు తీరతాయి. భారత్‌కు హరిత ఆర్థిక వ్యవస్థ అనేది ఎంపిక కాదని, తప్పనిసరి అని అధ్యయనం తెలిపింది.

ప్రపంచంలోనే అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీగా యాపిల్!



ప్రపంచంలోనే అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీగా, దశాబ్దకాలంలో తొలిసారిగా యాపిల్ తన అగ్రస్థానాన్ని తిరిగి పొందనుంది. ఐఫోన్ 17 విక్రయాలు బలంగా నమోదవుతుండడం ఇందుకు నేపథ్యం. ఈ ఏడాదే శాంసంగ్‌ను అధిగమించి యాపిల్ నంబర్.1కు చేరుకుంటుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. డాలరు క్షీణత, వాణిజ్య ఉద్రిక్తతలు శాంతించడం వల్ల యాపిల్ విక్రయాలు మరింత పెరుగుతాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ అంటోంది. సెప్టెంబరులో వచ్చిన ఐఫోన్ 17 మోడళ్లకు అమెరికాలోనే కాక, చైనా, భారత్‌ల్లోనూ మంచి ఆదరణ దక్కుతోంది. ప్రజలు పాత మోడళ్ల నుంచి అప్‌గ్రేడ్ కావడానికి ఇష్టపడుతున్నందున, అమెరికా-చైనా మార్కెట్లలో రెండంకెల వార్షిక విక్రయాల వృద్ధిని యాపిల్ సాధించనుందని విశ్లేషకులు చెబుతున్నారు. 2025లో ఐఫోన్ అమ్మకాలు 10%, శాంసంగ్ విక్రయాలు 4.6% వృద్ధి చెందొచ్చని మార్కెట్ పరిశోధనా సంస్థ కౌంటర్‌పాయింట్ అంచనా వేస్తోంది. మొత్తం మీద స్మార్ట్‌ఫోన్ మార్కెట్ ఈ ఏడాది 3.3% వృద్ధి చెందనుండగా.. యాపిల్ 19.4% మార్కెట్ వాటా పొందనుంది. అందువల్లే 2011 తర్వాత స్మార్ట్‌ఫోన్ విపణిలో అగ్రస్థానాన్ని పొందనుంది.

ఎల్‌పీజీ దిగుమతులు తగ్గేదేమీ లేదు



మధ్యప్రాచ్యం నుంచి అమెరికాకు మారతాయంతే: క్రిసిల్ నివేదిక

వంటగ్యాస్ (ద్రవీకృత పెట్రోలియం గ్యాస్-ఎల్‌పీజీ) కోసం దిగుమతులపైనే మనదేశం భారీగా ఆధారపడుతోంది. గత దశాబ్ద కాలంలో దేశీయ అవసరాల్లో 55-60% విదేశాల నుంచే వస్తోంది. దేశీయ ఉత్పత్తి పెరిగినా కూడా, గిరాకీ అంతకుమించి ఉంటున్నందున.. భారత్‌కు ఎల్‌పీజీ దిగుమతులే కీలకం అయ్యాయని క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక పేర్కొంది. భారత్-అమెరికా మధ్య కుదిరిన దీర్ఘకాల ఎల్‌పీజీ ఒప్పందంతో, ఏటా 2.2 మిలియన్ టన్నులు దిగుమతి కానుంది. ఆమేర సంప్రదాయ మధ్యప్రాచ్య సరఫరాదార్ల వాటా తగ్గుతుంది. అయితే చమురు మార్కెటింగ్ కంపెనీలకు వ్యయాలు ముఖ్యంగా, రవాణా ఖర్చులు అధికమవుతాయనే భావన ఉంది.

ఏటా 6-7 సిలిండర్ల వాడకం

✦ 2024-25లో ఎల్‌పీజీ వినియోగం 31.3 మిలియన్ టన్నులకు పెరిగింది. 2016-17లో ఇది 21.6 మిలియన్ టన్నులుగానే ఉంది. 2025-26లో 33-34 మి. టన్నులకు చేరొచ్చని అంచనా.

✦ కుటుంబాల ఎల్‌పీజీ వాడకమూ పెరగనుంది. ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన(పీఎమ్‌యూవై) వినియోగదార్లు 2024-25లో సగటున ఏటా 4.5 సిలిండర్లు బుక్ చేసుకున్నారు. 2016-17లో సగటు 3.9 సిలిండర్లుగా ఉంది. పీఎమ్‌యూవైయేతర వినియోగదార్లు గత అయిదేళ్లుగా సగటున ఏడాదికి 6-7 సిలిండర్లు వాడుతున్నారు.

✦ వాణిజ్య, పారిశ్రామిక వినియోగం మొత్తం గిరాకీలో 16 శాతానికి చేరింది. 2016-17లో ఇది 10 శాతంగా ఉంది.

✦ దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తి 2016-17లో 11.2 మి. టన్నులు కాగా, 2024-25లో 12.8 మి. టన్నులకు చేరుకుంది. అయితే గిరాకీ వృద్ధితో పోలిస్తే దేశీయ ఉత్పత్తి ఎపుడూ దిగువనే ఉంది. దీంతో దిగుమతి పరిమాణం 11.1 మి. టన్నుల నుంచి 20.7 మి.టన్నులకు పెరిగింది.

✦ 2024-25లో మధ్యప్రాచ్యం నుంచే 91-93% ఎల్‌పీజీ దిగుమతులు జరిగాయి. ఇందులో యూఏఈ 41%, ఖతర్ 22%, సౌదీ అరేబియా 15, కువైట్ 15% చొప్పున వాటాలున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో టయోటా భారత్ ప్రాంతీయ విడిభాగాల కేంద్రం

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వద్ద టీవీఎస్ ఐఎల్‌పీకి చెందిన పారిశ్రామిక, లాజిస్టిక్స్ పార్క్ సదుపాయంలో టయోటా భారత్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ (టీబీఐఎస్) తన ప్రాంతీయ విడిభాగాల కేంద్రాన్ని ప్రారంభించింది. ఇందుకోసం ఈ సదుపాయంలో 33,000 చదరపు అడుగులకు పైగా స్థలాన్ని గతంలో టయోటా లీజుకు తీసుకుంది. ఈ కేంద్రం ఏర్పాటు ద్వారా విడిభాగాల లభ్యతను టీబీఐఎస్ బలోపేతం చేసుకోనుంది. 'మా విశాఖపట్నం పార్క్‌లో అంతర్జాతీయ విడిభాగాల పంపిణీ కేంద్రాన్ని తెరవడం ద్వారా, దక్షిణ భారత్‌లో టయోటా విస్తరించనుంద'ని టీవీఎస్ ఐఎల్‌పీ జేఎండీ అదితి కుమార్ పేర్కొన్నారు. 'దక్షిణ భారత్ మాకు కీలక మార్కెట్. ఇందులోనూ విశాఖ వ్యూహాత్మక కేంద్రం. ఇక్కడ బలమైన పోర్టు అనుసంధానత ఉంది. తూర్పు, దక్షిణ భారత్‌లకు వ్యయానుకూల గేట్‌వేలా ఇది ఉంద'ని టీబీఐఎస్ డైరెక్టర్ ప్రకాశ్ నాయర్ పేర్కొన్నారు.

చెవిపోగులు తాకట్టుపెట్టి
టికెట్టు కొంటే.. రూ.3 కోట్ల లాటరీ

పంజాబ్‌లోని బఠిండా జిల్లా జ్జాగాన్ గ్రామానికి చెందిన మహేశ్వరి సాహ్నీని రూ.3 కోట్ల లాటరీ వరించింది. పెళ్లయిన కొంతకాలానికి భర్త వదిలేయగా.. మహేశ్వరి తన కుమార్తెతో కలిసి పుట్టింట్లో ఉంటూ ఇళ్లలో పనులు చేసుకుంటోంది. లాటరీలో విజేతగా నిలిచిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడింది. "త్వరలో నా కుమార్తె పుట్టినరోజు వస్తోంది. పాప కోసం ఓ బహుమతి కొందామనుకున్నా. నా దగ్గర డబ్బులు లేవు. ఆ సమయంలో ఒక అమ్మాయి కోటి రూపాయల లాటరీ గెలుచుకుందని వార్త పేపర్లో చూశాను. చెవిపోగులను తాకట్టు పెట్టి రూ.2,000తో నా కుమార్తె పేరిట నాలుగు టికెట్లు కొన్నాను. ఇంత డబ్బు మా జీవితాన్ని మార్చేస్తుందని ఊహించలేదు" అని పేర్కొంది. ఈ నెల 22వ తేదీ సాయంత్రం లాటరీ తగిలిందన్న వార్త విన్న క్షణాలు ఎప్పటికీ మరచిపోలేనని, ఈ డబ్బుతో పాపను బాగా చదివిస్తానని మహేశ్వరి తెలిపింది.



సుజిత్ ఇల్లు
శుక ప్రపంచం



బిహార్‌లోని ముజఫర్‌పుర్‌కు చెందిన సుజిత్ తన ఇంటిని శుకాల (చిలుకల) ఆవాసమైన చిన్న అభయారణ్యంలా మార్చారు. వివిధ రంగుల్లో ఉన్న ఈ చిలుకల కోసం ప్రత్యేక పంజరాలను ఏర్పాటు చేశారు. తన దగ్గరున్న పక్షులన్నీ భారత ప్రభుత్వ పరివేష్ పోర్టల్‌లో నమోదు చేసినవే అని, పొదుపు చేసిన డబ్బుతో ఈ విదేశీ పక్షులను కొని పెంచుతున్నట్లు సుజిత్ తెలిపారు. గాలా కాక్టూ (ఆస్ట్రేలియన్ జాతి), ఆఫ్రికన్ గ్రే చిలుకలు (దక్షిణాఫ్రికా), అమెరికన్ మకావ్, రెయిన్‌బో లోరిస్, బ్లూ-గోల్డ్ మకావ్, గ్రీన్-వింగ్ మకావ్ వంటి అనేక విదేశీ జాతి పక్షులను ఇక్కడ చూడవచ్చు. గత పదేళ్లుగా కొనసాగిస్తున్న ఈ పక్షుల ప్రేమను ఉపాధి మార్గంగా కూడా మార్చుకోవడం గమనార్హం.


చిలుక కోసం ఊరంతా పోస్టర్లు



ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీకి చెందిన మనోజ్ తప్పిపోయిన తన పెంపుడు చిలుక కోసం పట్టణమంతా పోస్టర్లు అంటించారు. నెల రోజులుగా కనిపించకుండా పోయిన చిలుకను తెచ్చి ఇచ్చినవారికి రూ.5 వేలు బహుమతిగా ఇస్తానని అందులో ప్రకటించారు.

ఇమ్రాన్ ఖాన్ మరణించినట్లు వార్తలు
కారాగారం ముందు పీటీఐ మద్దతుదారుల ఆందోళనలు

పెషావర్: పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైల్లో మృతి చెందారని వార్తలు వస్తున్న తరుణంలో రావల్పిండిలో ఆయన ఉన్న కారాగారం ముందు వందలమంది పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ (పీటీఐ) మద్దతుదారులు మంగళవారం రాత్రి నిరసన చేపట్టారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతినివ్వాలని ఆయన సోదరీమణులతో కలిసి డిమాండు చేశారు. ఈ క్రమంలోనే కొందరు పోలీసులు తమపై విచక్షణారహితంగా దాడులు జరిపారని ఇమ్రాన్ ముగ్గురు సోదరీమణులు ఆరోపించారు. 2023 ఆగస్టు నుంచి ఇమ్రాన్.. రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. అయితే, ఆయన్ను హతమార్చినట్లు సామాజిక మాధ్యమాల్లో ఒక్కసారిగా వార్తలు తెరపైకి వచ్చాయి. బలోచిస్థాన్ విదేశాంగ శాఖ తమ 'ఎక్స్' ఖాతాలో దీనికి సంబంధించి పోస్ట్ చేసింది. ఆయన అనారోగ్యంతోనూ మరణించి ఉండొచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి.



ఆ ప్రణాళిక ట్రంప్‌ది కాదా..?

- రష్యా రూపొందించిందా..!
- ఉక్రెయిన్‌లో శాంతిస్థాపన ప్రతిపాదనలపై వివాదం



వాషింగ్టన్: ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 28 పాయింట్ల శాంతి ప్రణాళికపై వివాదం రేగుతోంది. అది ట్రంప్ తయారుచేసింది కాదని, రష్యా రచించిన డాక్యుమెంటని వివిధ వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ వెలువరించిన కథనం కలకలం రేపుతోంది. ఆ కథనం ప్రకారం.. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపేందుకు అక్టోబరులోనే రష్యా కొన్ని షరతులతో ఓ పత్రాన్ని అగ్రరాజ్యానికి అందించింది. అందులోని అంశాలే 28 పాయింట్ల రూపంలో వెలుగులోకి వచ్చాయి. రష్యా అధ్యక్షుడు పుతిన్ సన్నిహితుడు కిరిల్ దిమిత్రివ్ ఈ డాక్యుమెంట్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. అమెరికా పశ్చిమాసియా రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్‌తో చర్చలు జరిపిన అనంతరం ఈ డాక్యుమెంట్‌కు కిరిల్ అంతిమ రూపు ఇచ్చారు. అందుకే ఇందులో మెజారిటీ ప్రతిపాదనలు రష్యాకు అనుకూలంగా ఉన్నాయి. ట్రంప్ యంత్రాంగం మాత్రం ఈ కథనాన్ని ఖండించింది.

9 పాయింట్లు తీసివేత

28 పాయింట్ల ప్రణాళికలో తొమ్మిది అంశాలను తాజాగా తొలగించినట్లు తెలుస్తోంది. ఒప్పందం.. పూర్తిగా రష్యాకు అనుకూలంగా ఉందని అంతర్జాతీయంగా, ముఖ్యంగా ఐరోపా దేశాల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో ఈ మేరకు అమెరికా వెనక్కి తగ్గినట్లు సమాచారం. తొలగించారన్న అంశాలపై బహిరంగ ప్రకటన వెలువడలేదు.

త్వరలో పుతిన్, జెలెన్‌స్కీలను కలుస్తా: ట్రంప్

పుతిన్‌ను కలిసేందుకు స్టీవ్ విట్కాఫ్‌ను మాస్కో పంపుతున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఉక్రెయిన్ అధికారులతో మాట్లాడేందుకు యూఎస్ ఆర్మీ సెక్రటరీ డాన్ డ్రిస్కాల్ కీవ్ వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. చర్చలు ఒక కొలిక్కి వస్తే తుది దశలో తాను పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలతో సమావేశమవుతానని చెప్పారు.

ఎస్సీ విద్యార్థుల ఉపకారవేతనాలకు
నూతన మార్గదర్శకాలు

దిల్లీ: 'ఎస్సీ విద్యార్థుల ఉన్నతశ్రేణి ఉపకారవేతనాల'కు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. ఆర్థిక సాయాన్ని విస్తరించడం, విద్యాసంస్థల జవాబుదారీతనాన్ని బలోపేతం చేసే దిశగా 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన మార్గదర్శకాలు ఉన్నాయి. సవరించిన నిబంధనల ప్రకారం పూర్తి ట్యూషన్ ఫీజు, విద్యాసంబంధ సామగ్రికి అవసరమైన మొత్తాన్ని డీబీటీ విధానంలో నేరుగా విద్యార్థి ఖాతాలో జమ చేయనున్నారు. మొదటి సంవత్సరం రూ.86 వేలు ఇస్తారు. ఆ తర్వాత పుస్తకాలు, లాప్‌టాప్ వంటి అవసరాలకు ఏటా రూ.41 వేలు విద్యార్థి ఖాతాకు బదిలీ చేస్తారు.

■ ఈ ఉపకార వేతనాలు పొందేందుకు దళిత విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షల్లోపు ఉండాలి. ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాలు వంటి గుర్తింపుపొందిన 200 సంస్థల్లో చేరినవారు, కేంద్ర-రాష్ట్రాల నుంచి మరే ఇతర ఉపకారవేతనాలు పొందని విద్యార్థులు అర్హులని నిబంధనల్లో పొందుపర్చారు. ■ మొదటి సంవత్సర విద్యార్థులు మాత్రమే కొత్త దరఖాస్తు చేసుకునే వీలుంది. పనితీరు ఆధారంగా మిగతా సంవత్సరాల్లో అది రెన్యువల్ అవుతుంది.

■ 2024-25 విద్యాసంవత్సరానికి మొత్తం 4,400 కొత్త సీట్లు ఉండగా.. ఇందులో ఎస్సీ బాలికల కోసం 30% కేటాయించారు. బాలికలు లేని సంస్థలు బాలురతో భర్తీ చేసుకునే వెసులుబాటుంది.

■ కేవైసీ చేయని విద్యా సంస్థలను ఉపకారవేతనాల పోర్టల్‌లో తొలగించనున్నారు.

■ ఒకే కుటుంబం నుంచి ఇద్దరికంటే ఎక్కువమంది విద్యార్థులకు ఈ పథకం వర్తించదు. ఒకసారి ఎంపికైన విద్యార్థి ఆ తర్వాత విద్యాసంస్థ మారితే పథకం అర్హత కోల్పోతారు.

హాంకాంగ్‌లో భారీ అగ్నిప్రమాదం

- బహుళ అంతస్తుల భవన సముదాయంలో చెలరేగిన మంటలు
- 36 మంది మృతి



బహుళ అంతస్తుల భవన సముదాయంలో మంటలు చెలరేగడంతో భారీగా వెలువడుతున్న పొగ

హాంకాంగ్: హాంకాంగ్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. థాయ్ పో జిల్లాలోని న్యూ టెరిటరీస్‌లో హౌసింగ్ కాంప్లెక్స్‌లోని బహుళ అంతస్తుల భవన సముదాయంలో బుధవారం మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 36 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 279 మంది ఆచూకీ తెలియడం లేదని హాంకాంగ్ ముఖ్య పరిపాలనాధికారి జాన్ లీ వెల్లడించారు. 29 మందిని ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపారు. 1980లో నిర్మించిన ఈ భవన సముదాయానికి మరమ్మతులు చేస్తున్నారు. ఈ పనుల కోసం వెదురు బొంగులు వినియోగించడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని.. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించిందని అధికారులు తెలిపారు. 32 అంతస్తులు ఉన్న 8 భవంతులు మంటల్లో కాలిపోతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ప్రమాదం విషయం తెలియగానే 140 ఫైరింజన్లు, 60 అంబులెన్సులను ఘటనాస్థలికి తరలించినట్లు అగ్నిమాపక అధికారులు వెల్లడించారు. దాదాపు 900 మందిని అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు పేర్కొన్నారు. ఆ భవన సముదాయంలో 2 వేల ఇళ్లు ఉండగా.. 4,800 మంది నివసిస్తున్నారని అధికారులు తెలిపారు.

రైళ్లలో 'హలాల్ మాంసం'పై ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసు

దిల్లీ: హలాల్ చేసిన మాంసాన్నే రైళ్లలో ప్రయాణికులకు అందిస్తుండటంపై వచ్చిన ఫిర్యాదు మీద 'జాతీయ మానవ హక్కుల కమిషన్' స్పందించి రైల్వేశాఖకు నోటీసు ఇచ్చింది. హలాల్ మాంసం వల్ల అనుచిత వివక్ష ఎదురవుతోందని, మానవ హక్కుల ఉల్లంఘనకు ఇది దారి తీస్తోందని భోపాల్‌కు చెందిన సునీల్ అహిర్‌వాల్ అనే ఫిర్యాదిదారు పేర్కొన్నారు. మాంసం వ్యాపారంలో ఎక్కువగా హిందూ దళితులే ఉంటారని, హలాల్ కారణంగా వారి జీవనోపాధి హక్కుకు భంగం వాటిల్లుతోందని ఆరోపించారు. రైల్వేబోర్డు ఛైర్మన్‌కు నోటీసులు జారీచేయాలని, ఫిర్యాదిదారు లేవనెత్తిన అంశాలపై విచారణ జరిపించి.. రెండువారాల్లో చర్యా నివేదిక సమర్పించేలా చూడాలని రిజిస్ట్రీని ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆదేశించింది. హలాల్ చేసిన మాంసాన్నే వినియోగించాలనే నిబంధనను విధించలేదని రైల్వేబోర్డు అధికారి స్పష్టంచేశారు.

వందేమాతర గేయంపై జాతీయస్థాయి పోటీలు

దిల్లీ: జాతీయ గేయం వందేమాతరానికి 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశ ప్రజలకు జాతీయస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని విద్యార్థులు, యువ కళాకారులకు మూడు రంగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. అవి.. 'సమృద్ధి కా మంత్ర, ఆత్మనిర్భర్ భారత్'పై చిత్రలేఖనం, 'స్వతంత్రత కా మంత్ర, వందేమాతరం'పై వ్యాసరచన, వందేమాతర గేయంపై పాట. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు, పౌరులు శాస్త్రీయ, జానపద రీతిలో వందేమాతరం గేయాన్ని పాడిన అనంతరం వీడియోను MyGov వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీడియో వ్యవధి రెండు నిమిషాలకు మించకూడదని పేర్కొంది. అత్యంత ఆకర్షణీయమైన ప్రదర్శనకు బహుమతులు అందజేస్తారు.



జనవరి కోసం ఎదురుచూడొద్దు

కొత్త ప్రయత్నాలను మొదలుపెట్టడానికి, మీ అలవాట్లను మార్చుకోవడానికి జనవరి వరకూ ఎదురుచూస్తున్నారంటే, మీరు నెల రోజులను వృథా చేస్తున్నట్లే. రోజువారీగా చేసే కృషితోనే మీ లక్ష్యాలను సాధిస్తారు తప్ప, ఓ సుముహూర్తాన మీకు మీరు వాగ్దానం చేసుకోవడం వల్ల కాదు.

– జానీ బ్రౌన్, బ్రాండింగ్ స్ట్రాటజిస్ట్

దిల్లీలో తీవ్ర కాలుష్యం...
వర్చువల్ విచారణలకు సుప్రీంకోర్టు యోచన

దిల్లీ: దిల్లీలో వాతావరణ కాలుష్యం అధికంగా ఉన్నందున వర్చువల్ విధానంలో విచారణలను చేపట్టే యోచనలో సుప్రీంకోర్టు ఉంది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)ను నిర్వహించాలన్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై బుధవారం విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ తాను అనారోగ్యానికి గురైన విషయాన్ని వెల్లడించారు. వర్చువల్ విధానంలో విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు విజ్ఞప్తి చేశారు. ఉదయపు నడకకు వెళ్లినప్పుడు తీవ్ర కాలుష్యం కారణంగా తాను కూడా అస్వస్థతకు గురయ్యానని సీజేఐ వెల్లడించారు. అరవై ఏళ్లకు పైబడిన న్యాయవాదులు వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. బార్ అసోసియేషన్ అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

కారుణ్య మరణంపై నిర్ణయానికి వైద్య మండలి ఏర్పాటు చేయండి

దశాబ్దానికిపైగా తీవ్ర అస్వస్థతకు గురై అచేతన స్థితిలో, స్పృహ లేకుండా ఉన్న 31ఏళ్ల యువకుడికి కారుణ్య మరణాన్ని ప్రసాదించేందుకు సంబంధించి వైద్య మండలిని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోయిడా జిల్లా ఆస్పత్రికి జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం బుధవారం సూచనలు చేసింది. ఆ యువకుడి తండ్రి చేసిన కారుణ్య మరణం అభ్యర్థనపై వైద్యపరమైన అన్ని అంశాలను పరిశీలించి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని తెలిపింది.

స్వాతంత్ర్యమంటే
హక్కులతోపాటు బాధ్యత: మోదీ



కరమ్‌సద్ (గుజరాత్): స్వాతంత్ర్యమంటే హక్కులు మాత్రమే కాదు.. బాధ్యత కూడా అనేది రాజ్యాంగ దినోత్సవం ప్రజలకు గుర్తుచేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఐక్యంగా ఉండాల్సిన అవసరాన్ని ఇది చెబుతుందన్నారు. దేశ మొట్టమొదటి హోంమంత్రి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ స్వస్థలం, గుజరాత్‌లోని ఆణంద్ జిల్లా కరమ్‌సద్‌లో బుధవారం మొదలైన ఐక్యతా పాదయాత్ర బుధవారం ప్రారంభమైన సందర్భంగా ప్రధాని ఈ సందేశమిచ్చారు. కలెక్టర్ ప్రవీణ్ చౌధరీ దానిని చదివి వినిపించారు. డిసెంబరు 15న పటేల్ 150వ జయంతినాడు ఈ పాదయాత్ర నర్మద జిల్లాలోని ఐక్యతా విగ్రహం వద్ద ముగుస్తుంది. "పాదయాత్రలు మన స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించాయి. పద ఘట్టనల శబ్దాలు సమాజాన్ని సంఘటితం చేశాయి. ప్రజల్లో ఆత్మవిశ్వాసానికి ఊపిరి లూదాయి. లక్షలమంది హృదయాల్లో ఐక్యతా భావనల్ని పాదుకొల్పాయి. కలిసి కదం తొక్కుతున్నప్పుడు విభేదాలు సమసిపోతాయని, ఆ మార్గమే సర్వోన్నతం అవుతుందని పటేల్‌కు తెలుసు. రాజ్యాంగ దినోత్సవం రోజే ఐక్యత ర్యాలీ మొదలు కావడం ఆనందకరం. డిజిటల్ భారత్, ఫిట్ ఇండియా, స్వచ్ఛభారత్, ఏక్ పేడ్ మా కే నామ్.. ఇలా అన్నింట్లోనూ దేశ పౌరులు ఐక్యతతో పాల్గొంటున్నారు. యువశక్తి, ప్రజల్లో ఐక్యత, నవకల్పనలతో 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే సంకల్పం నెరవేరుతుంది. అలాంటి ఐక్యతను పెంచడానికి ఈ యాత్ర దోహదపడుతుంది" అని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఈ ర్యాలీని ప్రారంభించారు. ప్రతిరోజూ 15 వేల మంది దీనిలో పాల్గొంటారు.

పారిపోయిన వ్యక్తులను
వెనక్కి రప్పించే హక్కు దేశానికి ఉంది

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: చట్టాలను ఉల్లంఘించి విదేశాలకు పారిపోయిన నేరగాళ్లను వెనక్కి రప్పించే హక్కు దేశానికి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేయడంతో పాటు తనను అప్పగించాలంటూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు భారత దేశం విజ్ఞప్తి చేయడాన్ని సవాల్ చేసిన విజయ్ మురళీధర్ అనే వ్యక్తి పిటిషన్‌ను తోసిపుచ్చుతూ జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. 'మీపై ఎన్నో కేసులు ఉన్నాయి. స్వదేశానికి తిరిగిరండి. దుబాయ్‌లో ఉన్న మీకు కేసుల వివరాలన్నీ పళ్లెంలో పెట్టి అందించలేరు. పాస్‌పోర్టు లేకుంటే ఆ వ్యవహారం అధికారులు చూసుకుంటారు' అని నిందితుడి తరఫు న్యాయవాదికి ధర్మాసనం స్పష్టం చేసింది. పోలీసులు మోపిన నేరాల వివరాల కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని సూచించింది. ఈ వ్యాజ్యంలో వాదనలు వినేందుకు ధర్మాసనం నిరాకరించడంతో న్యాయవాది పిటిషన్ ఉపసంహరించుకున్నారు. అక్రమ రవాణా తదితర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సంబంధించి గుజరాత్‌కు చెందిన విజయ్ మురళీధర్ ఉద్వానీపై 153 కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. అతను 2022లో దుబాయ్‌కు పారిపోయాడు. రెడ్ కార్నర్ నోటీసును ఉపసంహరించుకోవాలన్న విజయ్ అభ్యర్థనను గుజరాత్ హైకోర్టు తిరస్కరించడంతో సుప్రీంను ఆశ్రయించాడు.

రబ్రీదేవి బంగళా ఖాళీ చేయరు: ఆర్జేడీ

పట్నా: ఆర్జేడీ వ్యవస్థాపక అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్ భార్య, బిహార్ మాజీ సీఎం రబ్రీదేవి ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రభుత్వ బంగళాను ఖాళీ చేయబోరని ఆ పార్టీ బుధవారం స్పష్టం చేసింది. బిహార్ శాసన మండలిలో ప్రతిపక్షనేతగా రబ్రీదేవి పట్నాలోని సర్క్యులర్ రోడ్డులో పదో నంబరు బంగళాలో ఉంటున్నారు. అయితే ఆమెను హార్డింగ్ రోడ్డులోని 39వ నంబరు బంగళాకు మారాలని రాష్ట్ర ప్రభుత్వ భవన నిర్మాణ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఏది ఏమైనా రబ్రీ ప్రస్తుతం నివాసం ఉన్న బంగళాను ఖాళీ చేసే ప్రసక్తి లేదని ఆర్జేడీ రాష్ట్ర అధ్యక్షుడు మంగనీ లాల్ మండల్ స్పష్టం చేశారు. రబ్రీదేవి ఉంటున్న బంగళాను ఖాళీ చేయించాలన్న నిర్ణయం అధికార ఎన్డీయేకు లాలు కుటుంబం పట్ల ఉన్న దురుద్దేశాన్ని బహిర్గతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రులకు జీవితకాల వసతి కల్పించాలన్న గతకాల నిబంధన కింద రబ్రీదేవికి ఆ బంగళాను కేటాయించారని, కొన్నేళ్ల క్రితం అలహాబాద్ హైకోర్టు వెలువరించిన తీర్పు మేరకు ఆ నిబంధనను రద్దు చేయాల్సి వచ్చిందని రాష్ట్ర మంత్రి సంతోష్ కుమార్ సుమన్ వెల్లడించారు. రబ్రీదేవికి వసతి కల్పించబోమని తాము చెప్పడం లేదని, ఏ బంగళాలో ఎవరు ఉండాలో నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని మంత్రి చెప్పారు.

అంతర్జాతీయ ఎన్నికల సంఘం అధ్యక్షుడిగా
సీఈసీ జ్ఞానేశ్ కుమార్



దిల్లీ: భారత ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యం, ఎన్నికల సహాయ అంతర్జాతీయ సంస్థ(ఐడీఈఏ) అధ్యక్ష పదవిని చేపట్టనున్నారు. 2026 సంవత్సర కాలంలో జరిగే కౌన్సిల్ సమావేశాలకు ఆయన అధ్యక్షత వహిస్తారని ఎన్నికల సంఘం బుధవారం తెలిపింది. డిసెంబరు 3న స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో జరగనున్న ఐడీఈఏ సభ్యదేశాల సమావేశంలో ఆయన అధ్యక్ష పదవిని స్వీకరిస్తారని తెలిపింది. ఈ సంస్థలో 35 దేశాలకు సభ్యత్వం ఉంది. పరిశీలక హోదాలో అమెరికా, జపాన్‌లు ఉన్నాయి.

నియంత్రణ లేని ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలకు ఉగ్ర సంబంధాలు

- నిషేధాన్ని సమర్థించిన కేంద్రం
- సుప్రీంలో నేడు విచారణ

దిల్లీ: నియంత్రణ లేని ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు కొన్ని.. ఉగ్రవాద కార్యకలాపాలకు ఆర్థిక సాయం అందిస్తున్నాయని, వాటికి మనీ లాండరింగ్ కార్యకలాపాల్లో భాగస్వామ్యం ఉంటోందని సుప్రీం కోర్టుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. వాటిని నిషేధించడం సబబేనని స్పష్టం చేసింది. దీనిపై విచారణను గురువారం చేపడతామని జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'ఆన్‌లైన్ మనీ గేమింగ్ కార్యకలాపాలు నియంత్రణ లేకుండా విస్తరిస్తూ ఆర్థిక మోసాలకు, మనీలాండరింగ్‌కు, పన్ను ఎగవేతకు కారణమవుతున్నాయి, కొన్ని సందర్భాల్లో వాటి నుంచి ఉగ్రవాదానికి ఆర్థిక సాయం అందుతోంది' అని కేంద్రం బుధవారం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలు జాతీయ భద్రతకు, శాంతి భద్రతలకు, జాతీయ సమగ్రతకు ముప్పుగా మారాయని వివరించింది. విస్తృతమైన ప్రచారం, మార్కెటింగ్ ద్వారా ఆన్‌లైన్ గేమింగ్ యువతను ఆకట్టుకుంటోందని, సెలబ్రిటీల ప్రచారం వాటిని మరింత ఆకర్షణీయంగా మారుస్తోందని తెలిపింది. వ్యక్తులు, కుటుంబాలు, సమాజం, దేశం ఆన్‌లైన్ గేమింగ్‌వల్ల నష్టపోతున్నట్లు కేంద్రం కోర్టుకు తెలియజేసింది. సాధారణ ప్రజానీకం ఆన్‌లైన్ మనీ గేమింగ్ కారణంగా ఏటా రూ.20వేల కోట్లు నష్టపోతోందని, దాదాపు 45 కోట్ల మంది ఆ యాప్‌లవల్ల బాధితులయ్యారని పేర్కొంది. 2023 జనవరి నుంచి 2025 జులై వరకూ కర్ణాటకలో 32 మంది ఆన్‌లైన్ మనీ గేమ్‌ల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారని వివరించింది.

సమ్మె హక్కును హరిస్తున్న
కార్మిక కోడ్‌లు

- దేశ వ్యాప్తంగా శ్రామికుల నిరసనలు



దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న వివిధ సంఘాల సభ్యులు

దిల్లీ: ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా పది ప్రధాన కార్మిక సంఘాలతోపాటు పలు రైతు సంఘాల వేదిక సంయుక్త కిసాన్ మోర్చా, ఆలిండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ (ఏఐపీఈఎఫ్) సభ్యులు బుధవారం దేశవ్యాప్తంగా నిరసనల ప్రదర్శనలు నిర్వహించారు. కార్మిక చట్టాలను సంస్కరిస్తూ కేంద్రం నాలుగు కార్మిక కోడ్‌లను గత శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే. కొత్తగా ప్రకటించిన కోడ్‌లలో గిగ్ వర్కర్‌లకు సామాజిక భద్రత, ఉద్యోగులందరికీ తప్పనిసరిగా నియామక పత్రాలు, సమయానికి వేతన చెల్లింపులు వంటి నిబంధనలు ఉన్నా మొత్తం మీద కోడ్‌లు కార్మిక ప్రయోజనాలకు భంగకరంగా ఉన్నాయని యూనియన్‌లు ఆరోపిస్తున్నాయి.

"ఈ కోడ్‌లు మా సమ్మె హక్కును హరిస్తున్నాయి. కార్మిక సంఘాల రిజిస్ట్రేషన్‌ను కష్టసాధ్యం చేస్తున్నాయి, వాటి గుర్తింపును తేలికగా రద్దు చేసేందుకు వీలు కల్పిస్తున్నాయి, కార్మికులకు యాజమాన్యాలకు మధ్య రాజీని కఠినతరం చేస్తున్నాయి" అని కార్మిక సంఘాల సంయుక్త వేదిక రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సమర్పించిన విజ్ఞాపన పత్రంలో పేర్కొంది. కోడ్‌లకు వ్యతిరేకంగా దేశంలోని 500 జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ వెల్లడించారు. అన్ని రంగాలకూ, పరిశ్రమలకూ చెందిన కార్మికులు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారని ఆమె తెలిపారు. లేబర్ కోడ్, విద్యుత్ సవరణ బిల్లులకు వ్యతిరేకంగా లక్షల మంది విద్యుత్ రంగ కార్మికులు నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నారని ఆలిండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ శైలేంద్ర దూబే తెలిపారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లును ఆయన తప్పు పట్టారు.

ఉద్యోగులు, యజమానులకూ ప్రయోజనకరం : నీతి ఆయోగ్

కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు చట్టాల్లో గణనీయమైన మార్పులను తీసుకురానున్నాయని నీతి ఆయోగ్ సభ్యుడు రాజీవ్ గాబా తెలిపారు. నూతన కార్మిక చట్టాల వల్ల ఇకపై కాంట్రాక్ట్ ఉద్యోగులు కూడా శాశ్వత ఉద్యోగులతో పాటు సమాన ప్రయోజనాలను పొందనున్నారని చెప్పారు. ఈ కొత్త కార్మిక కోడ్‌ల వల్ల కార్మికులు, యజమానులిద్దరికీ ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. మోదీ ప్రభుత్వ హయాంలో జరిగిన సంస్కరణల్లో ఇది అత్యంత కీలకమైనదిగా రాజీవ్ అభివర్ణించారు.

రాజ్యాంగంపై మోదీ నిబద్ధత అనుమానాస్పదమే

- కాంగ్రెస్ విమర్శ

దిల్లీ: దేశ ప్రజలు తమకు రాజ్యాంగం నిర్దేశించిన విధుల్ని నిర్వర్తించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొనడాన్ని కాంగ్రెస్ బుధవారం తప్పు పట్టింది. రాజ్యాంగం పట్ల, అది నిర్దేశించిన ఆదర్శాల పట్ల, స్థాపించిన వ్యవస్థల పట్ల మోదీ నిబద్ధత అనుమానాస్పదమేనని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. దేశ పౌరులు రాజ్యాంగం పట్ల తమ విధుల్ని నిర్వర్తించాలని, బలమైన ప్రజాస్వామ్యానికి అదే పునాది అని ప్రధాని మోదీ చెప్పిన నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీ ఈ వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగంలోని 4ఏ భాగంలోని 51ఏ అధికరణంలో అది నిర్దేశించిన 11 విధులు ఉన్నాయి, దేశ పౌరునిగా, నాయకునిగా ప్రధానమంత్రి తన సొంత మౌలిక విధుల్ని నిర్వర్తిస్తున్నారా అని జైరాం రమేశ్ ప్రశ్నించారు.

మన్మోహన్ పుణ్యమే: జైరాం



యురేనియం సరఫరాకు సంబంధించి భారత్-కెనడాల మధ్య కుదరనున్న ఒప్పందం 2008లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ సారథ్యంలో భారత్-అమెరికాల మధ్య కుదిరిన ఒడంబడిక ఫలితమేనని, అప్పట్లో భాజపా దాన్ని వ్యతిరేకించిందని జైరామ్ రమేశ్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

అలా అయితే పనులు జరగవు: థరూర్



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ప్రశంసిస్తూ వ్యాఖ్యలు చేసిన సీనియర్ నేత శశి థరూర్ తన సొంత పార్టీ సహచరుల విమర్శల్ని తిప్పికొట్టారు. వారికి చురకలు అంటిస్తూ ప్రతిఒక్కరూ ఎప్పుడూ ఒకే సిద్ధాంతాలను పాటిస్తూ కేంద్రానికి సహకరించకపోతే.. కొన్ని పనులు జరగవని అన్నారు. సైద్ధాంతిక స్వచ్ఛత దేశాన్ని ముందుకు తీసుకువెళ్లదని.. సహకారమే పురోగతికి సాధనమని అన్నారు.

ముగియనున్న గాజా కాల్పుల విరమణ తొలి దశ

ఖాన్ యూనిస్: గాజా కాల్పుల విరమణ ఒప్పందం తొలి దశ దాదాపు ముగియనుంది. మరో ఇద్దరు బందీల మృతదేహాలను హమాస్ అప్పగిస్తే, ఒప్పందంలోని రెండో దశ ప్రారంభమవుతుంది. మంగళవారం ఓ బందీ భౌతికకాయాన్ని ఇజ్రాయెల్‌కు హమాస్ అప్పగించింది. ప్రతిగా ఇజ్రాయెల్ 15 పాలస్తీనియన్ల మృతదేహాలను గాజాకు బుధవారం పంపింది. తర్వాత దశల కోసం చర్చించడానికి తుర్కియే, ఈజిప్టు అధికారులు బుధవారం కైరోలో సమావేశమయ్యారు.

బంగ్లాదేశ్ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకుంటాం
హసీనా అప్పగింతపై భారత్

దిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలన్న బంగ్లాదేశ్ అభ్యర్థనను భారత్ పరిశీలిస్తోందని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. అయితే ఈ విషయంలో తాము ఆ దేశ ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు చేశారని భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 ఏళ్ల హసీనాకు ఇటీవల బంగ్లాదేశ్ అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హసీనాను అప్పగించాలని బంగ్లా పదే పదే భారత్‌ను అభ్యర్థిస్తోంది. బాబ్రీ మసీదు స్థలంలో నిర్మించిన అయోధ్య రామాలయంలో జరిగిన ధ్వజారోహణ క్రతువులో ప్రధాని మోదీ పాల్గొనడాన్ని తప్పుపడుతూ పాక్ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. మైనారిటీలను తీవ్రంగా అణచివేసి, మత విద్వేషాలను రెచ్చగొట్టే దేశానికి.. ఇతరులకు నైతిక హక్కులు బోధించే హక్కు లేదని పేర్కొంది.

యునెస్కో ప్రధాన కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహం



దిల్లీ: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో యునెస్కో డైరెక్టర్ జనరల్ ఖాలెద్ ఎల్ ఎనానీ, 50 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం రోజున ఈ విగ్రహాన్ని ఆవిష్కరించడం గర్వకారణమని ప్రధాని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.






మాక్ అసెంబ్లీలో పాల్గొని వివిధ అంశాలపై శాసనసభ్యుల్లా మాట్లాడుతున్న విద్యార్థులు



సభాపతిగా వ్యవహరించిన స్వాతి




మాక్ అసెంబ్లీలో చర్చలో పాల్గొన్న విద్యార్థులు

పిల్లల సభ భేష్!

అమరావతిలో ఆసక్తికరంగా విద్యార్థుల మాక్ అసెంబ్లీ

ఈనాడు, అమరావతి: అధికార, విపక్ష సభ్యులంతా అసెంబ్లీకి హాజరైతే ఎంత అర్థవంతమైన చర్చలు సాగుతాయో మాక్ అసెంబ్లీ ద్వారా విద్యార్థులు వివరించిన తీరు ఆకట్టుకుంది. సభా గౌరవాన్ని కాపాడుతూ.. ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తే ప్రజలకు ఎలాంటి మేలు జరుగుతుందో తెలియజెప్పారు. ప్రజాప్రతినిధులకు తాము ఏమాత్రం తీసిపోమంటూ మాక్ అసెంబ్లీని ఔరా అనిపించేలా నిర్వహించారు. ప్రశ్నోత్తరాల్లో అనుబంధ ప్రశ్నల అవకాశాన్ని సభ్యులు ఎలా వినియోగించుకోవచ్చు.. శూన్యగంటలో ప్రజా సమస్యలను ఎలా వెలుగులోకి తీసుకురావచ్చో స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఏర్పాటుచేసిన ఈ మాక్ అసెంబ్లీకి 175 నియోజకవర్గాల నుంచి 175 మంది విద్యార్థులను ఎంపికచేశారు. వీరిలో 26 మంది మంత్రులు, సభాపతి, ప్రొటెం స్పీకర్‌గా వ్యవహరించారు. మంత్రులుగా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంలో విద్యార్థులు అదరగొట్టారు. సభాపతిగా కాకినాడ జిల్లాకు చెందిన స్వాతి సభను బాగా నడిపించారు. సీఎంగా మన్యం జిల్లాకు చెందిన ఎం.లీలాగౌతమ్, ప్రతిపక్ష నేతగా అదే జిల్లాకు చెందిన ఎల్.సౌమ్య, డిప్యూటీ సీఎంగా విశాఖపట్నం జిల్లాకు చెందిన కోడి యోగి వ్యవహరించారు. మాక్ అసెంబ్లీ నిర్వహించిన తీరును సీఎం చంద్రబాబు ప్రశంసించారు. విద్యార్థులైతే.. తామే సీఎం, ప్రతిపక్షనేత, మంత్రులు, ఎమ్మెల్యేలు అనేలా ఆ పాత్రల్లోకి ప్రవేశించి.. సభను ఆద్యంతం ఆకట్టుకునేలా నిర్వహించారు. తడబాటు లేకుండా సభను కొనసాగించారు. అమరావతి అసెంబ్లీ ఆవరణలో ప్రత్యేకంగా వేసిన సెట్‌లో విద్యార్థుల మాక్ అసెంబ్లీ అసలు శాసనసభకు ఏ మాత్రం తీసిపోనట్లు సాగింది. విద్యార్థులు ఒకరితో ఒకరు పోటీపడి తమ పాత్రలను నిర్వర్తించారు. ప్రతిపక్ష సభ్యులు సభాపతి పోడియం వద్దకు వెళ్లి గొడవ చేయడం.. గొడవ చేసే సభ్యులను మార్షల్స్ బయటకు తీసుకువెళ్లడం లాంటి దృశ్యాలు నవ్వులు పూయించాయి. ప్రతిపక్షంపై విద్యాశాఖ మంత్రిగా వ్యవహరించిన మేఘన విమర్శలతో ప్రశ్నోత్తరాల సమయం ఆసక్తికరంగా సాగింది.



రాజ్యాంగ విలువలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో సీఎస్ విజయానంద్, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి లోకేశ్

సభాపతి కుర్చీకి కుడి ఎడమలు ఉండవు

మాక్ అసెంబ్లీలో ముందుగా సభాపతి ఎన్నిక జరిగింది. సభలోకి ప్రొటెం స్పీకర్ రాగానే సభ్యులందరూ లేచి నిలబడ్డారు. సభాపతిగా స్వాతి పేరును ఎమ్మెల్యేగా వ్యవహరించిన లోకేశ్వర్‌రెడ్డి ప్రతిపాదించారు. మరో సభ్యుడు అనిల్‌కుమార్ బలపరిచారు. వేరే ప్రతిపాదనలు లేనందున స్వాతి సభాపతిగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటించారు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేతల తర్వాత సభాపతి మాట్లాడుతూ.. "ఈ కుర్చీకి కుడి ఎడమలు ఉండవు. రాజ్యాంగం, సభా నియమాలే ఉంటాయి. ప్రతిపక్షానికి తగిన సమయం ఇస్తాను. సభా గౌరవం కాపాడడం మనందరి బాధ్యత" అని తెలిపారు.

తుపాను సమయంలో ఉపాధిహామీ వేతనం

ప్రశ్నోత్తరాలు, శూన్యగంట, రెండు బిల్లులు ప్రవేశపెట్టారు. వివిధ శాఖలపై 10ప్రశ్నలు అడిగారు. వాటికి మంత్రులు సమాధానం ఇచ్చారు. శూన్యగంటలో తుపాను సన్నాహక అంశంపై మాట్లాడేందుకు సభాపతి మూడు నిమిషాల సమయం ఇచ్చారు. తుపాను సమయంలో వేటకు వెళ్లని మత్స్యకారులకు ఉపాధి హామీ పథకం కింద వేతనం చెల్లిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి సమాధానం చెప్పడం ఆకట్టుకుంది.

ఒలింపిక్స్‌లో గోళీలాట చేర్చండి..

ప్రశ్నోత్తరాల్లో ఒలింపిక్స్‌పై ఆసక్తికర చర్చ సాగింది. ప్రతిపక్ష సభ్యుడు మాట్లాడుతూ.. "ఒలింపిక్స్ కమిటీకి ఒక లేఖ రాయండి. మన స్థానిక క్రీడలైన కోతి కొమ్మచ్చి, గిల్లీదండని చేర్చాలని అడగండి. కనీసం వాటిలోనైనా మనకు బంగారుపతకం వస్తుంది" అని సూచించగా.. దీనికి క్రీడల మంత్రి సమాధానం ఇచ్చారు. "నేను ఇంకొకటి కలుపుతున్నాను. ఒలింపిక్స్‌లో మ్యూజికల్ ఛైర్స్, గోడ దూకడం పెడితే మన నాయకుల దెబ్బకు వేరే దేశం వాళ్లకి రజతం కూడా దక్కదు" అని వ్యాఖ్యానించారు.

సభలోకి మార్షల్స్

పర్యావరణ రికార్డుల బరువు పిల్లల నెత్తిన మోపుతున్నారంటూ పర్యావరణ బిల్లుపై ప్రతిపక్షం అభ్యంతరం లేవనెత్తింది. వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన తెలిపింది. ప్రతిగా అధికారపక్ష సభ్యులూ పోడియం వద్దకు వచ్చారు. దీంతో మార్షల్స్ రంగంలోకి దిగి ఆందోళనకు దిగిన సభ్యుల్లో ఒకరిని బయటకు తరలించారు. రెండు బిల్లులకు సభ ఆమోదం తెలిపాక సభాపతి సభను నిరవధికంగా వాయిదా వేశారు.

విద్యార్థులతో గ్రూప్ ఫొటో

మాక్ అసెంబ్లీ ముగిశాక 'భారత రాజ్యాంగం పిల్లల కోసం' పుస్తకాన్ని సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులందరితో కలిసి సీఎం, సభాపతి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు గ్రూప్ ఫొటోలు దిగారు. విద్యార్థులకు శాసనసభ, మండలి హాల్‌ను మంత్రి లోకేశ్ చూపించారు. వారితో కలిసి భోజనం చేశారు.

శ్రమ, ధైర్యం.. మీ విజన్‌కు ఇంధనం



ఈనాడు, అమరావతి: విజన్ ఉంటే చాలదు.. దాన్ని ఆచరణలో పెట్టడానికి నిరంతరం శ్రమించాలని, సంక్షోభాల్ని ధైర్యంగా ఎదుర్కోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సంక్షోభాల్ని అవకాశాలుగా మలుచుకుని ముందుకెళితేనే ఏదైనా సాధ్యమవుతుందని దిశానిర్దేశం చేశారు. చాయ్‌వాలా ప్రధాని అవడమే కాకుండా దేశం దశదిశ మారుస్తున్నారంటే అది రాజ్యాంగం గొప్పతనమేనన్నారు. ఓ గిరిజన మహిళ రాష్ట్రపతిగా ఉన్నా, సాధారణ కుటుంబంలో పుట్టిన తాను నాలుగోసారి సీఎం అయినా అదంతా రాజ్యాంగం కల్పించిన అవకాశమేనని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో 'ఆంధ్రప్రదేశ్ పాఠశాల శాసనసభ' పేరుతో బుధవారం విద్యార్థులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో చంద్రబాబు పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పించిన అనంతరం ప్రసంగించారు. విద్యార్థులు తడుముకోకుండా చక్కగా మాట్లాడారని, అదరగొట్టారని ప్రశంసించారు. 'అప్పుడప్పుడూ అసెంబ్లీలో మా ఎమ్మెల్యేలు తడబడతారు. మీరు మాత్రం తడబడలేదు' అని విద్యార్థులను కొనియాడారు.

అమెరికా అధ్యక్షురాలిగా ఒక్క మహిళ కూడా ఎన్నిక కాలేదు

అమెరికాలో ఇప్పటి వరకూ ఒక్క మహిళ కూడా అధ్యక్షురాలు కాలేదని, కానీ మనదేశంలో మహిళలు ప్రధాని, రాష్ట్రపతులు అయ్యారని చంద్రబాబు గుర్తుచేశారు. 'అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దారు. దేశ పౌరులకు ఓటు అనే వజ్రాయుధాన్ని ఇచ్చారు. దీంతో ప్రభుత్వాల్ని మార్చొచ్చు. సమాజహితం కోసం చట్టసభలకు రావాలి కానీ వ్యక్తిగత కక్షల కోసం కాదు. ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలి. ఆకతాయిలు అవహేళన చేస్తే ఎదుర్కోవాలి. మగపిల్లలు కూడా వారిని కించపరిచేలా మాట్లాడటం మానుకోవాలి' అని సూచించారు.

బ్రిలియంట్ స్టూడెంట్‌ను కాను.. కానీ పద్ధతి ప్రకారం చేస్తా

'ఏ దేశానికైనా పబ్లిక్ పాలసీలు అవసరం. నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ విప్లవానికి నాంది పలికాను. దీంతో ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో తెలుగువాళ్లు అత్యధిక వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారు. నేను బ్రిలియంట్ స్టూడెంట్‌ను కాను. కానీ ఏ పనిచేసినా పద్ధతి ప్రకారం చేస్తాను. విశ్వవిద్యాలయంలో చదువుకునేటప్పుడు మా వైస్‌ఛాన్సలర్ పిలిచి లెక్చరర్ అవ్వమంటే రాజకీయాల్లోకి వెళ్లి ఎమ్మెల్యే అవుతానన్నాను. 28 ఏళ్లకే ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టాను. 30 ఏళ్లకు మంత్రిని, 45 ఏళ్లకు ముఖ్యమంత్రిని అయ్యాను. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఏడుసార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎంపీ అయ్యారు. మాకంటే చిన్న వయసులోనే మీరు మాక్ అసెంబ్లీకి వచ్చి సమర్థంగా నిర్వహించారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

రాజకీయాల్లోకి రండి.. సమాజాన్ని మార్చండి

- ఏ వృత్తిలోకి వెళ్లినా నైతికతను వీడొద్దు
- విద్యార్థులకు మంత్రి లోకేశ్ సూచన



ఈనాడు, అమరావతి: 'దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉంది. మీరంతా భవిష్యత్తులో ప్రయోజకులుగా మారాలి. ప్రధాని మోదీ నిర్దేశించిన వికసిత్ భారత్- 2047 లక్ష్యానికి అనుగుణంగా భారతదేశాన్ని అభివృద్ధి చేయాలి. ఇది కేవలం అధికారులు, ప్రజాప్రతినిధులతో సాధ్యం కాదు. మీరంతా ఈ యజ్ఞంలో భాగస్వాములు కావాలి' అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. మాక్ అసెంబ్లీ ప్రాంగణంలో రాజ్యాంగ దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. 'భవిష్యత్తులో ఏ వృత్తిలోకి వెళ్లినా నైతికతను వీడొద్దు. రాజకీయాల్లోకి రండి.. పాజిటివ్ లీడర్‌షిప్ తేవడానికి కృషి చేయండి. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతదేశం, ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణంగా నిలబడాలి' అని లోకేశ్ చెప్పారు.

ప్రజాస్వామ్యంలో ప్రతి స్వరం ముఖ్యమే

'ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తి స్వరం చాలా ముఖ్యం. శాసనసభకు వచ్చినప్పుడు చాలా ఎమోషన్స్ ఉంటాయి. ఒక దశలో యుద్ధం చేయాలనిపిస్తుంది. వాటిని క్రమశిక్షణతో అదుపు చేసుకున్నప్పుడే ప్రజాస్వామ్యం సాధ్యమవుతుంది. యువగళం పాదయాత్రలో రాజ్యాంగం పుస్తకం పట్టుకుని తిరిగాను. పాదయాత్రలో నన్ను అడ్డుకున్న పోలీసులకు ఆర్టికల్ 19లోని రైట్ టు ఫ్రీడమ్ గురించి చెప్పాను. వారు అదంతా మాకు తెలియదు.. ఎస్పీతో మాట్లాడమనేవారు. పిల్లలకు చిన్న వయసులోనే రాజ్యాంగ హక్కులు, బాధ్యతల గురించి తెలియజేయాలని ఆ రోజే నిర్ణయించుకున్నాను. ఏడాది క్రితం రాజ్యాంగ దినోత్సవ సదస్సులో.. పిల్లల కోసం బాలల భారత రాజ్యాంగాన్ని తెస్తాం, దేశంలోని పిల్లలకు అందించే బాధ్యత తీసుకుంటానని ముఖ్యమంత్రికి మాటిచ్చాను. మీ అందరి సమక్షంలో ఆ పుస్తకాన్ని ఆవిష్కరించాం. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో 7 లక్షల మందితో పోటీపడి మీరంతా ఇక్కడికి రావడం గొప్ప విషయం. పోటీపడి రాలేకపోయిన వారికి ఇతర వేదికల్లో అవకాశాలు కల్పిస్తాం. విద్యార్థులు స్పష్టంగా, భయం లేకుండా మాట్లాడాలి. చర్చ వాస్తవాల ఆధారంగా ఉండాలి. ఎదుటివారి అభిప్రాయం నచ్చకపోతే వారిని కించపరచకుండా గౌరవంగానే విభేదించాలి' అని లోకేశ్ చెప్పారు.


స్త్రీ, పురుషులు సమానమని నిరూపించాలి

'వికసిత్ భారత్ సాధించాలంటే సమాజంలో స్త్రీ, పురుషులు సమానమని ఆచరణలో చూపించాలి. గాజులు తొడుక్కున్నావా.. చీర కట్టుకున్నావా.. అమ్మాయిలా ఏడవద్దు అంటూ మహిళలను కించపరిచే పదాలు ఇంట్లో కూడా ఎవరూ వాడొద్దు. నేను ఈ స్థాయిలో ఉన్నానంటే నా తల్లి భువనేశ్వరి కారణం. క్రమశిక్షణ, పట్టుదల నేర్పారు. చిన్న తప్పు చేసినా నన్ను మా అమ్మ మందలిస్తారు' అని లోకేశ్ అన్నారు.

రాజకీయాలంటే భయపడే రోజులొచ్చాయి: అయ్యన్నపాత్రుడు



ఈనాడు, అమరావతి: 'రాజకీయాలంటే భయపడే రోజులొచ్చాయి. రాజకీయాలు ఎందుకు అని ఆలోచించే స్థాయికి ప్రజలు వచ్చారు. నేటి రాజకీయాల్లో కుతంత్రాలు.. రాష్ట్రం పోయినా ఫర్వాలేదు. మా ప్రిస్టేజీలు వేరు అనే ధోరణి వచ్చేసింది. దేశం, రాష్ట్రం, గ్రామం నాది అన్న ఫీలింగ్ రావాలి.. ఇది సాకారం కావాలంటే భావిపౌరులు రాజకీయాల్లోకి రావాలి. స్వచ్ఛమైన మనసుతో రాజకీయాలు చేస్తే, రాష్ట్రం, దేశం ఎందుకు బాగుపడవు' అని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మాక్ అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. మాక్ అసెంబ్లీలో పిల్లలు తమకంటే బ్రహ్మాండంగా సభను నడిపారని స్పీకర్ అభినందించారు. వీరు డిగ్రీలు పాసై రాజకీయాల్లోకి వస్తే ఇంకెంత బాగా మాట్లాడతారో.. అంటూ అభినందించారు. రాజ్యాంగం కోసం, దేశం కోసం ఎంతోమంది త్యాగం చేశారు. ప్రాణాలు అర్పించారు. వారి త్యాగాలు మరిచిపోకుండా.. విలువలతో రాజకీయాలు చేయాలని కోరారు. పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించాలని కోరారు.



మాక్ అసెంబ్లీకి వచ్చిన విద్యార్థుల కల ఐఏఎస్, ఐపీఎస్

ఈనాడు, అమరావతి: మాక్ అసెంబ్లీలో విద్యార్థులు రాజకీయ నేతలుగా వ్యవహరించినా చాలా మంది రాజకీయాల్లోకి వచ్చేందుకు ఆసక్తి లేదని పేర్కొన్నారు. 175 నియోజకవర్గాల నుంచి వచ్చిన వారిలో 80 శాతానికి పైగా విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్‌లు కావాలని కలలు కంటున్నట్లు పేర్కొన్నారు. మాక్ అసెంబ్లీ ముగిసిన తర్వాత నారా లోకేశ్ మాట్లాడుతూ.. ఏం కావాలనుకుంటున్నారని ప్రశ్నించారు. రాజకీయ నాయకులు కావాలనుకుంటున్నారా? అని అడిగితే 10 మంది లోపే చేతులు ఎత్తారు. ఐఏఎస్, ఐపీఎస్ కావాలనుకుంటున్న వారు చేతులు ఎత్తాలని సూచించగా.. దాదాపు 80%పైగా విద్యార్థులు చేతులు ఎత్తారు.

తొలిరోజు జోగి సోదరుల విచారణ 30 నిమిషాలే



నకిలీ మద్యం కేసులో నిందితులు జోగి రమేష్, రామును విజయవాడ ఎక్సైజ్ కార్యాలయంలోకి తీసుకెళ్తున్న పోలీసులు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో వైకాపా నేత జోగి రమేష్ (ఏ18), అతని సోదరుడు రాము (ఏ19)ల తొలి రోజు విచారణ 30 నిముషాలే సాగింది. అది కూడా వ్యక్తిగత వివరాల ప్రశ్నలకే సమయం సరిపోయింది. నాలుగు రోజుల కస్టడీలో భాగంగా నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న ఇద్దరినీ బుధవారం ఉదయం సిట్, ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారాగారంలోనే వైద్య పరీక్షలు చేయించి అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడకు తీసుకొచ్చారు. సాయంత్రం 3.40 గంటలకు నగరంలోని తూర్పు ఎక్సైజ్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం తెచ్చారు. అక్కడ భోజనం చేసిన అనంతరం న్యాయవాది సమక్షంలో విచారణ ప్రారంభించారు. అర్ధగంట విచారణ తర్వాత సమయం ముగుస్తుండడంతో నిందితులను ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించి, విజయవాడలోని జిల్లా జైలులో అప్పగించారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకల్లా విచారణ ముగించాలని, అనంతరం విజయవాడ జైలులో అప్పగించాలని ఉత్తర్వుల్లో కోర్టు స్పష్టం చేసింది. అందువల్ల సమయం లేకపోవడంతో జోగి సోదరులు ఇద్దరినీ ఎక్సైజ్ స్టేషన్‌లో వేర్వేరు గదుల్లో కూర్చోబెట్టి వ్యక్తిగత వివరాలు మాత్రమే అడిగారు. గురువారం నుంచి పూర్తి స్థాయిలో మూడు రోజుల పాటు విచారణ సాగనుంది.

మద్యం కుంభకోణం నిందితులకు తాత్కాలిక ఊరట

- లొంగుబాటు నుంచి సుప్రీంకోర్టు మినహాయింపు

ఈనాడు, దిల్లీ: మద్యం కుంభకోణంలో నిందితులుగా ఉన్న బాలాజీ గోవిందప్ప, పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి, కె.ధనుంజయరెడ్డిలకు సుప్రీంకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ట్రయల్‌కోర్టు ఇచ్చిన డిఫాల్ట్ బెయిల్‌ను ఏపీ హైకోర్టు ఇటీవల రద్దు చేసింది. ముగ్గురూ ఈ నెల 26లోపు లొంగిపోయి, తర్వాత రెగ్యులర్ బెయిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని జారీచేసిన ఆదేశాల నుంచి వారికి సుప్రీంకోర్టు ఉపశమనం కల్పించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. తదుపరి ఉత్తర్వులు జారీచేసేవరకూ వారికి లొంగుబాటు నుంచి మధ్యంతర రక్షణ కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది సిద్ధార్థలూథ్రా వాదనలు వినిపిస్తూ ప్రాథమికంగా ట్రయల్‌కోర్టు తమ ఛార్జిషీట్‌ను పక్కన పెట్టిందని, అయితే ఇప్పుడు హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఆ ఛార్జిషీట్‌ను మళ్లీ పరిగణనలోకి తీసుకున్నందున కోర్టులో విచారణ వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ కేసులో ఎంతమంది సాక్షులున్నారని సీజేఐ ప్రశ్నించగా 400 మంది ఉన్నట్లు చెప్పారు. సీజేఐ స్పందిస్తూ ఈరోజు ప్రాసిక్యూషన్ అంతమంది సాక్షులను చూపినా వారిని విచారించడం మొదలుపెట్టిన తర్వాత జాబితాను సవరించొచ్చని, అంతిమంగా అది సగానికి తగ్గిపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు మీరు 100 మంది సాక్షులను విచారిస్తున్నట్లు భావించినా, మొత్తం విచారణ కొనసాగడానికి ఎంత సమయం పడుతుందో చెప్పాలని ప్రశ్నించారు. లూథ్రా స్పందిస్తూ ఇదివరకు ట్రయల్‌కోర్టు తమ ఛార్జిషీట్‌ను పక్కనపెట్టిందని, ఇప్పుడు మళ్లీ అది పట్టాల మీదకు వచ్చిందని చెప్పారు. అందువల్ల విచారణను వేగంగా పూర్తిచేస్తామన్నారు. సీజేఐ స్పందిస్తూ "వారిని కస్టడీలో ఉంచడం ద్వారా ఏ ప్రయోజనం సాధిస్తారు? నిందితుల్లో ఒకరు సీనియర్ ఆఫీసర్. ఒకవేళ వాళ్లు సాక్షులను ప్రభావితం చేస్తారనుకుంటే మేం కొన్ని షరతులు విధిస్తాం" అని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసి పిటిషనర్ల వాదనలపై పది రోజుల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించించారు. ఈ మధ్యలో పిటిషనర్లకు లొంగుబాటు నుంచి మినహాయింపు ఇస్తున్నామని పేర్కొన్నారు. ట్రయల్‌కోర్టు విధించే షరతులన్నీ యథాతథంగా వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఈ కేసులో హైకోర్టు సరిగానే తీర్పు ఇచ్చిందని, దాన్ని తాము తప్పు పట్టడం లేదని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

అమరావతిలో మరో క్వాంటమ్ కంప్యూటర్ భవనం

- కంపెనీల నుంచి భారీగా ప్రతిపాదనలు
- అత్యున్నత ప్రమాణాలతో నిర్మించేందుకు అధికారుల యోచన

ఈనాడు - అమరావతి: అమరావతి క్వాంటమ్ వ్యాలీలో అమరావతి క్వాంటమ్ కంప్యుటేషన్ సెంటర్ (ఏక్యూసీసీ) భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే టెండరు పిలవగా.. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అదనంగా మరో భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం నిర్మించనున్న ఏక్యూసీసీ భవనంలో మూడు క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటుకు అవకాశం ఉంది. ఐబీఎం సంస్థ 133 క్యూబిట్‌ల సామర్థ్యం ఉన్న క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇందులో ఏర్పాటు చేయనుంది. మైక్రోసాఫ్ట్‌తో పాటు మరో ప్రముఖ సంస్థ స్థానికంగా పెట్టుబడి పెట్టే భాగస్వామ్య సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. ఆ రెండు సంస్థలూ ఏక్యూసీసీలో క్వాంటమ్ కంప్యూటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రాథమికంగా అనుమతించింది. అంటే నిర్మించనున్న భవనం ఆ మూడు కంప్యూటర్లకు సరిపోతోంది. వాటితోపాటు మరికొన్ని కంపెనీలు క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటుకు చోటు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈ దృష్ట్యా మరో భవనాన్ని నిర్మించాలని అధికారులు ప్రతిపాదించారు.

క్లాస్-4 డేటా సెంటర్లు

అమరావతి క్వాంటమ్ వ్యాలీలో నిర్మించే భవనాలు క్లాస్-4 డేటా సెంటర్ కేటగిరీవిగా అధికారులు చెబుతున్నారు. ఇందులో ఏర్పాటు చేసే క్వాంటమ్ కంప్యూటర్ 99.995 శాతం అప్‌టైమ్ లక్ష్యంతో పనిచేస్తుంది.

- ఐటీ కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా నిర్వహణ, మరమ్మతులు నిర్వహించే వీలుంటుంది.
- అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు ఉంటాయి. ఒకవేళ సరఫరాలో అంతరాయం తలెత్తితే అందులోని కూలింగ్ సిస్టమ్‌లు పనిచేసేందుకు వీలుగా అతి పెద్ద యూపీఎస్, బ్యాకప్ జనరేటర్లు వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉంటాయి.
- ఈ భవనంలో ఫ్రెజర్, ఉష్ణోగ్రతలను నిర్దిష్ట విధానంలో నిర్వహించాలి. కంప్యూటర్లు ఏర్పాటు చేసిన భవనంలో కనీసం పాదాలతో గట్టిగా చప్పుడు కూడా చేయకూడదు.
- ఈ తరహా డేటా సెంటర్ నిర్మించాలంటే చదరపు అడుగుకు సుమారు రూ.25 వేలు ఖర్చు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అమెరికా వంటి దేశాల్లో రూ.80 వేలు ఖర్చవుతుంది. ఈ ప్రమాణాలతో భవనాన్ని నిర్మించాలంటే కనీసం 6 నెలలు పడుతుంది. ఏవైనా సంస్థలు క్వాంటమ్ కంప్యూటర్లు ఏర్పాటు చేయడానికి ఆసక్తి వ్యక్తం చేస్తే ప్రస్తుతం స్పేస్ ఇచ్చే అవకాశం లేదు. అందువల్ల ముందస్తుగా మరో భవన నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

మనం ఇచ్చేది స్పేస్ మాత్రమే

క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు అవసరమైన స్పేస్ మాత్రమే ప్రభుత్వం కల్పిస్తుంది. కంప్యూటర్ తయారీ కోసం నిధులు కంపెనీలే సొంతంగా సమకూర్చుకోవాలి. వాటికి వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలి.

మొదటి భవనానికి డిసెంబరులో శంకుస్థాపన

క్వాంటమ్ వ్యాలీలో రూ.99.62 కోట్లతో ఏక్యూసీసీ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే టెండర్లు పిలిచింది. 45,000 చదరపు అడుగుల్లో.. కఠినమైన పర్యావరణ, వైబ్రేషన్ ఐసోలేషన్, ఎలక్ట్రో మాగ్నెటిక్ ప్రమాణాలకు అనుగుణంగా దీన్ని నిర్మిస్తున్నారు. దీనికి డిసెంబరు మొదటి వారంలో శంకుస్థాపన నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించకపోతే జేసీల తోలు తీసేవాళ్లం: మాజీ సీఎం జగన్



బ్రాహ్మణపల్లెలో అరటి రైతుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ సీఎం జగన్, ఎంపీ అవినాష్‌రెడ్డి

పులివెందుల, న్యూస్‌టుడే: 'కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు రైతులకు చేసింది ఏమీ లేదు.. రైతులకు గిట్టుబాటు ధర కల్పించలేకపోతున్నారు. నా హయాంలో జేసీలను పురమాయించి పంట కొనుగోళ్లు చేసేలా చేశాం. అలా చేయకపోతే వారి తోలు తీసేవాళ్లం' అని మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల పరిధిలోని బ్రాహ్మణపల్లె వద్ద అరటి తోటలను బుధవారం ఆయన ఎంపీ అవినాష్‌రెడ్డి, స్థానిక వైకాపా నేతలతో కలిసి పరిశీలించారు. అరటి సాగు చేస్తున్న కౌలు రైతు శ్రీనివాసులురెడ్డితో మాట్లాడారు. పొలంలోనే కాయలు మాగిపోతున్నాయని.. గిట్టుబాటు ధర దక్కట్లేదని రైతు చెప్పారు. అనంతరం జగన్ విలేకర్లతో మాట్లాడారు. 2024 మార్చిలో పులివెందులలో ఇంటిగ్రేటెడ్ అరటి ప్యాక్ హౌస్ ప్రారంభిస్తే.. విద్యుత్తు బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని దాన్ని పక్కన పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వంలో కనీసం పెట్టుబడి సాయం అందట్లేదని, ఉచిత బీమాను కాలరాశారని ఆరోపించారు. వైకాపా హయాంలో 84 లక్షల మంది రైతులకు ఉచిత పంటల బీమా కింద రూ.7,400 కోట్లు అందిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం కేవలం 18 లక్షల మందికి మాత్రమే పంటల బీమాకు అవకాశం కల్పించిందని విమర్శించారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయపోతే వైకాపా ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని జగన్ పేర్కొన్నారు.

నేడు రాష్ట్రానికి కర్ణాటక మైనర్ ఇరిగేషన్ మంత్రి బోసురాజు రాక

ఈనాడు, అమరావతి: కర్ణాటక మైనర్ ఇరిగేషన్, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు గురువారం సాయంత్రం విజయవాడ రానున్నారు. మంత్రాలయం వద్ద తుంగభద్రపై వంతెనతో కూడిన జలాశయం నిర్మించాలనే ఆలోచనలో కర్ణాటక ప్రభుత్వం ఉంది. దానిపై చర్చించేందుకు ఆయన ఏపీకి వస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆయన కర్ణాటకకు చెందిన మరో మంత్రి రామలింగారెడ్డితో కలిసి రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలుస్తారు. అనంతరం మంత్రులు నిమ్మల రామానాయుడు, టీజీ భరత్‌తో సమావేశమై చర్చలు జరుపుతారు.

పరకామణిలో చోరీకేసు రాజీకి మీరే ఆదేశాలిచ్చారా?

- శిక్ష పడేలా చేయాల్సింది పోయి రాజీకి ఎలా అంగీకరించారు?
- రవికుమార్ నుంచి ఆస్తుల్ని గిఫ్ట్‌డీడ్‌గా తీసుకోవటం వెనక ఎవరి ఒత్తిడి ఉంది?
- నాటి తితిదే ఈవో ధర్మారెడ్డిని విచారించిన సీఐడీ
- 5 గంటల పాటు 50కు పైగా ప్రశ్నలడిగిన అధికారులు
- మీకు తెలియకుండా ఏవీఎస్‌వో రాజీ చేసుకోగలరా?
- నాటి సీవీఎస్‌వో, ప్రస్తుత తూర్పుగోదావరి ఎస్పీ నరసింహ కిశోర్‌కు ప్రశ్నలు



పరకామణి కేసులో విజయవాడ సీఐడీ రీజినల్ కార్యాలయంలో విచారణకు హాజరై వెళ్తున్న తితిదే మాజీ ఈఓ ధర్మారెడ్డి ◆ అప్పటి సీవీఎస్ఓ నరసింహ కిషోర్

ఈనాడు-అమరావతి, ఈనాడు డిజిటల్-తిరుపతి: 'తితిదే పరకామణిలో చోరీ కేసులో రాజీకి మీరే ఆదేశాలిచ్చారా? న్యాయస్థానంలో శిక్షపడేలా చేయాల్సింది పోయి నిందితుడితో రాజీకి ఎందుకు, ఎలా అంగీకరించారు? అతని ఆస్తుల్ని గిఫ్ట్‌డీడ్‌గా తీసుకునేందుకు తితిదే పాలకమండలి సమావేశంలో టేబుల్ ఎజెండాగా ఎందుకు పెట్టారు? దీని వెనక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయి?' అంటూ అప్పటి తితిదే ఈవో ధర్మారెడ్డిపై సీఐడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. తితిదే పరకామణిలో చోరీ, రాజీ కేసుల్లో ధర్మారెడ్డి.. విజయవాడలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం విచారణకు హాజరయ్యారు. సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలోని దర్యాప్తు అధికారుల బృందం ఉదయం 10 నుంచి సాయంత్రం 3 వరకూ దాదాపు 5 గంటల పాటు ఆయన్ను విచారించింది. దాదాపు 50కు పైగా ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. 'పరకామణిలో చోరీకి ముందు, తర్వాత కూడా మీరే తితిదే ఈవో కదా.. ఆ వ్యవహారంలో ఎందుకు చర్యలు తీసుకోలేదు? నిందితుడు రవికుమార్ ఎన్నాళ్ల నుంచి పరకామణిలో చోరీ చేస్తున్నారు? ఆ సొత్తుతో ఎక్కడెక్కడ ఆస్తులు కొన్నారు? అనే అంశంపై తితిదే విజిలెన్స్‌తో దర్యాప్తు ఎందుకు చేయించలేదు?' అని అడిగినట్లు తెలిసింది.

నిర్ణయాల దస్త్రాలు ముందు పెట్టి ప్రశ్నల పరంపర

దర్యాప్తు అధికారులు ఏ ప్రశ్న అడిగినా.. తాను నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించానంటూ తప్పించుకునే ధోరణిలో ధర్మారెడ్డి సమాధానాలిచ్చినట్లు సమాచారం. దీంతో ఆయన తీసుకున్న నిర్ణయాలపై దస్త్రాలు చూపించి వాటి ఆధారంగా దర్యాప్తు అధికారులు ప్రశ్నించారు.

◆ 'పరకామణిలో చోరీ చేసిన సొత్తుతో నిందితుడు రవికుమార్ ఎక్కడెక్కడ? ఎన్నెన్ని ఆస్తులు కొన్నారు? వాటి విలువ ఎంతనేది గుర్తించి వాటిని రికవరీ చేయకుండా అతను రూ.14.43 కోట్ల ఆస్తిని గిఫ్ట్‌డీడ్‌గా ఇస్తానని ప్రతిపాదిస్తే.. ఎలా అంగీకరించారు? చోరీ సొత్తుతో అతను కూడబెట్టిన మిగతా ఆస్తులు ఏమయ్యాయో ఎందుకు తేల్చలేదు?' అంటూ అడగ్గా... ధర్మారెడ్డి పొంతనలేని సమాధానాలిచ్చినట్లు తెలిసింది. శ్రీవారికి విరాళాలు, గిఫ్ట్‌డీడ్‌లు ఇవ్వటానికి ఎవరైనా ముందుకొస్తే.. వారి నేపథ్యం పరిశీలించాకే వాటిని స్వీకరించాలనే నిబంధనలేమీ లేవని ధర్మారెడ్డి జవాబిచ్చినట్లు సమాచారం. ◆ 'గిఫ్ట్‌డీడ్ స్వీకరణ అంశాన్ని మీ ఆదేశాలతోనే టేబుల్ ఎజెండాగా చేర్చినట్లు మా దర్యాప్తులో తేలింది. ఎందుకు ఒత్తిడి తెచ్చారు?' అని అడగ్గా ధర్మారెడ్డి మౌనం వహించినట్లు సమాచారం.

మీ ఆదేశాలు లేకుండా ఏవీఎస్‌వో రాజీ చేసుకోగలరా?

'తితిదే పరకామణిలో చోరీ, తర్వాత కేసు రాజీ అంతా మీరు సీవీఎస్‌వోగా ఉన్నప్పుడే జరిగింది. మీ ఆదేశాలు లేకుండా, మీకు తెలియకుండా మీ నాయకత్వంలో పనిచేసే ఏవీఎస్‌వో స్థాయి అధికారి రాజీ చేసుకోగలరా?' అంటూ నాటి తితిదే సీవీఎస్‌వో, ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్‌ను సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్ ప్రశ్నించినట్లు సమాచారం. తితిదే పరకామణిలో చోరీ, రాజీ కేసుల్లో ఆయన విజయవాడలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం విచారణకు హాజరయ్యారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకూ దాదాపు 2 గంటల పాటు దర్యాప్తు బృందం ఆయన్ను విచారించింది. ప్రధానంగా చోరీకేసు రాజీ వెనక ఎవరి ఒత్తిళ్లు ఉన్నాయనే కోణంలో వివరాలు రాబట్టినట్లు సమాచారం.

◆ 'లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేసుకునేలా అప్పటి ఏవీఎస్‌వో సతీష్‌కుమార్‌పై మీరు ఒత్తిడి తీసుకొచ్చారా? ఎవరి ఆదేశాల మేరకు సతీష్‌పై ఒత్తిడి తెచ్చారు?' అని అడిగినట్లు తెలిసింది.

◆ పరకామణిలో చోరీ జరిగిన రోజు ఎవరెవరు డ్యూటీలో ఉన్నారు? వారిలో ఎంతమందిని విచారించారు? నాటి విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఏం తేల్చారు.. మీ దర్యాప్తులో ఏం తేలింది? నిందితుడి వద్ద ఎన్ని ఆస్తులున్నాయి? అవి ఎవరెవరి పేరిట ఉన్నాయి? కేసు ఎలా అంత త్వరగా క్లోజ్ చేయగలిగారు' అని సీఐడీ ఆరా తీసినట్లు సమాచారం.

తెరవెనక ఏం జరిగింది?

తితిదే పరకామణిలో విధులు నిర్వహిస్తున్న సీవీ రవికుమార్ పెద్ద ఎత్తున డాలర్లు, బంగారం అపహరించారంటూ అప్పట్లో ఏవీఎస్‌వోగా పనిచేసిన సతీష్‌కుమార్ 2023 ఏప్రిల్ 29న తిరుమల ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆ కేసులో మే 30న అభియోగపత్రం దాఖలు చేశారు. అనంతరం మూడున్నర నెలలకే సెప్టెంబరు 9న రవికుమార్‌తో లోక్ అదాలత్‌లో చోరీ కేసు రాజీ చేసుకున్నారు. ఈ క్రమంలో రవికుమార్ తన ఆస్తుల్లో ఏడు ఆస్తులను తితిదేకు గిఫ్ట్‌డీడ్‌గా ఇవ్వగా.. వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా, ధర్మారెడ్డి ఈవోగా ఉన్నప్పుడు పాలకమండలి వాటిని తీసుకుంది. దీనికి తెరవెనక ఏం జరిగిందనే కోణంలో సీఐడీ అధికారులు ప్రధానంగా విచారించారు.

మీ ప్రభుత్వంలో పంటలబీమా చెల్లించినట్లు నిరూపిస్తే రాజీనామా చేస్తా?

లేకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా జగన్?: ఎమ్మెల్సీ భూమిరెడ్డి

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో రైతులకు పంటల బీమా చెల్లించినట్లు ఆ పార్టీ వాళ్లు నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. నిరూపించలేకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా? అని వైకాపా అధినేత జగన్‌కు సవాలు విసిరారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం రాంగోపాల్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. "అధికారం లేనప్పుడే జగన్‌కు రైతులు గుర్తొస్తారు. 2019-24 మధ్య ఒక్క ఎకరం అరటి తోటకు కూడా బీమా చెల్లించలేదు. పులివెందుల ప్రాంతంలో అధిక సంఖ్యలో రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు" అని మండిపడ్డారు.

సినిమా విడుదలయ్యాక మీ పాటలు ఉన్నట్లు ఎందుకు కేసు వేస్తున్నారు?

ఇళయరాజాను ప్రశ్నించిన మద్రాసు హైకోర్టు

చెన్నై (ప్యారిస్), న్యూస్‌టుడే: ఒక సినిమా విడుదలై విజయం సాధించిన తర్వాత అందులో మీ పాటలు ఉపయోగించినట్లు ఎందుకు కేసు వేస్తున్నారని సంగీత దర్శకుడు ఇళయరాజాను మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. డ్యూడ్ సినిమాలో తాను సంగీతం సమకూర్చిన పాటలను తన అనుమతి లేకుండా ఉపయోగించినట్లు ఇళయరాజా మద్రాసు హైకోర్టులో కేసు వేశారు. ఆ పాటలను తొలగించాలని కోరారు. న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్ కుమార్ ఈ కేసును విచారణ చేపట్టి.. 30 ఏళ్ల కిందట వచ్చిన ఆ పాటలను ప్రస్తుతం అందరూ విని ఆనందిస్తున్నారని, అందుకు ఇళయరాజా ఎలా ప్రభావితమవుతారని, పాత పాటలు ఉపయోగించడం ప్రస్తుతం ట్రెండ్ అయిందని తెలిపారు. ఇళయరాజా తరపున సీనియరు లాయర్ వాదిస్తూ.. కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘించేలా ఆ పాటలను సినిమాలో ఉపయోగించారని, నిషేధం విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. తరచూ ఇళయరాజా పాటలను ఇతర సినిమాల్లో ఎందుకు ఉపయోగిస్తున్నారని 'డ్యూడ్' నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తరపు న్యాయవాదిని ప్రశ్నించారు. అందుకు మైత్రీ మూవీ మేకర్స్ సమాధానమిస్తూ... పాటల హక్కును ఎకో సంస్థ నుంచి సోనీ పొందిందని, సినిమాకు ఉపయోగించేందుకు వారి అనుమతి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వాదనలు పూర్తయిన నేపథ్యంలో న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు.

బీసీ కార్పొరేషన్లకు ఛైర్మన్ల నియామకం

ఈనాడు, అమరావతి: వివిధ బీసీ కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. భట్రాజు సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా సిరికొండ వెంకటేశ్వరరాజు, పెరిక సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా వనపర్తి వీరభద్రరావు, షేక్ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా షేక్ ముక్తార్, కుర్ని/కరికాల సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా కమర్తి మినప్ప, రెడ్డిక సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా కొండా శంకర్‌రెడ్డిలను నియమించింది. వీరు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్లపాటు పదవిలో ఉంటారు.

కొండల్లో హాయ్.. హాయ్!

మూలపాడులో రాష్ట్రంలో పెద్ద జిప్‌లైన్

ఎన్టీఆర్ జిల్లా మూలపాడు బటర్‌ఫ్లై పార్కులో రెండు కొండల మధ్య పచ్చని ప్రదేశంలో జిప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఇది రెండు వైపులా కలిపి 350 మీటర్ల పొడవు ఉంటుంది. 100 అడుగుల ఎత్తులో ఉండే ఈ జిప్‌లైన్‌ను అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ సహకారంతో ఏర్పాటు చేశారు. ఒక కొండపై నుంచి తీగల ద్వారా వెళ్లి తిరిగి.. మరోవైపు ఉండే తీగల ద్వారా ప్రారంభ పాయింట్‌కు చేరుకోవచ్చు. దీనికి బుధవారం ట్రయల్‌రన్ నిర్వహించగా, త్వరలో ప్రారంభించనున్నారు. ఇది రాష్ట్రంలోనే పెద్ద జిప్‌లైన్. ఇక్కడే సఫారీ, చిన్నపిల్లల పార్కు, ట్రెక్కింగ్ కూడా అందుబాటులోకి రానున్నాయి.

– ఈనాడు, అమరావతి



రెండు కొండల మధ్య ఏర్పాటు చేసిన జిప్‌లైన్ ట్రయల్‌రన్



జిప్‌లైన్ ఏర్పాటు చేసిన సీతాకోక చిలుకల పార్కు

తేలు కుట్టిన దొంగలా భూమన పరిస్థితి: వర్ల

ఈనాడు, అమరావతి: వైకాపా నేత భూమన కరుణాకర్‌రెడ్డి పరిస్థితి తేలుకుట్టిన దొంగలా ఉందని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. నైలు నదిలో కంటే రూ.కోట్ల అవినీతి డబ్బు అనే మొసళ్లు ఆయన ఇంట్లోనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పరకామణి కేసులో దొంగ ద్వారా సంక్రమించిన రూ.14.5 కోట్ల మార్కెట్ విలువ ఉన్న ఆస్తుల్ని భూమన అతి తక్కువ ధరకు తన అనుచరులకు లీజుకిచ్చారు. పరకామణి చోరీ కేసులో నిందితుడు, ఆయన కుటుంబ సభ్యులతో భూమన ఎన్నిసార్లు ఫోన్‌లో మాట్లాడారనే, కోణంలోనూ దర్యాప్తు చేయించాలి' అని వర్ల రామయ్య డిమాండ్ చేశారు.

బొండాడపై వంతెనకు రూ.12 కోట్లు

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం-గుడివాడ రోడ్డులో బొండాడ కాలువపై నాలుగు లేన్ల వంతెన పునర్నిర్మాణానికి రూ.12 కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ ఉప సభాపతి రఘురామకృష్ణరాజు వినతి మేరకు రద్దు చేసిన పనుల జాబితా నుంచి ఈ పనులకు మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

రబీలో ఈ-క్రాప్ మొదలయ్యేదెప్పుడు?

- తుపాను హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన
- నవంబరు ముగుస్తున్నా మొదలు కాని నమోదు

ఈనాడు, అమరావతి: రబీ మొదలై రెండు నెలలు పూర్తి కావస్తోంది. 6.50 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. అయినా ఇంకా ఈ-క్రాప్ ప్రారంభించలేదు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటనష్టం జరిగితే ఏం చేయాలన్న సందేహం వ్యక్తమవుతోంది. ఇప్పటికే శనగ, మినుము, పొగాకు, జొన్న, మొక్కజొన్న తదితర పంటల సాగు ముమ్మరంగా జరుగుతోంది. రియల్‌టైమ్‌లో ఈ-క్రాప్ నమోదు విధానం అమలు చేస్తే విపత్తుల కారణంగా నష్టం జరిగినా వెంటనే పెట్టుబడి రాయితీ అందించేందుకు వీలుంటుంది.

నమోదైందో లేదో తెలియదు: ఖరీఫ్‌లో తమ పంట ఈ-క్రాప్‌లో నమోదైందో లేదో కూడా రైతులకు తెలియడం లేదు. సాంకేతికత పెరిగిన నేపథ్యంలో ప్రజలెవరూ కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేకుండా చూడాలని సీఎం చంద్రబాబు చెబుతున్నా.. వ్యవసాయ అధికారులు మాత్రం రైతు సేవాకేంద్రాలకు వెళ్లి ఈ-క్రాప్‌లో నమోదైందో లేదో చూసుకోమని చెబుతున్నారు. అక్కడకు వెళ్తే సిబ్బంది తర్వాత రమ్మని సమాధానమిస్తున్నారు. ఆధార్ నమోదు ద్వారా ఆన్‌లైన్‌లో పరిశీలించుకునే వెసులుబాటు కల్పించడం లేదు.

హక్కులు, స్వేచ్ఛ, న్యాయాన్ని కాపాడేది రాజ్యాంగమే

ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల



విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే: భారత రాజ్యాంగం ఒక పుస్తకం కాదని.. ప్రతి పౌరుడికి దక్కిన వాగ్దానమని ఏపీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మార్చే ఎలాంటి కుయుక్తులనైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని రక్షించడంలో మొదటి స్థానంలో నిలబడతానన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. కోట్ల మంది ప్రజల ఆశయాలు, వారి హక్కులు, స్వేచ్ఛ, గౌరవం, న్యాయాన్ని కాపాడేది మన రాజ్యాంగమని చెప్పారు. కొన్ని శక్తులు భారత రాజ్యాంగాన్ని తినేసి చరిత్రను రూపుమాపాలని చూస్తున్నాయని.. సొంత రాజ్యాంగాన్ని లిఖించాలని కుట్రలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టిడ్కో ఇళ్లకు రూ.220 కోట్లు

ఈనాడు, అమరావతి: పట్టణ ప్రాంతాల్లో టిడ్కో ఆధ్వర్యంలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణానికి రూ.220 కోట్లు విడుదలచేసేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతులిచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.



అడ్డంకులను అవకాశాలుగా మలచుకోవాలి

సాధారణ వ్యక్తులు సమస్యల గురించి ఫిర్యాదు చేస్తూ గడిపితే, విజేతలు వాటిని పరిష్కరించడంపై దృష్టి పెడతారు. దాని అంతు చూసేవరకూ విశ్రమించరు. వారిలోని కుతూహలం, విమర్శనాత్మక ఆలోచనాధోరణే వారిని ప్రత్యేక వ్యక్తులుగా తీర్చిదిద్దుతాయి. ఇతరులు అడ్డంకులుగా భావించిన వాటిని వారు అవకాశాలుగా మలచుకుంటారు.

– అనుష్కా సోహం బథ్వాల్, ఆంత్రప్రెన్యూర్

4న విచారణకు రావాలని పీవీ సునీల్ కుమార్‌కు నోటీసు

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో అప్పటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజును సీఐడీ పోలీసులు కస్టడీలో హింసించిన కేసులో.. అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్‌కుమార్ డిసెంబరు 4న గుంటూరులో విచారణకు రావాలని విచారణాధికారి తాజాగా నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో సునీల్‌కుమార్ ఏ1గా ఉన్నారు. కేసును ప్రస్తుత విజయనగరం ఎస్పీ దామోదర్ పర్యవేక్షిస్తున్నారు. 2021 మే 14న హైదరాబాద్‌లోని నివాసంలో రఘురామకృష్ణరాజును అరెస్టు చేసి గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. అదే రోజు రాత్రి కస్టడీలో తనను తీవ్రంగా హింసించారని, హత్యాయత్నం చేశారని ఆయన ఫిర్యాదు చేశారు. అప్పట్లో వైకాపా ప్రభుత్వం కేసు నమోదుచేయలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత జులై 11న రఘురామకృష్ణరాజు ఫిర్యాదుతో గుంటూరులోని నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో విజయపాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సునీల్‌కుమార్‌ను తొలిసారి విచారణకు పిలిచారు. ప్రస్తుతం ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారు.

బెట్టింగ్‌కు బానిసై.. రికవరీ బంగారం కుదువ

- ఎస్సై సస్పెన్షన్
- 2018 నుంచి రూ.కోటిన్నర పోగొట్టుకున్నట్లు విచారణలో వెలుగులోకి..



భానుప్రకాశ్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: దొంగతనం కేసులో స్వాధీనం చేసుకున్న బంగారాన్ని ఓ ఎస్సై వడ్డీ వ్యాపారి వద్ద కుదువ పెట్టిన ఉదంతమిది. ఏపీలో ఎలక్ట్రిక్ విభాగంలో తనకు ఏఈ ఉద్యోగం వచ్చిందని.. రిలీవ్ చేయాలని అభ్యర్థించిన సదరు ఎస్సైని వెపన్ డిపాజిట్ చేయాలని కోరడంతో ఈ ఘటన వెలుగు చూసింది. ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి బానిసైన అతడు.. డబ్బుల కోసం రికవరీ బంగారాన్ని కుదువపెట్టినట్లు విచారణలో తేలింది. ఆ ఎస్సై సర్వీస్ రివాల్వర్ పోయిన ఉదంతంపైనా విచారణ జరుగుతోంది. హైదరాబాద్ అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలను తూర్పు మండలం డీసీపీ బాలస్వామి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాయచోటికి చెందిన భానుప్రకాశ్ 2020 బ్యాచ్ ఎస్సైగా ఎంపికయ్యారు. నగరంలోని హిమాయత్‌నగర్‌లో నివాసం ఉంటున్న అతను గత కొన్నేళ్లుగా అంబర్‌పేట పోలీస్‌స్టేషన్లో పనిచేస్తున్నారు. సెక్టార్ ఎస్సైగా పనిచేసిన అతన్ని క్రైం విభాగం ఎస్సైగా మార్చారు. పటేల్ నగర్‌లో ఓ ఇంటి పని మనిషి చేసిన దొంగతనం కేసులో 4.3 తులాల సొత్తును భానుప్రకాశ్ స్వాధీనం చేసుకున్నారు. కోర్టు విచారణలో ఉన్న ఈ కేసు లోక్‌అదాలత్‌లో పరిష్కారమైంది. దీంతో స్వాధీనం చేసుకున్న బంగారాన్ని యజమానికి అప్పగించే క్రమంలో అది కనిపించడం లేదని తేలింది. విచారించిన అధికారులు ఆన్‌లైన్ బెట్టింగ్ డబ్బుల కోసం భానుప్రకాశ్ ఆ బంగారాన్ని నారాయణగూడలోని ఓ దుకాణంలో కుదువ పెట్టినట్లు వెల్లడైంది. దీంతో ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతని రివాల్వర్ పోయిన ఘటనలోనూ విచారణ జరుపుతున్నారు. అతన్ని నాలుగు రోజుల క్రితమే సస్పెండ్ చేసినట్లు కాచిగూడ ఏసీపీ హరీశ్‌కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో 2018 నుంచి ఇప్పటి వరకు భానుప్రకాశ్ రూ.కోటిన్నర పోగొట్టుకున్నట్లు తెలిసిందని చెప్పారు.





మంగళగిరిలో ఏర్పాటు చేసిన డిజిటల్ గ్రంథాలయం ◆ అందంగా తీర్చిదిద్దిన రీడింగ్ రూం

వసతులన్నీ ఉన్నాయండి.. హాయిగా చదువుకోండి



లెక్చర్ హాల్



పాఠకులకు అందుబాటులో ఉంచిన పుస్తకాలు

పుస్తకాలు చదవాలంటే ఆహ్లాదకర వాతావరణం ఉండాలి. దీనికి ఆధునిక హంగులు తోడైతే ఇక పుస్తక ప్రియులకు పండగే. సరిగ్గా అలాంటి గ్రంథాలయమే గుంటూరు జిల్లా మంగళగిరిలో సిద్ధమైంది. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో రూ.1.34 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఈ డిజిటల్ లైబ్రరీని గురువారం ఆయన ప్రారంభించనున్నారు. 1986లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రారంభించిన ఈ భవనాన్ని ప్రస్తుతం ఇలా ఆధునికీకరించారు. రెండంతస్తుల ఈ భవనంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో చిన్నారులకు రీడింగ్ రూం, ప్లే ఏరియా, జర్నల్స్, దినపత్రికలు, పుస్తకాలు చదువుకునేందుకు రెండు గదులు, గ్రంథాలయ అధికారి కోసం మరో గది ఏర్పాటు చేశారు. రెండో అంతస్తులో ఈ-లైబ్రరీ, లెక్చర్ హాల్, రీడింగ్ రూం, డిజిటల్ రిసోర్స్ సెంటర్ వంటివి అందుబాటులోకి తెచ్చారు. ఈ-లైబ్రరీలో 20 కంప్యూటర్లు ఉన్నాయి. వీటన్నింటినీ ఇంటర్నెట్‌తో అనుసంధానించారు.

– ఈనాడు, గుంటూరు, న్యూస్‌టుడే, మంగళగిరి

EENADU Vol: 52, Issue: 107 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు సినిమా

చారిత్రక గర్జన




వెంకట సతీశ్, బాలకృష్ణ, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, గోపీచంద్ మలినేని

అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ మరోసారి చారిత్రక నేపథ్యంలో సినిమా చేస్తున్నారు. ఆయన 111వ సినిమా అది. గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు. విజయవంతమైన 'వీరసింహారెడ్డి' తర్వాత ఈ ఇద్దరూ కలిసి చేస్తున్న చిత్రమిది. నయనతార కథానాయిక. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ ప్రారంభోత్సవంలో పాల్గొని చిత్రబృందానికి స్క్రిప్ట్‌ని అందజేశారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు బి.గోపాల్ క్లాప్‌నివ్వగా, బాలకృష్ణ కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ఛాన్ చేశారు. దర్శకులు బోయపాటి శ్రీను, బాబీ, బుచ్చిబాబు సానా కలిసి గౌరవ దర్శకత్వం వహించారు. పలువురు సినీ ప్రముఖులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని చిత్రబృందానికి అభినందనలు తెలిపారు. గోపీచంద్ మలినేని తన మాస్ టచ్‌కు, చారిత్రక నేపథ్యాన్ని జోడిస్తూ బాలకృష్ణను ఇప్పటివరకూ చూడని ఓ సరికొత్త అవతారంలో తెరపై ఆవిష్కరిస్తారని సినీ వర్గాలు తెలిపాయి. ఈ సినిమాలో బాలకృష్ణ చారిత్రక గర్జనని చూస్తారని, ఆయనతో ఈ ప్రయాణం ఎంతో ప్రత్యేకమైనదని చెప్పారు దర్శకుడు గోపీచంద్ మలినేని. రాజసంతో, చారిత్రక సమరాన పోరాటం చేసి నిలిచిన ఓ యోధుడిలా బాలకృష్ణ ప్రచార చిత్రాల్లో కనిపిస్తున్నారు. భావోద్వేగాలు, యాక్షన్ అంశాలకు పెద్దపీట వేస్తూ రూపొందిస్తున్న చిత్రమిది. బాలకృష్ణ పలు కోణాల్లో కనిపించనున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన మిగిలిన నటీనటులు, సాంకేతిక బృందం వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

క్లాప్.. క్లాప్

పండగ పదహారు రోజులు



సాయికృష్ణ, గోపిక, శేఖర్ కమ్ముల

'వినాయకుడు', 'కేరింత' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న సాయికిరణ్ అడివి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'పదహారు రోజుల పండగ'. సాయికృష్ణ దమ్మాలపాటి కథానాయకుడిగా పరిచయం అవుతున్నారు. గోపిక ఉదయన్ కథానాయిక. రేణు దేశాయ్, అనసూయ భరద్వాజ్, వెన్నెల కిశోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సురేశ్‌కుమార్ దేవత, హరిత దుద్దుకూరు, ప్రతిభ అడివి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల క్లాప్‌నిచ్చారు. నిర్మాత టి.జి. విశ్వప్రసాద్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. డి.సురేశ్‌బాబు గౌరవ దర్శకత్వం వహించారు. కోన వెంకట్, కేకే రాధామోహన్ నిర్మాతలకి స్క్రిప్ట్‌ని అందజేశారు. అల్లు అరవింద్, వై.రవిశంకర్, కె.ఎల్.దామోదర్ ప్రసాద్ తదితర సినీ ప్రముఖులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. దర్శకుడు సాయికిరణ్ అడివి మాట్లాడుతూ "ఈ కథ నచ్చి 'పదహారు రోజుల పండుగ' అనే పేరు పెట్టమని చెప్పారు దర్శకుడు కృష్ణవంశీ. ఆయనకు కృతజ్ఞతలు. పలువురు ప్రముఖుల చేతులమీదుగా మా సినిమా ఆరంభం కావడం ఆనందంగా ఉంది" అన్నారు. కథానాయకుడు మాట్లాడుతూ "తొలి సినిమాని ఓ మంచి కథతో, మంచి దర్శకుడితో చేస్తుండడం నా అదృష్టం. ప్రేక్షకుల్ని అలరించడానికి అన్ని విధాలుగా కష్టపడి పనిచేస్తా" అన్నారు. రేణు దేశాయ్ మాట్లాడుతూ "అద్భుతమైన కథ ఇది. దర్శకుడు సాయికిరణ్ నాకు లాక్‌డౌన్‌కి ముందే చెప్పారు. అప్పుడే విని, వెంటనే చేస్తానని చెప్పాను. ఇందులో అత్తమ్మ పాత్రలో నేను కనిపిస్తాను" అన్నారు. అనసూయ భరద్వాజ్ మాట్లాడుతూ "నేను చాలా ఇష్టంగా చేస్తున్న సినిమా ఇది. పేరు ఎంత ముచ్చటగా ఉందో, కథ కూడా అంతే అద్భుతంగా ఉంటుంది. ఇలాంటి సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉంది" అన్నారు. పదహారు రోజుల పండగ సినిమా... పండగ రోజుల పండగలా నిలిచిపోతుందని చిత్రబృందం చెప్పింది. విష్ణు, 'మ్యాడ్' ఫేం కృష్ణుడు, అశోక్‌కుమార్, అనీష్ కురువిల్ల, సత్యశ్రీ, సోమశేఖర్, సుధీర్, పార్థసారథి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, ఛాయాగ్రహణం: పి. కళ్యాణ్ సుశీల్, ప్రొడక్షన్ డిజైన్: రామకృష్ణ సబ్బని, మోనికా నిగొత్రే సబ్బని, కూర్పు: సూర్యతేజ అంకే, స్క్రీన్‌ప్లే: జానీ, పోరాటాలు: రామ్ లక్ష్మణ్, పాటలు: వనమాలి, కళ్యాణ్ చక్రవర్తి, కిట్టు విస్సాప్రగడ, సంభాషణలు: సోమశేఖర్ పొట్ల.

మమ్ముట్టి కలాంకావల్ వచ్చేది అప్పుడే



మమ్ముట్టి

'డొమినిక్ అండ్ ది లేడీస్ పర్స్', 'బజూకా' చిత్రాలతో ఈ ఏడాది ప్రారంభంలోనే వైవిధ్యమైన పాత్రలతో అలరించారు మమ్ముట్టి. ఇప్పుడాయన ముచ్చటగా మూడో సినిమాతో ఈ సంవత్సరానికి ముగింపు పలకడానికి సిద్ధమయ్యారు. మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కలాంకావల్'. జితిన్ కె.జోస్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదల కావాల్సిన ఈ చిత్రం కొన్ని కారణాలతో వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా దీన్ని డిసెంబరు 5న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు ఇన్‌స్టా వేదికగా ప్రకటించింది చిత్రబృందం. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందించిన ఈ సినిమాలో వినాయకన్, గాయత్రి అరుణ్, రజిషా విజయన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

మర్మమైన ప్రపంచం.. వెలుగులోకి



జావెద్ జాఫేరి

'తుంబాడ్' చిత్రంతో అత్యాశ మనిషిని ఎలాంటి పరిస్థితికి దిగజారుస్తుందో చూపించిన దర్శకుడు రాహి అనిల్ బార్వే. ఇప్పుడు కల్ట్ పరిస్థితి గురించి తెరపై ఆవిష్కరించడానికి సిద్ధమవుతున్నారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మయసభ'. జావెద్ జాఫేరి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. కొన్నేళ్ల క్రితమే చిత్రీకరణ పూర్తయినప్పటికీ విడుదలకు నోచుకోలేదీ చిత్రం. ఇప్పుడు దీన్ని వచ్చే ఏడాది జనవరి 16న థియేటర్లలోకి తీసుకురానున్నట్లు తెలుపుతూ... ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు దర్శకుడు. "మట్టి.. కమ్మవాడికే.. నన్ను ఎందుకు తొక్కుతున్నావు ఏదో ఒకరోజు నిన్ను తొక్కే సమయమూ వస్తుంది" అంటుంది. చాలా కాలంగా పాతిపెట్టిన బంగారం తన హక్కు. కోసం వేచి ఉంది. పరమేశ్వర్ ఖన్నా మర్మమైన ప్రపంచం వివరాలు వెలుగులోకి రాబోతుంది" వ్యాఖ్యల జోడించారు. వీణా జామ్కర్, దీపక్ దామ్లే తదితరులు నటిస్తున్నారు. ఓ దర్శకుడి జీవితం ఆధారంగా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

ముగింపు వేడుకల్లో ధర్మేంద్రకు నివాళులు

గోవా వేదికగా 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా(ఇఫి) వేడుకలు ఘనంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఐదురోజుల క్రితం ఆరంభమైన ఈ వేడుక ముగింపు కార్యక్రమంలో ఇటీవలే కన్నుమూసిన ప్రముఖ బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్రకు నివాళులర్పించనున్నారు. "ఈ ఉత్సవం ముగింపు వేడుకలో ఆ అద్భుతమైన లెజెండ్‌కు మేము నివాళులర్పిస్తాం"ని ఎన్‌ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాశ్ మగ్దుమ్ తెలిపారు. బుధవారం ఈ వేడుకలో 'షోలే' ప్రదర్శన జరగాల్సి ఉంది. కానీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల దీన్ని రద్దు చేసినట్లు చెప్పారు.

ఆన్‌లైన్ వేధింపుల అంతమే లక్ష్యం



సమంత

సినిమాలతో అలరించడమే కాదు.. సామాజిక మాధ్యమాల వేదికగా ఆరోగ్యానికి సంబంధించిన విషయాల్ని పంచుకుంటూ ప్రేక్షకుల్లో స్ఫూర్తి నింపుతుంటుంది అగ్రతార సమంత. ఇప్పుడీమె మహిళలపై పెరుగుతోన్న ఆన్‌లైన్ వేధింపులకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధమైంది. దీని కోసం ఐక్యరాజ్యసమితికి చెందిన 'యూఎన్ ఉమెన్ ఇండియా'తో చేతులు కలిపింది సమంత. 16 రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమంలో ఆన్‌లైన్ వేధింపులను అంతం చేయడమే లక్ష్యంగా పనిచేయనుందామె. ఈ సందర్భంగా సమంత మాట్లాడుతూ.. "సోషల్ మీడియాలో కామెంట్స్, ఆన్‌లైన్ బెదిరింపులు, డీప్ ఫేక్ ఫొటోలు ఇలా ఎన్నో రకాలుగా మహిళలు వేధింపులకు గురవుతున్నారు. ప్రజల మధ్యలో ఉన్న వ్యక్తిగా ఈ డిజిటల్ హింస జీవితాలను, నమ్మకాన్ని, భద్రతను ఎంతగా ప్రభావితం చేస్తుందో నాకు తెలుసు. గతంలో ప్రత్యక్షంగా జరిగిన ఈ హింస ఇప్పుడు స్క్రీన్‌లపైకి వస్తుంది. ఇది మనిషిని మానసికంగా కుంగదీస్తుంది. నలుగురిలో తమ గొంతు వినిపించడానికి కూడా భయపడేలా చేస్తుంది. నేను ఎన్నో సార్లు ఈ పరిస్థితిని అనుభవించాను. ఇలాంటి వాటిపై మహిళల్లో అవగాహన పెరగాలి. ఈ ప్రచార కార్యక్రమం లక్ష్యమదే. ఆన్‌లైన్ హింసను అరికట్టడానికి మరింత బలమైన వ్యవస్థలు, కఠినమైన చట్టాలు రావాలి. యూఎన్ ఉమెన్ ఇండియా నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగం కావడం గౌరవంగా ఉంద"ని చెప్పింది.

పేర్లు చాలానే!



ఎన్టీఆర్

ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కలయికలో రూపొందుతున్న సినిమాకి 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఆ పేరుని ఇంకా ఖరారు చేయలేదని ఆ చిత్ర నిర్మాతల్లో ఒకరైన వై.రవిశంకర్ తెలిపారు. ఈ సినిమా కోసం చాలా పేర్లు పరిశీలనలో ఉన్నాయని, తాము పరిశీలిస్తున్న కొన్ని పేర్లలో 'డ్రాగన్' ఒకటి మాత్రమే అని ఆయన తెలిపారు. ఒక వేడుక ద్వారా సినిమా పేరుని, ప్రచార చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు ఆయన తెలిపారు. ప్రశాంత్ నీల్ ఈ చిత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో రూపొందిస్తున్నారని, ఎన్టీఆర్ నటనలో ఓ కొత్త కోణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుందని వై.రవిశంకర్ స్పష్టం చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. డిసెంబరు తొలి వారం నుంచి కొత్త షెడ్యూల్ చిత్రీకరణ షురూ కానుంది.

మహిళల నిశ్శబ్దమే.. ప్రశ్నించేలా ఉంటుంది



భూమి

బాలీవుడ్ కథానాయిక భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రలో నటించిన సిరీస్ 'దల్దాల్'. అమృత్ రాజ్ గుప్తా దర్శకత్వం వహించారు. ఇందులో డీసీపీ రీటా ఫెరీరా పాత్రలో కనిపించనుంది భూమి. తాజాగా ఈ సిరీస్ ఫస్ట్‌లుక్‌ను 56వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫి)లో విడుదల చేశారు. అనంతరం 'బియాండ్ ది స్టీరియోటైప్: రీడిఫైనింగ్ ఉమెన్ అండ్ పవర్ ఇన్ మోడ్రన్ స్టోరీ టెల్లింగ్' అనే సెషన్‌లో భూమి పాల్గొని.. ఈ సిరీస్ గురించి మాట్లాడింది. "మహిళలలో శక్తి బయటకు కనిపించే విధంగా ఉండాల్సిన అవసరం లేదనే విషయాన్ని ఈ సిరీస్ నుంచే నేర్చుకున్నా. వారి నిశ్శబ్దం మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని ప్రశ్నించేలా ఉంటుంది. రోజూ నా తల్లి ఇలా ఉండడం చూశా. నేను పోషించిన పాత్ర రీటా కూడా ఆ కోవకు చెందిదే. ఆమె పెద్దగా మాట్లాడదు. కానీ చాలా చేస్తుంది. మాటల కంటే మనం చేసే పనులు పెద్దగా మాట్లాడితే చాలు. ఈ రీటా పాత్ర నా కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడుకున్నది. దీని నుంచి బయటపడడానికి ఎక్కువ సమయం పట్టింది. కానీ చాలా సంతృప్తికరంగా ఉంద"ని అంది.

అలా తెలుగులోకి అడుగుపెట్టాం



వివేక్, మెర్విన్

"పాటల్లోనూ... నేపథ్య సంగీతంలోనూ ఇదివరకెప్పుడూ వినని కొత్త సౌండ్స్‌ని మేం వినిపిస్తూ స్వరాల్ని సమకూర్చాం. థియేటర్లలో మా ప్రయత్నం ప్రేక్షకులకు ఓ కొత్త అనుభవాన్ని పంచుతుంది" అన్నారు సంగీత దర్శకులు వివేక్ - మెర్విన్. తమిళంలో మంచి పేరు సంపాదించిన ఈ ద్వయం 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రంతో తెలుగు చిత్రసీమకి పరిచయం అవుతోంది. మహేశ్‌బాబు.పి దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన చిత్రమిది. రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తున్న సందర్భంగా సంగీత దర్శక ద్వయం వివేక్ - మెర్విన్ బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"తెలుగు సినిమా సంగీతం అంటే మాకు ఎంతో ఇష్టం. ప్రతి ఆల్బమ్‌ని వింటూ ఉంటాం. చెన్నైలో పుట్టి పెరిగిన మేం ఏఆర్ రెహమాన్ పాటలు వింటూ పెరిగాం. ఇళయరాజా సంగీతం అన్నా చాలా ఇష్టం. తెలుగులో సినిమా చేయాలని ఉండేది కానీ, 'ఆంధ్ర కింగ్ తాలూకా' మా మొదటి సినిమా అవుతుందని మాత్రం అనుకోలేదు. తమిళంలో 20 సినిమాలు చేశాం. 2024లో కథానాయకుడు రామ్ మాకు ఫోన్ చేసి మంచి సంగీతం ఇస్తున్నారంటూ మెచ్చుకున్నారు. ఒక నెల రోజుల తర్వాత ఆయనే ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పారు. అలా రామ్ సినిమాతోనే తెలుగు పరిశ్రమలోకి అడుగు పెట్టాం.

● "తెలుగు సినిమా ప్రయాణం చాలా సంతృప్తినిచ్చింది. తొలి పాట 'నువ్వుంటే చాలు...' విడుదల కాగానే తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి, ప్రేక్షకుల నుంచి గొప్ప స్పందన లభించింది. ఆ పాటని రామ్ రచించడం, అనిరుధ్ పాడటంతో అందరికీ వ్యక్తిగతంగా కనెక్ట్ అయ్యింది. చాలామంది ఫోన్ చేసి మీతో పనిచేయాలని ఉంది అన్నారు. అలా కొన్ని ప్రాజెక్టులు ఖరారయ్యాయి. వాటిని త్వరలో నిర్మాతలే స్వయంగా ప్రకటిస్తారు. మాకు అన్ని రకాల జానర్స్‌కు పని చేయాలని ఉంది".

సంగీత ప్రధానమైన కథ.. 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మొత్తం ఏడు పాటలు ఉంటాయి. ఇప్పటికే నాలుగు పాటల్ని విడుదల చేశాం. మనల్ని ఈ కాలం నుంచి మనల్ని ఈ కాలం నుంచి 2000 సంవత్సరంలోకి తీసుకెళ్లి, జ్ఞాపకాల్లో ముంచెత్తి ఓ గొప్ప అనుభూతిని పంచుతుంది. విజువల్‌గా కూడా ప్రతి పాట ఆకట్టుకునేలా ఉంటుంది".

● "సహజమైన సంగీతాన్ని కోరుకుంది ఈ కథ. అందుకు తగ్గట్టే మేం స్వరాల్ని సమకూర్చాం. సాహిత్యానికి ప్రాధాన్యం ఇస్తూ, అది స్పష్టంగా వినిపించేలా జాగ్రత్తలు తీసుకున్నాం. నువ్వుంటే చాలు..., చిన్ని గుండెలో... పాటలు థియేటర్లలో ఊపేస్తాయి. ఇవనే కాదు, ప్రతి పాటా ప్రత్యేకమే. హీరో రామ్‌కి సంగీతం అంటే ఇష్టం. గొప్ప అభిరుచి ఉన్న వ్యక్తి. మేం ఒక బాణీని సిద్ధం చేశాక విని, దానికి తగ్గట్టుగా అద్భుతమైన సాహిత్యాన్ని రాశారు. దర్శకుడికీ, మాకూ చాలా నచ్చింది. అలా ఆయన ఈ సినిమాతో గీత రచయితగా కూడా మారారు. దర్శకుడు మహేశ్‌బాబుకు సంగీతంపై మంచి అభిరుచి ఉంది. నిర్మాతలతో సహా మేమంతా ఒకే గదిలో కూర్చుని, సంగీత చర్చలు చేసుకుని ఆ తర్వాత ఈ పాటల్ని సమకూర్చాం. బీట్, మెలోడీ మేళవింపుగా, కొత్త రకమైన స్వరాలతో ఆల్బమ్ ముస్తాబైంది. ఈ సినిమా కోసమే దాదాపు 30 థీమ్స్‌ని స్వరపరిచాం. సినిమా విడుదల తర్వాత ఆ థీమ్స్‌ని ప్రత్యేకంగా విడుదల చేస్తాం".

గిర గిర గింగిరానివే..



అనస్వర రాజన్, రోషన్

'ఛాంపియన్'గా తెరపై సందడి చేయడానికి సిద్ధమవుతున్నారు శ్రీకాంత్ కుమారుడు రోషన్. ప్రదీప్ అద్వైతం తెరకెక్కిస్తున్న చిత్రమిది. అనస్వర రాజన్ కథానాయిక. ఈ సినిమా డిసెంబరు 25న రాబోతుంది. ఈ నేపథ్యంలోనే పాటల ప్రయాణాన్ని ప్రారంభించింది చిత్రబృందం. ఇందులో భాగంగానే ఈ సినిమా నుంచి మొదటి గీతాన్ని విడుదల చేసింది. 'గిర గిర గింగిరా గిరే..' అంటూ సాగుతున్న ఈ పాటలో రోషన్, అనస్వరల మధ్య కెమిస్ట్రీ, వారి స్టెప్పులు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ గీతాన్ని రామ్ మిరియాల ఆలపించారు. స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

ఇంకా నెల రోజులే



కార్తిక్, అనన్య

"ప్రేమ పండగ మొదలు కావడానికి ఇంకా నెల రోజులే మిగిలి ఉంద"ని అంటున్నారు బాలీవుడ్ కథానాయకుడు కార్తిక్ ఆర్యన్, అనన్య పాండే. మరి ఈ జంట పంచే వినోదాలు ఎలా ఉంటాయో తెలుసుకోవాలంటే 'తూ మేరీ మై తేరా మై తేరా తూ మేరీ' సినిమా చూడాల్సిందే. సమీర్ విద్వాన్స్ దర్శకత్వం వహిస్తున్నారు. ధర్మ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 25న రానుంది. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మరో కొత్త పోస్టర్‌ను పంచుకుంది నిర్మాణ సంస్థ. కార్తిక్, అనన్యల మధ్య కెమిస్ట్రీ, ఆకట్టుకునే ప్రేమకథతో దీన్ని తీర్చిదిద్దినట్లు ఇటీవలే విడుదలైన టీజర్‌తో స్పష్టం చేసింది చిత్రబృందం. ప్రేమ, సంగీతం, భావోద్వేగం, ఆకర్షణ లాంటి అంశాలతో రూపొందించిన ఈ సినిమా ట్రైలర్‌ను త్వరలో విడుదల చేయనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి.

ప్రత్యేకం రివాల్వర్ రీటా కామెడీ



కీర్తిసురేశ్

"నా కెరీర్‌లో ఎన్నో ప్రయోగాలు చేశా. ఎప్పుడూ విభిన్నమైన పాత్రలపైనే నా దృష్టి" అంటున్నారు కీర్తిసురేశ్. ఆమె ప్రధాన పాత్రధారిగా తెరకెక్కిన 'రివాల్వర్ రీటా' ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొస్తోంది. జేకే చంద్రు దర్శకత్వం వహించిన చిత్రమిది. సుధన్ సుందరం, జగదీశ్ పళనిసామి నిర్మాతలు. రాధికా శరత్‌కుమార్, సూపర్ సుబ్బరాయన్, సునీల్, అజయ్‌ఘోష్ కీలక పాత్రలు పోషించారు. చిత్రం విడుదలని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసింది చిత్రబృందం. ఈ సందర్భంగా కీర్తి సురేశ్ మాట్లాడుతూ "ఇది డార్క్ కామెడీ సినిమా. ఇప్పటివరకూ ఈ తరహా సినిమాలు చాలానే చూసుంటారు కానీ, ఇది ప్రత్యేకంగా ఉంటుంది" అన్నారు. అనంతరం విలేకర్లు అడిగిన ఓ ప్రశ్నకు ఆమె బదులిస్తూ తాను 'ఎల్లమ్మ' సినిమాలో నటించడం లేదని స్పష్టం చేశారు. సెట్‌లో 8 గంటలకంటే ఎక్కువ పని చేయడానికీ తాను సిద్ధమే కానీ, రోజూ అంటే కష్టమని చెప్పారు. నటీనటుల కంటే కూడా, సాంకేతిక నిపుణులు రెండు మూడు గంటలు ముందే వచ్చి, ఆలస్యంగా వెళ్లాల్సి ఉంటుందని వాళ్లందరి ఆరోగ్యాల్ని పరిగణనలోకి తీసుకోవల్సి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. పంపిణీదారుడు కుమార్ మాట్లాడుతూ "ఆంధ్ర, తెలంగాణలో ఈ చిత్రాన్ని విడుదల చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు కృతజ్ఞతలు" అన్నారు.

ఛాంపియన్



అద్భుతమేమీ జరగలేదు. దాసోహమే..! స్పిన్‌ను ఎదుర్కోవడంలో అదే అవస్థ. నైపుణ్యం లోపించింది.. సంకల్పమూ కొరవడింది. వీళ్లు సొంతగడ్డపైనే ఆడుతున్నారా అన్న సందేహం కలిగేలా మన బ్యాటర్లు తేలిపోయారు. ఫలితం.. తన టెస్టు చరిత్రలోనే భారత్ పరుగుల పరంగా అతిపెద్ద పరాజయాన్ని చవిచూసింది. గంభీర్ మార్గనిర్దేశంలోని భారత్‌ను రెండో టెస్టులో 408 పరుగుల తేడాతో చిత్తు చేసిన దక్షిణాఫ్రికా.. పాతికేళ్లలో భారత్‌లో తొలిసారి సిరీస్ విజయాన్నందుకుంది. ఏడాది కాలంలో సొంతగడ్డపై టీమ్‌ఇండియా రెండోసారి వైట్‌వాష్‌కు గురైంది.



3

సొంతగడ్డపై భారత జట్టుకు ఇది మూడో వైట్‌వాష్. ఇంతకుముందు 2000లో దక్షిణాఫ్రికాపై, నిరుడు న్యూజిలాండ్‌పై వైట్‌వాష్‌కు గురైంది.

జడేజా స్టంపౌట్ అయ్యాడిలా...

దాసోహమే..

- టీమ్‌ఇండియా వైట్‌వాష్
- రెండో టెస్టులోనూ చిత్తు

పాతికేళ్లలో తొలిసారి భారత్‌లో సిరీస్ నెగ్గిన దక్షిణాఫ్రికా

గువాహటి

అనుకున్నట్లే జరిగింది. టీమ్‌ఇండియాకు పరాభవమే. రెండో టెస్టులో అన్ని విభాగాల్లోనూ తేలిపోయిన ఆతిథ్య జట్టు.. 408 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయింది. 549 పరుగుల భారీ ఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 27/2తో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్.. కనీస ప్రతిఘటన లేకుండా చేతులెత్తేసింది. హార్మర్ (6/37) స్పిన్‌కు తలవంచుతూ 140 పరుగులకే కుప్పకూలింది. జడేజా (54; 87 బంతుల్లో 4×4, 2×6) మినహా బ్యాటర్లంతా విఫలమయ్యారు. మరో స్పిన్నర్ కేశవ్ మహరాజ్ రెండు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా 489 పరుగులు చేయగా.. భారత్ 201కే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌ను 260/5 వద్ద సఫారీ జట్టు డిక్లేర్ చేసింది. ఈ విజయంతో దక్షిణాఫ్రికా సిరీస్‌ను 2-0తో గెలుచుకుంది. ఆల్‌రౌండ్ సత్తా చాటిన యాన్సెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. హార్మర్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యాడు.

అదే ఆట: 13 నెలల కాలంలో టీమ్‌ఇండియాకు స్వదేశంలో రెండో వైట్‌వాష్ ఇది. నిరుడు ఆ జట్టు కివీస్ చేతిలో 0-3తో ఓడిన సంగతి తెలిసిందే. ఈడెన్ టెస్టులో ఓడాక.. రెండో టెస్టులోనైనా భారత్ పుంజుకుంటుందని అనుకుంటే, ఆ జట్టు ప్రదర్శన మరింత క్షీణించింది. క్షీణిస్తూనే ఉంది. అసలు టెస్టు క్రికెట్ ఆడడమే తెలియనట్లుంది మన బ్యాటర్ల ఆట. మ్యాచ్‌లో ఏ దశలోనూ భారత్ పోటీలో లేదు. ఒకప్పుడు స్పిన్ వేయడంలో, స్పిన్‌ను ఆడడంలో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన ఆ జట్టు.. ఇలా తడబడుతుంటే జీర్ణించుకోవడం అభిమానులకు కష్టమే. అసలు స్పిన్ మాత్రమే సమస్య కాదు. బ్యాటర్లు టెస్టు క్రికెట్‌కు తగ్గట్లు తమను తాము అన్వయించుకోలేకపోతున్నారు. సరైన టెక్నిక్ కూడా లోపించింది. బ్యాక్‌ఫుట్ అన్నది దాదాపుగా మరిచిపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో పేసర్ యాన్సెన్ ధాటికి కూడా విలవిల్లాడింది టీమ్‌ఇండియా. అయితే ఆ ఇన్నింగ్స్‌లో కనీసం రెండొందలైనా దాటింది. రెండో ఇన్నింగ్స్‌లో 140 చేయడానికే అపసోపాలు పడింది. జడేజా నిలవడంతో ఆ మాత్రం స్కోరైనా సాధ్యమైంది. లేదంటే పరిస్థితి మరింత దారుణంగా ఉండేదే. తన స్పిన్‌తో బ్యాటర్లను తిప్పలు పెట్టిన హార్మర్.. భారత జట్టు పతనాన్ని శాసించాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఒక్కటి మినహా వికెట్లన్నీ స్పిన్నర్లకే పడడం గమనార్హం. ఈ ఓటమితో టీమ్‌ఇండియా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు కూడా బాగా దెబ్బతిన్నాయి.

చేతులెత్తేశారిలా..: 549 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడం అసాధ్యం. కానీ భారత జట్టు కనీస పోరాటపటిమను ప్రదర్శించాలని ఆశించారు అభిమానులు. కానీ మన బ్యాటర్ల తీరు మారలేదు. స్పిన్‌ను అర్థం చేసుకోలేక మరింత పేలవంగా బ్యాటింగ్ చేశారు. వికెట్లు టపటపా పడ్డాయి. ఓవర్‌నైట్ స్కోరు 27/2తో భారత్ ఛేదనను కొనసాగించగా.. పతనం మొదలు కావడానికి ఎంతో సమయం పట్టలేదు. స్పిన్నర్ హార్మర్.. ఓవర్‌నైట్ బ్యాటర్ కుల్‌దీప్ (5)ను బౌల్డ్ చేయడం ద్వారా ఆఖరి రోజు భారత్‌ను తొలి దెబ్బతీశాడు. అదే ఓవర్లో జురెల్ (2)నూ వెనక్కి పంపాడు. కాసేపటి తర్వాత హార్మర్.. పంత్ (13)ను కూడా ఔట్ చేశాడు. బౌన్స్‌తో పాటు టర్న్ అయిన బంతి.. పంత్ బ్యాట్ అంచును తాకుతూ వెళ్లి మార్‌క్రమ్ చేతుల్లో పడింది. భారత్ 58/5తో పీకల్లోతు కష్టాల్లోకి కూరుకుపోయింది. ఆ తర్వాత ఓటమి లాంఛనమే. ఓవర్‌నైట్ బ్యాటర్ సాయి సుదర్శన్ (14; 139 బంతుల్లో 1×4) చాలా బంతులే ఆడాడు. కానీ బాగా ఇబ్బందిపడ్డాడు. సాధికారికంగా ఆడలేకపోయాడు. చివరికి అతడు ముత్తుసామి బౌలింగ్‌లో వెనుదిరిగాడు. జడేజా బాగానే ఆడినా అతడికి పెద్దగా సహకారం అందలేదు. సుందర్ (16), నితీశ్ (0) విఫలమయ్యారు. ఈ ఇద్దరిని హార్మర్ పెవిలియన్ చేర్చాడు. మహరాజ్ ఒకే ఓవర్లో జడేజా, సిరాజ్ (0)ను ఔట్ చేయడంతో టీమ్‌ఇండియా ఇన్నింగ్స్ ముగిసింది. 10 పరుగుల వ్యవధిలో భారత్ ఆఖరి నాలుగు వికెట్లు కోల్పోయింది.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: 489; **భారత్ తొలి ఇన్నింగ్స్:** 201
దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 260/5 డిక్లేర్డ్
భారత్ రెండో ఇన్నింగ్స్: యశస్వి (సి) వెరీన్ (బి) యాన్సెన్ 13; రాహుల్ (బి) హార్మర్ 6; సుదర్శన్ (సి) మార్‌క్రమ్ (బి) సెనురాన్ 14; కుల్‌దీప్ (బి) హార్మర్ 5; జురెల్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 2; పంత్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 13; జడేజా (స్టంప్డ్) వెరీన్ (బి) కేశవ్ 54; సుందర్ (సి) మార్‌క్రమ్ (బి) హార్మర్ 16; నితీశ్ (సి) వెరీన్ (బి) హార్మర్ 0; బుమ్రా నాటౌట్ 1; సిరాజ్ (సి) యాన్సెన్ (బి) కేశవ్ 0; ఎక్స్‌ట్రాలు 16 **మొత్తం:** (63.5 ఓవర్లలో ఆలౌట్) **140; వికెట్ల పతనం:** 1-17, 2-21, 3-40, 4-42, 5-58, 6-95, 7-130, 8-138, 9-140; **బౌలింగ్:** యాన్సెన్ 15-7-23-1; ముల్డర్ 4-1-6-0; హార్మర్ 23-6-37-6; కేశవ్ 12.5-1-37-2; మార్‌క్రమ్ 2-0-2-0; సెనురాన్ 7-1-21-1



పంత్, గంభీర్

గంభీర్‌కు వ్యతిరేకంగా నినాదాలు

దక్షిణాఫ్రికా చేతిలో రెండో టెస్టులో టీమ్‌ఇండియా చిత్తయిన అనంతరం గువాహటి మైదానంలో కోచ్ గౌతమ్ గంభీర్‌కు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తాయి. బహుమతి ప్రదానోత్సవం కోసం జట్టుతో కలిసి గంభీర్ మైదానానికి రాగా.. అతను రాజీనామా చేయాలంటూ స్టాండ్స్ నుంచి అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పేసర్ సిరాజ్‌తో పాటు సహాయ సిబ్బంది వారిస్తున్నా అభిమానులు శాంతించలేదు.

"నా విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది బీసీసీఐ. ఇంగ్లాండ్‌లో జట్టును గెలిపించిన విషయాన్ని మరిచిపోయిన జనాలు.. న్యూజిలాండ్ చేతిలో ఓటమి గురించే మాట్లాడతారు. నేను ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్‌లోనూ జట్టును గెలిపించాను" – గంభీర్

201
రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు స్కోరు. ఈ సిరీస్‌లో ఆ జట్టు ఈ ఒక్క సారే రెండొందలు దాటింది.

408
రెండో టెస్టులో భారత జట్టు ఓటమి అంతరం. పరుగుల పరంగా భారత్‌కు ఇదే అతి పెద్ద పరాజయం.

36.82
కోచ్‌గా గంభీర్ గెలుపు శాతం. డంకన్ ఫ్లెచర్ (33.33) తర్వాత అత్యంత తక్కువ గెలుపు శాతం కలిగిన భారత జట్టు కోచ్ గంభీరే. గంభీర్ మార్గనిర్దేశనంలో భారత్ ఏడు టెస్టుల్లో గెలిచి, పది టెస్టుల్లో ఓడింది. రెండింటిని డ్రాగా ముగించింది.

భారత్‌లో టెస్టు సిరీస్ అనగానే విదేశీ జట్లు జావగారిపోయేవి ఒకప్పుడు. మన జట్టు ఎంత తేడాతో గెలుస్తుందనే చూసేవాళ్లు. భారత్‌లో భారత్‌ను ఓడించడాన్ని ప్రత్యర్థి జట్లు గొప్ప ఘనతలా భావించేవి. అలాంటిది దశాబ్దాల తరబడి భారత్‌లో సిరీస్ గెలవని జట్లు ఇప్పుడు టీమ్‌ఇండియాను వైట్‌వాష్ చేస్తున్నాయి. భారత్‌ను సొంతగడ్డపై ఓడించడం పెద్ద విషయమే కాదని చాటి చెబుతున్నాయి. "అమ్మో ఇండియా" అనే రోజులు పోయి.. "ఇండియానే కదా" అనుకునే పరిస్థితి.

ఇదంతా కేవలం ఏడాది వ్యవధిలో వచ్చిన మార్పు. సొంతగడ్డపై ఎవ్వరికీ అందనంత ఎత్తులో ఉన్న భారత్‌ను నిరుడు న్యూజిలాండ్ నేలమీదికి దించితే.. ఇప్పుడు దక్షిణాఫ్రికా మన జట్టును పాతాళానికి తోసేసింది. ఈ స్థితి నుంచి జట్టు కోలుకోవడం అంత తేలికగా కనిపించడం లేదు.

ఎటు పోతున్నాం!

ఫోర్త్ అంపైర్

ఒక పెద్ద ఓటమి ఎదురైనపుడు అందుకు కారణాలేంటో లోతుగా విశ్లేషించుకోవాలి. తప్పులను సరిదిద్దాలి. గత ఏడాది న్యూజిలాండ్ చేతిలో భారత జట్టు వైట్‌వాష్‌కు గురవడానికి కారణాలేంటో గుర్తించి కాయకల్ప చికిత్స చేసి ఉంటే ఈ రోజు దక్షిణాఫ్రికా చేతిలో ఘోర పరాభవం తప్పేది. పన్నెండేళ్ల పాటు సొంతగడ్డపై సిరీసే కోల్పోని జట్టు, ఏడాది వ్యవధిలో రెండు సిరీస్‌ల్లో వైట్‌వాష్‌లకు గురైందంటే.. ఆటతీరులోనే పెద్ద లోపం ఉందన్నది స్పష్టం. ఈ రెండు పరాభవాల్లో ప్రత్యర్థుల ఘనత కంటే మన వైఫల్యమే ఎక్కువ అనడంలో సందేహం లేదు. ఓటముల కంటే ఓడిన తీరు ఎక్కువ ఆందోళన కలిగిస్తోంది. ఇప్పుడు ఉన్నట్లుండి పిచ్‌లేమీ మారిపోలేదు. కానీ వికెట్లకు తగ్గట్లుగా ఆటను అన్వయించుకోవడంలో, సరైన టెక్నిక్‌తో ఆడడంలో మన ఆటగాళ్లు విఫలమయ్యారు. బ్యాటింగ్‌కు అనుకూలంగా మారిన ఇంగ్లాండ్ పిచ్‌లపై రాణించి.. సొంతగడ్డపై స్పిన్‌కు అనుకూలంగా మారిన వికెట్లపై మన బ్యాటర్లు చతికిలపడ్డారు. టెస్టులంటే ఓపిక, సంయమనంతో ఆడాలనే ప్రాథమిక సూత్రాన్ని ఈ తరం క్రికెటర్లు మరిచిపోతున్నారు. ఒకప్పుడు స్పిన్ ఆడడంలో భారత బ్యాటర్లకు తిరుగులేదనే పేరుండేది. కానీ ఇప్పుడు స్పిన్ ఆడలేని బలహీనతే జట్టును దెబ్బ తీస్తోంది. విదేశీ బ్యాటర్లు ఇక్కడికొచ్చి మన స్పిన్నర్లను దీటుగా ఎదుర్కొంటుంటే.. ప్రత్యర్థి స్పిన్నర్ల దెబ్బకు మనవాళ్లు తేలిపోతున్నారు. మ్యాచ్ పరిస్థితితో సంబంధం లేకుండా గుడ్డిగా షాట్లు ఆడడంలో ఔచిత్యమేంటో ఆటగాళ్లకే తెలియాలి. డ్రా చేసుకోవడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేని స్థితిలోనూ బ్యాటర్లు షాట్లకు ప్రయత్నించి ఔట్ కావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ మ్యాచ్‌లో భారత్ కోల్పోయిన వాటిలో కనీసం సగం వికెట్లు అనవసర షాట్లకు ప్రయత్నించి కోల్పోయినవే. యాన్సెన్ బౌన్సర్లను ఆయుధంగా చేసుకున్నాడని తెలిసీ.. ఆ బంతులను ఆడే టెక్నిక్ తెలియక వికెట్లు ఇచ్చేశారు బ్యాటర్లు. తొలిసారి భారత్‌లో పర్యటించిన హార్మర్.. భారత బ్యాటర్లను అంతగా ఇబ్బంది పెట్టడం, అన్నన్ని వికెట్లు (17) తీయడమేంటో? అతను ఉపయోగించుకున్నట్లుగా అనుభవజ్ఞులైన మన స్పిన్నర్లు సొంత మైదానాలను సద్వినియోగం చేసుకోకపోవడమేంటో? అవతలి జట్టులో టెయిలెండర్లు మన బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నారు. ధారాళంగా పరుగులు రాబట్టారు. కానీ మన ప్రధాన బ్యాటర్లు కాసేపు క్రీజులో నిలవడానికి, వికెట్లు కాపాడుకోవడానికి ఆపసోపాలు పడ్డారు. ప్రత్యర్థి బ్యాటర్లు మన స్పిన్నర్లను స్వీప్ షాట్లతో సమర్థంగా ఎదుర్కొంటే.. క్రికెట్లో అలాంటి ఒక షాట్ ఉందనే మన బ్యాటర్లు మరిచిపోయారా అనిపిస్తోంది. అసలు ప్రత్యర్థి మన దగ్గరికి వచ్చిందా? లేక ప్రత్యర్థి దేశానికి వెళ్లి మనం ఆడుతున్నామా అనిపించేలా.. దక్షిణాఫ్రికా ఆధిపత్యం చలాయిస్తుంటే, భారత జట్టు బేలతనాన్ని ప్రదర్శించింది. రెండో టెస్టును డ్రా చేసుకున్నా గెలిచినట్లే అని నాలుగో రోజు విలేకరుల సమావేశంలో జడేజా చెప్పడం.. జట్టు మానసిక స్థితికి అద్దం పట్టేదే. కఠిన పరిస్థితులుండే విదేశాల్లో విజయాలు సాధించిన జట్టు.. ఇప్పుడు సొంతగడ్డపై ఓటములు తప్పించుకోవడం కోసం పోరాడే స్థితికి రావడం భారత క్రికెట్ దీన స్థితికి రుజువు.



టెస్టులాడే సామర్థ్యమేదీ?

దేశంలో ఎంతోమంది ప్రతిభావంతులు వెలుగులోకి రావడానికి, ప్రపంచ క్రికెట్లో భారత్ ఒక శక్తిగా ఎదగడానికి ఐపీఎల్ తోడ్పడిందనడంలో సందేహం లేదు. కానీ ఆ లీగ్ ప్రభావంతో బాదుడే లక్ష్యంగా సాగుతున్న కుర్రాళ్లలో టెస్టులు ఆడే నైపుణ్యం తగ్గుతోందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆచితూచి ఆడడం, క్రీజులో కుదురుకోవడం అనే ప్రక్రియే యువ ఆటగాళ్లలో కనిపించడం లేదు. నిజానికి రెండో టెస్టులో ఓటమి తప్పించుకోవడం మరీ కష్టమేమీ కాదు. ఓ వంద ఓవర్లు నిలబడితే మ్యాచ్ డ్రా అయ్యేది. ఇదే మ్యాచ్‌లో ప్రత్యర్థి జట్టు తొలి రోజు 6 వికెట్లు కోల్పోయాక మిగిలిన 4 వికెట్లతో దాదాపు రోజంతా బ్యాటింగ్ చేసింది. అలాంటపుడు ఆతిథ్య జట్టు బ్యాటర్లు ఒక రోజు నిలవడం కష్టమా? కానీ షాట్లను నియంత్రించుకోలేని, డిఫెన్స్ ఆడలేని బలహీనతతో కేవలం 64 ఓవర్లకే చాపచుట్టేసింది ఇండియా. తొలి టెస్టులో పిచ్ ఎంత కఠినంగా ఉన్నా సరే.. 124 పరుగుల లక్ష్యాన్ని కూడా ఛేదించలేక 93కే కుప్పకూలడం జట్టు పతనానికి మరో రుజువు. ప్రస్తుత బ్యాటర్లలో ఎంతమందికి టెస్టులాడే టెక్నిక్ ఉందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక ద్వితీయశ్రేణి జట్టులా కనిపిస్తోంది ప్రస్తుత టీమ్‌ఇండియా. జట్టుతో పాటు ఆటతీరు ఇలా తయారవడంలో కోచ్ పాత్ర ఎంతన్నది కూడా ఇప్పుడు చర్చనీయాంశమే. కోచ్ అంటే తెర వెనుక ఉండి సహకారం అందిస్తూ, జట్టును నడిపించాల్సిన వాడు. కిర్‌స్టన్, రవిశాస్త్రి, ద్రవిడ్ ఈ పనే సమర్థంగా చేశారు. కానీ గంభీర్ మాత్రం భిన్నమైన దారిలో నడుస్తున్నట్లు కనిపిస్తోంది. తన మాటకు ఎదురు లేకుండా ఉండేందుకు, ఇది తాను తయారు చేసిన జట్టు అని ఒక ముద్ర చూపించేందుకు రోహిత్, కోహ్లి, అశ్విన్ లాంటి సీనియర్లను సాగనంపేశాడనే ఆరోపణలు అతడిపై ఉన్నాయి. జట్టులో పదే పదే మార్పులు చేయడం.. పిచ్‌ల విషయంలో అతిగా జోక్యం చేసుకోవడం.. కొందరు ఆటగాళ్లకు ఎక్కువ అవకాశాలిచ్చి, కొందరిని విస్మరించడం.. ఇలా గంభీర్ అనేక విషయాల్లో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. ముక్కుసూటిగా, సీరియస్‌గా ఉండే తన వ్యవహారశైలి జట్టు వాతావరణాన్ని దెబ్బ తీస్తోందనే చర్చ జరుగుతోంది. కోహ్లిలో ఇంకా కొన్నేళ్లు టెస్టులు ఆడే వయసు, ఫిట్‌నెస్, సాంకేతికత ఉన్నప్పటికీ.. అతను సుదీర్ఘ ఫార్మాట్ నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి కల్పించింది గంభీరే అన్నది ఆరోపణ. అవసరమైతే కోహ్లిని టెస్టుల్లోకి తిరిగి తీసుకురావడంపై బీసీసీఐ దృష్టిసారిస్తే మంచిది. అదే సమయంలో జట్టు వాతావరణాన్ని ఉత్తమ స్థితిలో ఉంచే కోచ్‌ను తీసుకురావడమూ అవసరమే. వీటన్నింటి కంటే యువ ఆటగాళ్లలో టెస్టులకు తగ్గ దృక్పథాన్ని, టెక్నిక్‌ను మెరుగుపరచడం అత్యావశ్యకం.

అవును.. అహ్మదాబాద్‌లోనే

2030 కామన్వెల్త్ క్రీడలు



గ్లాస్గో: అహ్మదాబాద్‌కు 2030 కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులను బుధవారం అధికారికంగా కట్టబెట్టారు. కామన్వెల్త్ స్పోర్ట్ సర్వసభ్య సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. కామన్వెల్త్ క్రీడల ఎగ్జిక్యూటివ్ బోర్డు గత నెలలో అహ్మదాబాద్ పేరును సిఫారసు చేసింది. ఆ నేపథ్యంలో తాజా ధ్రువీకరణ లాంఛనమే. సీడబ్ల్యూజీ ఆతిథ్య హక్కులు లభించడంతో 2036 ఒలింపిక్స్‌ను నిర్వహించాలన్న భారత్ సంకల్పానికి బలం చేకూరినట్లయింది. నైజీరియా నగరం అబుజా కూడా 2030 సీడబ్ల్యూజీ హక్కుల కోసం పోటీపడింది. అయితే 2034 క్రీడల కోసం ఆ నగరాన్ని పరిగణలోకి తీసుకోవాలని కామన్వెల్త్ స్పోర్ట్ నిర్ణయించింది. ఇంతకుముందు 2010లో భారత్ దిల్లీలో కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యమిచ్చింది. అందుకోసం రూ.70 వేల కోట్లు ఖర్చు చేసింది. 2030లో 15-17 క్రీడల్లో పోటీలు నిర్వహించాలని భారత్ భావిస్తోంది. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్ ఈ క్రీడలకు ఆతిథ్యమివ్వనుంది. నిర్ణీత సమయానికి ముందే మౌలిక సదుపాయాల ఏర్పాట్లు పూర్తి చేస్తామని భారత అధికారులు చెప్పారు. 2030 అక్టోబరులో క్రీడలను నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. కామన్వెల్త్ క్రీడల కంటే ముందు 2028లో ప్రపంచ అండర్-20 ఛాంపియన్‌షిప్స్‌ను అహ్మదాబాద్‌లో నిర్వహించాలని భారత ఒలింపిక్ సంఘం భావిస్తోంది. భారత్ కామన్వెల్త్ క్రీడల ఆతిథ్య హక్కులు గెలవడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు. దేశ ప్రజలకు అభినందనలు తెలిపారు.

ఖేల్‌రత్న వస్తుందనుకుంటున్నా

- ఒలింపిక్స్ పతకమే లక్ష్యం
- భారత అగ్రశ్రేణి ఆర్చర్ జ్యోతి సురేఖ



జ్యోతి సురేఖ

ఈనాడు, హైదరాబాద్: దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు లభిస్తుందని భావిస్తున్నట్లు భారత అగ్రశ్రేణి ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ తెలిపింది. ప్రపంచ ఆర్చరీలో అన్ని టోర్నీల్లో విజేతగా నిలిచానని.. ఒలింపిక్స్ పతకంతో కెరీర్‌ను సంపూర్ణం చేసుకోవాలని అనుకుంటున్నట్లు బుధవారం విలేకరుల సమావేశంలో సురేఖ పేర్కొంది. ఇటీవల ఢాకాలో జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్‌లో సురేఖ రెండు స్వర్ణాలతో సత్తాచాటింది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో ఆమె పసిడి గెలిచింది. 15 ఏళ్ల కెరీర్‌లో ఆమె 90 అంతర్జాతీయ పతకాలు సాధించింది. ప్రపంచ ఛాంపియన్‌షిప్, వరల్డ్‌కప్, ఆసియా క్రీడలతో సహా దాదాపుగా అన్ని ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పతకాల పంట పండించిన సురేఖ.. ప్రపంచ రెండో ర్యాంకు, ఆసియాలో నంబర్‌వన్ స్థానంలో ఉంది. "లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో కాంపౌండ్ ఆర్చరీకి చోటు దక్కడం చాలా సంతోషంగా ఉంది. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక టోర్నీలన్నింట్లో పతకాలు సాధించా. ఒలింపిక్స్‌లోనూ దేశానికి పతకం అందించినప్పుడే నా కెరీర్ సంపూర్ణం అవుతుంది. ఇప్పుడు నా లక్ష్యం ఒలింపిక్స్ పతకం. దానికి ఖేల్‌రత్న అవార్డు స్ఫూర్తినిస్తుందని అనుకుంటున్నా. కొన్నేళ్లుగా ఖేల్‌రత్న రేసులో నిలుస్తూ అత్యధిక పాయింట్లతో ముందంజలో ఉంటున్నా ఆ పురస్కారం దక్కడం లేదు. ఈసారి లభిస్తుందని గట్టిగా నమ్ముతున్నా. ఒలింపిక్స్‌లో కాంపౌండ్ ఆర్చరీని చేర్చిన తర్వాత మాకు ప్రాధాన్యం లభిస్తోంది. కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుండటంతో మాపై బాధ్యత కూడా పెరిగింది. కఠోర శ్రమతోనే 15 ఏళ్లుగా రాణిస్తున్నా. భవిష్యత్తులోనూ ఇదే సంకల్పాన్ని కొనసాగిస్తా" అని సురేఖ వివరించింది.

శ్రీకాంత్ ముందంజ

లఖ్‌నవూ: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ ముందంజ వేశాడు. బుధవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో శ్రీకాంత్ 21-13, 21-10తో కవిన్ తంగమ్‌పై, కిరణ్ జార్జ్ 21-17, 21-9తో జేసన్ గుణవన్ (హాంకాంగ్)పై, ప్రియాన్షు రజావత్ 21-18, 21-14తో మైస్నాం మీరాబాపై, రాహుల్ భరద్వాజ్ 18-21, 21-16, 23-21తో తరుణ్‌రెడ్డిపై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు.

భారత టీటీ జట్టుకు రజతం

దిల్లీ: ఐటీటీఎఫ్ ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారిగా ఫైనల్ చేరుకుని చరిత్ర సృష్టించిన భారత అండర్-19 బాలుర జట్టు రజతం సాధించింది. రొమేనియాలో జరుగుతున్న ఈ టోర్నీ ఫైనల్లో భారత్ 0-3తో జపాన్ చేతిలో పరాజయం చవిచూసింది. అంకుర్ భట్టాచార్య 17-15, 6-11, 12-10, 4-11, 11-13తో రైసీ కవాకమి చేతిలో, అభినంద్ 7-11, 8-11, 6-11తో కజాకి యోషియామా చేతిలో, ప్రియానుజ్ 9-11, 7-11, 3-11తో తమితో వతనబె చేతిలో ఓడారు.

19 ఏళ్ల కుర్రాడు.. చెస్ ప్రపంచకప్ గెలిచాడు



సిందరోవ్

పనాజి: భారత్ ఆతిథ్యమిచ్చిన చెస్ ప్రపంచ కప్‌లో ఉజ్బెకిస్థాన్ కుర్రాడు జవోకిర్ సిందరోవ్ విజేతగా నిలిచాడు. అతడి వయసు 19 ఏళ్లే. అత్యంత పిన్న వయసులో ఈ ప్రతిష్ఠాత్మక ట్రోఫీని సొంతం చేసుకున్న ప్లేయర్‌గా సిందరోవ్ రికార్డు నెలకొల్పాడు. ఫైనల్లో అతను.. 2.5-1.5తో వీ యి (చైనా)ను ఓడించాడు. వీరి మధ్య తొలి గేమ్ డ్రాగా ముగియగా.. రెండో గేమ్‌లో సిందరోవ్ పైచేయి సాధించాడు. నాదిర్బెక్ (ఉజ్బెకిస్థాన్)ను 2-0తో ఓడించిన ఆండ్రీ ఎసిపెంకో (ఫిన్లాండ్) మూడో స్థానంలో నిలిచాడు. చెస్ ప్రపంచకప్‌లో ఫైనల్ చేరడం ద్వారా సిందరోవ్, వీ యి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు.

భారత్ 4.. మలేసియా 3

ఇపో: సుల్తాన్ అజ్లాన్ షా హాకీ కప్‌లో భారత్ బుధవారం 4-3తో మలేసియాపై విజయం సాధించింది. భారత్ తరఫున సెల్వమ్ కార్తి (7వ), సుఖ్‌జీత్ సింగ్ (21వ), అమిత్ రోహిదాస్ (39వ), సంజయ్ (53) తలో గోల్ కొట్టారు. మలేసియా జట్టులో ఫైజల్ సారి (13వ), ఫిత్రి సారి (36వ), మర్హాన్ జలీల్ (45వ) స్కోర్ చేశారు. భారత్ (6 పాయింట్లు).. పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది.

అయిదో స్థానంలో భారత్

గువాహటి: ఐసీసీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో టీమ్‌ఇండియా అయిదో స్థానానికి పడింది. 9 మ్యాచ్‌ల్లో 4 విజయాలు సాధించిన భారత జట్టు 4 మ్యాచ్‌ల్లో ఓడింది. ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. 48.15 గెలుపు శాతంతో ఉన్న భారత్ డబ్ల్యూటీసీలో భాగంగా ఇంకో 9 మ్యాచ్‌లు ఆడనుంది. పట్టికలో ఆస్ట్రేలియా (100 శాతం) అగ్రస్థానంలో, దక్షిణాఫ్రికా (75) రెండో స్థానంలో ఉన్నాయి. శ్రీలంక (66.67), పాకిస్థాన్ (50) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

ఉర్విల్ అదుర్స్

31 బంతుల్లోనే సెంచరీ

ఈనాడు, హైదరాబాద్: గుజరాత్ బ్యాటర్ ఉర్విల్ పటేల్ (119 నాటౌట్; 37 బంతుల్లో 12×4, 10×6) అదరగొట్టాడు. బౌండరీలు, సిక్సర్లతో చెలరేగి కేవలం 31 బంతుల్లోనే సెంచరీ సాధించడంతో సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో గుజరాత్ శుభారంభం చేసింది. బుధవారం గ్రూపు-సి పోరులో గుజరాత్ 8 వికెట్ల తేడాతో సర్వీసెస్‌పై విజయం సాధించింది. గౌరవ్ కొచ్చర్ (60; 37 బంతుల్లో 7×4, 2×6) రాణించడంతో మొదట సర్వీసెస్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు రాబట్టింది. బదులుగా గుజరాత్ 12.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. కేవలం రెండు వికెట్లు కోల్పోయి 183 పరుగులు సాధించింది. ఆర్య దేశాయ్ (60; 35 బంతుల్లో 6×4, 3×6), 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఉర్విల్ తొలి వికెట్‌కు 174 పరుగులు జోడించి గుజరాత్‌కు విజయాన్ని అందించారు. మరోవైపు గ్రూపు-బీ మ్యాచ్‌లో హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో మధ్యప్రదేశ్‌ను ఓడించింది.

సందేహం నుంచి.. జ్ఞానోదయం వరకూ!

కురుక్షేత్ర యుద్ధ సమయంలో శ్రీకృష్ణపరమాత్ముడు కర్తవ్య నిర్వహణ గురించి అర్జునుడికి చేసిన హితబోధే భగవద్గీత. అందులో ప్రతి అక్షరం ఒక శక్తిమంతమైన బాణం. ప్రతి భావం అమూల్య సందేశం. అందుకే గీతలో లేనిది లేదు- అంటారు ఆధ్యాత్మికవేత్తలు. అది సర్వకాలికం, సార్వజనీనం.



డిసెంబరు 1 గీతా జయంతి

భగవద్గీత.. అది మరీ ఉద్గ్రంథం ఏమీ కాదు. మొత్తం 18 అధ్యాయాలు, 700 శ్లోకాలు. అందులో శ్రీకృష్ణుడి సందేశాలు 574, అర్జునుడి సందేహాలు 84, సంజయుడి మాటలు 41 కాగా.. ధృతరాష్ట్రుడి శ్లోకం ఒకటి. కానీ దీని ప్రాముఖ్యత మాత్రం అనంతం. అసలు ఆధునిక కాలంలో భగవద్గీత అవసరం ఏమిటి అంటే.. అది మొన్నటికో నిన్నటికో పరిమితం కాదు. ఎప్పటికీ ఎల్లరకూ అవసరమైంది. సత్యాన్ని దర్శింపజేస్తుంది. గురువులా ఉద్బోధిస్తుంది. సర్వ సందేహాలకూ సమాధానం ఇస్తూ సకల సమస్యలకూ పరిష్కారం చూపుతుంది. సముద్రంలో అలలు ఎంత సహజమో జీవితంలో కష్టనష్టాలూ అంతే సహజం. భగవద్గీత సమస్యల్ని రూపుమాపుతుందని చెప్పలేం కానీ వాటిని ఎదుర్కొనగల ధైర్యాన్ని, పరిష్కరించుకోగల సామర్థ్యాన్ని తప్పనిసరిగా అందిస్తుంది.

భగవద్గీతలోని 'ధర్మక్షేత్రే కురుక్షేత్రే..' అన్న మొట్టమొదటి శ్లోకంలోనే గీతా సారాంశాన్ని అందించాడు వ్యాస మహర్షి. ఈ శ్లోకంలో 'క్షేత్రే క్షేత్రే ధర్మం కురు' ప్రయోగాన్ని పరిశీలిస్తే.. ఎవరు ఏ రంగంలో ఉన్నా, ఏ స్థాయిలో ఉన్నా, ఎక్కడున్నా, ఎలా ఉన్నా.. ధర్మాన్ని ఆచరించాలి. ఇక్కడ మళ్లీ ఏ ధర్మాన్ని ఆచరించాలనే మరో సందేహం. దానికి భగవద్గీత చివరి శ్లోకంలోని చిట్టచివరి పదం 'మమ' అన్నది సమాధానం. గీతలోని తొలి పదం 'ధర్మ', చివరి పదం 'మమ'. ఈ రెండింటినీ కలిపితే.. 'మమ ధర్మం' అవుతుంది. అంటే ఆయా వ్యక్తులకు సమాజం నిర్ణయించిన ధర్మాన్ని ఆచరించాలని చెబుతుంది భగవద్గీత.

అర్జునుడి ఆవేదన..

అర్జునుడంతటి యోధుడు, విద్యావంతుడు.. మరుక్షణంలో యుద్ధం ప్రారంభం కాబోతుండగా తన క్షత్రియ ధర్మాన్ని మరిచాడు. దుర్యోధనాదుల్ని కంటే పడేసి 'నా తాత, తండ్రి, సోదరులు, గురువులు, స్నేహితులు.. వీళ్లంతా నా వాళ్లు' అనే మమకారంలో మునిగాడు. నిర్వేదానికి నిస్సత్తువకూ గురయ్యాడు. అర్జునుడి ఈ నిర్వేదమే గీతాబోధకు కారణం. జీవితాన్ని తులాదండంగా (త్రాసు) భావిస్తే.. కుడి ఎడమల్లోని సిబ్బెలు, మధ్యలోని ముల్లు లాంటివి భగవద్గీత మొదటి, మధ్య, చివరి (ఆదిమధ్యాంతాల్లోని) మూడు శ్లోకాలు. అవి జీవిని వేదనకు పరమాత్మ అనుగ్రహానికి సమన్వయాన్ని కలిగించి జీవనాన్ని సమతుల్యం చేస్తాయి.

తులాదండం ఒరిగింది...

కార్పణ్యదోషోపహత స్వభావః పృచ్ఛామి త్వాం ధర్మసమ్మూఢచేతాః
యచ్ఛ్రేయః స్యాన్నిశ్చితం బ్రూహి తన్మే శిష్యస్తేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్

తాను పాటించాల్సిన ధర్మాన్ని మరచి, మనసంతా మమకారం నిండిపోవడం వల్ల మంచేదో చెడేదో తెలుసుకోలేని స్థితిలో ఉన్నాడు అర్జునుడు. అందుకే తనకు మార్గదర్శనం చేయమని శ్రీకృష్ణుని ప్రార్థించాడు. అర్జునుడి మనసులోని ఆధ్యాత్మిక తులాదండం కార్పణ్య దోషం వల్ల ఒకదిక్కుకు ఒరిగిపోయింది. దాన్ని సమతుల్యం చేయడానికి కృష్ణపరమాత్ముడు అర్జునుడి నెపంతో..

సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః

అంటూ లోకానికి భరోసా ఇచ్చాడు. 'అన్ని ధర్మాలనూ వదిలిపెట్టి నన్ను ఆశ్రయించు.. సర్వపాపాల నుంచి నిన్ను విముక్తుణ్ని చేస్తాను' అని పరమాత్మ అభయమిచ్చాడు. అయితే అలా భరోసా ఇచ్చే ముందు- కర్మంటే ఏమిటి? కర్మ సన్యాసానికి నిర్వచనం ఏమిటి? ధ్యానం, జ్ఞానం, భక్తి అంటే ఏమిటి? అసుర లక్షణాలు, దైవ లక్షణాలు, ఉత్తమపురుష లక్షణాలు, సత్వ రజస్తమో గుణాలు, మోక్షం, మోక్ష సన్యాసం.. ఇలా అనేక విషయాల గురించి వివరంగా తెలియజేశాడు. కార్పణ్యదోషం కారణంగా ఒక దిక్కుకు ఒరిగిన అర్జునుడి మానసిక తులాదండం ముల్లు గీతాబోధతో సమాన స్థాయికి చేరింది.

అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగ క్షేమం వహామ్యహం

వేరే ఆలోచన లేకుండా సర్వ సమర్పణ భావంతో పరమాత్మను ఉపాసిస్తూ ఆశ్రయిస్తే వారి యోగక్షేమాల్ని తానే చూసుకుంటానని లోకానికి ఇచ్చిన భరోసా ఇది. అయితే ఇక్కడ ఒక విషయం గమనించాలి. పరమాత్మను ఉపాసించడం అంటే ముక్కు మూసుకుని తపస్సు చేస్తూ కూర్చోమని కాదు. ప్రతి పనిలో పరమాత్మను చూడమని, ప్రతి పనిని భగవదర్పణ చేయమని దీని అర్థం. అంటే చేసే పనినే పూజగా భావించి చేయమని పరమాత్మ భావన. భగవద్గీత కర్తవ్యం ఆచరించడమే తప్ప కర్మ రాహిత్యాన్ని సమర్థించదు. కర్తవ్యాలను నిర్వహిస్తూనే జ్ఞానాన్ని పొందమని, చేయాల్సిన పనులను ధర్మబద్ధంగా ఆచరించమని చెబుతుంది భగవద్గీత.

గీత... ఆదిశంకరుల అన్వయం

భగవద్గీతలోని 18 అధ్యాయాల్ని మూడు భాగాలుగా విభజించి వాటికి 'తత్వమసి' అనే వేద వాక్యాన్ని అన్వయించారు జగద్గురు ఆదిశంకరాచార్యులు. అర్జున విషాద యోగం నుంచి ధ్యానయోగం వరకు ఉన్న మొదటి ఆరు అధ్యాయాలు 'త్వం'ను వివరిస్తాయి. అంటే శరీరం, మనసుల గురించి, అసలు మనమంటే ఏమిటో గీత తెలియజేస్తుంది. విజ్ఞానయోగం నుంచి భక్తియోగం వరకు 'తత్' పదాన్ని అనగా పరమాత్మ తత్వాన్ని విశదీకరిస్తుంది. ఆ తర్వాత ఉన్న క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగం నుంచి మోక్ష సన్యాసయోగం వరకూ ఉన్న చివరి భాగం 'అసి' అనేదాన్ని వివరిస్తుంది. అసి అంటే 'అవుతున్నావు' అని అర్థం. అంటే.. జీవుడిగా ఉన్న నీవు దేవుడిగా మారే మార్గాన్ని చూపిస్తుంది భగవద్గీత.

యత్ర యోగేశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః
తత్ర శ్రీ విజయోర్భూతిః ధ్రువా నీతిర్మతిర్మమ

భగవద్గీతలోని ఈ చివరి శ్లోకం మొత్తం గీతా సారాంశాన్ని తెలియజేస్తుంది. ఎక్కడ యోగీశ్వరుడైన కృష్ణుడు, ధనుర్ధారియైన అర్జునుడు (ధనుస్సును వదిలిపెట్టిన అర్జునుడు కాదు) ఉంటారో.. అక్కడ నీతిబద్ధత ఉంటుంది, విజయం చేకూరుతుంది. యోగీశ్వరుడైన కృష్ణుడు అంటే దేవుడు, ధనుర్ధారియైన అర్జునుడు అంటే కర్తవ్యపాలన చేసే (కర్తవ్యనిష్ఠ గరిష్ఠుడు) జీవుడు అంటే విజయం తథ్యం. కృష్ణుడు దైవానుగ్రహానికి, అర్జునుడు మానవ ప్రయత్నానికి ప్రతీకలు. కర్తవ్యాన్ని నిర్వర్తించు, ఫలితం గురించి ఆలోచించకు- అని పాఠం పలుకుతుంది గీత. దైవానుగ్రహం + మానవ ప్రయత్నం = విజయం. ఇదే భగవద్గీత సారం. యుద్ధభూమిలో పార్థుడి సందేహం తీర్చిన కృష్ణపరమాత్ముడి సందేశం మనందరికీ జ్ఞానోదయమే.

- డా.ఎస్ఎల్వి ఉమామహేశ్వరరావు, త్రిపురాంతకం

మార్గశిరమాసంలో గురువారానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ మాసంలో గురువారం రోజున చేసే పూజను మార్గశిర గురువార వ్రతం అంటారు. సంవత్సరానికి ఒకసారి ఈ వ్రతం ఆచరించడం శ్రేష్ఠం. ఈ వ్రతం లక్ష్మీదేవికి ప్రీతికరమైనదని పురాణాలు పేర్కొన్నాయి. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల రుణ సమస్యలు తొలగిపోతాయి. ఆరోగ్యం, ఐశ్వర్యం వృద్ధి చెందుతాయి.

లక్ష్మీదేవికి ఆనందకరమైన వ్రతం

మార్గశిర మాసంలో గురువార వ్రతం చేసుకునేవారు సూర్యోదయం కంటే ముందే నిద్ర లేచి ఇంటిని శుభ్రం చేసుకుని, తలస్నానం చేయాలి. లక్ష్మీదేవి విగ్రహాన్ని లేదా చిత్రపటాన్ని అలంకరించాలి. గణపతి ప్రార్థన అనంతరం లక్ష్మీదేవిని పూజించాలి. ఈ మాసంలో వచ్చే ప్రతి గురువారం పూజలు చేసి నైవేద్యాలు సమర్పించాలి. మార్గశిర లక్ష్మీపూజ కథ చదువుకొని అక్షతలను తలమీద వేసుకోవాలి. ఇలా నియమనిష్ఠలతో వ్రతం ఆచరించినవారికి వైకుంఠ ప్రాప్తి కలుగుతుందన్నది పురాణవచనం. ప్రశాంతమైన మనసుతో పూజాకార్యక్రమం ముగించి ఇరుగుపొరుగువారికి ప్రసాదాలు పంచిపెడితే గృహంలో లక్ష్మీ తాండవిస్తుంది.



ఈ వ్రతం ఆచరించేవారు కొన్ని పద్ధతులు పాటించాలి. ఆ రోజున చిన్నారులను, దూషించకూడదు, దండించకూడదు. పెద్దలతో మన్ననగా, ప్రేమగా ఉండాలి. సాయంకాలం గడపకు రెండు వైపులా దీపాలు ఉంచాలి. దాన ధర్మాలు చేయాలి. ఎవరితోనూ ఘర్షణకు దిగకూడదు. ఉపవాసం ఉండి లక్ష్మిని పూజిస్తే ఆ ఇల్లు ధన ధాన్య పుత్ర పౌత్రాదులతో వర్ధిల్లుతుంది. మార్గశిర గురువారం లక్ష్మీదేవి భూలోకానికి విచ్చేస్తుందని, నియమనిష్ఠలతో పూజచేసేవారి ఇంట్లో అడుగు పెడుతుందని విశ్వసిస్తారు.

సాధారణంగా ఏ పూజ చేసినా చివర్లో ఉద్వాసన చెబుతారు. అయితే మార్గశిర గురువారం వ్రతంలో ఈ ప్రక్రియ ఉండదు. ఉద్వాసన అంటే ఆహ్వానించిన దేవతలను గౌరవంగా తమ నివాసాలకు పంపడం. లక్ష్మీదేవి ఇంట్లో ఉండిపోవాలని కోరుకోవాలే గానీ వెళ్లమనకూడదు. అందువల్ల ఉద్వాసన చెప్పకూడదని పండితులు చెబుతారు. గురువారాన్ని కొందరు లక్ష్మీవారం అని కూడా అంటారు.



మార్గశిర ఏకాదశిని 'మోక్షదా ఏకాదశి' అంటారు. మన ఆశలు, అవసరాలు నెరవేరాలనే కోరికతో దైవాన్ని ప్రార్థించడం అనాదిగా వస్తున్నదే. భౌతిక కోరికల సంగతి అలా ఉంచితే.. ఆధ్యాత్మిక చింతన పెంచుకుని మోక్షం కోరుకునే వారికి ఈ ఏకాదశి మహా ప్రీతికరమైంది. మోక్షం పొందాలంటే పుణ్యకార్యాలు చేస్తుండాలి. అందుకు మోక్షదా ఏకాదశి ఎంతో అనుకూలమైంది. ఈ విశిష్టదినాన మనం చేసే మంచిపనులు ద్విగుణీకృతంగా ఫలిస్తాయని, మోక్షం వస్తుందని పెద్దలు చెబుతారు. మోక్షం కలిగించే రోజు కాబట్టే ఈ ఏకాదశికి మోక్షదా ఏకాదశి అనే పేరు వచ్చింది.

విష్ణునామ సంకీర్తనలతో...

డిసెంబరు 1 మోక్షదా ఏకాదశి


మోక్షదా ఏకాదశి నాడు వేకువజామునే తలస్నానం చేసి పరిశుభ్రమైన వస్త్రాలను ధరించాలి. ఇంటినీ, పూజా మందిరాన్నీ శుభ్రం చేయాలి. విష్ణుమూర్తి ప్రతిమను పీఠంపై అమర్చి అలంకరించాలి. ప్రతిమకు పాలు, పెరుగు, పంచదార, తేనె, నెయ్యిలతో అభిషేకం చేసి.. షోడశోపచార పూజను పూర్తి చేయాలి. పాయసం నైవేద్యంగా సమర్పించాలి.

మోక్షదా ఏకాదశి రోజున భగవద్గీతను పూజిస్తారు. సాయంత్రం వైష్ణవ ఆలయాలను దర్శిస్తారు. ఈ రోజున భగవద్గీతతో పాటు, విష్ణు సహస్రనామం, ముకుందాష్టకం చదవడం శుభప్రదం అనేది పెద్దల మాట. సాయంత్రం మరోసారి పూజ చేసి.. తమ శక్తికి తగ్గట్టుగా దానధర్మాలు చేయాలి. రోజంతా ఉపవాసం ఉండి విష్ణునామ సంకీర్తనలతో గడపాలి. రాత్రి జాగరణ చేయాలి. మరునాడు ఉదయం మళ్లీ పూజ చేసి నైవేద్యం సమర్పించడంతో ఏకాదశి వ్రతం పూర్తి చేసినట్టవుతుంది. అప్పుడు ఉపవాస దీక్ష విరమించాలి.

పూర్వం వైఖానసుడు అనే రాజు ఏకాదశి వ్రతం ఆచరించి మోక్షాన్ని పొందినట్టుగా పురాణాలు పేర్కొన్నాయి. ప్రతి సంవత్సరం ఈ వ్రతం నియమ నిష్ఠలతో పాటించే వారికి మోక్షం లభిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. పూర్తిగా ఉపవాసం పాటించలేనివారు పాలు, పండ్లు సేవించవచ్చు. వ్రతం ఆచరించని వారు కూడా మోక్షదా ఏకాదశి రోజున ఉల్లి, వెల్లుల్లి మొదలైనవి తినకూడదు. ఈ విశిష్ట దినాన విష్ణుమూర్తిని పూజించడం వలన లక్ష్మీదేవి కరుణా కటాక్షాలు కూడా లభిస్తాయన్నది పండిత వచనం.

పిల్లల్ని ఎలా పెంచాలంటే...

ఎదిగే వయసులోని చిన్నారులను నైతికంగా, ఆధ్యాత్మికంగా, భావోద్వేగపరంగా ఆదర్శప్రాయంగా తీర్చిదిద్దాలి, అదే సమయంలో వారి అవసరాలను తీర్చటంపై దృష్టి సారించాలని ఇస్లాం ధర్మం పేర్కొంటుంది. ప్రధానంగా 'ఆడండి- నేర్పండి- స్నేహం చేయండి' అనే మూడు దశలున్న అభివృద్ధి మార్గాన్ని సూచిస్తుంది. ఒక్కో దశ ఏడేళ్ల కాలం కొనసాగుతుంది.




ఇస్లాం సందేశం

తొలి ఏడేళ్లలో ఆటపాటల మార్గాన్ని అవలంబించాలి. ఇది పిల్లలతో బలమైన ప్రేమపూర్వక బంధాన్ని ఏర్పరుస్తుంది. రెండో దశలోని ఏడేళ్ల కాలంలో అంటే పిల్లలకు 14 ఏళ్ల వయసు వచ్చే వరకూ ఒక గురువులా వ్యవహరించాలి. మతపరమైన, నైతిక విద్యకు బలమైన పునాదులు వేయటానికి.. నిత్యజీవితంలో క్రమశిక్షణను అలవర్చటానికి అత్యంత అనువైన సమయమిది. చివరి ఏడేళ్లు బాలబాలికలు యుక్త వయసులోకి అడుగు పెట్టే దశ. కీలకమైన ఈ దశలో వారితో స్నేహితుల్లా మెలగాలి. సరైన దారిలో వెళ్లేలా వారికి మార్గనిర్దేశం చేయటంపై దృష్టి సారించాలి. అవసరమైనప్పుడు తగిన సలహాలు ఇవ్వటం ద్వారా తగిన నిర్ణయాలు తీసుకునేలా వారిని ప్రోత్సహించాలి. పిల్లల పెంపకం తల్లిదండ్రుల పవిత్ర బాధ్యత అని గ్రహించాలి.

దైవ ప్రవక్త ముహమ్మద్ (స) అవలంబించిన సౌమ్యతను పాటిస్తూ తల్లిదండ్రులు ప్రేమతో, సహనంతో తమ పిల్లలను ముందుకు నడిపించాలి. అదే సమయంలో తగిన ఆధ్యాత్మిక శిక్షణ ద్వారా అల్లాహ్‌తో బలమైన బంధం ఏర్పడేలా వారిని తీర్చిదిద్దాలి. చిన్నప్పటి నుంచే నిజాయతీ, సమగ్రత, కరుణ, ఇతరుల పట్ల గౌరవం వంటి విలువలను పిల్లల్లో పెంపొందించాలి. ఇది నైతికంగా పటిష్ఠమైన పునాది ఏర్పడటానికి, పెద్దయ్యాక బాధ్యతాయుతంగా వ్యవహరించటానికి తోడ్పడుతుంది. పిల్లలకు ఇస్లాం ఆచారాలు, సంప్రదాయాలు, నైతికత గురించి బోధించే బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలి. మంచి మర్యాదలు, స్వీయ జవాబుదారీతనం పెంపొందేలా వారికి సాయం చేయాలి. దయ, నిజాయితీ, క్షమాగుణం వంటి సద్గుణాలు అలవడాలంటే తల్లిదండ్రులే వారికి ఆయా విషయాల్లో ఆదర్శంగా నిలవాలి. ఆహారం, నివాసం వంటి ప్రాథమిక అవసరాలు తీర్చటమే కాకుండా ఆర్థిక ఇబ్బంది కలగకుండా చూడాలి. భద్రతతో కూడిన సురక్షిత వాతావరణాన్ని కల్పించాలి. చిన్నారులు ఏదైనా తప్పు చేస్తే తొలుత వారితో మాట్లాడి కారణమేమిటో తెలుసుకోవాలి. వారికి విధించే శిక్ష.. వాళ్లు తమ తప్పు తెలుసుకునేలా ఉండాలే కానీ కఠినంగా కాదు. పిల్లలపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే క్రమంలో ముందుగా తల్లిదండ్రులు తమ కోపతాపాలను నిగ్రహించుకోవాలని ఇస్లాం ధర్మ గ్రంథాలు పేర్కొంటున్నాయి. వీటి ఆచరణ ద్వారా భావితరాలను బాధ్యతా యుతమైన పౌరులుగా తీర్చిదిద్దవచ్చు అనటంలో సందేహం లేదు.

దేవుడిది కరుణాంతరంగం. మనం ఎవరికీ ఎలాంటి హానీ కలిగించకుండా.. చేతనైనంత సాయం చేసేందుకు ప్రయత్నిస్తూ ముందుకు సాగాలి. అలా సహృదయంతో ధర్మబద్ధమైన ప్రవర్తనతో మెలగుతుంటే.. దయామయుడైన దేవుడు తన బిడ్డలకు రెండింతల ఆశీర్వాదం ఇస్తాడు. ఈ మాట కచ్చితం. తనను విశ్వసించిన భక్తులను దేవుడు ఎంత గొప్పగా దీవించాడో గుర్తుచేసుకుందాం..

గురువులను గౌరవించాలి!



క్రీస్తు వాణి

పాపపంకిలమైన మన దేహాన్ని సిలువ పవిత్ర రక్తంతో ప్రభువు ప్రక్షాళన చేశాడు. తాను ప్రేమించిన ఇశ్రాయెల్ జాతీయులకు కానాను దేశాన్ని బహుమానంగా ఇచ్చాడు. మనం క్లిష్ట సమస్యలో ఉన్నప్పుడు దేవుని బలమైన రెక్కల కింద ఆదరణ లభిస్తుందనే విషయం నిర్వివాదాంశం. యాకోబు తన సహోదరుడైన జోసెఫ్ నుంచి దూరంగా పారిపోయాడు. ఖాళీచేతులతో నదిని దాటాడు. అయితే 'నిన్ను ఆశీర్వదించి, నీ స్వదేశానికి తిరిగి రప్పిస్తాను' అని దేవుడు దీవించాడు. ఆ మాట ప్రకారం కొన్నేళ్ల తర్వాత రెండింతలుగా ఆశీర్వాదం పొంది తన పెద్ద కుటుంబం, పశువులమంద, దాసదాసీ జనంతో (ఆది 32:5) స్వదేశానికి తిరిగొచ్చాడు. దైవాన్ని నమ్మిన యాకోబు అలా ప్రభువు అనుగ్రహం పొందాడు. కష్టకాలంలో బంధుమిత్రులపై ఆధారపడక, మనలను ఎన్నడూ విడవని, ఎడబాయని దేవుణ్ణే పూర్తిగా విశ్వసించాలి. అలా చేసినప్పుడు యాకోబు వలె అనేక ఆశీర్వాదాలు లభిస్తాయి. మరో సంఘటన.. ప్రవక్త అయిన ఏలియాను దేవుడు పరలోకానికి తీసుకువెళ్లాల్సిన సమయం సమీపించింది. అప్పుడు ఆయన ప్రియశిష్యుడైన ఎలీషా తన గురువును అనుసరిద్దామనుకున్నాడు. 'దేవుడు నన్ను తీసికెళ్లిపోతున్నాడు' అని ఏలియా చెప్పగా.. 'నేను మిమ్మల్ని ఎంతమాత్రం విడిచిపెట్టను' అని బదులిచ్చాడు ఎలీషా. అతడు దేవుణ్ణి ఎంత హృదయపూర్వకంగా ఆరాధించాడో.. తన గురువునూ అంతగా అభిమానించాడు. ఇతరులు నిరుత్సాహపరచినప్పటికీ ఎవరి మాటలనూ లక్ష్యపెట్టక.. తుదివరకూ గురువును వెన్నంటి ఉన్నాడు. గొప్ప గౌరవాభిమానాలతో సేవించాడు. కాబట్టి మనమంతా ప్రభువును ఆరాధించాలి. అలాగే దేవుడి వాక్యం బోధించే గురువులను గౌరవించాలి. వారు తెలియజేసే సువార్తలను ఆకళింపు చేసుకోవాలి. మందిరానికి వెళ్లి ప్రార్థన చేయాలి. బైబిల్ వాక్యాలను పాటించాలి. ఇలా చేసినపుడు దేవుడు రెండింతల ఆశీర్వాదం అందిస్తాడు.

కర్మఫలం.. దేవుడికైనా తప్పదు

సాధువు ప్రవచనం ముగిసింది. ఒక వ్యక్తి 'గురువర్యా! కర్మఫలం గురించి వింటుంటాను గానీ చాలా సందేహాలున్నాయి.. మీరు కాస్త వివరంగా చెప్పండి' అనడిగాడు. సాధువు చిరునవ్వు నవ్వి.. ఇలా చెప్పటం ఆరంభించారు...

'మహాభారత యుద్ధం తర్వాత ద్వారక మునిగిపోయింది. శ్రీకృష్ణపరమాత్ముడికి నిర్యాణసమయం ఆసన్నమైంది. అలాంటి తరుణంలో ఆయన ఎంతో మహిమాన్వితమైన ప్రభాసతీర్థంలో రావిచెట్టుపై విశ్రమించాడు. ఎడమ పాదాన్ని కుడి తొడపై చేర్చి శయనభంగిమలో ఉన్నాడు. ఆ సమయంలో ఒక వేటగాడు సముద్రంలో విసిరిన ముసలం (రోకలి వంటి ఆయుధం) చిన్న ముక్కను బాణానికి అమర్చి వేటకు బయల్దేరాడు.

దూరం నుంచి శ్రీకృష్ణుడి పాదాన్ని జింకముఖంగా భ్రమించిన వేటగాడు గురి చూసి బాణం వదిలాడు. తీరా దగ్గరికి వచ్చి శ్రీకృష్ణుడని గ్రహించి ఆందోళనచెందాడు. ఏదో మాయ ఆవహించినందువల్లే ఈ మహాపరాధం జరిగిందని ఆవేదన చెందాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ఓదార్చి.. గత జన్మలో జరిగిన వృత్తాంతాన్ని ఇలా చెప్పాడు... 'పూర్వజన్మలో నువ్వు కిష్కింధను పాలించిన వాలివి. నేను శ్రీరాముణ్ణి. సీతను అపహరించిన వారిని అన్వేషిస్తున్న సమయంలో నీ సోదరుడు సుగ్రీవుడితో నాకు మైత్రి కలిసింది. నీ సోదరుడికి నీతో ఉన్న వైరం వల్ల నీతో యుద్ధానికి పాల్పడుతూ సహాయం చేయమని అడగటంతో అంగీకరించాను. ఎదుటివారి బలమంతా నీకు చేరుతుందన్న విషయం తెలుసు కాబట్టి నేను చెట్టు చాటు నుంచి నిన్ను సంహరించాను. దానికి ఫలితమే ఈ జన్మలో నువ్వు కిరాతకుడిగా జన్మించి నా మరణానికి కారణభూతుడివి అయ్యావు. కర్మఫలం అంటే ఇదే. అది జన్మజన్మలకూ కొనసాగుతూనే ఉంటుంది. ఇందులో నీ తప్పేమీ లేదు, కర్మఫలం వల్లే ఇలా జరిగింది- అంటూ ఓదార్చాడు. అంతే కాకుండా పుణ్యాత్ములకు మాత్రమే లభించే స్వర్గాన్ని కూడా అతడికి ప్రసాదించాడు. భగవంతుడికైనా కర్మఫలం అనుభవించక తప్పదని ఈ ఉదంతం ద్వారా గ్రహించవచ్చు' అంటూ వివరంగా తెలియజేశాడు.

తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే కాబట్టి చీమకైనా అపకారం తలపెట్టకూడదు. ఎవరికీ ఏ విధంగానూ రుణపడకూడదు- అన్నది మునుల ఉవాచ. లేకుంటే కర్మఫలం అనుభవించాల్సి వస్తుంది. కొందరు గత జన్మలో తమకు రుణపడినవారే ప్రస్తుతం రుణం తీర్చుకుంటున్నారని భావిస్తారు. నిజానికి వారు రుణపడ్డారో లేదో తెలియదు కదా! కాబట్టి



తీసుకున్నదానికి బదులు తీర్చుకోవాలి. లేకుంటే మరుజన్మలో వారి రుణం తీర్చుకోవాల్సి వస్తుంది. అందుకే ఎవరి నుంచి అయినా ఏదైనా తీసుకుంటే.. తిరిగి ఇచ్చేసి రుణ విముక్తులు అవ్వాలన్నది పెద్దల మాట. ఇరుగుపొరుగువారు రుచి చూడమని కూరో, పచ్చడో ఇచ్చినా బదులుగా మరేదో ఇవ్వడం వెనుక ఉన్న ఆంతర్యం ఇదే. కొందరు అతి చిన్న వయసులోనే మృత్యువాత పడుతుంటారు. పూర్వజన్మలో చేసిన కర్మలే అందుకు కారణమని, అందుకే కర్మఫలం విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని పెద్దలు చెబుతుంటారు.

- యలమర్తి అనూరాధ



సాధువులు తమ గురించి, తమకు ఎదురైన సన్నివేశాల గురించి పెద్దగా ప్రస్తావించరు. అయితే ఒక సందర్భంలో కంచి పరమాచార్య తన జీవితంలో జరిగిన రెండు అనుభవాలను భక్తులతో ఇలా పంచుకున్నారు...

పాఠం నేర్పిన సంఘటనలు

'అప్పుడు నాకు నాలుగేళ్ల వయసు. ఒకరోజు ఓ పునుగు పిల్లి (దీన్నుంచి సుగంధం వెలువడుతుంది) మా ఇంట్లో అటక మీదున్న ఆహారాన్ని దొంగిలించేందుకు వచ్చి.. రాగిచెంబులో తల దూర్చింది. తలను బయటకు తీసుకోలేక అటకమీద అటూ ఇటూ గెంతుతూ వీర విహారం చేసింది. ఆ శబ్దాలు ఎంత భయంకరంగా ఉన్నాయంటే.. రాత్రంతా మాకే గాక చుట్టుపక్కల వారికి కూడా నిద్రాభంగం చేశాయి. తెల్లారిన తర్వాత పొరుగింటి వ్యక్తి.. పిల్లి తలను చెంబులోంచి ఎలాగోలా బయటకు తీశాడు. అది గుర్తుండిపోయే సంఘటనే కాదు.. నాకు జీవిత సత్యం కూడా బోధపడింది. ఇక నా రెండో అనుభవం ఏమిటంటే... మా అమ్మ నాకు బంగారు కడియాలు చేయించి చేతికి తొడిగింది. అవి వదులుగా ఉండటంతో.. కొంచెం బిగువుగా అవ్వాలని గట్టిగా నొక్కుతున్నాను. అప్పుడో వ్యక్తి వచ్చి వాటిని ఇవ్వమన్నాడు. అతడు కంసాలి కాబోలు, సరిచేయడానికి అడుగుతున్నాడు- అనుకున్నాను. వెంటనే కడియాలు తీసిచ్చి.. 'అయితే వీటిని సరిచేసి తీసుకురా' అన్నాను. 'అలాగే.. కొద్దిసేపట్లో తీసుకొస్తాను' అని వెళ్లిపోయాడతడు. అతడు రాకపోయేసరికి అమ్మతో జరిగింది చెప్పాను. సదరు వ్యక్తి పొన్నుస్వామి అనే దొంగ అని తెలిసింది. తర్వాత అతణ్ణి పట్టుకున్నారు, శిక్షించారు. ఈ రెండు సంఘటనలూ నేను పసిబాలుడిగా ఉన్నప్పుడు జరిగాయి. ఇప్పుడు వయసు మీదపడినప్పటికీ అవి మనసులో ముద్రితమయ్యాయి. ఎందుకంటే వాటి నుంచి నేను పాఠం నేర్చుకున్నాను. ఆత్రుతతో అడ్డ దారుల్లో భౌతికమైన లాభాలు పొందాలనుకుంటే పునుగు పిల్లి, పొన్నుస్వామిల్లా శిక్షను అనుభవించాల్సి వస్తుంది. స్వార్థపూరిత ఆలోచనలను విరమించుకోవాలి. ధర్మం, నైతికత అత్యవసరం. ఇతరుల శ్రేయస్సు కోసం శ్రమించాలి. భౌతిక సుఖసౌఖ్యాలకు ప్రాధాన్యత ఇవ్వక.. ఆధ్యాత్మిక చింతనతో జీవించాలి' అంటూ తెలియజేశారు.

ముడి సరకులకు మూలాధారాలు!

జనరల్ స్టడీస్ – ఇండియన్ జాగ్రఫీ

వాణిజ్య పంటలు

ఆర్థిక ప్రాముఖ్యత ఉన్న ఉత్పత్తుల్లో వాణిజ్య పంటలు ప్రధానమైనవి. దేశ ఆర్థికవ్యవస్థ బలోపేతానికి, రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, ప్రజల ఆహార, పారిశ్రామిక అవసరాలను తీర్చడానికి ఇవి ఎంతో అవసరం. అధిక జనాభా ఉన్న భారత్‌లో ఆహార పంటలతో పాటు వాణిజ్య పంటలకూ ప్రాధాన్యం పెరుగుతోంది. దేశంలో సాగయ్యే ప్రధాన వాణిజ్య పంటలు, వాటి ఉత్పత్తి, వినియోగ పరిమాణాలపై పోటీ పరీక్షార్థులకు సమగ్ర పరిజ్ఞానం ఉండాలి. ఒక్కో పంట సాగుకు అనుకూల పరిస్థితులు, దేశంలో అందుకు అనువైన ప్రాంతాలు, ఎక్కువగా పండిస్తున్న రాష్ట్రాల వివరాలను తెలుసుకోవాలి.

స్వాతంత్ర్యానంతరం భారతదేశం మొదట ఆహార పంటల విషయంలో స్వావలంబన సాధించింది. ఆ తర్వాత వాణిజ్య పంటలపై దృష్టి సారించింది. వాటిలో కొన్ని ఆహారంగా ఉపయోగపడితే, మరికొన్ని పరిశ్రమల ఉత్పత్తి అవసరాలకు ముడిసరకుగా మారుతున్నాయి. వాణిజ్య పంటల్లో చెరకు, నూనెగింజలు, పప్పుధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, కాఫీ, టీ తదితరాలను ఆహార పంటల కిందకు వస్తాయి. పత్తి, పొగాకు, జనుము, రబ్బరు మొదలైన ఆహారేతర పంటలు. కాఫీ, టీ, రబ్బరు తోటపంటల జాబితాలో ఉన్నాయి. ఈ పంటల్లో కొన్ని పరిశ్రమలకు ముడిసరకుగా నిలుస్తున్నాయి. మరికొన్ని ప్రత్యేకంగా ఎగుమతులుగా మారి విదేశీమారక ద్రవ్యాన్ని సమకూరుస్తున్నాయి. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలు వివిధ రకాల వాణిజ్య పంటలకు ప్రసిద్ధి చెందాయి.


చెరకు

చెరకు: భారతదేశంలో పురాతన కాలం నుంచి చెరకు పంట ఉంది. ప్రపంచ చెరకు ఉత్పత్తిలో బ్రెజిల్ మొదటి, భారత్ ద్వితీయ స్థానాల్లో ఉన్నాయి. ప్రపంచ చక్కెర ఉత్పత్తిలో భారత్‌ది 19% (సుమారు 35.5 మిలియన్ మెట్రిక్ టన్నులు) వాటా ఉంది. వినియోగంలో 28.5 మిలియన్ మెట్రిక్ టన్నులతో ప్రపంచంలోనే తొలి స్థానం (2024-25 లెక్కల)లో నిలిచింది. ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కువగా చెరకు పండిస్తారు. చెరకుతో బెల్లం, చక్కెర ఉత్పత్తి చేస్తారు. ఈ పంటకు 20°C - 27°C ఉష్ణోగ్రత, 110-150 సెం.మీ.ల వర్షపాతం, నల్లరేగడి, ఒండ్రు నేలలు అనుకూలం.


పత్తి

పత్తి: భారతదేశ పురాతన పంట. ప్రాచీన కాలం నుంచి దేశం వస్త్ర పరిశ్రమకు, ఎగుమతులకు ప్రసిద్ధి. వాణిజ్య పంటలన్నింటిలోనూ పత్తికి ప్రత్యేక స్థానం ఉంది. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కూడా దేశ వస్త్ర పరిశ్రమకు పత్తి వెన్నెముక లాంటిది. దీనిని తెల్ల బంగారం అంటారు. పత్తి పంటకు 20°C - 30°C వరకు ఉష్ణోగ్రత, 50-100 సెం.మీ. వర్షపాతం, నల్లరేగడి నేలలు అనుకూలం. నీటిపారుదల పద్ధతుల్లో కూడా పొడి ప్రాంతాల్లోనూ పండించవచ్చు. 2024-25 లెక్కల ప్రకారం పత్తి ఉత్పత్తిలో చైనా తర్వాత రెండో స్థానం భారత్‌ది.


జనుము

జనుము: దేశ ఈశాన్య ప్రాంతాల్లో జనపనార ప్రధాన పంట. ప్రపంచ జనుము పంటలో సగానికిపైగా భారత్‌లోనే పండుతోంది. ఉత్పత్తిలోనూ మొదటి స్థానంలో ఉంది. 2, 3 స్థానాల్లో బంగ్లాదేశ్, ఉజ్బెకిస్థాన్ ఉన్నాయి. జనపనారను 'గోల్డెన్ ఫైబర్' అంటారు. పశ్చిమ బెంగాల్‌లో అధికంగా పండిస్తారు. 25°C - 35°C ఉష్ణోగ్రత, 100-140 సెం.మీ.ల వర్షపాతం, సారవంతమైన డెల్టా, ఒండ్రు నేలలు జనుముకు అనుకూలం. ఇది ఖరీఫ్ పంట.


పొగాకు

పొగాకు: క్రీ.శ. 1508లో పోర్చుగీసువారు పొగాకును దేశంలోకి తీసుకొచ్చారు. ఈ పంటకు 16°C - 35°C వరకు ఉష్ణోగ్రత, 50 సెం.మీ.లకు పైగా వర్షపాతం అవసరం. నల్లరేగడి నేలలు అనుకూలం. ఏపీలోని గుంటూరు, కృష్ణా జిల్లాల్లో మేలిమి రకమైన వర్జీనియా పొగాకు పండుతుంది. 2024-25 లెక్కల ప్రకారం పొగాకు ఉత్పత్తి, ఎగుమతి పరంగా చైనా తర్వాత రెండో స్థానంలో భారత్ ఉంది. ప్రపంచ పొగాకు సాగు విస్తీర్ణంలో 0.45 మిలియన్ హెక్టార్లతో 10% వాటా భారత్‌కు ఉంది. ప్రధానంగా గుజరాత్, ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో పండిస్తారు.


కాఫీ

కాఫీ: సముద్ర మట్టానికి 900-1800 మీటర్ల ఎత్తులో కొండవాలులో సాగు చేస్తారు. కర్ణాటకలోని బాబాబుదాన్ గిరి, చిక్కమగళూరు, కూర్గ్, మంజరాబాద్; కేరళలోని వయనాడ్, ట్రావెన్‌కోర్; తమిళనాడులోని షెవరాయ్, పల్నిస్, నీలగిరి, అన్నామలై ప్రాంతాల్లో, తూర్పు కనుమల్లోనూ పండిస్తారు. ప్రపంచ కాఫీ ఉత్పత్తిలో భారత్ స్థానం 7.


టీ (తేయాకు)

టీ (తేయాకు): ఇది ఆకుజాతి పంట. పర్వతప్రాంత నేలలు అనుకూలం. ప్రస్తుతం భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద తేయాకు ఉత్పత్తిదారు (మొదటిది చైనా). అస్సాం తేయాకును అత్యధికంగా ఉత్పత్తి చేస్తోంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోనూ తేయాకు తోటలు ఎక్కువ.


రబ్బరు

రబ్బరు: హెవియాబ్రెజిలెన్సిస్ అనే చెట్టు నుంచి తీసిన రబ్బరు పాల ద్వారా సహజ రబ్బరు ఉత్పత్తి చేస్తారు. రబ్బరు ఉత్పత్తిలో కేరళ ముందంజలో ఉంది. త్రిపుర, అస్సాం, కర్ణాటక, తమిళనాడుల్లో రబ్బరు చెట్లు ఉన్నాయి.


కొబ్బరి

కొబ్బరి: తీరప్రాంత ఇసుక నేలలు, లేటరైట్ నేలలు అనుకూలం. కేరళ, తమిళనాడు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కువగా పండిస్తారు.

సుగంధద్రవ్యాలు: ఇవి ఆహారానికి సువాసన, పోషకాలను సమకూరుస్తాయి. ప్రధానంగా ఆయన ప్రాంత, ఉప-ఆయన ప్రాంతాల్లో పండుతున్నాయి. ప్రపంచ సుగంధద్రవ్యాల ఉత్పత్తిలో భారత్‌అగ్రస్థానం (1.5 కోట్ల మెట్రిక్ టన్నులు)లో ఉంది. ఎక్కువగా కేరళలో ఇవి ఉత్పత్తి అవుతాయి. కాబట్టే కేరళను సుగంధ ద్రవ్యాల ఉద్యానవనం (స్పైస్ గార్డెన్ ఆఫ్ ఇండియా)గా పిలుస్తారు.

మిరియాలు: ఇవి సుగంధ ద్రవ్యాల్లో అతి ముఖ్యమైన పంట. కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో వీటిని ఎక్కువగా పండిస్తున్నారు.

యాలకులు: వీటిని సుగంధద్రవ్యాల రాణిగా పిలుస్తారు. 800-1500 మీటర్ల ఎత్తున్న ప్రాంతం అనుకూలం. కేరళ, కర్ణాటక, తమిళనాడు ఎక్కువగా పండిస్తున్నాయి.

భారత్ మొత్తం 75 రకాల సుగంధద్రవ్యాలను ఉత్పత్తి చేస్తుంది. మిరియాలు, యాలకులు మాత్రమే కాకుండా మిరపకాయలు, ధనియాలు, మెంతులు, జీలకర్ర, పసుపు ఇంకా అనేక రకాలు ఉన్నాయి. మిరపకాయల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి.

దేశంలో అన్ని సుగంధద్రవ్యాల ఉత్పత్తి పరంగా చూస్తే మధ్యప్రదేశ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లు ఉత్పత్తిలో ముందున్నాయి.



పప్పుధాన్యాలు: ప్రోటీన్లు ఎక్కువగా ఉండే లెగ్యుమినేసి కుటుంబ పంటలన్నీ పప్పు ధాన్యాల కిందకు వస్తాయి. ఇవి ఆహారంలో ఎక్కువగా మాంసకృత్తులను అందించే శాకాహార పంటలు. వీటిలో ప్రధానమైనవి శనగలు, కందులు, పెసలు, మినుములు, వేరుశనగలు. ఇవి ఆహార పంటగానే కాకుండా భూసారాన్ని అభివృద్ధి చేసే పంటమార్పిడి పద్ధతిలోనూ ఉపయోగపడతాయి.

శనగలు: రబీ కాలం పంట. క్షారమృత్తికల్లోనూ పండుతుంది. దీనికి వర్షపాతం తక్కువగా 40-50 సెం.మీ. ఉంటే సరిపోతుంది. చల్లటి ఆహ్లాదకర వాతావరణం అనుకూలం. మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, హరియాణాలో అధిక విస్తీర్ణంలో పండిస్తాయి.

కందులు: శనగల తర్వాత ఎక్కువగా పండే పప్పుధాన్యం. ఎక్కువగా వేడి, తేమ ఉన్న ప్రాంతాలు ఈ పంటకు అనుకూలం. ఖరీఫ్ పంటగా పండిస్తారు. తేలికపాటి నేలల్లోనూ పండుతుంది. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కువగా పండిస్తున్నారు.

వేరుశనగ: ఇది ఉష్ణమండల, మెట్ట పంట. నీటివసతులు తక్కువగా ఉన్నచోట పండిస్తారు. పంటకాలం నాలుగైదు నెలలు. 50-75 సెం.మీ. వర్షపాతం, 20°C - 35°C ఉష్ణోగ్రత కావాలి. ఇసుక, నల్లరేగడి నేలలు అనుకూలం. సాగు విస్తీర్ణం, ఉత్పత్తి పరంగా భారత్ ప్రపంచంలో ద్వితీయ స్థానం (2024-25)లో ఉంది. ప్రధానంగా గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పండుతుంది.


రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

ప్రాక్టీస్ బిట్లు

1. ఇంద్రధనుస్సు విప్లవ స్థాపకులకు సంబంధించి కింది వాటిలో సరికాని జత?
   1) పసుపు విప్లవం - సామ్ పిట్రోడా
   2) నీలి విప్లవం - అరుణ్ కృష్ణన్
   3) స్వర్ణ విప్లవం - నిర్పఖ్ తుతేజ్
   4) శ్వేత విప్లవం- ఎం.ఎస్.స్వామినాథన్
2. 2023–24 నాటికి భారతదేశంలో తలసరి గుడ్ల లభ్యత?
   1) 62 2) 103 3) 110 4) 92

ఇండియన్ ఎకానమీ

3. 2024, అక్టోబరులో భారతదేశంలో ఎన్నో పశుగణన ప్రారంభమైంది?
   1) 19వ 2) 21వ 3) 20వ 4) 18వ
4. ప్రస్తుతం భారతదేశంలో నూనె గింజల ఉత్పత్తిలో అత్యధిక వాటా ఉన్న మొదటి మూడు రాష్ట్రాలను గుర్తించండి.
   1) రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్
   2) మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్
   3) రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర
   4) మధ్యప్రదేశ్, గుజరాత్, ఏపీ
5. చేపలఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న 3 రాష్ట్రాల వరుసను గుర్తించండి.
   1) ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా
   2) ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక
   3) ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు
   4) కర్ణాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్

సమాధానాలు
1-4, 2-2, 3-2, 4-1, 5-2

దరఖాస్తు చేశారా?



- ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో ప్రొఫెషనల్ ఖాళీలు
  చివరి తేదీ: 28.11.2025
- ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో కౌన్సెలర్స్ ఉద్యోగాలు
  చివరి తేదీ: 28.11.2025


ఇవిగో ప్రేరణను పెంచే మార్గాలు! — లైఫ్‌స్కిల్స్



విద్యార్థులు, ఉద్యోగార్థులకు ప్రధానంగా ఉండాల్సిన లక్షణాలు ఉత్సాహం, సన్నద్ధత. కానీ శారీరక అలసట, వ్యతిరేక ఆలోచనలు వాటిని హరించి తగిన ప్రేరణ లేకుండా చేస్తాయి. గతానికి సంబంధించిన తప్పులనే గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తు గురించి ఎక్కువగా కంగారు పడుతూ, వర్తమానంపై పట్టు కోల్పోతుంటారు. ఆ విధమైన అనవసర సందేహాలు, విమర్శలు, భయాలను పక్కన పెట్టేస్తేనే ఎవరైనా అనుకున్న లక్ష్యాన్ని సాధించగలుగుతారు. ఉన్నత లక్ష్యాలను మాత్రమే గుర్తుచేసుకుంటూ అలాంటి పరిస్థితుల నుంచి బయటపడే మార్గాన్ని, స్వీయ ప్రేరణను పెంపొందించుకునే తీరును తెలుసుకోవాలంటే **క్యూఆర్ కోడ్** స్కాన్ చేయండి.

ఫ్రాన్స్‌తో గరుడ.. యూకేతో అజేయ వారియర్!

దేశంలో ఎక్కువసార్లు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వ్యక్తిగా బిహార్ సీఎం నీతీష్ కుమార్ రికార్డు సృష్టించారు. అమెరికా చరిత్రలోనే నలభై మూడు రోజుల పాటు సుదీర్ఘంగా సాగిన షట్ డౌన్ ఎట్టకేలకు ముగిసింది. వైఫై సాంకేతికతలో విప్లవాత్మక లక్షణాలతో కూడిన సేవలు ఒమన్ విమానాశ్రయాల్లో అందుబాటులోకి వచ్చాయి. సిక్కింలోని గిరిజనుల సంప్రదాయ సంగీత వాయిద్యాల్లో రెండింటికి జీఐ గుర్తింపు లభించింది. ఒడిశాలోని సోనాపుర్ బీచ్ బ్లూ ఫ్లాగ్ జాబితాలో చేరింది. ఈ విధంగా వార్తల్లో నిలిచిన వర్తమాన అంశాలన్నింటినీ పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. ఇటీవల ప్రపంచస్థాయి గుర్తింపు పొందిన దేశ ఉత్పత్తులు, ప్రాంతాలు, వార్తల్లో వ్యక్తుల వివరాలు, బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల విశేషాలు, భారత్-మిత్ర దేశాల సంయుక్త సైనిక విన్యాసాలు, ప్రభుత్వ, కార్పొరేట్ రంగాల్లో జరిగిన నియామకాలు; వెల్లడైన సర్వేలు, నివేదికలు, విడుదలైన పుస్తకాలు, జాతీయ, అంతర్జాతీయ క్రీడల ఫలితాలన్నింటినీ అధ్యయనం చేయాలి, గుర్తుంచుకోవాలి.


గరుడ వైమానిక విన్యాసాలు


కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు

1. కింది వాటిలో సరైంది?
   ఎ) ప్రపంచంలోనే అతిపెద్ద మ్యూజియం ఈజిప్టులోని గిజా పిరమిడ్ల సమీపంలో నిర్మించారు.
   బి) స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న గిరిజనవీరుల డిజిటల్ మ్యూజియం ఛత్తీస్‌గఢ్‌లోని నయా రాయ్‌పుర్‌లో ప్రారంభమైంది.
   సి) లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంతో అస్సాం ప్రభుత్వం ఒక ఒప్పందం చేసుకుంది. శ్రీకృష్ణుడి జీవితాన్ని వర్ణించే 16వ శతాబ్దపు 'బృందావనీ పట్టువస్త్రం'ను అరువు ఒప్పందంతో స్వదేశానికి తీసుకొచ్చి 2027లో అస్సాంలో ప్రదర్శిస్తారు.
   1) ఎ, బి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, సి


ఈజిప్ట్ మ్యూజియం

2. 'సాన్-కెవు' అనే కొత్త రకం వంగడాన్ని నాగాలాండ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ వంగడం ఏ పంటకు సంబంధించింది?
   1) గోధుమ 2) అల్లం 3) బఠాణీ 4) వరి
3. కింది వాటిలో సరైంది?
   ఎ) ప్రపంచ వాతావరణ మార్పు, పనితీరు సూచీ-2026లో నాలుగు, ఐదు, ఆరు స్థానాల్లో వరుసగా డెన్మార్క్, యూకే, మొరాకో నిలిచాయి.
   బి) ఈ సూచీలో భారత్ 23వ స్థానంలో నిలిచింది.
   సి) 67 దేశాల సూచీలో 67వ స్థానంలో సౌదీ అరేబియా, 66వ స్థానంలో ఇరాన్, 65 స్థానంలో అమెరికా నిలిచాయి.
   డి) ఏటా జర్మన్ వాచ్, న్యూక్లైమేట్ ఇన్‌స్టిట్యూట్, క్లైమేట్ యాక్షన్ నెట్‌వర్క్ (సీఏఎన్) ఇంటర్నేషనల్ కలిసి వాతావరణ మార్పు, పనితీరు సూచికను విడుదల చేస్తాయి.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి
   3) ఎ, బి, డి 4) ఎ, సి, డి



నోట్: ఈ సూచీలో మొదటి మూడు ర్యాంకులు ఖాళీగా ఉన్నాయి.

4. నైరుతి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రుల ప్రాంతీయ సమావేశం 2025, నవంబరు 18న ఎక్కడ జరిగింది?
   1) గువాహటి 2) ఇంఫాల్
   3) హైదరాబాద్ 4) న్యూదిల్లీ
5. 'అనశ్వర్' పేరుతో 14వ బౌద్ధ గురువు దలైలామా జీవితంపై పుస్తకాన్ని ఇటీవల కేంద్ర మాజీ మంత్రి కరణ్ సింగ్ 2025, నవంబరు 16న ఆవిష్కరించారు. ఈ పుస్తక రచయిత ఎవరు?
   1) అరవింద్ యాదవ్ 2) నవీన్ కుమార్
   3) కంఠక్ నాథ్ 4) రవి సిన్హా
6. 8వ గరుడ వైమానిక విన్యాసాలు నవంబరు 16 నుంచి 27 వరకు ఏ దేశాల మధ్య జరుగుతాయి?
   1) ఇండియా - రష్యా 2) ఇండియా - ఫ్రాన్స్
   3) ఇండియా - మాల్దీవులు
   4) ఇండియా - అమెరికా

నోట్: ◆ 8వ గరుడ వైమానిక విన్యాసాలు ఫ్రాన్స్‌లోని మోంట్-డి-మార్సన్‌లో జరుగుతాయి.
◆ గరుడ వైమానిక విన్యాసాలు 2003లో ప్రారంభమయ్యాయి.

7. బిహార్ ముఖ్యమంత్రిగా 10వ సారి ప్రమాణ స్వీకారం చేసి నీతీష్ కుమార్ రికార్డు నెలకొల్పారు. తొలిసారిగా ఆయన ఎప్పుడు సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు?
   1) 2005 2) 2003 3) 2004 4) 2000

నోట్: ◆ దేశంలో ఎక్కువకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి పవన్ కుమార్ చామ్లింగ్ (24 ఏళ్ల 165 రోజులు- అస్సాం), రెండో వ్యక్తి నవీన్ పట్నాయక్ (24 సంవత్సరాల 99 రోజులు- ఒడిశా)

8. ప్రపంచ బాలల హక్కుల దినోత్సవాన్ని ఎప్పుడు జరుపుతారు?
   1) నవంబరు 15 2) నవంబరు 20
   3) నవంబరు 16 4) నవంబరు 19
9. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ సస్టైనబిలిటీ ర్యాంకింగ్స్–2026లో తొలిస్థానంలో నిలిచిన విశ్వవిద్యాలయం ఏది?
   1) లండ్ విశ్వవిద్యాలయం (స్వీడన్)
   2) టొరంటో విశ్వవిద్యాలయం (కెనడా)
   3) ఐఐటీ - దిల్లీ (ఇండియా)
   4) ఐఐటీ - ఖరగ్‌పుర్ (ఇండియా)

నోట్: ఐఐటీ - దిల్లీ భారత్ నుంచి తొలి స్థానంలో నిలవగా.. 2, 3వ స్థానాల్లో ఐఐటీ ముంబయి, ఐఐటీ ఖరగ్‌పుర్ నిలిచాయి.


10. 'కేంబ్రిడ్జ్ డిక్షనరీ వర్డ్ ఆఫ్ ది ఇయర్ 2025' ఏమిటి?
    1) పారా సోషల్ 2) మానిఫెస్టో
    3) వైబ్ కోడింగ్ 4) 6-7

నోట్: ◆ డిక్షనరీ.కామ్ వర్డ్ ఆఫ్ ద ఇయర్ 2025.. 6-7
◆ కొలిన్స్ డిక్షనరీ వర్డ్ ఆఫ్ ద ఇయర్ 2025 - వైబ్ కోడింగ్

11. కింది వాటిలో సరైంది?
    ఎ) బిహార్ అసెంబ్లీలో మొత్తం సీట్లు 243.
    బి) ఇటీవల వెలువడిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ 202 స్థానాల్లో విజయం సాధించింది.
    సి) మహాగఠ్‌బంధన్ కూటమి 34 స్థానాలు దక్కించుకుంది.
    డి) ప్రశాంత్ కిశోర్ పార్టీ 'జన్ సురాజ్' ఒక స్థానం గెలిచింది.
    ఇ) అసదుద్దీన్ ఓవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ ఐదు స్థానాల్లో గెలిచింది.
    1) ఎ, బి, సి, డి, ఇ 2) బి, సి, డి
    3) ఎ, బి, సి, ఇ 4) ఎ, సి, డి

నోట్: ◆ జన్ సురాజ్‌కు ఒక్క సీటు కూడా రాలేదు.
◆ ఎన్డీఏ - 202 (బీజేపీ 89, జేడీయూ 85, ఎల్‌జేపీ(ఆర్‌వీ) 19, హెచ్ఏఎం(ఎస్) 5, ఆర్ఎల్ఎం 4
◆ మహాగఠ్‌బంధన్ - 35 (ఆర్జేడీ 25, ఐఎన్‌సీ 6, సీపీఐ (ఎంఎల్) 2, సీపీఐ (ఎం) 1, ఐఐపీ - 1
◆ ఇతరులు - 6 (ఏఐఎంఐఎం 6, బీఎస్పీ 1)

12. తుంగ్‌బుక్ (మెత్తని కలప, గొర్రె/మేక చర్మంతో తయారుచేసిన మూడు తీగల వాయిద్యం), పుమ్‌టాంగ్ పులిట్ (నాలుగు రంధ్రాలతో ఉన్న వెదురు వేణువు)కు ఇటీవల జీఐ ట్యాగ్స్ లభించాయి. ఇవి ఏ రాష్ట్రానికి చెందినవి?
    1) అస్సాం 2) మణిపుర్ 3) సిక్కిం 4) గోవా



నోట్: సిక్కింలోని లెప్చా గిరిజనుల సంగీత వాయిద్యాలు.

13. 'జన్ జాతీయ గౌరవ్ దివస్'ను ఎప్పుడు నిర్వహిస్తారు?
    1) నవంబరు 16 2) నవంబరు 15
    3) నవంబరు 20 4) నవంబరు 21

నోట్: ◆ బిర్సాముండా జయంతి రోజు.
◆ 2025, నవంబరు 15 నాటికి బిర్సాముండా పుట్టి 150 ఏళ్లు పూర్తయ్యాయి. (1875, నవంబరు 15 జననం).

14. వృక్షమాతగా గుర్తింపు పొందిన సాలుమరద తిమ్మక్క (114 ఏళ్లు) ఇటీవల మరణించారు. ఈమెకు ఏ సంవత్సరంలో పద్మశ్రీ వచ్చింది?
    1) 2018 2) 2022 3) 2021 4) 2019



నోట్: ◆ తిమ్మక్క కర్ణాటకకు చెందినవారు.
◆ కర్ణాటక ప్రభుత్వం ఈమెను 2022లో పర్యావరణ రాయబారిగా నియమించింది.

15. 2025, నవంబరు 8 – 14 వరకు బంగ్లాదేశ్‌లోని ఢాకాలో జరిగిన 24వ ఎడిషన్ ఆసియా ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పతకాల పట్టికలో మొదటి స్థానంలో నిలిచిన దేశం ఏది?
    1) కజకిస్థాన్ 2) ఉత్తర కొరియా
    3) ఇండియా 4) బంగ్లాదేశ్

నోట్: ◆ 6 స్వర్ణాలు, 3 రజతాలు, ఒక కాంస్యంతో మొత్తం 10 పతకాలతో ఇండియా మొదటి స్థానంలో నిలిచింది. 2 స్వర్ణాలు, 4 రజతాలు, 4 కాంస్యాలు..మొత్తం 10 పతకాలతో దక్షిణ కొరియా 2వ స్థానాన్ని దక్కించుకుంది.

16. అమెరికాలో 2025, అక్టోబరు 1న ప్రారంభమైన షట్ డౌన్ ఎప్పుడు ముగిసింది?
    1) నవంబరు 15, 2025
    2) నవంబరు 10, 2025
    3) నవంబరు 16, 2025
    4) నవంబరు 17, 2025
17. కింది వాటిలో సరైంది?
    ఎ) 2025 ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ మస్కట్ - ఖమ్మ, ఘని.
    బి) 2025 ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ నవంబరు 24 నుంచి డిసెంబరు 5 వరకు రాజస్థాన్‌లోని జైపుర్‌లో జరుగుతాయి.
    సి) మొదటి ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ 2020లో భువనేశ్వర్‌లో జరిగాయి.
    డి) 4వ ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్ అస్సాంలో జరిగాయి.
    1) ఎ, బి, సి 2) బి, సి, డి
    3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి



నోట్: 'ఖమ్మ' ఓర్పు, బలం, చురుకుదనాన్ని సూచిస్తుంది.
◆ 'ఘనీ' పదం ఆతిథ్యం, వెచ్చదనాన్ని సూచిస్తుంది.

18. 'డెమోగ్రఫీ, రిప్రజెంటేషన్ డీలిమిటేషన్: ది నార్త్ – సౌత్ డివైడ్ ఇన్ ఇండియా' పుస్తక రచయిత?
    1) సంతోష్ నాథ్ 2) నాగేంద్ర కుమార్
    3) రవి కె.మిశ్రా 4) నావిక్ సింగ్
19. ఫ్రాన్స్ ప్రతిష్ఠాత్మకమైన షెవాలియర్ అవార్డు–2025 ఎవరికి వచ్చింది?
    1) సచిన్ తెందూల్కర్ 2) మిథాలీరాజ్
    3) షఫాలీ వర్మ 4) తోట తరణి
20. 'కుశాల్ దలాల్' ఏ క్రీడకు చెందినవారు?
    1) క్రికెట్ 2) హాకీ 3) కబడ్డీ 4) ఆర్చరీ
21. విమానాశ్రయాల్లో ప్రపంచంలోనే మొదటి 'వై-ఫై 7' నెట్‌వర్క్ ప్రారంభించిన దేశం?
    1) సౌదీ అరేబియా 2) ఒమన్
    3) ఖతర్ 4) కువైట్
22. 'అజేయ వారియర్' సైనిక విన్యాసాలు ఏ దేశాల మధ్య జరుగుతాయి?
    1) ఇండియా - యునైటెడ్ కింగ్‌డమ్
    2) ఇండియా - రష్యా
    3) ఇండియా - ఫ్రాన్స్ 4) ఇండియా - కెనడా

నోట్: 8వ ఎడిషన్ అజేయ వారియర్ సైనిక విన్యాసాలు రాజస్థాన్‌లో జరుగుతున్నాయి.

23. 3వ అంతర్జాతీయ ఆయుర్వేద సదస్సు ఏ దేశంలో జరిగింది?
    1) ఇండియా 2) బ్రెజిల్ 3) కెనడా 4) రష్యా

థీమ్: డైవర్సిటీ అండ్ ఇన్‌క్లూజన్ ఇన్ ఆయుర్వేద: కేరింగ్ ఫర్ ఎవ్రీబడీ అండ్ ఎవ్రీ బీయింగ్.


24. హరియాణా మహిళా కమిషన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎవరు నియమితులయ్యారు?
    1) సనామీర్ 2) నీతూ డేవిడ్
    3) షఫాలీ వర్మ 4) స్మృతి మంధాన

నోట్: ◆ వికసిత్ భారత్ బిల్డథాన్ 2025 అంబాసిడర్ - శుభాంశు శుక్లా
◆ పారాదీప్ ఫాస్ఫేట్స్ లిమిటెడ్ అంబాసిడర్ - రాహుల్ ద్రవిడ్

25. మొదటిసారి గిరిజన క్రీడా సదస్సు ఎక్కడ జరిగింది?
    1) రాంచీ 2) భోపాల్ 3) భువనేశ్వర్ 4) లద్దాఖ్
26. ఏ రాష్ట్రంలోని సోనాపుర్ బీచ్ 2025–26 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ బ్లూ ఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను పొందింది?
    1) కేరళ 2) తమిళనాడు 3) మహారాష్ట్ర 4) ఒడిశా
27. ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ టీబీ నివేదిక ప్రకారం గత దశాబ్దంలో భారతదేశంలో క్షయ వ్యాధి తగ్గింపు స్థాయి ఎంత?
    1) 29% 2) 21% 3) 36% 4) 42%

నోట్: క్షయ కేసుల్లో భారత్ తొలి స్థానంలో ఉంది.

28. 2025లో భారత జీడీపీ వృద్ధి ఎంతగా మూడీస్ అంచనా వేసింది?
    1) 7.0% 2) 8.3%
    3) 9.2% 4) 7.8%


రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు
1-3, 2-2, 3-2, 4-3, 5-1, 6-2, 7-4, 8-2, 9-1, 10-1, 11-3, 12-3, 13-2, 14-4, 15-3, 16-2, 17-3, 18-3, 19-4, 20-4, 21-2, 22-1, 23-2, 24-3, 25-4, 26-4, 27-2, 28-1.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

గ్రామీణ దారిద్ర్యం.. పట్టణాలకు 'వలస' వెళ్తోంది!

వ్యక్తులు ఒక ప్రాంతం నుంచి మరొక చోటుకు తరలి వెళ్లడాన్ని వలస అంటారు. ఇందులో అనేక ఆర్థిక, సామాజిక, జనాభాపరమైన సమస్యలు ఉంటాయి. ముఖ్యంగా వలసదారులు గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటారు. వీటిలో ప్రధానంగా ఆర్థిక దుర్బలత్వం, నివాస వసతి లోపాలు, ఆరోగ్య సంరక్షణ, చట్టపరమైన రక్షణలు లేకపోవడం, భాషా - సాంస్కృతిక వ్యత్యాసాలు, వివక్ష లాంటి అడ్డంకులు ఉంటాయి. వలసదారులతోపాటు ఆతిథ్య (వెళ్లిన చోటు), మూల (వచ్చిన ప్రదేశం) ప్రాంతాలు సానుకూల, ప్రతికూల పరిణామాలకు గురవుతాయి.

భారత ఆర్థిక సమస్యలు - వలస

ప్రభావాలు

వలసలు ప్రధానంగా గ్రామాల నుంచి పట్టణాలకు అధిక స్థాయిల్లో జరుగుతున్నాయి. ఇందులో ఎక్కువగా యువత ఉంటోంది. ఆ ప్రభావం పల్లెల్లోని వ్యవసాయం - దాని అనుబంధ రంగాలపై పడుతోంది. సేద్యం చేసే రైతులు, కూలీలు కరవై వ్యవసాయ రంగం దెబ్బతింటోంది. దీంతో ఆహార భద్రత లోపిస్తోంది.

✦ అంతర్జాతీయంగా వలసలు అధికంగా ఉన్న దేశాల్లో వృత్తి నిపుణులు, మేధావుల కొరత ఏర్పడుతోంది. ఉదాహరణకు మన దేశం నుంచి ఎక్కువ సంఖ్యలో ఇంజినీర్లు, డాక్టర్లు, పరిశోధకులు లాంటి వారు అభివృద్ధి చెందిన దేశాల్లో నివాసం ఏర్పాటు చేసుకునేందుకు వెళ్తున్నారు.

✦ గ్రామాల నుంచి యువకులు, వయోజనులు వలస వెళ్లడంతో ఆయా ప్రాంతాల్లో జనాభా వృద్ధి మందగిస్తుంది. వృద్ధుల్లో చనిపోయే వారి రేటు అధికంగా ఉండటం వల్ల గ్రామాల్లో మరణాల రేటు కూడా పెరుగుతుంది.

✦ గ్రామీణుల్లో వలసలు ఎక్కువగా ఉండటం వల్ల ఆ ప్రభావం సంస్కృతి, సంప్రదాయాలపై అధికంగా ఉంటుందని వివిధ సామాజికవేత్తలు తమ అధ్యయనాల్లో వెల్లడించారు. వీటి వల్ల వృత్తుల నిర్మాణంలో మార్పులు జరుగుతాయి.

✦ ఉన్న స్థానం విడిచి కొత్త ప్రాంతాలకు వలస వెళ్లినవారు అక్కడి వాతావరణానికి తగ్గట్లు సర్దుబాటు కావడం ప్రధాన సమస్య.

✦ గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు జరిగే వలస కారణంగా ఆ ప్రభావం నగరీకరణపై ఎక్కువగా ఉంటుంది. మహానగరాల అవతరణ, చిన్న పట్టణాల సంఖ్య పెరుగుదలకు వలసలే ప్రధాన కారణం.

✦ నగరాల్లో మూడింట రెండు వంతుల జనాభా సహజ కారకాల రీతిలో వృద్ధిచెందితే.. మూడింటిలో ఒక వంతు వలసల కారణంగా పెరుగుతోంది.

✦ ఇవి ఒక ప్రాంత ప్రజల పరిమాణాన్ని, వృద్ధిని ప్రభావితం చేయడమే కాకుండా అక్కడి జనాభా నిర్మాణం, పంపిణీల్లో పెను మార్పులకు కారణమవుతాయి. శ్రామిక వర్గం సంఖ్య, వృత్తి నైపుణ్యం ఆధారంగా కార్మికుల విభజన జరిగితే; విద్య, ఉపాధి అవకాశాలు, వృత్తులు, పరిశ్రమ, పొదుపు, ఉత్పాదకత లాంటి అంశాలు వలసలను ప్రభావితం చేస్తాయి.

వలస - నగరీకరణ

నగరీకరణ అంటే ఒకే ప్రాంతంలో జనాభా కేంద్రీకృతం కావడం లేదా ఒక భౌగోళిక ప్రాంతంలోని మొత్తం జనాభాతో పోలిస్తే పట్టణ ప్రాంత జనాభా నిష్పత్తి ఎక్కువ కావడం. పట్టణ ప్రాంతంలో ప్రజల సంఖ్య పెరగడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. అవి: 1) సహజ పెరుగుదల

2) ఇతర ప్రాంతాల నుంచి జరిగే వలసలు

▮ అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో పట్టణీకరణ ఇటీవల కాలంలోనే ప్రారంభమైంది. ఈ విషయంలో ప్రపంచ దేశాల కంటే భారత్ తక్కువ స్థాయిలోనే ఉంది.

పట్టణీకరణకు కారణాలు: రవాణా, కమ్యూనికేషన్ సౌకర్యాలు వృద్ధి కావడం.

☛ వ్యవసాయ రంగంలో నిత్యం ఉంటోన్న అనిశ్చితి కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కరవై పని కోసం పట్టణాలకు తరలడం.

☛ భూమి లేని పేద కార్మికులు, వ్యవసాయ కూలీలు మంచి జీవితం లభిస్తుందనే ఆశతో నగరాలకు రావడం.

☛ గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఇతర సౌకర్యాల కొరత వల్ల అవి లభించే పట్టణాల వైపు పెద్ద రైతులు, భూస్వాములు చూస్తున్నారు.

☛ పారిశ్రామికీకరణ ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లోనే జరగడం వల్ల త్వరగా ఉపాధి పొందొచ్చనే ఉద్దేశంతో గ్రామీణులు పట్టణాల బాట పడుతున్నారు.

☛ ఈ అంశాలను బట్టి వలసలకు పట్టణీకరణకు పరస్పర సంబంధం ఉందని తెలుస్తోంది. వలసల వల్ల నగరాలు వృద్ధి చెందుతున్నాయి. పట్టణీకరణ వేగంగా జరుగుతున్నకొద్దీ మరిన్ని వలసలకు ప్రోత్సాహం లభిస్తోంది.


☛ పాశ్చాత్య దేశాల్లో వలసలను అభివృద్ధికి సంకేతంగా పేర్కొంటారు. అయితే అధిక జనాభా కలిగిన భారత్‌లో వలసలు గ్రామీణ దారిద్ర్యం పట్టణాలకు బదిలీ కావడాన్ని సూచిస్తుంది. వలస వస్తోన్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాల కల్పన పెద్ద సవాలుగా ఉంటోంది. దీంతో పట్టణాల్లో మురికివాడలు పెరగడం, నివాసం, తాగునీరు, రవాణా తదితర మౌలిక వసతుల లేమి లాంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

వలసలు - పారిశ్రామికీకరణ

ప్రాథమిక రంగాన్ని మించి పరిశ్రమ, తయారీ రంగం ఆధిపత్యాన్ని ప్రదర్శించడాన్ని పారిశ్రామికీకరణ అంటారు. అంటే వ్యవసాయ రంగంతో పోలిస్తే వాటిలో ఉపాధికల్పన, పెట్టుబడుల ఆకర్షణ ఎక్కువగా ఉంటుంది. పాత పరిశ్రమల విస్తరణ, నూతన ఫ్యాక్టరీల స్థాపన కూడా దీని కిందకే వస్తుంది.

❖ పారిశ్రామికీకరణకు ఆర్థికాభివృద్ధికి సన్నిహిత సంబంధం ఉంది. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్, జపాన్, జర్మనీ లాంటి దేశాల్లో జనాభాలో అధిక శాతం ద్వితీయ రంగంలోనే పని చేస్తున్నారు. మన దేశంలో నేటికీ అత్యధిక ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడ్డారు.

❖ వలసలకు అతి ముఖ్యమైన కారణాల్లో పారిశ్రామికీకరణ ఒకటి. కొత్త పరిశ్రమలు ఏర్పాటైనప్పుడు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. సాధారణంగా పట్టణాలకు కొద్ది దూరంలోనే పరిశ్రమల స్థాపన జరుగుతుంది. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు పరిశ్రమలు వెలిసిన ప్రాంతానికి వలస వస్తారు. వారు పట్టణాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటారు. దీంతో నగర జనాభా వృద్ధి చెందుతుంది.



❖ పెరిగిన మానవవసరులకు అనుగుణంగా ఇళ్లు, విద్య, వైద్య సౌకర్యాలు, వినోద కేంద్రాలు ఏర్పాటు చేయాలి. దీంతో మళ్లీ ఉపాధి కల్పన, పెట్టుబడులకు అవకాశాలు ఏర్పడతాయి. మరికొందరు కొత్తగా ఆ ప్రాంతానికి వచ్చేందుకు ఆకర్షణ శక్తిగా ఇది పనిచేస్తుంది.

☛ గ్రామీణ ప్రాంతాల నుంచి శారీరక శ్రమ చేయగల వయసులో ఉన్న పురుషులు ఆర్థిక కారణాల దృష్ట్యా పట్టణాలకు వలస వెళ్తున్నారు. మహిళలు, చిన్న పిల్లలు, వృద్ధులు పల్లెల్లోనే ఉంటున్నారు. దీంతో గ్రామాల్లో ఉత్పాదకత లోపిస్తోంది. మరోవైపు పట్టణ ప్రాంతాల్లో కొత్త వాతావరణానికి సర్దుబాటు కావడమనే సమస్య తలెత్తుతోంది.

☛ అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులు, ఉపాధి లేనివారికి పట్టణాల్లోని పరిశ్రమల్లో పని లభించడం వల్ల దేశ తలసరి నగదు ఆదాయంలో వృద్ధి ఉంటుంది.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day 843

Insipid

Telugu meaning: పసలేని, నిస్తేజమైన

English meaning: Insipid (ఇన్సిపిడ్) is an adjective that describes something dull, uninteresting, or lacking flavour or excitement.

Synonyms: Bland, Dull; ***Antonyms:*** Lively, Interesting

Usage: **1.** The soup tasted insipid because it had no spices or seasoning.

2. The speaker's insipid presentation failed to capture the audience's attention.

Latest Updates

Manager Posts

Bank of Baroda (BOB) is inviting applications for the Manager and Deputy Manager posts in various departments. The total no. of posts is 82. The application fee is Rs.850. Eligible candidates can apply online before 2025 December 9.

Group B, C Jobs

All India Institute of Medical Sciences (AIIMS), New Delhi, has released a notification for the recruitment of Group B, C jobs in various departments on a regular basis in AIIMS hospitals and central government institutes across the country. The total no. of posts is 1,383. The application fee is Rs.3,000. The last date for receipt of online applications is 2 December 2025.

Assistant Manager, Senior Medical Officer

THDC India Limited is inviting applications for the recruitment of Assistant Manager, Senior Medical Officer posts on a contract basis. The total no. of posts is 40. The online registration fee is Rs.600. Eligible candidates can apply online before 6 December 2025.

Did You Apply..?

Today (November 27) is the last date for the following Jobs/ Admissions.

☛ RRB NTPC - 5,810 Graduate Posts.
Qualification: Degree.

☛ RRB NTPC - 3,058 Undergraduate Jobs.
Eligibility: Intermediate.

☛ Joint Entrance Examination (Main)-2026

☛ 122 Deputy Manager Jobs in NPCIL.
Qualification: Diploma, Graduate, MBA, PG, LLB, MSW.

☛ 132 Senior Resident posts in AIIMS Bhubaneswar.
Eligibility: MD/DNB/MS/DM, MCh.

For more information and other notifications - scan QR code

స్టడీ జోన్

అగ్ని పర్వతాలు

భూగర్భంలో ఉన్న శిలాద్రవం ఉపరితలానికి చేరడానికి ఉపయోగపడే మార్గమే అగ్ని పర్వతం. భూమి లోపలి పొరల్లో ఉండే అధిక ఉష్ణోగ్రతల కారణంగా అక్కడి శిలలు కరిగి, ద్రవరూపంలోకి మారతాయి. ఈ శిలాద్రవం అనుకూల పరిస్థితుల్లో అగ్ని పర్వతాల రంధ్రం ద్వారా బయటకు వస్తుంది. భూ అంతర్భాగంలో వాయువులతో కూడి ఉన్న శిలాద్రవాన్ని 'మాగ్మా' అంటారు. భూ ఉపరితలాన్ని చేరిన శిలాద్రవాన్ని 'లావా'గా పేర్కొంటారు. భూమిపై ఉన్న భౌగోళిక స్వరూపాల్లో క్రియాశీలత దృష్ట్యా అగ్ని పర్వతాలు ముఖ్యమైనవి. పోటీ పరీక్షల నేపథ్యంలో వీటి గురించి ముఖ్య విషయాలు తెలుసుకుందాం..!



రకాలు

ఆవర్తన స్థాయి, విస్ఫోటనం, ఉద్భేదనం ప్రాతిపదికగా అగ్నిపర్వతాలను మూడు రకాలుగా వర్గీకరించారు. అవి:

1. క్రియాశీల అగ్నిపర్వతాలు: తరచుగా లేదా నిరంతరం విస్ఫోటనం చెందేవి. **ఉదా:** స్ట్రాంబోలి, ఎట్నా.

2. నిద్రాణ అగ్నిపర్వతాలు: గతంలో విస్ఫోటనం జరిగి, ప్రస్తుతం క్రియాశీలకంగా లేనివి. ఇవి భవిష్యత్తులో విస్ఫోటనం చెందొచ్చు. **ఉదా:** ఇటలీలోని వెసూవియస్, జపాన్‌లోని ఫ్యూజియామా.

3. విలుప్త అగ్నిపర్వతాలు: ఇవి వర్తమానంలో లేదా భవిష్యత్తులో విస్ఫోటనం చెందలేవు. **ఉదా:** నార్కొండం (భారతదేశం), కిలిమంజారో (టాంజానియా).

కొన్ని ముఖ్యాంశాలు:

అగ్నిపర్వత ఉద్భేదనం తీవ్రంగా ఉన్నప్పుడు అగ్నిపర్వత ముఖం (క్రేటర్) పేలిపోయి, దాని స్థానంలో పెద్దపెద్ద గుంటలు ఏర్పడతాయి. కాలక్రమేణా వీటిలో నీరు చేరి సరస్సులుగా మారతాయి. వీటినే 'కాల్డేరా' సరస్సులు, జ్వాలాబిల సరస్సులు అంటారు.


▮ అగ్నిపర్వత సంబంధ ప్రక్రియ వల్ల ఏర్పడే వేడినీటి బుగ్గలను గీజర్లు అంటారు. ఉదా: అమెరికా ఎల్లోస్టోన్ నేషనల్ పార్కులోని ఓల్డ్‌ఫెయిత్ ఫుల్ గీజర్.

అగ్నిపర్వతాల నుంచి వెలువడే పదార్థాలు, గతంలో అడిగిన ప్రశ్నలు తదితర పూర్తి సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

భారత జాతీయోద్యమం (1935-39)

గాంధీజీ నాయకత్వంలో జరిగిన శాసనోల్లంఘన ఉద్యమం భారతదేశ చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టం. ఇది ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను బలంగా రగిల్చింది. అదే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ అనేక రాజకీయపరమైన నిర్ణయాలు తీసుకుంది. ఆ పార్టీపై మహాత్మా గాంధీ ప్రభావం అలాగే నిలిచిపోయింది. అయినప్పటికీ సామ్యవాదం, కమ్యూనిజం మొదలైన సిద్ధాంతాల ఆవిర్భావంతో కాంగ్రెస్‌లో కొంత మార్పు వచ్చింది. 1935-39 మధ్యకాలంలో భారతదేశంలో జరిగిన జాతీయవాద రాజకీయాలు, 'భారత ప్రభుత్వ చట్టం-1935', కాంగ్రెస్ మంత్రివర్గాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.



రాజకీయ సంస్థలు

ఈ కాలంలోనే అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్, అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ లాంటి సంస్థలు ఏర్పాటయ్యాయి.

భారత ప్రభుత్వ చట్టం–1935

సైమన్ కమిషన్ నివేదిక, మూడు రౌండ్ టేబుల్ సమావేశాల్లో వచ్చిన సూచనలన్నీ కలిపి 1933లో ఒక శ్వేత పత్రంగా వెలువడ్డాయి. వీటిని పరిశీలించేందుకు లార్డ్ లిన్‌లిత్‌గో నాయకత్వంలో పార్లమెంట్ ఒక జాయింట్ సెలెక్ట్ కమిటీని ఏర్పాటు చేసింది. దీని నివేదిక ఆధారంగా బ్రిటిష్ పార్లమెంట్ 'భారత ప్రభుత్వ చట్టం-1935'ను ప్రవేశపెట్టింది.

కాంగ్రెస్ అధ్యక్షులుగా నెహ్రూ, 1937లో సాధారణ ఎన్నికలు, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ స్థాపన, రెండో ప్రపంచ యుద్ధం - భారత జాతీయ కాంగ్రెస్, ఆగస్టు ప్రతిపాదన, క్రిప్స్ రాయబారం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



The Indian Navy commissioned INS Mahe, the first vessel of the Mahe-class Anti-Submarine Warfare Shallow Water Craft (ASW-SWC) on 24 November 2025. The ceremony took place at the Naval Dockyard in Mumbai.

✦ INS Mahe is built by Cochin Shipyard Limited.

Bharat Electronics Limited (BEL) and Safran Electronics and Defence (SED), France, have signed a Joint Venture Cooperation Agreement to produce the HAMMER Smart Precision Guided Air-to-Ground weapon system in India.

✦ The document was signed by BEL Chairman and Managing Director Manoj Jain and SED Executive Vice President Alexandre Ziegler, in the presence of Secretary (Defence Production) Sanjeev Kumar and Safran CEO Olivier Andries.



President Droupadi Murmu has nominated Supreme Court judge Justice Vikram Nath as executive chairman of the National Legal Services Authority. He is also in line to serve as the CJI for seven months between February 10 and September 24, 2027.

According to the Centre for Global Development's Commitment to Development Index (CDI) 2025, India ranks 36th overall among the countries evaluated. The index, published by the Centre for Global Development, a non-profit think tank based in Washington, DC and London.

For more Current Affairs: Scan QR code

Bank Exams

Reasoning

Inserting Missing Characters


Directions (Qs. 1 - 15): Find the missing number or letter in the following questions?

1.

1	$\frac{1}{2}$	$\frac{3}{2}$
2	$\frac{2}{3}$	$\frac{8}{3}$
3	?	$\frac{19}{5}$


A) $\frac{1}{2}$ B) $\frac{2}{3}$ C) $\frac{3}{4}$
D) $\frac{4}{5}$ E) $\frac{5}{6}$

2.



A) 36 B) 38 C) 40 D) 42 E) 50

3.



A) 8 B) 17 C) 12 D) 16 E) 10

4.

F	J	N
M	Q	U
O	S	?


A) U B) W C) X
D) Y E) Z

5.

5	2	4
4	4	7
2	5	3
18	30	?


A) 42 B) 32 C) 43
D) 33 E) 53

6.




A) 76 B) 66 C) 10 D) 20 E) 40

7.




A) 18 B) 27 C) 24 D) 25 E) 9

8.



A) 240 B) 195 C) 84
D) 53 E) 100


9.



In above figure what are the values of X, Y, Z?


A) X = 2, Y = 6, Z = 7
B) X = 10, Y = 6, Z = 3
C) X = 1, Y = 10, Z = 12
D) X = 5, Y = 7, Z = 9
E) None of the above

10.



A) 10 B) 13 C) 12
D) 14 E) 20

11.




A) 3 B) 7 C) 6 D) 4 E) 2

12.

O	10	S	6	W	?
12	Q	8	U	4	?


A) $\frac{1}{Y}$ B) $\frac{2}{Y}$ C) $\frac{6}{U}$
D) $\frac{11}{P}$ E) None of these

13.




A) $\frac{20}{13}$ B) $\frac{21}{25}$ C) $\frac{15}{16}$
D) $\frac{17}{18}$ E) $\frac{27}{23}$

14.



A) 10 B) 15 C) 25
D) 12 E) 32

15.



A) 44 B) 55
C) 80 D) 88
E) 96

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

'సర్'ను గతంలో నిర్వహించలేదని ఇప్పుడు వద్దనడం సరికాదు

- తమిళనాడు, కేరళ వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు వ్యాఖ్య



దిల్లీ: దేశంలో ఓటర్ల జాబితాలకు ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)ను గతంలో ఎప్పుడూ నిర్వహించలేదు కనుక ఆ కసరత్తును ఇప్పుడు పలు రాష్ట్రాల్లో చేపట్టడాన్ని ఎన్నికల సంఘం(ఈసీ) నిర్ణయాన్ని ప్రశ్నించడం సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. ఓటరు నమోదు ఫారం-6లో పేర్కొన్న వివరాలు సరైనవో కావో నిర్ధారించుకునే అధికారం ఈసీకి ఉందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి ధర్మాసనం తెలిపింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో 'సర్' ప్రక్రియపై ఈసీ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తుది విచారణను ధర్మాసనం బుధవారం చేపట్టింది. ఆధార్ కార్డు ఒక్కటే వ్యక్తుల పౌరసత్వాన్ని నిర్ధారించలేదని తెలిపింది. పౌరసత్వ నిరూపణకు అవసరమైన పత్రాల్లో ఆధార్ ఒకటిగా ఉండాలని మాత్రమే తాము సూచించామంది. ఓటరు జాబితా నుంచి ఎవరి పేరునైనా తొలగిస్తున్నట్లయితే వారికి ముందుగా నోటీసు ఇవ్వాలని స్పష్టం చేసింది. ఫారం-6లోని వివరాలను నిర్ధారించుకోకుండా ఓటరు జాబితాలో చేర్చాలని ఈసీకి చెప్పడం సరికాదని అభిప్రాయపడింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లోని 'సర్' కసరత్తును సవాల్ చేసిన పిటిషన్ల విచారణ షెడ్యూల్‌ను ధర్మాసనం ఖరారు చేసింది. కేరళ పిటిషన్లపై డిసెంబరు 2న, తమిళనాడు వ్యవహారంపై డిసెంబరు 4న, పశ్చిమ బెంగాల్ వ్యాజ్యాలపై డిసెంబరు 9న విచారణ జరుపనున్నట్లు తెలిపింది. ఆయా తేదీల లోగా ఈసీ, పిటిషనర్లు వారి వారి రిజాయిండర్లను సమర్పించాలని ఆదేశించింది. 'సర్'ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల తరఫున బుధవారం సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపించారు. ఓటరు పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారం.. బూత్ స్థాయి అధికారుల (బీఎల్‌వో)కు ఇవ్వడం తగదని సిబల్ పేర్కొన్నారు. గురువారం కూడా వాదనలు కొనసాగనున్నాయి.

దొడ్డిదారిన ఎన్ఆర్‌సీ అమలుకే సర్

- మమతా బెనర్జీ ఆరోపణ



కోల్‌కతా: దొడ్డిదారిన జాతీయ పౌర జాబితా (ఎన్ఆర్‌సీ) అమలు చేసేందుకే కేంద్ర ప్రభుత్వం.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను (సర్) చేపట్టిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఇది సామాన్య పౌరులను ఆందోళనకు గురిచేయడమేనని స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం కోల్‌కతాలోని రెడ్ రోడ్‌లో ఉన్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రాథమిక హక్కులు ప్రమాదంలో పడ్డాయని ఆరోపించారు. 'ప్రజల ఓటు హక్కును లాగేసుకుంటున్న విషాద ఘటనను చూస్తున్నాం. వారి మతపరమైన హక్కులనూ లాగేసుకుంటున్నారు. భాషలపైనా దుష్ట దాడులు జరుగుతున్నాయి. దళితులు, మైనారిటీలు, సామాన్య హిందూ ఓటర్లనూ వారు వదలడం లేదు' అని విమర్శించారు. 'ఈ మట్టిలో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ప్రజలను.. ఈ దేశంలో నివసించడానికి ఉన్న హక్కులను నిరూపించుకోవాలని అడుగుతున్నారు. పౌరసత్వ హక్కుల పేరుతో భయానక వాతావరణం నెలకొల్పారు' అని రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకున్న మమత వ్యాఖ్యానించారు.

ఆ నినాదాలపై ఆంక్షలు ఆందోళనకరం

పార్లమెంటు ప్రాంగణంలో 'జై హింద్, వందేమాతరం' అంటూ నినాదాలు చేయడంపై ఆంక్షలు విధించారని పలు మీడియా నివేదనలు తన దృష్టికి వచ్చాయని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ ఆదేశం ఆందోళనకరమని పేర్కొన్నారు. 'నివేదికల్లో ఎంత వాస్తవముందో నాకు తెలియదు. ఎంపీలను అడిగి తెలుసుకుంటా. వందేమాతరం మన జాతీయ గీతం. స్వాతంత్ర్య సమర యోధులు ఉపయోగించిన నిరసన గీతం. దీన్ని ఎలా మర్చిపోగలం. బెంగాల్ గుర్తింపును వారు నాశనం చేయాలనుకుంటున్నారా' అని ప్రశ్నించారు.

తృణమూల్ ఆదేశాలతో
బెంగాల్‌లో నకిలీ ఓటర్ల చేర్పు

- ఈసీతో భేటీలో భాజపా ఆరోపణ

దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ ఆదేశాలతోనే ఓటర్ల జాబితాలో 'నకిలీ, అనుమానాస్పద' పేర్లు చేరుతున్నాయని ఎన్నికల సంఘానికి (ఈసీ) భాజపా ఫిర్యాదు చేసింది. బుధవారం భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య, భాజపా రాష్ట్ర సహ ఇన్‌ఛార్జ్ అమిత్ మాలవీయ, ఎంపీ జగన్నాథ్ సర్కార్ ముర్ములతో కూడిన ప్రతినిధి బృందం ఈసీతో భేటీ అయింది. ఈ సందర్భంగా బౌద్ధులు, జైనులు సహా మతువా వర్గానికి చెందిన వారి పేర్లనూ ఓటరు జాబితాలో చేర్చాలని ప్రతినిధుల బృందం ఈసీని కోరింది. మరోవైపు పని ఒత్తిడిని నిరసిస్తూ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) మనోజ్ అగర్వాల్ కార్యాలయం ముందు కొంత మంది బీఎల్‌వోలు చేపట్టిన నిరసనలపై 48 గంటల్లో నివేదికను అందించాలని కోల్‌కతా పోలీసులకు ఈసీ లేఖ రాసింది. ఆందోళనలను 'తీవ్రమైన భద్రతా ఉల్లంఘనలు'గా పేర్కొంది.



26/11 ముంబయి ఉగ్రదాడి జరిగి 17 ఏళ్లయిన సందర్భంగా నాటి మృతులకు ముంబయిలో బుధవారం నివాళులు అర్పిస్తున్న ఓ పోలీసు అధికారి

26/11 అమరవీరులకు రాష్ట్రపతి నివాళులు

దిల్లీ: దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో 2008 నవంబరు 26న జరిగిన ఉగ్రదాడులకు బుధవారంతో 17 ఏళ్లు గడిచాయి. ఈ సందర్భంగా దేశాన్ని కాపాడేందుకు ముష్కరులకు ఎదురొడ్డి ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా నివాళులు అర్పించారు. "26/11 ముంబయి ఉగ్రదాడుల్లో దేశ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాలను ధారబోసిన వీర సైనికులందరికీ నేను నివాళులర్పిస్తున్నాను. వారి త్యాగాన్ని దేశం గుర్తుంచుకుంటుంది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని ఎదుర్కొంటామన్న నిబద్ధతను పునరుద్ఘాటిద్దాం" అని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. "ఉగ్రదాడుల్లో ప్రాణాలు కోల్పోయిన సైనికులకు, సామాన్యులందరికీ నా నివాళులు. ప్రధాని మోదీ ఉగ్రవాద వ్యతిరేక విధానం సుస్పష్టం. మన దేశ ఉగ్రవ్యతిరేక చర్యలను ప్రపంచమంతా అభినందిస్తోంది, మద్దతునిస్తోంది" అని అమిత్ షా 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

భాజపా కార్యాలయం కోసం 40 వృక్షాల కూల్చివేతపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- హరియాణా ప్రభుత్వానికి మందలింపు

దిల్లీ: హరిత ప్రాంతంలో ఏపుగా పెరిగిన 40 వృక్షాలను కూల్చివేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. హరియాణాలోని కర్నాల్‌లో హరిత ప్రాంతంగా గుర్తించిన చోట భాజపా కార్యాలయానికి స్థలం కేటాయించడాన్ని, ఆ కార్యాలయానికి రహదారి కోసం 40 వృక్షాలను కూల్చివేయడాన్ని సవాల్ చేస్తూ మాజీ సైనికాధికారి, వీర్‌చక్ర అవార్డు గ్రహీత కర్నల్ దేవిందర్ సింగ్ రాజ్‌పూత్ (71) ఈ పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం... హరియాణా ప్రభుత్వం, ఆ రాష్ట్ర పట్టణాభివృద్ధి విభాగంపై మండిపడ్డారు. రాజకీయ పార్టీ కార్యాలయాన్ని మరో ప్రాంతానికి ఎందుకు తరలించలేదు? ఏపుగా పెరిగిన వృక్షాలను ఎందుకు కూల్చివేశారు? ఆ చెట్ల పరిస్థితి ఏమిటంటూ ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ విక్రమ్‌జిత్ బెనర్జీని నిలదీసింది. సరైన సమాధానంతో రావాలని, లేకుంటే కోర్టు తీసుకునే చర్యలకు బాధ్యత వహించాల్సి వస్తుందని ధర్మాసనం హెచ్చరించింది.

కేఫ్‌పై కాల్పులు జరిగిన ప్రతిసారి..
ఆదరణ లభించింది

- టీవీ వ్యాఖ్యాత కపిల్ శర్మ



ముంబయి: ప్రముఖ టీవీ వ్యాఖ్యాత కపిల్ శర్మకు చెందిన కెనడాలోని కేఫ్‌పై గత కొన్ని నెలల్లో పలుమార్లు కాల్పులు జరగడం కలకలం రేపాయి. అయితే, ప్రతి ఘటన అనంతరం తన కేఫ్‌కు మరింత మంది ప్రజలు వచ్చారని ఆయన తెలిపారు. ఈ కాల్పులతో కెనడా అధికారులు కూడా ఇటువంటి దాడులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. ముంబయి లాంటి నగరం మరొకటి లేదని.. భారత్‌లో తనకు ఎక్కడా అభద్రతా భావం కలగలేదని చెప్పారు. ''స్థానిక నియమాల కారణంగా అక్కడి పోలీసులకు ఇటువంటి ఘటనలను నియంత్రించే అధికారం లేక పోవచ్చు. కానీ.. నా కేఫ్‌పై కాల్పుల వ్యవహారం కెనడా ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. పార్లమెంటులోనూ దీనిపై చర్చ జరిగింది. నిజానికి.. ప్రతి కాల్పుల ఘటన అనంతరం కేఫ్‌కు మరింత ఆదరణ లభించింది. పరిస్థితులపై చాలా మంది ఫోన్లు చేశారు. నా కేఫ్‌పై కాల్పుల ఘటన వార్తగా మారింది. ఇప్పుడు అక్కడ శాంతిభద్రతలను మెరుగుపర్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు" అని ఓ కార్యక్రమంలో కపిల్ శర్మ చెప్పారు. కెనడాలోని బ్రిటిష్ కొలంబియాలో కపిల్ శర్మ 'కాప్స్ కేఫ్'ను ప్రారంభించారు. ఈ ఏడాది జులైలో తొలిసారి గుర్తు తెలియని వ్యక్తులు దానిపై కాల్పులు జరిపారు. ఆగస్టు, అక్టోబరు నెలల్లోనూ ఈ తరహా ఘటనలు నమోదయ్యాయి. అయితే, ఈ దాడుల్లో ఎవరికీ గాయాలు కాలేదు.

పాన్‌మసాలా వ్యాపారి కోడలి ఆత్మహత్య

దిల్లీ: ప్రసిద్ధ బ్రాండ్ అయిన కమ్లా పసంద్ పాన్ మసాలా యజమాని కమల్ కిశోర్ చౌరాసియా కోడలు దీప్తి చౌరాసియా (38) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆమె గది నుంచి ఒక డైరీని స్వాధీనం చేసుకున్నామనీ, అందులో తన భర్తతో తరచూ జరుగుతున్న గొడవల్ని గురించి దీప్తి ప్రస్తావించారని పోలీసులు తెలిపారు. కుటుంబ వివాదాల కారణంగా ఆమె తన భర్త ఇంట్లో కాకుండా వేరుగా ఉంటున్నారు. ఆమె సోదరుడు రిషబ్ తన బావ ప్రవర్తనపై ప్రశ్నలు లేవనెత్తారు. దీప్తికి భర్తతో వివాదాలున్నాయనడం ఆధారరహితమని, ఆమె రాసిన అంతిమ లేఖలో వివాదాల ప్రస్తావనే లేదని చౌరసియా కుటుంబ న్యాయవాది వెల్లడించారు.

ఐఐటీ బాంబే పేరు మార్పునకు మోదీకి లేఖ రాస్తా: ఫడణవీస్

ముంబయి: ఐఐటీ బాంబే పేరును ఐఐటీ ముంబయిగా మార్చాలని కోరుతూ ప్రధానమంత్రికి, కేంద్ర విద్యాశాఖకు మహారాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయనుందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ వెల్లడించారు. అదృష్టవశాత్తూ ఐఐటీ బాంబే పేరును ఐఐటీ ముంబయిగా మార్చలేదంటూ కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ ప్రకటన వెలువరించారు. "బాంబే పేరును ముంబయిగా మార్చడం వెనక భాజపా నేత రామ్‌నాయక్ కృషి అందరికీ తెలిసిందే. నగరాన్ని ముంబయి అని పిలుస్తామే తప్ప బాంబే అని కాదు" అని ఫడణవీస్ అన్నారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలు ఆయన ప్రభుత్వ ఆలోచనా ధోరణికి అద్దం పడుతున్నాయని ఎంఎన్ఎస్ అధినేత రాజ్ ఠాక్రే ఘాటుగా స్పందించారు.

ఒక ధర్మాసనం తీర్పును
మరో ధర్మాసనం రద్దు చేయడం ఆందోళనకరం

- సుప్రీం కోర్టు వ్యాఖ్య

దిల్లీ: ఒక ధర్మాసనం వెలువరించిన తీర్పును కక్షిదారుల అభ్యర్థన మేరకు తదనంతర ధర్మాసనంగానీ, మరో ప్రత్యేక ధర్మాసనంగానీ రద్దు చేస్తున్న ఉదంతాలు పెరిగిపోతుండటంపై అత్యున్నత న్యాయస్థానం బుధవారం ఆందోళన వ్యక్తం చేసింది. సుప్రీం తీర్పును అంతిమమైనదిగా పరిగణించడం ద్వారా అనంతమైన వ్యాజ్య పరంపరను నివారించడంతోపాటు న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని బలోపేతం చేయవచ్చని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఆగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'ఈ కోర్టులో ఒక న్యాయమూర్తి వెలువరించిన తీర్పును ఆయన ఇంకా అధికారంలో ఉండగాగానీ, ఆయన పదవీ విరమణ చేశాకగానీ మరో న్యాయమూర్తి రద్దు చేస్తున్న ఆందోళనకర ఒరవడి ఎంతో బాధాకరం. ముఖ్యంగా తదనంతర ధర్మాసనాలు, ప్రత్యేకంగా ఏర్పాటైన ధర్మాసనాలు ఇలా వ్యవహరిస్తున్నాయి' అని అభిప్రాయపడింది. అత్యున్నత న్యాయస్థానం తీర్పు పవిత్రతను, అంతిమత్వాన్ని సమర్థించడం చట్ట పాలనలోని మౌలిక సూత్రమని స్పష్టం చేసింది. 'ఒక ధర్మాసనం ఓ అంశంపై వెలువరించిన తీర్పు సంబంధిత వివాదాన్ని పరిష్కరించిన అంతిమ నిర్ణయంగా మిగలాలని రాజ్యాంగంలోని 141వ అధికరణం పేర్కొంటోంది. తదనంతర కాలంలో భిన్నాభిప్రాయం వ్యక్తమైందన్న కారణంగా వ్యాజ్యాన్ని తిరగదోడటం 141వ అధికరణం లక్ష్యాన్ని నీరుగారుస్తోంది' అని ధర్మాసనం పేర్కొంది. శాసనసభలు ఆమోదించిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో రాష్ట్రపతికి, గవర్నర్లకు ఒక ద్విసభ్య ధర్మాసనం 3 నెలల గడువు విధించగా.. సుప్రీంకోర్టు గత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నాయకత్వంలోని ధర్మాసనం ఇటీవల ఆ తీర్పును పక్కనబెట్టిన సంగతి తెలిసిందే.

న్యాయవాదులు.. మార్గం చూపే వెలుగు దివ్వెలు

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్య



దిల్లీ: చట్ట పాలనను బలోపేతం చేయడంలో, రాజ్యాంగ పవిత్రతను కాపాడటంలో న్యాయవాద వ్యవస్థ అనివార్యమైన పాత్రను పోషిస్తోందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. బాధితులైన వారికి, పేదలకు న్యాయ సహాయం అందించడంలో అది ఎంతో ముఖ్యమని స్పష్టం చేశారు. బుధవారం సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ నిర్దేశిత విలువల్ని కాపాడటంలో న్యాయవాదుల కృషిని న్యాయ వ్యవస్థ పలు పర్యాయాలు గుర్తించిందని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. 'భారత ప్రజలు రాజ్యాంగాన్ని తమకు తాము బహుమతిగా ఇచ్చుకున్న ఈ దినోత్సవాన మనందరం సంబరంగా వేడుక జరుపుకొంటున్నాం. ఈ సందర్భంగా మీ ముందు నిల్చున్న నేను మన రాజ్యాంగ పవిత్రతను నిలబెట్టడంలో న్యాయవాదుల పాత్రను శ్లాఘిస్తున్నాను' అని పేర్కొన్నారు. కోర్టులు రాజ్యాంగాన్ని కాపాడే కాపలాదారులైతే, న్యాయవాదులు వాటి మార్గాన్ని ప్రకాశవంతం చేసే వెలుగు దివ్వెలని వ్యాఖ్యానించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ ఈ కార్యక్రమంలో ప్రసంగించారు.

12.45 కోట్ల టన్నుల బియ్యం ఉత్పాదన

- తగ్గుముఖం పట్టిన పప్పు దినుసులు, నూనెగింజల దిగుబడి
- ఖరీఫ్ వివరాలను వెల్లడించిన కేంద్ర వ్యవసాయశాఖ

దిల్లీ: అక్టోబరుతో పూర్తయిన గత ఖరీఫ్ సీజన్‌లో దేశం రికార్డు స్థాయిలో 12.45 కోట్ల టన్నుల బియ్యం ఉత్పత్తి చేసింది. ఇది అంతకు ముందు సంవత్సరం నాటి దిగుబడి కన్నా 1.4 శాతం ఎక్కువ అని కేంద్ర వ్యవసాయ శాఖ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. అదే సమయంలో పప్పుదినుసులు, నూనె గింజలు, పత్తి పంటల ఉత్పాదన తగ్గుముఖం పట్టిందని వెల్లడించింది. దేశంలో 2025-26 సంవత్సరంలో 17.33 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి కాగా అంతకు ముందు సంవత్సరంలో వాటి ఉత్పాదన 16.95 కోట్ల టన్నులని వ్యవసాయ శాఖ ముందస్తు అంచనాలు తెలియజేస్తున్నాయి. 2024-25 సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో 122.8 కోట్ల టన్నుల బియ్యం ఉత్పత్తి అయినట్టు ఆ శాఖ వివరించింది.

4.14 కోట్ల టన్నుల ముతక ధాన్యాలు

2025-26 సంవత్సరంలో 2.83 కోట్ల టన్నుల జొన్నలు, 4.14 కోట్ల టన్నుల ముతక ధాన్యాలు ఉత్పత్తి అయినట్టు అంచనా. అయితే కంది పప్పు ఉత్పాదన కొద్దిగా తగ్గుముఖం పట్టింది. గత సంవత్సరం 77 లక్షల టన్నుల కంది పప్పు ఉత్పాదన నమోదు కాగా ఈ సంవత్సరం అది 74 లక్షల టన్నులకు పడిపోనుందని అంచనా. అలాగే నూనె గింజల ఉత్పత్తి కూడా 2.80 కోట్ల టన్నుల నుంచి ఈ సంవత్సరం 2.756 కోట్ల టన్నులకు పడిపోతుందని భావిస్తున్నారు.

దిల్లీ పేలుడు కేసులో మరొకరి అరెస్ట్

- ఉమర్ నబీకి ఆశ్రయం కల్పించినట్లు నిర్ధారణ

దిల్లీ: దేశరాజధాని దిల్లీలో పేలుడుకు కారణమైన డాక్టర్ ఉమర్ నబీకి ఆశ్రయం కల్పించిన ఓ వ్యక్తిని జాతీయ దర్యాప్తు బృందం(ఎన్ఐఏ) బుధవారం అరెస్ట్ చేసింది. ఎన్ఐఏ ప్రతినిధి తెలిపిన వివరాల ప్రకారం... హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన షోయబ్ అనే వ్యక్తి ఉమర్‌కు పది రోజులపాటు ఆశ్రయమివ్వడమే కాకుండా రవాణా సదుపాయాన్ని కల్పించినట్లు తెలిసింది. ఈ కేసులో అరెస్ట్ అయిన వారిలో షోయబ్ ఏడో వ్యక్తి. పోలీసుల అదుపులో ఉన్న అనుమానితుల్లో ఒకడైన డా.ముజమ్మిల్ షకీల్ ఇచ్చిన సమాచారంతో షోయబ్‌ను అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. అల్-ఫలా విశ్వవిద్యాలయంలో కాంపౌండర్‌గా షోయబ్ పనిచేశాడని.. ఉగ్ర కుట్ర గురించి అతడికి ముందే తెలుసని అధికారులు పేర్కొన్నారు. ఐఈడీ బాంబుల తయారీకి వాడే పేలుడు పదార్థాలను నిందితులు అతడి ఇంట్లోనే నిల్వ చేసినట్లు గుర్తించామన్నారు.

కోర్టు ముందుకు షోయబ్, అమర్ రషీద్ అలీ

షోయబ్‌తో సహా ఈ కేసుతో సంబంధం ఉన్న మరో నిందితుడు అమీర్ రషీద్ అలీని ఎన్ఐఏ బుధవారం దిల్లీ కోర్టులో హాజరుపరిచింది. నిందితులను తమ కస్టడీకి అప్పగించాలని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి అంజు బజాజ్ చందనాకు ఎన్ఐఏ విజ్ఞప్తి చేసింది.



స్వాధీనం చేసుకున్న నిషిద్ధ దగ్గుమందు సీసాలను త్రిపుర రాజధాని అగర్తల శివార్లలోని బోధ్‌జంగ్ నగర్‌లో ధ్వంసం చేస్తున్న అధికారులు

పదేళ్లుగా జప్తు సొమ్ము తిరిగి ఇవ్వని సీబీఐకి సుప్రీంకోర్టు చీవాట్లు

- రూ.5వేల జరిమానా విధింపు

దిల్లీ: న్యాయస్థానం ఆదేశించి దశాబ్ద కాలం గడచిపోయినా జప్తు చేసిన రూ.50వేల సొమ్మును తిరిగి ఇవ్వని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)పై ముంబయిలోని ప్రత్యేక కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వ్యక్తికి చెల్లించాల్సిన రూ.50వేల మొత్తానికి రూ.5వేలను అదనంగా చెల్లించాలని సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి వి.పి.దేశాయ్ ఆదేశించారు. జాప్యానికి కారణమైన అధికారి జీతం నుంచి ఆ జరిమానా మొత్తాన్ని వసూలు చేయాలని సీబీఐ ఉన్నతాధికారులకు స్పష్టం చేసింది. అవినీతి ఆరోపణల కేసులో పెరెస్ పెజార్కర్ అనే వ్యక్తి నుంచి సీబీఐ 2014 సెప్టెంబరులో రూ.50వేల నగదు స్వాధీనం చేసుకుంది. అయితే, ఆ ఆరోపణలను నిరూపించలేకపోవడంతో జప్తు మొత్తాన్ని చెల్లించాలంటూ సీబీఐ ప్రత్యేక కోర్టు 2015 నవంబరులో ఆదేశించి కేసును మూసివేసింది. సీబీఐ తనకు రూ.50వేలు చెల్లించలేదని పెరెస్ పెజార్కర్ మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో తాజా ఆదేశాలు వెలువడ్డాయి. 2016లో కేంద్ర ప్రభుత్వం పెద్ద నోట్లు రద్దు చేసిన సమయంలోనూ ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వకుండా సీబీఐ అధికారి నిర్లక్ష్యం చేశారు. జప్తులో ఉన్న కరెన్సీ ప్రస్తుతం చెల్లకుండా పోయిందని, రిజర్వు బ్యాంకులో జమచేసి ఆ మొత్తాన్ని పిటిషనర్‌కు అందజేస్తామని చెప్పడంతో కోర్టు అంగీకరించింది.

శ్రీనగర్, దిల్లీలో గజగజ

- అత్యంత చలి రాత్రుల నమోదు

దిల్లీ, శ్రీనగర్: దేశరాజధాని దిల్లీ, జమ్మూకశ్మీర్‌లలో చలి గజగజ వణికిస్తోంది. దిల్లీలో దాదాపు మూడేళ్ల తర్వాత ఉష్ణోగ్రతలు బుధవారం 8 డిగ్రీలకు చేరుకుని నవంబరులోనే అత్యంత చలి రాత్రిగా నమోదైంది. 2022 తర్వాత ఉష్ణోగ్రతలు 8 డిగ్రీలకు పడిపోవడం ఇదే తొలిసారి. శీతాకాలంలో కనిష్ఠ సగటు కంటే 3.3 డిగ్రీలు తగ్గినట్లు వాతావరణ కేంద్రం ప్రకటించింది. మరోవైపు జమ్మూకశ్మీర్‌లోనూ చలితీవ్రత పెరిగిపోతోంది. బుధవారం శ్రీనగర్‌లో ఉష్ణోగ్రతలు మైనస్ 3.9 డిగ్రీలకు పడిపోయి అత్యంత చలి రాత్రిగా నమోదైంది. సాధారణం కంటే నాలుగు డిగ్రీలు తక్కువకు ఉష్ణోగ్రతలను పడిపోయాయని స్థానిక వాతావరణ అధికారులు తెలిపారు. పుల్వామా జిల్లాలోని కొనిబాల్ ప్రాంతంలో మైనస్ 5.5 డిగ్రీలు, పహల్గామ్‌లో మైనస్ 4.6 డిగ్రీలు నమోదయ్యాయి. దీంతో జమ్మూలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు శీతాకాల సెలవులు ప్రకటించారు. 1 నుంచి 8 తరగతికి డిసెంబరు 1 నుంచి 2026 ఫిబ్రవరి 28 వరకు, 9-12 తరగతులకు డిసెంబరు 11 నుంచి ఫిబ్రవరి 22 వరకు సెలవులను మంజూరు చేశారు.

వీసా సరళీకరణ దిశగా భారత్-యూఏఈ చర్చలు

దిల్లీ: భారత్-యూఏఈల మధ్య సులువైన ప్రయాణానికి వీలు కల్పించేలా వీసా విధానాలను సరళీకరించుకోవాలన్న లక్ష్యంతో చేపట్టిన చర్చలు బుధవారం గణనీయ పురోగతి సాధించాయి. అబుదాబీలో జరిగిన భారత్-యూఏఈ కాన్సులర్ వ్యవహారాల సంయుక్త కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగింది. ఇరుదేశాల మధ్య సమాచార మార్పిడిని మరింతగా మెరుగుపరచుకోవడం, ఇరుపక్షాలూ నేరగాళ్ల అప్పగింతను వేగవంతం చేయడంపై సైతం చర్చ జరిగినట్టు విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. కాన్సులర్ వ్యవహారాలపై కూడా ఈ సందర్భంగా విస్తృత చర్చ జరిగింది. ఒక దేశంలో ఉన్న మరో దేశ పౌరుల భద్రత, గౌరవం, సంక్షేమాల పరిరక్షణకు బద్ధులమై పనిచేద్దామని ఇరుపక్షాలూ నిర్ణయించాయి.

నౌకా విధ్వంసక బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించిన పాక్

కరాచీ: నౌకా విధ్వంసక బాలిస్టిక్ క్షిపణిని పాకిస్థాన్ పరీక్షించింది. ఈ విషయాన్ని ఆ దేశ మిలిటరీ విభాగం వెల్లడించింది. ఈ ప్రయోగం విజయవంతమైందని.. భూమిపై, సముద్రంలోని లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదని పేర్కొంది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ క్షిపణిని ఒక నౌక నుంచి ప్రయోగించినట్లు తెలిపింది.

శత్రువుల కుట్రలను ఛేదించాలి: మునీర్

ఇటీవల భారత్‌తో జరిగిన ఘర్షణలో తమ సాయుధ దళాలు వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించాయని పాక్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిం మునీర్ పేర్కొన్నారు. దీంతో తమ దేశ గ్లోబల్ స్టేచర్ పెరిగిందని ప్రగల్భాలు పలికారు. రావల్పిండిలోని జనరల్ హెడ్ క్వార్టర్స్‌లో బుధవారం నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ వర్క్‌షాప్‌లో మునీర్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌తో జరిగిన యుద్ధంలో మన సాయుధ దళాలు చూపిన వృత్తి నైపుణ్యం, సంకల్పం, నిబద్ధత ప్రపంచ స్థాయిలో పాకిస్థాన్ గౌరవాన్ని పెంచాయన్నారు. మన బలం జాతీయ ఐక్యతలోనే ఉందని.. మనమంతా కలిసి శత్రువుల కుట్రను ఛేదించాలని ఈ సందర్భంగా మునీర్ అధికారులకు సూచించారు.

రెండు కోట్ల ఆధార్ నంబర్లు అచేతనం

దిల్లీ: మృతి చెందిన రెండు కోట్ల మందికిపైగా వ్యక్తుల ఆధార్ నంబర్లను యునిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ) అచేతనం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల నుంచి అందిన సమాచారం మేరకు ఈ చర్య తీసుకుంది. ఆధార్ సమాచారం ఎప్పటికప్పుడు తాజాగా, కచ్చితంగా ఉండేలా యూఐడీఏఐ ఈ 'క్లీన్-అప్' కార్యక్రమాన్ని చేపట్టింది. చనిపోయిన వారి ఆధార్‌ను దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవడానికి, లేదా దాన్ని ఉపయోగించి సంక్షేమ పథకాల ప్రయోజనాలను అనధికారికంగా పొందకుండా నివారించడానికి ఈ చర్యలు చాలా అవసరం. ఏ ఆధార్ నంబరును కూడా మరొకరికి మళ్లీ కేటాయించరు.

సర్కోజీకి శిక్షను సమర్థించిన ఫ్రాన్స్ సుప్రీంకోర్టు

పారిస్: పదవిని కాపాడుకునేందుకు 2012 ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని, అక్రమంగా సమకూర్చుకున్న నిధులతో ఎన్నికల ప్రచారం నిర్వహించారన్న కేసులో ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీకి దిగువ న్యాయస్థానం విధించిన శిక్షను ఫ్రాన్స్ సుప్రీంకోర్టు సమర్థించింది. దీనిప్రకారం ఆయన ఏడాది పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. ఫ్రాన్స్ చట్టాల ప్రకారం ఆ శిక్షను ఆయన గృహ నిర్బంధంలో ఉంటూ పూర్తి చేయవచ్చు. అయితే, ఎలక్ట్రానిక్ పరికరాలతో నిఘా ఉంచుతారు. ఎన్నికల ప్రచారానికి సంబంధించిన మరో కేసులో రెండు వారాల క్రితం జైలు నుంచి సర్కోజీ విడుదలైన నేపథ్యంలో తాజా తీర్పు వెలువడింది.

జడ్జీల నియామకాలకు ప్రామాణిక విధానం ఖరారు చేయండి

- ఎస్సీబీఏ అధ్యక్షుడు వికాస్ సింగ్ వినతి

దిల్లీ: న్యాయమూర్తుల నియామకాలపై విశ్వసనీయతను పెంపొందించేలా, ప్రతిభావంతులైన వ్యక్తుల్నే ఆ పదవులకు ఎంపిక చేసేలా ప్రామాణిక విధి విధానాలను ఖరారు చేయాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్సీబీఏ) అధ్యక్షుడు వికాస్ సింగ్ అభిప్రాయపడ్డారు. ఉన్నత న్యాయస్థానాలకు జడ్జీల నియామకానికి సంబంధించిన ప్రామాణిక నిబంధనల ఖరారు అంశం చాలా కాలంగా నానుతోందని, ఇప్పటికైనా దానికి తుది రూపం ఇవ్వాలని కేంద్ర న్యాయశాఖ మంత్రికి, సీజేఐకి విజ్ఞప్తి చేశారు. న్యాయమూర్తుల నియామకాలకు కొలీజియం వ్యవస్థే సరైనదని, అయితే దానికి జవాబుదారీతనం ఉండాలని పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం దిల్లీలో ఎస్సీబీఏ నిర్వహించిన కార్యక్రమంలో వికాస్ సింగ్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

మధ్యప్రదేశ్ విట్‌లో విద్యార్థుల ఆందోళన

సీహోర్: మధ్యప్రదేశ్‌లోని సీహోర్ జిల్లాలో గల వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) విద్యాలయ విద్యార్థులు నిర్వహించిన ఆందోళన హింసాత్మకంగా మారింది. తమకు అందిస్తున్న తాగునీరు, ఆహారం నాణ్యత ఘోరంగా ఉందని, ఈ కారణంగా పలువురు కామెర్లవ్యాధికి గురయ్యారంటూ వారు విధ్వంసానికి దిగారు. కళాశాల ప్రాంగణానికి, వాహనాలకు నిప్పు పెట్టారు. ఈ మేరకు బుధవారం సంబంధిత అధికారులు వెల్లడించారు. మంగళవారం బాగా పొద్దుపోయిన తర్వాత చెలరేగిన ఈ ఆందోళనలో ఓ బస్సు, రెండు నాలుగు చక్రాల వాహనాలు, ఓ అంబులెన్స్, హాస్టల్ కిటికీలు, ఆర్‌వో ప్లాంటు, ప్రాంగణానికి చెందిన పలు నిర్మాణాలు మంటలకు దెబ్బతిన్నాయి. ఈ విధ్వంసానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సుమారు 3 వేల నుంచి 4 వేల మంది విద్యార్థులు నిరసనలో పాల్గొన్నారని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం కళాశాల ప్రాంగణంలో భారీ ఎత్తున పోలీసులను మోహరించారు. ఆందోళనల నేపథ్యంలో ఈ నెల 30 వరకూ కళాశాల యాజమాన్యం సెలవులు ప్రకటించింది.

థాయ్‌లాండ్‌లో వరదలు.. 33 మంది మృతి

బ్యాంకాక్: గత వారం రోజులుగా దక్షిణ థాయ్‌లాండ్‌ను ముంచెత్తిన వరదల కారణంగా సుమారు 33 మంది పౌరులు మృతి చెందారు. 12 రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో 10 లక్షల కుటుంబాలు, 27 లక్షల మంది పౌరులు ప్రభావితమయ్యారని విపత్తు నివారణ విభాగం బుధవారం వెల్లడించింది. మరోవైపు బుధవారం వానలు తగ్గుముఖం పట్టడంతో వరదలు శాంతిస్తాయని భావిస్తున్నారు. ఇప్పటికీ పలు వరద ప్రభావిత ప్రాంతాల్లో తమను రక్షించాలంటూ పౌరులు ఇళ్ల పైకప్పులపైకి చేరి అర్థిస్తున్న వీడియోలు తాజాగా వెలుగులోకి వచ్చాయి.

సుమత్రలో 17 మంది..

మెడాన్: ఇండోనేసియాలోని సుమత్ర దీవిలో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అకస్మాత్తు వరదలు సంభవించాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. వాటి కిందపడి 17 మంది మృతి చెందారు. ఆరుగురు గల్లంతయ్యారు. మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని ఆందోళన చెందుతున్నారు. సహాయబృందాలు సహాయకార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి.

రైట్స్ లిమిటెడ్‌లో 400 అసిస్టెంట్ మేనేజర్లు

రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్.. నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ జోన్‌లలో వివిధ విభాగాల్లో 400 అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్, మెకానికల్, మెటలర్జీ, కెమికల్, ఐటీ, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మా. **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగాల్లో డిగ్రీ (సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఐటీ, మెటలర్జీ)తో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 40 ఏళ్లు మించరాదు.
వేతనం: నెలకు రూ.42,478. **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీలకు రూ.600, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు రూ.300.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 25. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో. **రాత పరీక్ష తేదీ:** జనవరి 11.
పరీక్ష కేంద్రాలు: దిల్లీ, ముంబయి, బెంగళూరు, కోల్‌కతా, భువనేశ్వర్, హైదరాబాద్, బిలాయ్, చెన్నై, పట్నా, లఖ్‌నవూ.
వెబ్‌సైట్: https://www.rites.com/Career

బెల్‌లో ఇంజినీర్లు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, పుణె.. ఫ్రెష్ ఇంజినీర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▸ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్: 03 ▸మెకానికల్ ఇంజినీర్: 02
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్/ మెకానికల్)లో ఉత్తీర్ణత ఉండాలి.
వయసు: 1-11-2025 నాటికి 30 ఏళ్లు ఉండాలి. ఓబీసీకి 3 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీకి 5 ఏళ్లు, పీడబ్ల్యూబీడీలకు 10 ఏళ్లు సడలింపు ఉంటుంది. **వేతనం:** నెలకు రూ.23,000 - రూ.27,500. **దరఖాస్తుకు చివరి తేదీ:** 2025 డిసెంబరు 20.
ఎంపిక: రాత పరీక్షతో. **వెబ్‌సైట్:** https://bel-india.in/job-notifications/


కార్పొరేట్ ప్రపంచంలో ఉద్యోగి విజయాన్ని నిర్దేశించే కొన్ని అంశాల్లో.. ఎదురు చూడని సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించే నైపుణ్యం ప్రధానమైంది. కాలేజీల్లో ఈ నైపుణ్యాలను ప్రత్యేకించి బోధించరు. సంస్థల్లోనూ ప్రత్యేకంగా నేర్పరు. ఇవి పరిణతితో, పరిశీలనతో తెలుసుకోవాల్సిన అంశాలు. ఈ నైపుణ్యం ఉన్నవారు కార్పొరేట్ ఉద్యోగాల్లో వేగంగా అభివృద్ధి సాధించగలరు.

నైపుణ్యం సాధిద్దామిలా..

సమస్యా పరిష్కార నైపుణ్యం సాధించాలంటే.. దాన్ని గుర్తించి, మూల కారణాన్ని అర్థం చేసుకోవాలి. ఒక మార్గంలో పరిష్కారం కనిపించనప్పుడు ప్రత్యామ్నాయ విధానాలను అన్వేషించి, సమస్యను విశ్లేషించాలి. అవసరం మేరకు దాన్ని సీనియర్ల దృష్టిలో ఉంచి, వారి సలహా తీసుకుని, బాధ్యతతో అమలు చేయగల నైపుణ్యాలు ప్రతి ఉద్యోగిని మంచి కార్పొరేట్ యాజమాన్యాలు ఆశిస్తుంటాయని గుర్తించాలి.

ఆలోచిస్తేనే..

హారిక టెక్నాలజీ ఆధారిత 'న్యూ ఏజ్ కంపెనీ లాజిస్టిక్స్ (రవాణా నిర్వహణ) శాఖలో ట్రెయినీగా చేరింది. మెటీరియల్, ఆలస్యంగా డెలివరీ అవుతోందని కస్టమర్ల నుంచి ఫిర్యాదులు అందాయి. సరకు రవాణా అయ్యే సమయాల్లో రహదారి చాలా రద్దీగా ఉండటమే డెలివరీ ఆలస్యానికి మూల కారణమని ఆమె గుర్తించింది. దీనికి పరిష్కారంగా.. 'వేర్ హౌస్' (గిడ్డంగి) టీమ్‌తో మాట్లాడి ప్రత్యామ్నాయ రూట్ మ్యాప్ తయారు చేసి, డెలివరీ వాహనం ప్రయాణించేందుకు కొత్త టైమ్ స్లాట్లు సూచించింది. [illegible] సమస్య పరిష్కారానికి తాను చేసిన సూచనలను క్షుణ్నంగా మేనేజర్‌కు వివరించింది హారిక. వాటికి 'ఇంప్రెస్' అయిన మేనేజర్ ఆమెను అభినందించి, ప్రోత్సాహక బహుమతి ప్రకటించి, అదనపు బాధ్యతలు అప్పగించారు.



మెరుగైన జీవితం కోసం కార్పొరేట్ సంస్థల్లో కొలువులు ఆశించే యువతకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సమస్యా పరిష్కార నైపుణ్యాలు ఎంతో అవసరం. ఈ విషయంలో యాజమాన్యాలకు ప్రతి ఉద్యోగిపైనా కొన్ని అంచనాలు ఉంటాయి. కాలేజీల్లో కేస్ స్టడీస్, గ్రూప్ డిస్కషన్ల రూపంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నప్పటికీ, ఇవి ఊహాజనిత ఆధారంగా ఉంటాయి. కార్పొరేట్ ప్రపంచంలో.. కంటికి కనిపించని సమస్యలెన్నో ఉంటాయి. వాటిని సమర్థంగా ఎదుర్కొంటేనే ఉద్యోగ లక్ష్యాలు సాధించడం వీలవుతుంది. ఉద్యోగార్థుల్లో సమస్యా పరిష్కార సామర్థ్యాన్ని యాజమాన్యాలు గమనిస్తాయి.

సమస్యా పరిష్కారం.. ఉద్యోగ పురస్కారం

కార్పొరేట్ స్కిల్స్



వదిలేస్తే..

రాజు ఒక సంస్థలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా చేరాడు. టీమ్ లీడర్ ఇచ్చిన డేటా ఎంట్రీ చేసే ప్రోగ్రాంలో ఎర్రర్ కనిపించింది. ఆ ఎర్రర్‌ను పరిష్కరించలేక నిరుత్సాహానికి గురై, 'తర్వాత చూద్దాంలే' అని వాయిదా వేశాడు. సమస్యను విశ్లేషించినప్పుడు డేటా ఎంట్రీలో జరిగిన పొరపాటును మేనేజర్ గుర్తించారు. ఇదే విషయం గురించి రాజుతో మాట్లాడితే.. తాను సమస్య తీవ్రతను అర్థం చేసుకోలేక పోయానని, తప్పును అంగీకరించాడు. ఆ పొరపాటుకూ, ఇతరుల దృష్టికి తీసుకెళ్లనందుకూ రాజుపై మేనేజర్‌కు నమ్మకం తగ్గి, అతడికి హెచ్చరిక నోటీసు ఇచ్చారు. ఇది రాజు కెరియర్‌లో ఒక తీరని మచ్చగా మిగిలింది.

రాజీపడితే సంజాయిషీ

దిలీప్ కార్పొరేట్ కాలేజీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి, బహుళ జాతి సంస్థలో డెవలపర్‌గా చేరాడు. ఒక కొత్త డిజైన్ అభివృద్ధి చేసే బాధ్యతను అతడికి టీమ్ లీడర్ అప్పగించారు. ఈ ప్రాజెక్టు డిజైన్ రూపకల్పనలో ఏదో లోపం ఉందని దిలీప్‌కు అనుమానం వచ్చింది. ఈ సమస్యను బృంద సభ్యుల, టీమ్ లీడర్ల దృష్టికి తీసుకెళ్లకుండా అలాగే కొనసాగించాడు. టీమ్‌కు ప్రాజెక్టును ప్రజంట్ చేస్తున్నప్పుడు విలువల్లో తేడాలు వచ్చి అది ఫెయిల్ అయింది. సమస్య ఉందన్న అనుమానం వచ్చినప్పటికీ, సమయానికి పరిష్కరించక పోవడంతో ప్రాజెక్టు స్వరూపం మారింది. ఫలితంగా టీమ్ అందరికీ సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. దిలీప్ పని తీరుపై అసంతృప్తితో యాజమాన్యం అతడిపై చర్య తీసుకుంది. ఒక విలువైన పని చేస్తున్నప్పుడు తన స్థాయిలో పరిష్కారానికి వీలుకాని సమస్య ఎదురైతే దాన్ని సీనియర్ల దృష్టికి తీసుకెళ్లడం బాధ్యత అవుతుంది.

పరిష్కరించలేని సమస్య ఎదురైనప్పుడు నిరుత్సాహానికి గురై, సమస్యతో రాజీ పడకుండా, కొత్త ఆలోచనలతో పరిష్కార మార్గాలను అన్వేషిస్తే సృజనాత్మకత మెరుగుపడుతుంది. ఉద్యోగి సమస్యను పరిష్కరించలేనప్పుడు.. జట్టులోని ఇతర సభ్యుల సహకారం కోరడం ద్వారా సహోద్యోగులతో కమ్యూనికేషన్ మెరుగుపడుతుంది. సమస్య మూలాలను తెలుసుకోకుండా రాజీ పడితే ఉద్యోగులు ఆత్మవిశ్వాసం కోల్పోతారు. ఇది కెరియర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది.



దొరైరాజ్, సీనియర్ జనరల్ మేనేజర్,
ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ప్రభుత్వ కొలువు వస్తుందా?

ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుతున్నాను. నా లక్ష్యం ప్రభుత్వ ఉద్యోగం పొందడం. ఈ కోర్సుతో అవకాశాలు ఎలా ఉంటాయి? – కుమార్

సాధారణంగా కంప్యూటర్ సైన్స్ చదివే విద్యార్థుల్లో ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పొందాలని ఆశిస్తారు. అధిక వేతనాలు, విదేశీ అవకాశాలు, కార్పొరేట్ వాతావరణం కారణంగా ఐటీ కంపెనీల వైపు ఆకర్షితులవుతారు. అయితే, ఇటీవల కాలంలో పరిస్థితుల్లో వచ్చిన మార్పుల వల్ల మీలాగే చాలామంది కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ప్రైవేటు ఉద్యోగాల కంటే ప్రభుత్వ ఉద్యోగాల వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఉద్యోగ భద్రత, పని ఒత్తిడి, ఉద్యోగ స్థిరత్వం, జీవన నాణ్యత వంటి అంశాలకు ప్రాధాన్యం పెరగడంతో ప్రభుత్వ ఉద్యోగాలపై ఆసక్తి ఎక్కువవుతోంది.



ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్)తో ప్రభుత్వ రంగంలో చాలా అవకాశాలు ఉన్నాయి. ప్రపంచం మొత్తం డిజిటల్ దిశగా వేగంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో, ప్రభుత్వ సేవలు కూడా కంప్యూటరైజ్ అవుతూ, డేటాను శాస్త్రీయంగా నిర్వహిస్తూ, సైబర్ భద్రత చర్యలను బలోపేతం చేస్తూ, మార్పులకు లోనవుతున్నాయి. దీంతో కంప్యూటర్ సైన్స్ నిపుణుల అవసరం నిరంతరం పెరుగుతుండటమే కాకుండా, ఈ కోర్సు పూర్తిచేసిన వారికి ప్రభుత్వ విభాగాల్లో వివిధ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా.. ప్రోగ్రామింగ్, డేటా మేనేజ్‌మెంట్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేషన్, సాంకేతిక సహాయం, సైబర్ భద్రత వంటి రంగాల్లో పెద్ద ఎత్తున పోస్టులు భర్తీ అవుతున్నాయి.

ఈ విద్యార్హతతో.. యూపీఎస్సీ, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ద్వారా సైంటిఫిక్ ఆఫీసర్, టెక్నికల్ ఆఫీసర్, కంప్యూటర్ ప్రోగ్రామర్, ఐటీ ఆఫీసర్ లాంటి సాంకేతిక ఉద్యోగాలు పొందవచ్చు. వీటికోసం కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులో లోతైన అవగాహన, ప్రోగ్రామింగ్ నైపుణ్యం, లాజికల్ థింకింగ్, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అవసరం. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జిల్లా, మండల, సచివాలయ స్థాయిలో డిజిటల్ సేవలకు సంబంధించిన పోస్టులను భర్తీ చేస్తున్నాయి. వాటిలో.. డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఐటీ హెల్ప్ డెస్క్ వంటి ఉద్యోగాలు ముఖ్యమైనవి.

● బ్యాంకింగ్ రంగంలోనూ కంప్యూటర్ సైన్స్ వారికి డిమాండ్ ఉంది. ఆధునిక బ్యాంకులు.. డిజిటల్ బ్యాంకింగ్, కోర్ బ్యాంకింగ్ సిస్టమ్స్, సైబర్ భద్రతా విధానాలు, డేటాబేస్ నిర్వహణ వంటి విధులపై పూర్తిగా ఆధారపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ ఆఫీసర్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, డేటాబేస్ మేనేజర్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్ వంటి ఉద్యోగాలకు ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ అర్హత ఉన్నవారికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది.

● ఇస్రో, డీఆర్‌డీవో, బార్క్, ఎన్ఐసీ వంటి దేశంలోని ప్రతిష్ఠాత్మక శాస్త్ర పరిశోధనా సంస్థలు కూడా కంప్యూటర్ సైన్స్ నిపుణులను నియమిస్తున్నాయి. వీటిలో ప్రోగ్రామర్, సైంటిఫిక్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ రిసెర్చ్ ఫెలో వంటి ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. వీటికోసం సీ ప్రోగ్రామింగ్, జావా, నెట్‌వర్కింగ్, ఆపరేటింగ్ సిస్టమ్స్, డేటా స్ట్రక్చర్స్ వంటి ప్రాథమిక విషయాలపై పట్టు అవసరం.

● విద్యా రంగం విషయానికి వస్తే.. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, ల్యాబ్ అసిస్టెంట్, గెస్ట్ లెక్చరర్ వంటి ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయి. ఉన్నత విద్యారంగంలో స్థిరపడాలనుకుంటే, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులో నెట్/సెట్ ఉత్తీర్ణత సాధించి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్‌గా ఉద్యోగం పొందవచ్చు. పీహెచ్‌డీతో ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో సహాయ ఆచార్యులుగా సేవలందించవచ్చు. డిజిటల్ క్లాస్ రూమ్స్, కంప్యూటర్ ల్యాబ్స్ పెరుగుతున్న నేపథ్యంలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులకు డిమాండ్ మరింతగా పెరిగింది. బోధన వృత్తిని ఇష్టపడేవారికి ఇది అత్యుత్తమ మార్గం.

● గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలు ఏర్పడిన తర్వాత ప్రభుత్వ సేవలు పూర్తిగా డిజిటల్ వైపు మళ్లాయి. డేటా ఎంట్రీ, డేటా మేనేజ్‌మెంట్, టెక్నికల్ సపోర్ట్ వంటి పనుల్లో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రాధాన్యం లభిస్తోంది.

● ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన తర్వాత గేట్ రాసి మంచి ర్యాంక్ సాధిస్తే, అనేక ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలకు నేరుగా ఇంటర్వ్యూకు అర్హత ఉంటుంది. ఇప్పటి నుంచే ప్రణాళికా బద్ధంగా సంసిద్ధం అయితే, ప్రభుత్వ ఉద్యోగం పొందడం కష్టం కాదు.

– ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్,
కెరియర్ కౌన్సెలర్

ఐసీఎంఆర్ దిల్లీలో యంగ్ ప్రొఫెషనల్స్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్, దిల్లీ ఒప్పంద ప్రాతిపదికన యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
▸యంగ్ ప్రొఫెషనల్-2 (టెక్నికల్/సైంటిఫిక్, జనరల్): 03
▸యంగ్ ప్రొఫెషనల్-2 (టెక్నికల్/సైంటిఫిక్, స్టాటిస్టిక్స్): 02
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో పీజీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** నవంబరు 25 నాటికి 40 ఏళ్లలోపు ఉండాలి.
వేతనం: నెలకు రూ.42,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో **ఇంటర్వ్యూ తేదీ:** డిసెంబరు 17.
వెబ్‌సైట్: https://www.icmr.gov.in/

సైంటిస్టులు

నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రిసెర్చ్, హైదరాబాద్... ఒప్పంద ప్రాతిపదికన సైంటిస్టు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▸సైంటిస్ట్-సీ: 04 ▸సైంటిస్ట్-డీ: 02 ▸సైంటిస్ట్-ఈ: 01
అర్హత: సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, బీవీఎస్సీ, ఏహెచ్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ లేదా ఫార్మ్-డి, ఎంవీఎస్సీ అండ్ ఏహెచ్ లేదా పీహెచ్‌డీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: సైంటిస్ట్-సీకు 40 ఏళ్లు, సైంటిస్ట్-డీకు 45 ఏళ్లు, సైంటిస్ట్-ఈకు 50 ఏళ్లు మించకూడదు.
వేతన శ్రేణి: నెలకు సైంటిస్ట్-సీకు రూ.67,700 - రూ.2,08,700; సైంటిస్ట్-డీకు రూ.78,800- రూ.2,09,200; సైంటిస్ట్-ఈకు రూ.1,23,100- రూ.2,15,900. **ఎంపిక:** కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, ఇంటర్వ్యూతో. **దరఖాస్తు ఫీజు:** రూ.1500. ఎస్సీ /ఎస్టీ/ మహిళలు/ పీడబ్ల్యూడీ/ ఈడబ్ల్యూఎస్‌లకు ఫీజు లేదు.
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 22.12.2025.
వెబ్‌సైట్: https://www.iari.res.in/bms/announcements/jobs.php

సీఆర్ఆర్ఐలో ఫీల్డ్ ఆపరేటర్లు

కటక్‌లోని ఐసీఏఆర్- సెంట్రల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ).. తాత్కాలిక ప్రాతిపదికన అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆపరేటర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
▸అగ్రికల్చరల్ ఫీల్డ్ ఆపరేటర్ (ఏఎఫ్ఓ): 02
అర్హత: టెన్త్, ఇంటర్, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం. **వేతనం:** నెలకు రూ.18,000.
వయసు: 18-50 ఏళ్ల మధ్య ఉండాలి.
ఇంటర్వ్యూ తేదీ: 01.12.2025. **వేదిక:** ఐసీఏఆర్-సెంట్రల్ రైస్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, కటక్. **వెబ్‌సైట్:** https://icar-crri.in/walk-in-interview-3/

గెయిల్‌లో సీనియర్ ఇంజినీర్ అవుతారా

న్యూదిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (గెయిల్)..29 సీనియర్ ఇంజినీర్, ఆఫీసర్ పోస్టులను ప్రకటించింది. గ్రూప్ డిస్కషన్/ ప్రొఫిషియన్సీ టెస్ట్/ ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఇంటర్వ్యూలతో నియామకాలు ఉంటాయి.



మొత్తం ఖాళీల్లో.. సీనియర్ ఇంజినీర్ 13, సీనియర్ ఆఫీసర్ 13, చీఫ్ మేనేజర్-1, ఆఫీసర్ 2 ఖాళీలు ఉన్నాయి.
మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, బాయిలర్ ఆపరేషన్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫైర్ అండ్ సేఫ్టీ, లా, మార్కెటింగ్, హెచ్ఆర్, మెడికల్ విభాగాల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.
ఎంపిక: విద్యార్హతలు, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి తదుపరి దశ/దశలకు ఎంపిక చేస్తారు. సీనియర్ ఆఫీసర్ పోస్టుకు.. ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ (పీఈటీ), ఇంటర్వ్యూలు ఉంటాయి.
● ఇంటర్వ్యూలో అన్‌రిజర్వ్‌డ్/ ఓబీసీ - ఎన్‌సీఎల్/ ఈడబ్ల్యూఎస్‌లు 60 శాతం, ఎస్సీ/ఎస్టీలు 55 శాతం, దివ్యాంగులు 50 శాతం కనీసార్హత మార్కులు సంపాదించాలి.
● గ్రూప్ డిస్కషన్/ ప్రొఫిషియన్సీ టెస్ట్/ ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులో అన్‌రిజర్వ్‌డ్/ ఓబీసీ - ఎన్‌సీఎల్/ ఈడబ్ల్యూఎస్‌లు 40 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 35 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి.
● తుది ఫలితాలను గెయిల్ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. తాజా ఉద్యోగ సమాచారం కోసం అభ్యర్థులు తరచూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.
● ఎంపికైనవారు ఏడాది ప్రొబేషన్‌లో పనిచేయాలి.

ముఖ్యాంశాలు

ఎక్కువ సంఖ్యలో ఖాళీలున్న పోస్టుల వివరాలు..
అర్హతలు: సీనియర్ ఇంజినీర్: కంప్యూటర్ సైన్స్/ ఐటీ/ కెమికల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్/ ప్రొడక్షన్ అండ్ ఇండస్ట్రియల్/ మెకానికల్ అండ్ ఆటోమొబైల్/ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిగ్రీ. ఏడాది ఉద్యోగానుభవం ఉండాలి. ఫుల్‌టైమ్ రెగ్యులర్ కోర్సులు చేసినవారు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ చేసినవారూ దరఖాస్తు చేసుకోవచ్చు.
సీనియర్ ఆఫీసర్: ఫైర్/ ఫైర్ అండ్ సేఫ్టీ/ కెమికల్/ మెకానికల్/ ప్రొడక్షన్/ ఎలక్ట్రికల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఐటీ/ సివిల్ బ్రాంచ్‌తో ఇంజినీరింగ్ డిగ్రీ. ఏడాది ఉద్యోగానుభవం ఉండాలి.
◆ విద్యార్హతలకు సంబంధించిన డిగ్రీలను 60 శాతం మార్కులతో పూర్తిచేయాలి.
వయసు: 28 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: అన్‌రిజర్వ్‌డ్/ ఓబీసీ - ఎన్‌సీఎల్/ ఈడబ్ల్యూఎస్‌లకు రూ.200. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఫీజు లేదు.
వేతన శ్రేణి: సీనియర్ ఇంజినీర్, సీనియర్ ఆఫీసర్లకు నెలకు రూ.60,000-1,80,000. మూలవేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్, గ్రూప్ ఇన్స్యూరెన్స్, హౌస్‌బిల్డింగ్ అడ్వాన్స్, వైద్య సదుపాయాలు ఉంటాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.12.2025
వెబ్‌సైట్: https://gailonline.com/

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో..

బిజినెస్ అనలిస్ట్
సంస్థ: టెక్‌డోమ్ సొల్యూషన్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: బిజినెస్ అనాలిసిస్, బిజినెస్ డెవలప్‌మెంట్, క్లయింట్ ఇంటరాక్షన్, క్లయింట్ రిలేషన్‌షిప్, క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్ (సీఆర్ఎం), రిసెర్చ్ అండ్ అనలిటిక్స్ **స్టైపెండ్:** రూ.8,000-15,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 18
☛ https://shorturl.at/7xOG3

మార్కెటింగ్
సంస్థ: క్లింక్
నైపుణ్యాలు: బ్రాండింగ్, కంటెంట్ రైటింగ్, మార్కెటింగ్, సోషల్‌మీడియా మార్కెటింగ్ **స్టైపెండ్:** రూ.18,000-23,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 19
☛ https://shorturl.at/DJTVB



హ్యూమన్ రిసోర్సెస్
సంస్థ: శ్రీకుర్మా ఆటోమొబైల్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: కోల్డ్ కాలింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్, రిక్రూట్‌మెంట్
స్టైపెండ్: రూ.8,000-12,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 17
☛ https://shorturl.at/ZsevN

విశాఖపట్నంలో..

కంటెంట్ రైటర్ (ఇన్‌స్టాగ్రామ్ స్ట్రాటజీ)
సంస్థ: ఇంటర్వ్యూబడ్డీ **నైపుణ్యాలు:** కంటెంట్ రైటింగ్, కోఆర్డినేషన్, ఇన్‌స్టాగ్రామ్ మార్కెటింగ్, స్ట్రాటజీ, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ **స్టైపెండ్:** రూ.5,000
దరఖాస్తు గడువు: నవంబరు 30
☛ https://shorturl.at/uQbmP

హెచ్ఆర్
సంస్థ: సినెక్టిఫై సొల్యూషన్స్ ప్రై.లి. **నైపుణ్యాలు:** ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, మేనేజ్‌మెంట్, ఎంఎస్-ఆఫీస్, ఆపరేషన్స్, రిక్రూట్‌మెంట్, టైమ్ మేనేజ్‌మెంట్ **స్టైపెండ్:** రూ.5,000-15,000
దరఖాస్తు గడువు: డిసెంబరు 17
☛ https://tinyurl.com/h2scjp4r

ఎస్ఈఆర్‌సీలో సైంటిస్టులు...

సీఎస్ఐఆర్‌కు చెందిన స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ సెంటర్, (సీఎస్ఐఆర్-ఎస్ఈఆర్‌సీ) చెన్నై.. 30 సైంటిస్ట్ పోస్టులను ప్రకటించింది. ఎంటెక్/ఎంఈ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఉన్నత విద్యార్హతలు, సైంటిఫిక్ జర్నల్‌లో ప్రచురణలు, రాత పరీక్ష/సెమినార్, ఉద్యోగానుభవంతో నియామకాలు ఉంటాయి.



మొత్తం ఖాళీల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 12, ఓబీసీకి 8, ఈడబ్ల్యూఎస్‌కు 3, ఎస్సీకి 4, ఎస్టీకి 3 కేటాయించారు.
ఉన్నత విద్యార్హతలు (ఎంఈ, ఎంటెక్), రిసెర్చ్/ పీహెచ్‌డీ స్పెషలైజేషన్, సైంటిఫిక్ జర్నల్‌లో ప్రచురణలు, రాత పరీక్ష/ సెమినార్, ఉద్యోగానుభవంతో షార్ట్‌లిస్ట్ చేసి ఇంటర్వ్యూకు పిలుస్తారు.
ప్రొడక్ట్ డెవలప్‌మెంట్/ టెక్నాలజీ ఇన్నోవేషన్/ ట్రాన్స్‌లేషనల్ రిసెర్చ్/ అప్లైడ్ టెక్నాలజీ రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యమిస్తారు.
రాత పరీక్ష/ సెమినార్‌లలో ఒక దాన్ని నిర్వహించవచ్చు. రాత పరీక్ష తేదీ, వివరాలను కాల్ లెటర్‌తో తెలియజేస్తారు.
గమనించాల్సినవి: ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు పంపితే చివరి దాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.
▲ దరఖాస్తు చేసిన తర్వాత ఎలాంటి మార్పులకూ అవకాశం ఉండదు.
▲ ఇంటర్వ్యూకు హాజరయ్యే వారికి రెండో తరగతి రైలు ప్రయాణ ఛార్జీలను చెల్లిస్తారు.
▲ విద్యార్హతలు, అనుభవాలకు సంబంధించిన డాక్యుమెంట్లను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. వాటి ఆధారంగానే షార్ట్‌లిస్ట్ చేసి రాతపరీక్ష/ సెమినార్‌కు ఎంపిక చేస్తారు.
▲ తాజా ఉద్యోగ సమాచారం కోసం తరచూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

వివరాలు:
అర్హతలు: స్ట్రక్చరల్ ఇంజినీరింగ్/ అప్లైడ్ మెకానిక్స్/ జియోటెక్నికల్/ ఓషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ బ్రాంచ్‌తో ఎంటెక్/ ఎంఈ.
వయసు: 32 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీకి ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళలు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.
వేతన శ్రేణి: నెలకు రూ.67,700-2,08,700. మూల వేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, టీఏ, ఎల్‌టీసీ, వైద్య ఖర్చులు, చిల్డ్రన్ ఎడ్యుకేషన్, హౌస్ బిల్డింగ్ అడ్వాన్సులు, గ్రాట్యుటీ, నేషనల్ పెన్షన్ స్కీమ్ మొదలైన సదుపాయాలు ఉంటాయి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 22.12.2025
వెబ్‌సైట్: https://serc.res.in/

జిప్‌మర్‌లో ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్

జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్, పుదుచ్చేరి ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▸ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్: 03
అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా ఎంటెక్/ఎంఈ/ఎమ్మెస్సీతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: డిసెంబరు 15, 2025 నాటికి 30 ఏళ్లు ఉండాలి.
వేతనం: నెలకు రూ.28,000.
దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 15.
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://jipmer.edu.in/announcement/jobs





మాక్ అసెంబ్లీలో తమకు కేటాయించిన సీట్లలో కూర్చున్న విద్యార్థులు ★ అసెంబ్లీ భవనం గురించి వివరిస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు సవిత, సంధ్యారాణి, పయ్యావుల కేశవ్, అనిత

ఒలింపిక్స్‌లో కోతి కొమ్మచ్చి, గోలీలాట, గిల్లీదండ పెట్టించండి

- రోడ్డు ప్రమాదాలు చేసే విద్యార్థులు టెర్రరిస్టులు కాదు.. వారిని మార్చుకుందాం
- ఆకట్టుకున్న విద్యార్థుల మాక్ అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు

విద్యార్థుల మాక్ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు అందర్నీ ఆకట్టుకుంది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులుగా వ్యవహరించిన సభ్యులు తడబాటు లేకుండా సమాధానాలు ఇచ్చారు. ఒలింపిక్స్ ఏర్పాట్లపై ప్రతిపక్ష సభ్యుడిగా తేజ నరసింహా అడిగిన ప్రశ్న సభలో నవ్వులు పూయించింది. "మన వాళ్లు జావెలిన్ విసరడం కంటే ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడంలో ఎక్కువ నిపుణులు. నా సలహా ఏంటంటే ఒలింపిక్స్ కమిటీకి ఒక లేఖ రాయండి. మన స్థానిక క్రీడలైన కోతి కొమ్మచ్చి, గోలీలాట, గిల్లీదండలను ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టండి. కనీసం దాంట్లోనైనా మనకు బంగారు పతకం గ్యారెంటీగా వస్తుంది. క్రీడాకారులకు శిక్షణ ఇవ్వకుండా ఈ ప్రభుత్వం ఆరు బయట చుక్కలు లెక్కబెడుతుందా?" అంటూ ప్రశ్నించారు.

– ఈనాడు, అమరావతి

ఫోన్లో క్యాండీ క్రష్ ఆడుతూ లెక్కపెడతారా?

ప్రతిపక్ష సభ్యులు: ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల మొబైల్ వ్యసనం కేసులు ఎన్ని నమోదయ్యాయి? ఈ కేసుల కోసం ఏమైనా కౌన్సెలింగ్ లేదా రిహాబిలిటేషన్ సదుపాయం అందిస్తోందా? డీ ఎడిక్షన్ సెంటర్ల ఏర్పాటు యోచన ఉందా?

మానవవనరుల శాఖ మంత్రి: వందల్లో కేసులు నమోదయ్యాయి. ప్రత్యేక రిహాబిలిటేషన్ అంటూ లేదు. కచ్చితంగా కౌన్సెలింగ్ అందిస్తుంది. డీ ఎడిక్షన్ సెంటర్ల ఏర్పాటు ప్రతిపాదనలు పరిశీలన దశలో ఉన్నాయి.

ప్రతిపక్ష సభ్యురాలు నిహారిక: విద్యార్థుల మొబైల్ వ్యసనం కేసులు వందల్లో ఉన్నాయట. అంటే కచ్చితమైన లెక్క లేదా? లేక అది కూడా ఫోన్లో క్యాండీ క్రష్ ఆడుతూ లెక్కపెట్టారా? పిల్లలేమో 5జీ స్పీడ్‌లో ఫోన్లకు అతుక్కుపోతుంటే మీ ప్రభుత్వ చర్యలేమో ఇంకా 2జీ స్పీడ్‌లో పరిశీలన దశలోనే తిరుగుతున్నాయి? ఆ ప్రయోగాత్మక కేంద్రాలు భూమిపైకి వచ్చేలోపు విద్యార్థుల భవిష్యత్తు స్విచ్ ఆఫ్ అయిపోదా?

మంత్రి: గౌరవ సభ్యులు సాంకేతికత గురించి, 5జీ గురించి బాగానే మాట్లాడారు. కానీ, మా ప్రభుత్వం విద్యార్థుల్ని నేరస్థుల్లా చూడడం లేదు. బాధితుల్లా చూస్తోంది.

ప్రతిపక్ష సభ్యురాలు: అసలు లెక్కలు ఏవి? వందల్లో అంటే సమాధానమేనా? దాటవేయకండి. ప్రయోగాత్మక కేంద్రాలు ఎప్పుడు వస్తాయి? తేదీ చెప్పండి?

మంత్రి: పిల్లల చేతిలో ఫోన్ ఉంటే అది మొబైల్ వ్యసనం. దీన్ని సరి చేయొచ్చు. కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్రతిపక్ష సభ్యురాలు: మళ్లీ కథలే యాక్షన్ ప్లాన్ ఏదీ?

మంత్రి: ప్రభుత్వం ఏం చేసినా గుడ్డిగా వ్యతిరేకించే మైక్ వ్యసనానికి మాత్రం మందు కనిపెట్టలేదు. పిల్లలకు కౌన్సెలింగ్ పని చేస్తుంది. కానీ, మీకు పని చేయదు. మేము ప్రయోగాత్మక సెంటర్లపై దృష్టిపెట్టాం. మీరు కేవలం అల్లరి మీద దృష్టిపెడతారు తేడా అదే.

కళాశాల విద్యార్థులపై ఎన్ని కేసులు నమోదయ్యాయి?

సభ్యులు: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే కళాశాల విద్యార్థులపై కేసులు ఎన్ని నమోదయ్యాయి? ప్రమాదాల నివారణకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏంటి?

రవాణా శాఖ మంత్రి: ద్విచక్ర ప్రమాదాల కేసులు రికార్డుల్లో ఉన్నాయి. రోడ్డు భద్రత చర్యలు చేపట్టాం. కళాశాలల్లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ఎమ్మెల్యే ద్వారకేశ్: కౌన్సెలింగ్, అవగాహన అని కాలక్షేపం చేస్తున్నారు. రోడ్డుపై రాష్‌గా నడిపి ప్రాణాలు తీసేవారు విద్యార్థి కాదు.. వాడు ఒక రోడ్ టెర్రరిస్ట్. ప్రభుత్వానికి ధైర్యం ఎందుకు లేదు? వాళ్లను ఇంకా పసి పిల్లలు అని వెనకేసుకొస్తారా? వాళ్లపై టెర్రరిస్ట్ చట్టాలు పెట్టడానికి మీ చేతులు ఎందుకు వణుకుతున్నాయి? ఓట్లు కోసమేనా?

సభాపతి: టెర్రరిస్ట్ అనేది చాలా పెద్ద పదం. మన పిల్లల్ని టెర్రరిస్ట్ సభలో అంతటి తీవ్రమైన పదజాలం వాడడం సమంజసం కాదు.

మంత్రి: ప్రతిపక్ష సభ్యుల వాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నాం. వాళ్లు దారితప్పిన పిల్లలు. టెర్రరిస్టులు కాదు. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించి, తల్లిదండ్రులను పిలిపించి బాధ్యత గుర్తు చేస్తే వారు రేపు బాధ్యత గల పౌరులవుతారు. మానవత్వంతో మార్చుదాం.

ఒలింపిక్స్–2036 కోసం రాష్ట్రం ఎలాంటి ప్రయత్నాలు ప్రారంభించింది? ప్రారంభిస్తే ఎంత నిధులు కేటాయించారు?

క్రీడల శాఖ మంత్రి: ఒలింపిక్స్-2036పై చర్చలు జరుగుతున్నాయి. కార్యక్రమ అవసరాలను అనుసరించి నిధుల కేటాయింపు పరిశీలనలో ఉంది.

ఎమ్మెల్యే తేజ నరసింహా: 2036 ఒలింపిక్స్ కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. సంతోషం. మన దేశ జనాభా ఎంత 140 కోట్లు. కానీ, వచ్చే పతకాలను వేళ్లపై లెక్క పెట్టొచ్చు. మన వాళ్లు జావెలిన్ విసరడం కంటే ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడంలో ఎక్కువ నిపుణులు. నా సలహా ఏంటంటే ఒలింపిక్స్ కమిటీకి ఒక లేఖ రాయండి. మన స్థానిక క్రీడలైన కోతి కొమ్మచ్చి, గోలీలాట, గిల్లీదండలను ఒలింపిక్స్‌లో ప్రవేశపెట్టండి. కనీసం దాంట్లోనైనా మనకు బంగారు పతకం గ్యారెంటీగా వస్తుంది. క్రీడాకారులకు శిక్షణ ఇవ్వకుండా ఈ ప్రభుత్వం ఆరు బయట చుక్కలు లెక్కబెడుతుందా?

ఒలింపిక్స్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారా?

మంత్రి: మనకు వచ్చిన పతకాలు చూస్తుంటే నాకూ అప్పుడప్పుడు బాధగా ఉంటుంది. ఆయన గిల్లి దండ అన్నారు. నేను ఇంకొకటి చేర్చుతాను. ఒలింపిక్స్‌లో మ్యూజికల్ చైర్స్, గోడదూకడం పెడితే ఆ విభాగాల్లో అన్ని పతకాలు మన నాయకులవే. కుర్చీ కోసం మనం పరిగెత్తినంత స్పీడ్‌గా ఉసేన్ బోల్ట్ కూడా పరుగెత్తలేడు. మన క్రీడాకారుల వైఫల్యం గల్లీ నుంచి ఢిల్లీ వరకు.. అక్కడి నుంచి ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే వరకు మా ప్రభుత్వానికి విజన్ ఉంది.

సభాపతి: 1900 పారిస్ ఒలింపిక్స్‌లో పావురాల షూటింగ్ అధికారిక క్రీడగా ఉంది. రేపొద్దున్న మన కబడ్డీగాని, ఖోఖోగాని ఒలింపిక్స్ వెళ్లవని నిబంధన ఏమీ లేదు. మ్యూజికల్ చైర్స్ ఆలోచన బాగుంది. కానీ, అది ఈ సభలో వద్దు. గ్రౌండ్‌లో చూసుకుందాం.

15 రోజుల్లోనే నెట్ మీటర్ బిగింపు..

ప్రతిపక్ష సభ్యులు: మొత్తం విద్యుత్తు ఉత్పత్తిలో సౌరశక్తి వాటా ఎంత? గతేడాది సోలార్ శక్తి ఎంత జోడించారు? పీఎం సూర్యఘర్ కింద ఎంతమంది లబ్ధిదారులు నమోదయ్యారు?

విద్యుత్తు శాఖ మంత్రి: విద్యుత్తు ఉత్పత్తిలో సౌరశక్తి గణనీయమైన వాటా ఉన్నది. గత ఆర్థిక సంవత్సరంలో కొత్త సౌర సామర్థ్యం రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానించాం. అనేక మంది లబ్ధిదారులు నమోదయ్యారు.

ఎమ్మెల్యే దయానా: పీఎం సూర్యఘర్‌కు సంబంధించి ప్రజలు దరఖాస్తు చేసుకుంటున్నారు. రాయితీ వస్తోంది. కానీ, నెట్ మీటరింగ్ బిగించడానికి డిస్కం అధికారులు నెలల తరబడి సమయం తీసుకుంటున్నారు. దరఖాస్తు ఆమోదించిన 15 రోజుల్లోపే కచ్చితంగా నెట్ మీటర్ బిగించేలా ప్రభుత్వం కఠినమైన గడువు విధిస్తే ఈ పథకం వేగంగా ప్రజల్లోకి వెళ్తుంది.

సభాపతి: చాలా మంచి పాయింట్ లేవనెత్తారు. ఇది నిజంగా సామాన్యుడికి ఉపయోగపడే సూచన. రాజకీయాలకు అతీతంగా ఇలాంటి సలహాలు వస్తేనే సభకు గౌరవం.

మంత్రి: సభ్యులు లేవనెత్తిన అంశంతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. సౌర విద్యుత్తు ప్యానెల్స్ బిగించడం ఎంత ముఖ్యమో.. నెట్ మీటరింగ్ అంత కన్నా ముఖ్యం. కొన్నిచోట్ల జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. ఇకపై దరఖాస్తు చేసుకున్న రెండు వారాల్లోపు మీటర్ బిగించకపోతే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకునేలా నిబంధనలు మారుస్తాం.

విద్యా సంస్థల్లో తనిఖీలు చేస్తాం..

ప్రతిపక్ష నాయకులు: నార్కోటిక్ డ్రగ్స్ సీజ్‌లు, జరిమానాలు, అరెస్టులు ఎన్ని చేశారు? విద్యా సంస్థల్లో డ్రగ్స్ నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

హోంమంత్రి: సీజ్‌లు, జరిమానాలు, అరెస్టులు రికార్డుల్లో నమోదయ్యాయి. 22,366.25 కిలోల గంజాయి, 91.2 ఆస్ను సీజ్ చేశాం. 970మంది అరెస్టు అయ్యారు. 5045 మంది అనుమానితులను అరెస్టు చేశాం. విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ఎమ్మెల్యే మేఘన: డ్రగ్స్ నివారణకు ఏఏ చర్యలు తీసుకుంటున్నారో సభకు తెలియచేయాలని కోరుతున్నాం.

మంత్రి: డ్రగ్స్ నివారణపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉంది. రాబోయే రోజుల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడమే కాకుండా ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి, పాఠశాలలు, కళాశాలల్లో తనిఖీలు నిర్వహించి, అందుకు కారణమైన వారిని కఠినంగా శిక్షిస్తాం. 2047నాటికి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మారుస్తామని హామీ ఇస్తున్నా.

తండాలకు రోడ్లు వేస్తాం

ఎమ్మెల్యే ఉదయశ్రీ: అడవి తల్లి బాటలో ఎన్ని గిరిజన గ్రామాలు కవర్ అయ్యాయి అంటే గణనీయమైన సంఖ్య అని మంత్రి పేర్కొన్నారు. కానీ, అంకెల విషయంలో స్పష్టత లేకపోతే అభివృద్ధిని ఎలా కొలుస్తాం? గిరిజన టోలీలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. వాటికి అభివృద్ధి జరగకపోతే వర్షాకాలంలో వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం ఉండదు. బడ్జెట్ ఉంది అంటున్నారు.. పనులు ఎందుకు ఆగిపోయాయి? ఆర్థిక సంవత్సరం అయిపోయేలోపు స్పష్టమైన లెక్కలు ఇవ్వగలరా?

పంచాయతీరాజ్ శాఖ మంత్రి: సభ్యులు అడిగిన ప్రశ్నలకు నా దగ్గర చెంపదెబ్బలాంటి సమాధానం ఉంది. నేను అంకెలు దాచదలుచుకోలేదు. కొన్ని తండాల్లో అటవీ శాఖ అనుమతులు రావడంలో జాప్యం వల్లే పనులు ఆలస్యమయ్యాయి. వచ్చే వారం సంబంధిత అధికారులు, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమీక్ష ఏర్పాటు చేస్తాం. వర్షాలు మొదలయ్యేలోపు పెండింగ్‌లో ఉన్న 20 తండాల్లో పనులు ప్రారంభించి, మార్చిలోపు పూర్తి చేస్తాం. నిధుల కొరత లేదు. చిత్తశుద్ధి లోపం అంతకన్నా లేదు.



సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మంత్రి లోకేశ్. చిత్రంలో మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ విజయానంద్, హోంమంత్రి అనిత



మాక్ అసెంబ్లీకి వస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్



నినాదాలు చేసుకుంటూ.. మాక్ అసెంబ్లీ వెల్ వైపు వస్తున్న సభ్యులు

అసెంబ్లీ సమావేశాలు ఎలా ఉంటాయో తెలుసుకున్నాం

- మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు

ఈనాడు, అమరావతి: మాక్ అసెంబ్లీలో పాల్గొనడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశం ముగిసిన తర్వాత విద్యార్థులు సంతోషంతో.. వారి అభిప్రాయాలు పంచుకున్నారు.

రాజకీయాల్లోకి వచ్చినా సాయం చేస్తా

– చిన్మయి, జడ్పీహెచ్ఎస్, తిరుచానూరు, తిరుపతి జిల్లా

మాక్ అసెంబ్లీలో విద్యాశాఖ మంత్రిగా వ్యవహరించా. సీఎం చంద్రబాబు చెప్పినట్లు ఇది మాకు ఎంతో ఉపయోగపడుతుంది. అసెంబ్లీ సమావేశాలు ఎలా ఉంటాయో తెలుసుకున్నాం. ఇలాంటి కార్యక్రమాలతో మాలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. ఇంతకుముందు వైద్యురాలిని కావాలని అనుకున్నాను. ఇక్కడికి వచ్చాక వైద్యురాలిని అయినా ఆ తర్వాత రాజకీయాల్లోకి రావొచ్చని తెలిసింది. వైద్యురాలిగా ఉచిత వైద్యం చేయాలన్నది నా కోరిక. రాజకీయల్లోకి వచ్చినా అందరికీ సాయం చేస్తా. ఏటా మాక్ అసెంబ్లీ నిర్వహిస్తే బాగుటుంది.

స్పీకర్‌గా వ్యవహరించడం గొప్ప అనుభూతి

– స్వాతి, ఆదర్శ పాఠశాల, శంఖవరం, కాకినాడ

సభాపతిగా ఎన్నిక కావడం.. స్పీకర్‌గా వ్యవహరించడం గొప్ప అనుభూతినిచ్చింది. బిల్లులు ఎలా ప్రవేశపెడతారు? సభ ఎలా నిర్వహిస్తారో తెలుసుకున్నా. సభాపతిగా అధికార, ప్రతిపక్షాలను సమానంగా చూడాలని తెలుసుకున్నా.

రాజకీయాల్లో వస్తా

– రాజశేఖర్, ఎస్‌కేవీఎస్ పాఠశాల, బాపట్ల

పెద్దయ్యాక రాజకీయాల్లోకి వద్దామనుకుంటున్నా. సీఎం కుర్చీ ఎక్కాలని అనుకుంటున్నా. ప్రొటెం స్పీకర్‌గా సభ్యులను నియంత్రించే అవకాశం రావడం ఆనందంగా ఉంది. ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

ప్రతిపక్ష నేతగా వ్యవహరించా..

– సౌమ్య, జడ్పీహెచ్ఎస్, మక్కువ, మన్యం జిల్లా

నేను ప్రతిపక్ష నేతగా వ్యవహరించా. చాలా ఆనందంగా ఉంది. ప్రతిపక్షమంటే ప్రశ్నించడంతోపాటు సమాధానాన్ని పూర్తిగా వినాలి. సభ ఇలా ఉంటుందని మాకు ప్రయోగాత్మకంగా చూపించడం కొత్త అనుభూతినిచ్చింది.



ఏపీ శాసనసభ సమావేశంలో మాట్లాడుతున్న సీఎస్ విజయానంద్



మాక్ అసెంబ్లీలో నిరసన తెలుపుతున్న సభ్యులు

తెలంగాణ ఎమ్మెల్యేగా నవీన్‌యాదవ్ ప్రమాణస్వీకారం



స్పీకర్ ఛాంబర్‌లో నవీన్‌యాదవ్‌తో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్. చిత్రంలో వీహెచ్, నరసింహాచార్యులు, బీర్ల అయిలయ్య, శ్రీధర్‌బాబు, విజయలక్ష్మి, అనిల్‌కుమార్ యాదవ్, అజారుద్దీన్ తదితరులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఇటీవల జరిగిన ఉపఎన్నికలో జూబ్లీహిల్స్ శాసనసభ నియోజకవర్గం నుంచి ఎన్నికైన నవీన్‌యాదవ్‌తో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేయించారు. బుధవారం శాసనసభ భవనంలోని స్పీకర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్‌బాబు, అజారుద్దీన్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు వీహెచ్, శాసనసభ కార్యదర్శి వి.నరసింహాచార్యులు, ఆయా కార్పొరేషన్ల ఛైర్మన్లు, నవీన్‌యాదవ్ కుటుంబసభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో గెలిపించిన జూబ్లీహిల్స్ ప్రజలకు రుణపడి ఉంటానని ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా గాంధీభవన్‌కు చేరుకొని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాగంటి గోపీనాథ్‌పై కోర్టులో కేసులు వేశానని, ఆయన చనిపోకపోయినా ఉపఎన్నికలు వచ్చేదని ఈ సందర్భంగా నవీన్‌యాదవ్ వ్యాఖ్యానించారు. మాగంటి చనిపోయిన తర్వాత కేసులు వెనక్కి తీసుకున్నట్లు చెప్పారు.

ఆ ప్రాజెక్టుల చింత తీరేలా..

- వనశక్తి తీర్పు ఉపసంహరణతో ఆశలు
- 'సియా'కు మార్గదర్శకాల కోసం ఎదురుచూపులు
- పర్యావరణ అనుమతులకు మళ్లీ దరఖాస్తు

ఈనాడు–అమరావతి: వనశక్తి తీర్పును సుప్రీం కోర్టు ధర్మాసనం ఉపసంహరించుకోవడంతో మన రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులకు శుభసూచకంగా మారనుంది. ఆయా ప్రాజెక్టుల పర్యావరణ అనుమతులకు త్వరితగతిన అడుగులు వేసేందుకు మళ్లీ వెసులుబాటు లభించింది. ఈ క్రమంలో ఇప్పటికే రూ.వేల కోట్లు ఖర్చు చేసినా నిరుపయోగంగా ఉన్న చింతలపూడి ఎత్తిపోతల, రాయలసీమ ఎత్తిపోతల పథకాలు పట్టాలెక్కే ఆస్కారం ఉంటుంది. మరి కొన్ని ఇతర సాగునీటి ప్రాజెక్టులూ ఈ కోవలోకి వస్తాయి. వనశక్తి తీర్పును ఉపసంహరించుకుంటూ కిందటి వారంలో సుప్రీం ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. పాత తేదీలతో అనుమతులు ఇచ్చే విషయంలో వేరే ధర్మాసనానికి విచారణ బాధ్యతలు అప్పగిస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆ తీర్పు ఆధారంగా కేంద్ర అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ కొత్తగా ఇచ్చే మార్గదర్శకాలు ఈ ప్రాజెక్టులకు కీలకం కానున్నాయి. రాష్ట్రంలో ఒక స్థాయి వరకు పర్యావరణ అనుమతులు ఇచ్చేందుకు స్టేట్ ఎన్విరాన్‌మెంటల్ అప్రైజల్ అథారిటీ (సియా- రాష్ట్ర పర్యావరణ అంశాల మదింపు సంస్థ)కి అధికారం ఉంది. కేంద్ర మంత్రిత్వశాఖ నుంచి ఆ మార్గదర్శకాలు వారికి అందుతాయి. ఆ తర్వాత ఈ సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ముందడుగు పడుతుంది. చింతలపూడి ఎత్తిపోతల పనులు తిరిగి చేపట్టేందుకు అవసరమైన అనుమతులు తీసుకునేందుకు తాజా పరిస్థితుల్లో మూడు నెలల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు.

రూ.4,190 కోట్లు ఖర్చు చేసినా ఎక్కడి పనులు అక్కడే..

- చింతలపూడి ఎత్తిపోతల ద్వారా 3 దశల్లో 90 రోజుల్లో 53.50 టీఎంసీల నీటిని ఎత్తిపోసి 2 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు, 2.10 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఇవ్వాలని ఉద్దేశించారు.
- 4 జిల్లాల్లో 410 గ్రామాలకు మంచినీళ్లు అందుతాయి.
- ఇప్పటికే రూ.4,190 కోట్లు ఖర్చు చేశారు. అంచనాలు పెంచుతూ ప్రతిపాదనలూ పంపారు.

ఇప్పుడు ఏ దశలో ఉంది: తొలిదశలో పంపుహౌస్‌లు రెండూ పూర్తయ్యాయి. ప్రధాన కాలువ అంతా నీటి సరఫరాకు వీలుగా దాదాపు పనులు పూర్తయ్యాయి.

పర్యావరణ అనుమతుల మాటేమిటి: సియా వద్ద పర్యావరణ అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండగా సుప్రీంకోర్టు వనశక్తి తీర్పు వచ్చింది. 2021లో కేంద్ర అటవీ పర్యావరణశాఖ కొన్ని మార్గదర్శకాలు ఇచ్చింది. 2025 మే నెలలో.. ఈ మార్గదర్శకాలు చెల్లవంటూ వనశక్తి తీర్పు పేరుతో సుప్రీంకోర్టు నిర్ణయం వెలువరించింది. పర్యావరణ అనుమతుల అంశాల్లో ఎలా వ్యవహరించాలో సియాకు మార్గదర్శకాలు అందాయి.

- దీంతో చింతలపూడికి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్సు(టీఓఆర్)లు ఇచ్చేందుకు చేసిన దరఖాస్తును సియా తిరస్కరించింది. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో ఇప్పుడు మళ్లీ సియా వద్ద దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. టీఓఆర్‌కు అనుమతి వస్తే పర్యావరణ మదింపు చేయాలి. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాల్సి ఉంటుంది.
- మరోవైపు చింతలపూడి ఎత్తిపోతలకు హరిత ట్రైబ్యునల్ రూ.73.60 కోట్ల జరిమానా విధించింది. ఆ జరిమానా తగ్గింపునకు సుప్రీంకోర్టును ఆశ్రయించే ఉద్దేశంతో అధికారులు ఉన్నారు. పర్యావరణ అనుమతులకు ఇబ్బందులు ఉన్న నేపథ్యంలో ఆ అంశం పెండింగులో పడినా తాజా పరిణామాలతో మళ్లీ దానికి కూడా కదలిక రానుంది. పట్టిసీమ ఎత్తిపోతల, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాలకు హరిత ట్రైబ్యునల్ పెద్ద మొత్తంలో జరిమానా విధించినా మళ్లీ కోర్టులను ఆశ్రయించి తగ్గింపు వెసులుబాటు పొందారు.

రాయలసీమ ఎత్తిపోతల మాటేమిటి?

శ్రీశైలం జలాశయంలో కనిష్ఠ నీటిమట్టం వద్ద కూడా సీమ జిల్లాలకు నీటిని పంపేందుకు వీలుగా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని వైకాపా ప్రభుత్వం చేపట్టింది. రోజుకు 3 టీఎంసీల శ్రీశైలం జలాలు మళ్లిస్తారు. ఇప్పటికే రూ.739 కోట్లు దీనికి ఖర్చు చేశారు. హరిత ట్రైబ్యునల్ ఈ పనులను అడ్డుకుంది. సరైన పర్యావరణ అనుమతులు లేకుండా పనులు చేస్తున్నందున వీటిని నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. నీటి వినియోగం తగ్గించుకుని తాగునీటి అవసరాల కోసం ఈ పథకాన్ని ఉపయోగించేలా రీ డిజైన్ చేసే ఆలోచనతో జలవనరులశాఖ ఉంది. తాజా పరిణామాలతో పర్యావరణ అనుమతులు తెచ్చుకునే ఆస్కారమూ ఏర్పడుతుంది.

సమీకృత టమాటో వాల్యూచైన్ ప్రాజెక్టును వేగవంతం చేయాలి: టీజీ భరత్

ఈనాడు, అమరావతి: సమీకృత టమాటో వాల్యూ చైన్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి భరత్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్‌ను ఆయన దిల్లీలో కలిసి ప్రాజెక్టుపై చర్చించారు. రాష్ట్రంలో ఆహార శుద్ధి యూనిట్ల అభివృద్ధికి సంబంధించిన అంశాలపైనా ఆయనతో సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ.. "రాష్ట్రంలోని ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీవో)లను ప్రోత్సహించేందుకు పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేయాలి. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద స్టార్టప్‌లు, సూక్ష్మ పరిశ్రమలను బలోపేతం చేసేందుకు వీలుగా తిరుపతి, బాపట్ల, లాం, పులివెందుల్లో ఇంక్యుబేషన్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలపాలి. రాష్ట్రంలోని రైతులకు ప్రయోజనం కల్పించేందుకు పంట కోత తర్వాత నష్టాలను తగ్గించడంపై దృష్టిపెట్టాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించేందుకు ఆహారశుద్ధి యూనిట్లను బలోపేతం చేయడంలో కేంద్రం సహకరించాలి. ఈ ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు" అని వెల్లడించారు.

యువత దరికి రాజ్యాంగం చేరాలి

- తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



జ్యోతి వెలిగిస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, సుదర్శన్‌రెడ్డి, నరసింహశర్మ, జగన్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: ప్రతి భారతీయుడు.. ముఖ్యంగా యువత రాజ్యాంగ సూత్రాలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని.. తల్లిదండ్రులు, విద్యావేత్తలు, ప్రభుత్వ సంస్థలు, పౌరసమాజం సమష్టిగా రాజ్యాంగాన్ని యువత దరికి చేర్చేందుకు కృషిచేయాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి 'మీ రాజ్యాంగాన్ని తెలుసుకోండి' అని పిలుపునిచ్చారని.. ఇందులోభాగంగా యువత రాజ్యాంగం గురించి సృజనాత్మకంగా, అనుభవపూర్వకంగా తెలుసుకునే మార్గాలను వివరిస్తూ వారిని ప్రోత్సహించాల్సి ఉందన్నారు. 76వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం హైకోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగం లీగల్ డాక్యుమెంట్ కాదని, ప్రజాస్వామ్యానికి జీవనాడి వంటిదని.. ప్రజల ఆకాంక్షలకు మార్గదర్శనం చేస్తూ ప్రతి పౌరుడి హక్కులను పరిరక్షిస్తుందన్నారు. ఏడు దశాబ్దాలకుపైగా 'వైవిధ్యంలో ఏకత్వం' స్ఫూర్తిని నిలబెట్టి ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా మన దేశం నిలబడటానికి అవకాశం కల్పించిందన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన ప్రక్రియ ద్వారా తెలంగాణ ఏర్పాటైందని, ఇది ప్రాంతీయ వైవిధ్యాన్ని అందించిందన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తి కేవలం సంస్థలు, కోర్టు గదులకే పరిమితం కాకూడదని.. ప్రతి ఇల్లు, ప్రతి వ్యక్తికీ చేరాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగ రక్షణ బాధ్యత కేవలం న్యాయ, శాసన, కార్యనిర్వాహక వ్యవస్థలపైనే కాదని, రాజ్యాంగ విలువలు నేర్పే విద్యావేత్తలు, అమలుచేసే నిర్వాహకులు, ప్రజల్లో అవగాహన పెంచే మీడియా, హక్కులను తెలిపే పౌరసమాజం, కుటుంబం, ఇలా రోజువారీ రాజ్యాంగ నైతికత ద్వారా జీవించే ప్రతిఒక్కరిపైనా ఉందన్నారు.

రవాణా శాఖలో హోంగార్డులసేవలు మరో ఏడాది కొనసాగింపు

ఈనాడు, అమరావతి: రవాణా శాఖలో పనిచేస్తున్న 320 మంది హోంగార్డుల సేవలు మరో ఏడాదిపాటు కొనసాగించేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రోడ్డు భద్రతా కార్యక్రమాలు, ఆక్రమణల తొలగింపు పనులకు పోలీసు శాఖకు చెందిన హోంగార్డులను రవాణా శాఖ వినియోగించుకుంటోంది. ఈ ఏడాది నవంబరు నుంచి వచ్చే ఏడాది అక్టోబరు వరకు వారి సేవలను కొనసాగించేందుకు వీలుగా ప్రభుత్వం అనుమతించింది.



గోవా చలనచిత్రోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర శకటం

- ఏపీ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఎండీ కేవీఎస్ విశ్వనాథన్

ఈనాడు, అమరావతి: గోవా అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో తొలిరోజు జరిగిన పరేడ్‌లో రాష్ట్ర శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని ఏపీ చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఎండీ కేవీఎస్ విశ్వనాథన్ తెలిపారు. 20 మంది డూప్ లైవ్ నటీనటులు, ఏపీలోని షూటింగ్ లొకేషన్లతో 'భారతీయ సినిమా మరియు పర్యాటక రంగాల హృదయ స్పందన' ఇతివృత్తంతో ఈ శకటాన్ని ప్రదర్శించినట్లు బుధవారం ఓ ప్రకటనలో ఆయన వివరించారు. గోవాలో ఈ నెల 20న ప్రారంభమైన ఈ వేడుకలు 28 వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్‌టీల సర్దుబాటు

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీ కారణంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పోస్టులు కోల్పోతున్న 166 మంది కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్‌టీ)ను సర్దుబాటు చేశారు. విజయవాడలోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో బుధవారం వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చారు. పోస్టింగ్‌లు పొందిన సీఆర్‌టీలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

సిలికా మైనింగ్ లీజులపై సీఎస్ నేతృత్వంలో విచారణకు కమిటీ

ఈనాడు, అమరావతి: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం మోమిడి గ్రామంలో సిలికా మైనింగ్‌లో అక్రమాలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై పూర్తి వివరాలతో ఆరు వారాల్లో నివేదిక సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనికోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని పేర్కొంది. గ్రామంలోని సర్వే నంబర్లు 696, 695 లోని రిజర్వు ఫారెస్టు భూముల్లో సిలికా మైనింగ్ కోసం కేటాయించడంపై ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మన్ దువ్వ రమేశ్ హైకోర్టులో పిల్ వేశారు. ఈ మేరకు సీఎస్ ఛైర్మన్‌గా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, అటవీ దళాల అధిపతి (పీసీసీఎఫ్) సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రధాని సాధించిన మరో విజయం: సీఎం

ఈనాడు, అమరావతి : 2030 కామన్వెల్త్ క్రీడల నిర్వహణ హక్కులు మన దేశానికి దక్కడం గర్వకారణమని సీఎం చంద్రబాబు అన్నారు. ఇది ప్రధాని మోదీ నాయకత్వంలో సాధించిన మరో విజయమని 'ఎక్స్‌'లో పేర్కొన్నారు.

కృష్ణా జలాలపై మన హక్కుల్ని వదులుకోం

- ట్రైబ్యునల్‌లో బలమైన వాదనలు వినిపించాలి
- జలవనరులశాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: కృష్ణా నదీ జలాలపై ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న హక్కుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'రాష్ట్ర నీటి కేటాయింపుల్లో ఎలాంటి మార్పులు చేసేందుకూ వీలు లేదు. చట్టపరంగా ఏపీకి దక్కిన వాటా యథాతథంగా కొనసాగించాల్సిందే. దీనిపై బలమైన వాదనలు వినిపించాలి. ఏటా వేలాది టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోంది. వరద జలాల వినియోగంలో పొరుగు రాష్ట్రాలతో సామరస్య పూర్వకంగా వ్యవహరించాలి' అని అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సచివాలయంలో జలవనరులశాఖ అధికారులతో సమీక్షించారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల్లో 811 టీఎంసీల వాటా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత జలవివాదాల ట్రైబ్యునల్-1 ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించింది. వాటిని పునస్సమీక్షించాలనడం సరికాదు' అని చంద్రబాబు పేర్కొన్నారు. వర్షాలు విస్తారంగా కురిసినా పలుచోట్ల జలాశయాలు ఇంకా పూర్తిస్థాయిలో నిండకపోవడానికి కారణాలపై శాస్త్రీయ అధ్యయనం చేయాలని అధికారుల్ని ఆదేశించారు. అన్ని మేజర్, మీడియం, మైనర్ రిజర్వాయర్లలో ప్రస్తుతం 1,095 టీఎంసీల నీటి నిల్వలున్నాయని, 83.43% నిండాయని అధికారులు వివరించారు. రాష్ట్రంలో భూగర్భజలాలు గతేడాది సగటున 7.45 మీటర్లు ఉండగా.. ఈ ఏడాది 6.8 మీటర్లకు పెరిగాయని చెప్పారు. భూగర్భజలాలు 8 మీటర్ల కన్నా దిగువన ఉన్న 5,697 గ్రామాల్లో వాటి పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

పోలవరం ఎడమకాలువకు వెంటనే భూసేకరణ

పోలవరం ప్రాజెక్టు ఎడమకాలువ త్వరితగతిన పూర్తి చేసేందుకు వెంటనే భూసేకరణ చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వేగంగా అందించాలని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై సీఎం సమీక్షించారు. డయాఫ్రమ్ వాల్ పనులు 73% పూర్తయ్యాయని, వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి నిర్మాణం పూర్తి చేస్తామని అధికారులు వివరించారు. వైబ్రో కాంపాక్షన్ పనులు 97% జరిగాయని, వచ్చే నెలాఖరుకు పూర్తవుతాయని తెలిపారు. డయాఫ్రమ్ వాల్ పనులు కొలిక్కి వస్తుండటంతో ప్రాజెక్టులో ప్రధాన భాగమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు ఇప్పటికే ప్రారంభించామని పేర్కొన్నారు.

రాజధాని రైతుల సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన రైతుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని, సాంకేతిక సమస్యలుంటే తక్షణం పరిష్కరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. వైకాపా ప్రభుత్వంలో ఇబ్బందులు ఎదుర్కొన్న రాజధాని రైతులకు న్యాయం చేయాలన్నారు. అప్పట్లో వారు చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. సచివాలయంలో సీఆర్‌డీఏపై బుధవారం ఆయన సమీక్షించారు. 'ప్రభుత్వానికి సహకరించిన రైతులకు అదే స్థాయిలో సహకారం అందించాలి. అపరిష్కృత సమస్యల్ని మంత్రివర్గం ముందుంచాలి. రాజధాని నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందించాలి. నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీ వద్దు. అంతిమంగా అమరావతిని ప్రపంచశ్రేణి నగరంగా తయారు చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యం' అని చంద్రబాబు పేర్కొన్నారు. సమీక్షలో మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ, పురపాలక శాఖ అధికారులు పాల్గొన్నారు.

చెరలో 5 దశాబ్దాలు.. విడిపించిన సర్కారు



పోలేపల్లిలో స్వాధీనం చేసుకున్న ఎన్నెస్పీ భూమిలో పెడస్టల్ హద్దురాళ్ల ఏర్పాటు

తెలంగాణలో రూ.378 కోట్ల విలువైన 420 ఎకరాల ఎన్నెస్పీ భూముల స్వాధీనం

- మంత్రి పొంగులేటి ఆదేశంతో అధికార యంత్రాంగం చర్యలు

ఈనాడు, ఖమ్మం- కూసుమంచి, న్యూస్‌టుడే: తెలంగాణలో ఖమ్మం జిల్లాలో ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్నెస్పీ) కాల్వల కోసం సేకరించిన భూములవి. రాజకీయ నేతల ప్రోద్బలంతో అన్యాక్రాంతమయ్యాయి. కబ్జాదారులు కొన్నేళ్లుగా ఫలసాయమూ పొందుతున్నారు. రెవెన్యూశాఖ మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికార యంత్రాంగం నాటి దస్త్రాల బూజు దులిపింది. ఖమ్మం జిల్లాలో ఒక్క పాలేరు నియోజకవర్గంలోనే సుమారు 800 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించింది. ఇప్పటికే రూ.378 కోట్ల విలువైన 420.08 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. ఇందులో 299.08 ఎకరాలు ఖమ్మం నగరం సమీపంలోని పోలేపల్లి గ్రామంలో ఉండటం విశేషం. నేలకొండపల్లిలో 47, ముత్తగూడెం 35, మద్దులపల్లిలో 24, ఏదులాపురంలో 10, తిరుమలాయపాలెం (గ్రామకంఠం)లో 3, బారుగూడెంలో 2 ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు.

కాంక్రీటు కరకట్ట నిర్మాణానికి కదలడంతో...

ఖమ్మం జిల్లాలో ఎన్నెస్పీ కాల్వలు తవ్వి, మట్టికట్టలు నిర్మించడానికి 1968లో రైతుల నుంచి భూములు సేకరించారు. కాల్వ నిర్మాణం పూర్తయ్యాక... మట్టి తవ్విన ప్రాంతాల్లోని గుంతలను కొందరు పూడ్చివేసి సేద్యపు భూమిగా మార్చుకున్నారు. పట్టా పాసుపుస్తకాలూ పొందారు. స్థిరాస్తి వ్యాపారం ఊపందుకోవడంతో ఇళ్ల స్థలాలుగా విక్రయించడానికి సన్నద్ధమవుతున్నారు. మరోపక్క, మున్నేరు వరదలతో నదికి ఇరువైపులా ఉన్న ఖమ్మం నగరం, ఏదులాపురం పట్టణ ప్రజలు ఏటా ఇబ్బందులు పడుతున్నారు. సమస్య శాశ్వత పరిష్కారానికి ఇరువైపులా కాంక్రీటు కరకట్ట (రిటెనింగ్ వాల్) నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం ప్రైవేటు భూములను సేకరించనున్నారు. ఆ భూములు కోల్పోతున్నవారికి పోలేపల్లిలో స్థలాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఎన్నెస్పీ స్థలాల ఆక్రమణపై విచారణకు మంత్రి పొంగులేటి ఆదేశించారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సారథ్యంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మంత్రి ఓఎస్డీ రమేశ్, నీటిపారుదల శాఖ ఈఈ రమేశ్‌రెడ్డి, అర్బన్, రూరల్ తహసీల్దార్లు రంగంలోకి దిగారు. భూసేకరణకు అప్పట్లో ప్రభుత్వం విడుదల చేసిన అవార్డు ప్రతులకు సంబంధించిన సుమారు 10 వేల పేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి... కబ్జాకు గురైన ఎన్నెస్పీ, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 30 ఎకరాలకు గతంలో రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టాలనూ రద్దు చేశారు. ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో స్వాధీనం చేసుకున్న 420.08 ఎకరాల ఎన్నెస్పీ భూముల చుట్టూ రూ.25 లక్షలతో పెడస్టల్ హద్దురాళ్లను పాతారు.

జోగి అనుచరుడు డబ్బు తీసుకుని మోసం చేశారు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్ అనుచరుడు, ఇబ్రహీంపట్నానికి చెందిన ఓ వ్యక్తి తన నుంచి రూ.లక్షల్లో నగదు తీసుకొని మోసం చేశాడని, తిరిగి చెల్లించమంటే చంపేస్తానని బెదిరిస్తున్నాడని విజయవాడకు చెందిన వేముల సత్యవాసవి వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, యాదవ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ జి.నరసింహయాదవ్, ఆర్యవైశ్య సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేశ్ వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. సైన్యంలో పనిచేసిన తనకు ప్రభుత్వం ఇచ్చిన 2.5 ఎకరాల సాగు భూమిని ఆక్రమించిన వైకాపా నేతలపై చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్లకు చెందిన శేషగిరిరావు ఫిర్యాదు చేశారు. వివిధ ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం ముక్తినూతలపాడుకు చెందిన మురళీ కోరారు.

అంబేడ్కర్ ఆశయాల్ని ముందుకు తీసుకెళ్లే పార్టీ తెదేపా

- తెదేపా కేంద్ర కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం



కార్యక్రమంలో రాజ్యాంగ పీఠిక చదువుతున్న తెదేపా నేతలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, షరీఫ్, యనమల రామకృష్ణుడు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, వర్ల రామయ్య తదితరులు

ఈనాడు, అమరావతి: రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ ఆశయాల్ని ముందుకు తీసుకెళ్లే పార్టీ తెదేపా అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. సమానత్వం, స్వేచ్ఛతో జీవించే మార్గమే రాజ్యాంగమని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. మహాత్మాగాంధీ, బీఆర్ అంబేడ్కర్, తెదేపా వ్యవస్థాపకులు ఎన్టీఆర్, రాజ్యాంగ పీఠిక చిత్రాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంబేడ్కర్ సిద్ధాంతాల స్ఫూర్తితోనే ఎన్టీఆర్ తెదేపాను స్థాపించారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, ఎమ్మెల్యేలు నక్కా ఆనంద్‌బాబు, తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేపాడ చిరంజీవిరావు రాజ్యాంగం గొప్పతనం గురించి మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన రాజ్యాంగ వ్యతిరేక చర్యల్ని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ గుర్తుచేశారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్, మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



భాజపా రాష్ట్ర కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, చిత్రంలో ఆ పార్టీ నాయకులు

ఈనాడు, అమరావతి: అంబేడ్కర్ ఆశయాలకు, రాజ్యాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం, నెహ్రూ కుటుంబం తూట్లు పొడిచిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విమర్శించారు. అంబేడ్కర్‌ను ఎన్నికల్లో ఓడించడానికి 75వేల ఓట్లను చెల్లని ఓట్లుగా మార్చారని, ఆయన్ను అడుగడుగునా అవమానించారని ఆరోపించారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ చిత్రపటానికి మాధవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ దినోత్సవం అంటే సంబరాలు చేసుకోకూడదని, రాజ్యాంగం వెనుక అంతరాన్ని, మౌలిక అంశాలను అందరూ తెలుసుకోవాలని కోరారు. ప్రపంచ నేతగా అంబేడ్కర్‌ను పరిచయం చేయాలన్నది ప్రధాని మోదీ లక్ష్యమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు ప్రధాని అమలుచేస్తున్నారని తెలిపారు. భాజపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భాజపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నాగలక్ష్మి, అధికార ప్రతినిధి షేక్ బాజీ, మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

శనగ రైతులకు అక్కరకు రాని రాయితీ విత్తనాలు

ఈనాడు, అమరావతి: రబీ సీజన్‌లో రాయితీపై ఇస్తున్న విత్తనాలు శనగ రైతులకు అక్కరకు రాకుండా పోయాయి. బహిరంగ మార్కెట్‌లో ధర తక్కువగా ఉండటమే ఇందుకు కారణం. 25 శాతం రాయితీతో క్వింటాల్ రూ.5,850 చొప్పున ఏపీ సీడ్స్ రైతులకు అందిస్తుండగా వ్యాపారుల వద్ద రూ.5,750కే లభిస్తున్నాయి. దీంతో బహిరంగ మార్కెట్‌లోనే రైతులు కొనుగోలు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 1.50 లక్షల క్వింటాళ్ల శనగ విత్తనాలు పంపిణీ లక్ష్యంగా నిర్ణయించారు. ఇప్పటికి లక్ష్యంలో 50 శాతం పంపిణీ కూడా పూర్తి కాలేదు. రాయితీపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం కారణంగా.. అప్పటికే అధిక శాతం రైతులు ఇప్పటికే బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసేశారు.

◆ రైతులు ఎక్కువగా జేజీ-11 (ఎర్రశనగ) సాగు చేస్తారు. కొందరు రైతులు కాక్-2 (కాబూలీ) రకం విత్తుతున్నారు. ఏపీ సీడ్స్ క్వింటాల్ రూ.7,100కు మధ్యవర్తుల నుంచి సేకరించారు. వాస్తవానికి శనగ ధర క్వింటాల్ రూ.5,300 నుంచి రూ.5,600 మాత్రమే ఉంది. అంటే రైతుకు దక్కే ధరతో పోలిస్తే సేకరణ ధర క్వింటాల్‌కు రూ.1,500 వరకు అధికం. రైతుకు దక్కే రాయితీ కంటే.. మధ్యవర్తులకే ప్రయోజనం దక్కినట్లు అయింది.

◆ సేకరణ ధరకు శుద్ధి, రవాణా, ఇతర ఖర్చులతో విక్రయధర క్వింటాలుకు రూ.7,800 చొప్పున వ్యవసాయశాఖ నిర్ణయించింది. దీనిపై 25 శాతం రాయితీతో రూ.5,850 చొప్పున రైతులకు అందిస్తున్నారు. 20 కిలోల విత్తన శనగ బస్తా రైతుకు రూ.1,170లకు ఇస్తున్నారు. సాధారణంగా జేజీ-11 ధరతో పోల్చితే కాక్-2 (తెల్లశనగ) రకం ధర ఎక్కువగా ఉండేది. ఈసారి శనగ ధరలు పతనమైన నేపథ్యంలో రెండు రకాల విత్తనాలు ఒకే ధరకు విక్రయిస్తున్నారు. ఈ విషయమై ఉమ్మడి గుంటూరు జిల్లా ఏపీ సీడ్స్ మేనేజరు సుమలత మాట్లాడుతూ మట్టి, రాళ్లు లేకుండా శుద్ధిచేసి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 10 వేల క్వింటాళ్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు 4 వేల క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. మండల వ్యవసాయాధికారుల నుంచి ప్రతిపాదనలు వస్తే రైతులు కోరిన గ్రామానికి విత్తనం పంపిస్తామన్నారు. ఈసారి అమ్మకాలు కొంత మందకొడిగా ఉన్నాయన్నారు.

సీపీఎస్ వాటా ప్రాన్ ఖాతాలో జమకు అనుమతి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయంలోని కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం (సీపీఎస్) ఉద్యోగుల జీతాల నుంచి మినహాయించి, గతంలో ప్రాన్ ఖాతాకు జమచేయని మొత్తాన్ని జమ చేసేందుకు కూటమి ప్రభుత్వం అనుమతించింది. వైకాపా ప్రభుత్వంలో సీపీఎస్ ఉద్యోగుల జీతాల నుంచి 10% చొప్పున సీపీఎస్ మొత్తాన్ని మినహాయించారు. ఆ మొత్తాన్ని ప్రాన్‌ఖాతాకు జమచేయకుండా ప్రభుత్వం వద్దే ఉంచేశారు. దీనిపై సచివాలయ సీపీఎస్ ఉద్యోగుల సంఘం పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించడంతో స్పందించిన ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆ మొత్తం రూ.8.86 కోట్లను డ్రా చేసి, ప్రాన్‌ఖాతాలో జమచేసేలా ట్రెజరీ విభాగానికి ఆదేశాలు ఇచ్చింది.

కృష్ణపట్నం ఇన్‌ఫ్రాకు కేటాయించిన భూములను రద్దు చేయాలంటూ హైకోర్టులో పిల్

ఈనాడు, అమరావతి: పారిశ్రామిక వాడ(సెజ్) ఏర్పాటుకు ఉద్దేశించిన భూములను కృష్ణపట్నం ఇన్‌ఫ్రా టెక్ ప్రైవేట్ లిమిటెడ్ దుర్వినియోగం చేస్తోందని, ఈ నేపథ్యంలో భూకేటాయింపులను రద్దు చేయాలంటూ దాఖలైన పిల్‌పై హైకోర్టు స్పందించింది. వివరాలతో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఇతర ప్రతివాదులను ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

◆ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని వివిధ గ్రామాల పరిధిలో మల్టీ ప్రొడక్ట్ సెజ్ ఏర్పాటు కోసం కృష్ణపట్నం ఇన్‌ఫ్రా సంస్థకు 4,731 ఎకరాలు కేటాయించారని ఆ భూములను ఆ సంస్థ దుర్వినియోగం చేస్తోందంటూ గూడూరుకు చెందిన ఎన్ మునీందర్‌రెడ్డి హైకోర్టులో పిల్ వేశారు.

భూములను తనఖా పెట్టి రుణాలు

బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది బి.ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. సెజ్ అభివృద్ధి కోసం కృష్ణపట్నం ఇన్‌ఫ్రా సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం 2009-10లో భూములు కేటాయించిందన్నారు. ఒప్పందానికి అనుగుణంగా పారిశ్రామికవాడను నిర్మించడంలో ఆ సంస్థ విఫలమైందన్నారు. ఇప్పటి వరకు సెజ్ కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. భూములను తనఖా పెట్టి బ్యాంకుల నుంచి భారీగా రుణం తీసుకుంటోందన్నారు. తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడినప్పటికీ సెజ్ నుంచి బహుళ ఉత్పత్తుల ఇండస్ట్రియల్ పార్క్‌గా మార్చేందుకు 2023 నవంబరులో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కృష్ణపట్నం ఇన్‌ఫ్రా సంస్థ చేతుల్లో ఉన్న భూముల్లో 30 వేల కోట్ల విలువ చేసే సిలికా ఖనిజం నిక్షిప్తమై ఉందన్నారు. మైనింగ్ నిర్వహిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి రాయల్టీ కింద 4,500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని భూములను వెనక్కి తీసుకోవాలని కోరారు.

హక్కులతో పాటు విధులూ ఉంటాయి

- గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులకు ప్రత్యేక పాత్రను ఇచ్చినా.. హక్కులు, విధులు నాణేనికి రెండువైపులా ఉంటాయని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ప్రజలకు సంక్రమించిన హక్కులతో పాటు విధులూ ఉంటాయని గమనించాలన్నారు. రాజ్‌భవన్‌లోని దర్బార్ హాలులో బుధవారం నిర్వహించిన 76వ రాజ్యాంగ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భారత రాజ్యాంగ రూపశిల్పి డా.బీఆర్ అంబేడ్కర్, రాజ్యాంగ ముసాయిదా కమిటీ సభ్యుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఔషధ పరీక్ష ప్రాంతీయ ల్యాబ్‌లు అందుబాటులోకి తెస్తాం

- ఔషధ నియంత్రణ పరిపాలన సంచాలకుడు ప్రసాద్

ఈనాడు, అమరావతి: విశాఖపట్నం, కర్నూలు ప్రాంతీయ ఔషధ పరీక్ష ప్రయోగశాల భవనాల నిర్మాణం పూర్తయిందని అవసరమైన పరికరాలు, సిబ్బందిని సమకూర్చి త్వరలో అందుబాటులోకి తెస్తామని ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్ తెలిపారు. 'ఈనాడు'లో ఈనెల 25న ప్రచురితమైన 'మందు మంచిదో కాదో తేల్చేదెట్లా?' కథనంపై ఆయన స్పందించారు. పరికరాల కొనుగోలుకు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు ఏపీఎంఎస్ఐడీసీకి పంపామని, టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. 16 మంది సాంకేతిక సిబ్బంది పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల కార్యాలయాల ప్రారంభం తుపాను కారణంగా వాయిదాపడిందని, త్వరలో ప్రారంభిస్తామని ప్రసాద్ వెల్లడించారు.

కొత్తగా ఉద్యోగాల్లో చేరిన 3.59 లక్షల మంది..

పీఎంవీబీఆర్‌వై కింద ప్రయోజనాలు అందిస్తాం

- 'ఈనాడు'తో ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ నికుంజ్ మీనా



ఈనాడు, హైదరాబాద్: "భవిష్యనిధి వృద్ధాప్యంలో ఆసరా కోసం. అవసరాల పేరిట తరచూ నగదు ఉపసంహరించవద్దు. ఈపీఎఫ్ వడ్డీరేటు ఏడాదికి 8.25 శాతం ఉంటోంది. కానీ నెలవారీ నిల్వలపై వడ్డీ చెల్లించడం ద్వారా చక్రవడ్డీ తరహాలో ఈ మొత్తం వడ్డీ 9శాతానికి పైగా చేరుతుంది. వడ్డీపై ఆదాయ పన్ను ఉండదు. ఈ ప్రయోజనాలు పరిగణనలోకి తీసుకుంటే 10 శాతానికి వెళ్తుంది. ఈస్థాయిలో ప్రతిఫలం ఇచ్చే పథకాలేవీ లేవు'' అని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ (బంజారాహిల్స్) నికుంజ్ మీనా అన్నారు. తెలంగాణలో గడిచిన మూడునెలల కాలంలో 3.59 లక్షల మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరి ఈపీఎఫ్ పరిధిలోకి వచ్చారని తెలిపారు. తెలంగాణలో ఉన్న మొత్తం 36,833 సంస్థల్లో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన (పీఎంవీబీఆర్‌వై)లో 9,390 నమోదయ్యాయని, వీటిలో 3.59 లక్షల మంది కొత్తగా ఉద్యోగాలు పొంది, తొలిసారి ఈపీఎఫ్‌లో చందాదారులుగా చేరారని వివరించారు. కొత్త కార్మిక కోడ్‌లతో కార్మికులందరూ సామాజిక భద్రత పరిధిలోకి వస్తారని... త్వరలోనే విధివిధానాలు అమల్లోకి వస్తాయన్నారు. ఇటీవల సీబీటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమల్లోకి తీసుకువచ్చేలా కూడా విధివిధానాలు సిద్ధమవుతున్నాయన్నారు. ఆధార్, బ్యాంకు ఖాతా, పాన్ నంబర్లతో ఈ-కేవైసీతో పాటు ఈ-నామినేషన్ ద్వారా యాజమాన్యాల ప్రమేయం లేకుండా క్లెయిమ్‌లు వేగంగా పొందవచ్చన్నారు. ఈపీఎఫ్‌వో చేపట్టిన పీఎంవీబీఆర్‌వై, ఈఈసీ కార్యక్రమాలపై 'ఈనాడు'తో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.

ఉద్యోగాలు కల్పించిన సంస్థలకూ ప్రోత్సాహకాలు

"పీఎంవీబీఆర్‌వై 2027 జులై 31 వరకు అమల్లో ఉంటుంది. దేశవ్యాప్తంగా కొత్తగా 3.5కోట్ల ఉద్యోగాలు కల్పించాలన్నది లక్ష్యం. అందులో ఈ రీజియన్ వాటా 2 శాతం ఉంటుందని అంచనా. కొత్తగా ఉద్యోగాలు కల్పించిన సంస్థలకు, ఉద్యోగాలు పొందిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందుతాయి.

■ ఈ పథకం కింద తొలిసారి ఉద్యోగం పొందిన (గతంలో ఎక్కడా పనిచేసి ఉండకూడదు) వారికి ఏడాదికి రూ.15వేల ప్రోత్సాహకం అందుతుంది. తొలి ఆరునెలల సర్వీసు పూర్తి అయిన తరువాత రూ.7,500 ఇస్తారు. ఆ తరువాత ఆర్థిక అక్షరాస్యత పరీక్ష పాస్ కావాలి. అనంతరం మిగతా ఆరునెలల సర్వీసు పూర్తి చేస్తే మరో రూ.7,500 ఉద్యోగి ఖాతాలో జమ అవుతాయి.

■ సాధారణ రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తే రెండేళ్ల పాటు, తయారీ రంగంలో ఉద్యోగాలు కల్పించిన యాజమాన్యాలకు నాలుగేళ్ల పాటు పథకం ప్రోత్సాహకాలు అందుతాయి. వేతనం రూ.10 వేల లోపు ఉంటే నెలకు రూ.1,000... వేతనం రూ.10,001 నుంచి రూ.20వేల లోపు ఉంటే రూ.2వేలు... వేతనం రూ.20వేల నుంచి రూ.లక్షలోపు ఉంటే నెలకు రూ.3వేలు యాజమాన్యం ఖాతాలో వేస్తాం. రూ.లక్ష వేతనం కన్నా ఎక్కువ ఉంటే పథకం వర్తించదు.

■ జోన్ల పునర్విభజన తరువాత బంజారాహిల్స్ జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యాయి.

■ 2017 అక్టోబరు 1నుంచి ఉద్యోగాల్లో చేరినా... యాజమాన్యాలు ఈపీఎఫ్ పథకం అమలు చేయకుంటే ఉద్యోగుల నమోదు ప్రచార కార్యక్రమం (ఈఈసీ)లో భాగంగా కేవలం రూ.100 జరిమానా చెల్లించి ఈపీఎఫ్ పరిధిలోకి తీసుకురావచ్చు. అయితే ఆ ఉద్యోగి ప్రస్తుతం పనిచేస్తూ ఉండాలి. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి యజమాని తన వాటా 12 శాతం వడ్డీతో సహా చెల్లించాలి. యాజమాన్యాలు తప్పుడు క్లెయిమ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు.

■ డెత్ క్లెయిమ్‌లు ఏడు రోజుల్లో సెటిల్ చేయాలన్న నిబంధనలున్నా.. మూడు రోజుల్లోనే పూర్తి చేస్తున్నాం. యాజమాన్యాలు 'డెత్' అని స్పష్టంగా పేర్కొంటే మరింత వేగంగా పరిష్కరించే అవకాశాలు ఉంటాయి.

■ ఏమైనా సమస్యలు ఉంటే.. ఈపీఎఫ్ఐజీఎంఎస్ లేదా సీపీజీఆర్ఏఎంఎస్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఆధార్ ఆధారిత యూఏఎన్‌తో ఒక సంస్థ నుంచి మరొక సంస్థకు మారితే సర్వీసు ఆటోమేటిక్‌గా ట్రాన్స్‌ఫర్ అవుతుంది" అని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ నికుంజ్ మీనా వివరించారు.

తితిదేలో జరిగిన అవినీతిలో జగన్‌రెడ్డి బంధువుల పాత్రపైనా విచారణ చేయించాలి

- యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ డిమాండ్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వంలో తితిదేలో జరిగిన అవినీతిలో వైకాపా అధినేత జగన్‌రెడ్డి బంధువుల పాత్రపైనా విచారణ చేయించాలని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ డిమాండ్ చేశారు. అప్పట్లో శ్రీవారి ప్రసాదాల తయారీలో, నిర్మాణాల్లో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం నరసింహయాదవ్ విలేకరులతో మాట్లాడారు. "తెదేపా ప్రభుత్వం ప్రారంభించిన గరుడ వారధి పనుల్ని తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిలిపేసింది. ఆ పార్టీ నాయకులు కాంట్రాక్టర్లతో లాలూచీపడి డిజైన్లు మార్చేశారు. తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ వరకే ప్రాజెక్టును కుదించారు'' అని ఆరోపించారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటు

ఈనాడు, అమరావతి: భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గాన్ని ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ప్రకటించారు. అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం ఇచ్చేలా నియామకం జరిపినట్లు బుధవారం ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.

◆ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు: తల్లా ధనరాజు (కాకినాడ), సింహాద్రి సత్యనారాయణ (తూర్పు గోదావరి), బి.శ్రీలక్ష్మి (కృష్ణా), శీనయ్య (నెల్లూరు), సతీష్‌చంద్ర (కడప), బి.ఈరన్న (కర్నూలు)◆ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు: వేమిరెడ్డి సురేంద్రరెడ్డి (తిరుపతి), వైవీ సుబ్బారావు (గుంటూరు)◆ రాష్ట్ర కార్యదర్శులు: అన్నెపు ఉమామహేశ్వరరావు (శ్రీకాకుళం), నాగిరెడ్డి సతీష్‌రావు (డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ), దాసరి బాబి (పశ్చిమ గోదావరి), డి.నాగరాజు (ఏలూరు), చేపూరి వినయ్‌నారాయణ (నెల్లూరు), వి.కిరణ్‌కుమార్ (అన్నమయ్య), చింతా శరత్‌కుమార్‌రెడ్డి (శ్రీసత్యసాయి)◆ కోశాధికారి: వి.పాండురంగ విఠల్ (గుంటూరు)◆ జోనల్ ఇన్‌ఛార్జులు: టి.తిమ్మారెడ్డి, ఉన్నం సింహాద్రి నారాయణ◆ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శిగా కె.రఘువంశీ, సోషల్ మీడియా ఇన్‌ఛార్జిగా ఎం.అనిత.

మంచికో లెక్క... చెడుకో లెక్క...

- రోడ్డుపై వెళుతూ తుపుక్కుమని ఉమ్మేశారు.
- ఫోన్‌లో మాట్లాడుతూనే రోడ్డు దాటేస్తున్నారు.
- సోషల్ మీడియాలో అవాకులూ చెవాకులూ మాట్లాడేశారు.

మన దేశంలో అయితే ఏం చేస్తారు? మనకెందుకులే అని చూస్తూ ఊరుకుంటారు... మహా అయితే మందలిస్తారు... అంతేనా..!

అదే చైనాలో చేసే ప్రతి తప్పునూ రికార్డు చేసి లెక్క తేల్చేస్తారు. ప్రభుత్వ ఉద్యోగం నుంచి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ దాకా ప్రతిదాంట్లో కొర్రీ పెట్టేస్తారు. వారి వివరాలను బహిర్గతం చేసి పరువును బజారుకీడ్చేస్తారు.

● తీసుకున్న లోన్లు, వాడిన క్రెడిట్ కార్డుల బిల్లులు సక్రమంగా కడుతున్నామా? అనేదానికి ఓ లెక్క ఉంది. అదే క్రెడిట్ స్కోర్. అది మన ఆర్థిక క్రమశిక్షణకు సూచిక. మరి వ్యక్తిగత క్రమశిక్షణకు కొలమానమేంటి? ఈ ప్రశ్న చైనాలో పాలకులకు వచ్చింది. అందుకే వాళ్లు ప్రజల వ్యవహారశైలికి కూడా స్కోర్ పెట్టేశారు. దీన్ని సోషల్ క్రెడిట్ సిస్టం అన్నారు.

● ఎవరైనా హత్యలు, దోపిడీలు, అవినీతి వంటి నేరాలు చేసిన వారిపై చైనా చట్టాల ప్రకారం అతి తీవ్ర చర్యలు ఉంటాయి. దీంతోపాటు పౌరులు ప్రతిఒక్కరూ బాధ్యతగా ఉండి తీరాలని భావించిన ఆ ప్రభుత్వం ఈ వ్యవస్థపై అనేక సంవత్సరాలు కసరత్తు చేసి 2020లో ఈ సిస్టంను కొలిక్కితెచ్చింది.

● సోషల్ క్రెడిట్ సిస్టమ్‌ను నేషనల్ డెవలప్‌మెంట్ అండ్ రిఫార్మ్స్ కమిషన్, పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా, సుప్రీం పీపుల్స్ కోర్టు నిర్వహిస్తాయి.

● చైనాలో అడుగడుగునా ఉన్న హైటెక్ సీసీ కెమెరాలు ప్రతి ఒక్కరి కదలికలపై నిఘా వేసి ఉంచుతాయి. అందరి ఫేస్ డేటా ముందుగానే రికార్డు చేసి ప్రభుత్వం అధీనంలో ఉంటుంది కాబట్టి... ఎవరైనా, ఏదైనా తేడా చేస్తే వెంటనే దాన్ని ఫేస్ డేటాతో పోల్చి చూస్తారు. పోలీసులు, బ్యాంకులు, ఉద్యోగం చేసే సంస్థలు, అధికారిక వ్యవస్థల నుంచి కూడా వ్యక్తిగత డేటా తీసుకుంటారు. వీటన్నిటి ఆధారంగా స్కోర్ ఇస్తారు.

● డేటా విశ్లేషణ నిరంతరం జరుగుతుంటుంది. అందుకే స్కోర్ శాశ్వతంగా ఒకేలా ఉండదు. వారి ప్రవర్తనను బట్టి మారుతూ ఉంటుంది. మంచి పనులు చేసినప్పుడు పెరగొచ్చు. వ్యతిరేక చర్యలకు పాల్పడితే తగ్గిపోవచ్చు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వ్యక్తిగతంగా తెలియపరుస్తారు.

● సోషల్ క్రెడిట్ స్కోర్ వల్ల ఎవరికి వారు అప్రమత్తంగా, బాధ్యతగా ఉంటారని చైనా పాలకులు భావిస్తున్నారు. అయితే దీనివల్ల వ్యక్తిగత స్వేచ్ఛకు తీవ్ర ఆటంకం కలుగుతోందని, పౌరహక్కులకు నష్టం జరుగుతోందన్న విమర్శలూ లేకపోలేదు.



ఎలా ఉంటే... పైపైకి...

● ప్రకృతి వైపరీత్యాల వంటి సమయంలో సాహసోపేతమైన పనిచేసి పది మందికీ ఉపయోగ పడితే
● స్థిరమైన ఆర్థిక స్థితి, క్రెడిట్ హిస్టరీ కలిగి ఉంటే
● పేదవాళ్లకు సాయం చేసిన రికార్డు ఉంటే
● సోషల్ మీడియాలో ప్రభుత్వానికి మద్దతుగా పోస్టులు ఉంటే..
● రక్తదానం చేసి ఉంటే..
● ఇరుగు, పొరుగు వాళ్లతో సహృదయంతో ఉండడం వల్ల
● కుటుంబంలో పెద్దవాళ్లను జాగ్రత్తగా చూసుకుంటున్న వారికి
● దానధర్మాలు, ఇతర సామాజిక కార్యక్రమాలకు నేతృత్వంవహిస్తే...

ఏం చేస్తే... పాతాళానికి...

● ట్రాఫిక్ ఉల్లంఘనలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తే..
● ప్రభుత్వ వ్యవస్థలకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహిస్తే.
● అమ్మ, నాన్నలను సక్రమంగా చూసుకోకుంటే...
● సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్టులుపెడితే
● ఇంటర్‌నెట్ ద్వారా రూమర్లను వ్యాప్తిచేస్తుంటే
● చేసిన తప్పులకు పశ్చాత్తాపం లేకుండా ఉన్నవారికి
● సాంస్కృతిక హననం చేస్తుంటే...
● ఆన్‌లైన్ గేమ్స్‌లో మోసం చేస్తే..

మంచి స్కోర్‌లు వస్తే...

➤ విద్యా సంస్థల్లో సీట్లు, ఉద్యోగాల్లో ప్రాధాన్యం
➤ రుణాలు తేలిగ్గా పొందొచ్చు
➤ అద్దె కార్లు, సైకిళ్లను డిపాజిట్ లేకుండానే తీసుకోవచ్చు
➤ జిమ్ ఉచితం ➤ ప్రజారవాణాలో ఛార్జీలు తక్కువ
➤ ఆసుపత్రుల్లో ముందు వరస. తక్కువ సమయంలోనే వైద్యం ➤ వేగంగా ఉద్యోగోన్నతి
➤ ప్రభుత్వం కల్పించే గృహ సదుపాయాల్లో ప్రాధాన్యం
➤ కొన్ని రకాల పన్ను రాయితీలు

తక్కువ స్కోర్ వస్తే...?

■ లైసెన్సులు, పర్మిట్ల జారీ ఆలస్యమవుతుంది
■ హైస్పీడ్ రైళ్లు, విమాన ప్రయాణాల్లో నిబంధనలు
■ బ్యాంకు రుణాలు తొందరగా రావు ■ ప్రభుత్వ ఉపాధి మార్గాలకు దారులు మూసుకుపోయినట్లే ■ ప్రైవేటు విద్యా సంస్థల్లోనూ ప్రవేశాలు కష్టమే.
■ వారి ఐడీ నంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టడం ద్వారా అందరికీ వీరి గురించి తెలిసేలా చేస్తారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఇంటికొచ్చిన కిరణ్



17 ఏళ్లకు ఏఐ సహాయంతో..

పదేళ్ల వయసులో ఐస్‌క్రీం కొనుక్కోడానికి ఇంటి నుంచి బయటకువచ్చి తప్పిపోయిన ఓ బాలిక.. 17 ఏళ్ల తర్వాత మళ్లీ అమ్మానాన్నల చెంతకు చేరింది. ఓ ఫౌండేషను చొరవ, ఏఐ సాంకేతికత ఈ కలయికను సుసాధ్యం చేశాయి. పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌కు చెందిన కిరణ్ 2008లో ఐస్‌క్రీం కోసం రోడ్డుపైకి వచ్చింది. తిరిగి వెళ్లడానికి దారి తెలియక తప్పిపోయి కొత్త ప్రాంతానికి చేరింది. ఈ క్రమంలో కరాచీకి చెందిన 'ఈధీ ఫౌండేషను' అనే స్వచ్ఛందసంస్థ ఆమెను చేరదీసింది. ప్రస్తుతం కిరణ్ వయసు 27 ఏళ్లు కాగా.. గత 17 ఏళ్లుగా ఆమె తల్లిదండ్రుల ఆచూకీ తెలుసుకోడానికి ఎంతో ప్రయత్నించినా లాభం లేకపోయింది. తాజాగా ఏఐ సాంకేతికత అందుబాటులోకి రావడంతో సైబర్ నిపుణుడు నబీల్ అహ్మద్‌ను సంప్రదించారు. కిరణ్ తాజా ఫొటోలు, చిన్నప్పటి ఫొటోల సాయంతో ఎడ్వాన్స్‌డ్ ఏఐ ముఖ గుర్తింపును ఉపయోగించి ఆమె తండ్రి ఎవరో గుర్తించారు. ఇస్లామాబాద్‌లో దర్జీగా పనిచేస్తున్న అబ్దుల్ మజీద్‌కు విషయం చెప్పడంతో ఆయన కుమార్తెను ఇంటికి తీసుకువెళ్లడానికి తక్షణం కరాచీకి చేరుకున్నారు. కిరణ్ ఆచూకీ కోసం ఎన్నో రకాలుగా ప్రయత్నించి విఫలమై మిన్నకుండిపోయామని.. ఇప్పుడు చాలా సంతోషంగా ఉందని మజీద్ అన్నారు. -కరాచీ

మెట్టినింటికి మమత

హెలికాప్టర్‌లో



పెళ్లంటే ఊరంతా చెప్పుకొనే ముచ్చటలా జరగాలని కోరుకున్న ఓ యువకుడు వివాహం అనంతరం తన భార్యను హెలికాప్టర్‌లో ఇంటికి తీసుకువెళ్లాడు. తొలిసారిగా మెట్టినింట అడుగుపెట్టిన ఆ యువతికి జీవితాంతం మరిచిపోలేని మధుర జ్ఞాపకాన్ని అందించాడు. సాధారణంగా వధువు పుట్టింటి నుంచి అత్తగారి ఇంటికి బయలుదేరే సందర్భం చాలా భావోద్వేగంతో కూడుకొని ఉంటుంది. కని పెంచిన తల్లిదండ్రులను, సొంత ఊరిని వదిలి కొత్తచోటుకు వెళ్లడం ఆడవాళ్ల జీవితంలో ఎంతో బరువైన సందర్భం. అలాంటి క్షణాలను కొత్త పెళ్లికొడుకు హితేశ్ వర్మ ఇలా ప్రత్యేకంగా మార్చడం విశేషం. హరియాణాలోని హిసార్ సమీప తలవానీ గ్రామం నుంచి నవవధువు మమతావర్మ గత ఆదివారం రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్ సమీప ధని రాయకాన్ గ్రామంలోని మెట్టినింటికి వెళ్లింది. -ఈటీవీ భారత్

మేం ఎగురుతాం



ఓ ప్రముఖ పారిశ్రామికవేత్త ఎక్స్ ఖాతాలో.. చేత్తో చేపను పట్టుకుని వదలగా... అది ఎగిరిపోతున్న వీడియోని షేర్ చేశారు. 'ఎగిరే చేపను చూడటం ఇదే మొదటిసారి' అన్న క్యాప్షన్ పెట్టారు. అది నెట్టింట కలకలం సృష్టించగా.. చివరకు ఐఎఫ్ఎస్ అధికారి పర్వీన్ రంగంలోకి అది డిజిటల్ చేప... ఏఐ సృష్టి అని తేల్చారు. దీంతో అసలు ఎగిరే చేపలు నిజంగా ఉన్నాయా అని నెటిజన్లు వెతకడం ప్రారంభించారు. అలా తాజాగా వార్తల్లోకి వచ్చిందీ ఎగిరే చేప. ఎక్సోకోటిడే కుటుంబంలో సుమారు 40కి పైగా జాతులకు చెందిన సముద్ర చేపలు నిజంగానే ఎగురుతాయి. వీటికి పెక్టోరల్ ఫిన్స్ అనే పెద్ద రెక్కలుంటాయి. తోక ఫోర్క్ ఆకారంలో చీలినట్లుగా ఉంటుంది. ఈ రెండింటి సాయంతో అవి గాల్లో ఎగురుతాయి. వీటికి పక్షులంత బలంగా ఎగిరే సామర్థ్యం లేకపోయినా 100-650 అడుగుల వరకూ గంటకు 56 కి.మీ. వేగంతో ఎగరగలవట. ఇందుకోసం ముందుగా నీళ్లలో కొంతమేర వేగంగా ఈదాక, బయటికొచ్చి రెక్కల్ని ఆడిస్తూ గాల్లోకి లేస్తాయి. ముఖ్యంగా మాంసాహార సముద్రజీవుల నుంచి తప్పించుకునేందుకే ఇవి గాల్లోకి లేస్తాయి. ఈ జాతుల్లో చాలావరకూ 7-12 అంగుళాల పొడవే ఉంటాయి. కొన్ని మాత్రమే 18 అంగుళాల పొడవు పెరుగుతాయి. అట్లాంటిక్, పసిఫిక్, హిందూ మహాసముద్రాల్లోని ఉష్ణమండల ప్రాంతాల్లో కనిపించే ఈ చేపలకు బార్బడోస్ పెట్టింది పేరు. అందుకే ఆ ద్వీప దేశాన్ని 'ద ల్యాండ్ ఆఫ్ ద ఫ్లైయింగ్ ఫిష్' అనీ అంటారు. ఎగిరే చేప వాళ్ల జాతీయ చిహ్నాల్లో ఒకటి. జాతీయ వంటకం కూడా. జపాన్, చైనా, ఇండియా, వియత్నాం, ఇండొనేషియా దేశాల్లోనూ వీటిని పట్టి విక్రయిస్తుంటారట. -వసుంధర డెస్క్

మేం రిచ్

నయా ఐలాండ్‌కు మిత్తల్!



ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్సెలర్ మిత్తల్ కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిత్తల్ బ్రిటన్‌కు గుడ్‌బై చెప్పి.. దుబాయ్‌కు తన మకాం మార్చనున్నారన్న వార్తలతో సంపన్నులకు అనువుగా, అత్యంత భద్రత కలిగిన లగ్జరీ జోన్ 'నయా ఐలాండ్' చర్చనీయాంశంగా మారింది. దుబాయ్‌లోని జుమైరా తీరప్రాంతంలో అన్ని హంగులతో తీర్చిదిద్దిన ప్రైవేటు దీవి ఇది. అత్యంత గోప్యతా ప్రమాణాలను పాటిస్తూ ఈ ద్వీపాన్ని నిర్మించారు. పరిమిత స్థాయిలో విశాలమైన బ్రాండెడ్ హోమ్స్‌కు ప్రాధాన్యం ఇవ్వడంతో ప్రతి ఇంటికి బీచ్ సదుపాయం ఉంటుంది. సముద్రానికి దగ్గరగా విలాస నౌకల్లో విహరించవచ్చు. ఈ ద్వీపంలో మిత్తల్ భవంతి 21,000 నుంచి 48,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండవచ్చని తెలుస్తోంది. ఇక్కడ ఒక విల్లా ప్రారంభ ధర రూ.109 కోట్ల వరకు ఉంటుందని స్థానిక మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇలా ఒక ఆస్తిని సొంతం చేసుకున్నవారు పదేళ్ల గోల్డెన్ వీసాకు అర్హులని అందులో పేర్కొన్నారు. బ్రిటన్‌లో కీర్‌స్టార్మర్ ప్రభుత్వ పన్ను విధానం నచ్చక లక్ష్మీ మిత్తల్ మకాం మార్పు నిర్ణయం తీసుకున్నారు. -ఇంటర్నెట్ డెస్క్

కారు నంబరుకు రూ.1.17 కోట్లు!

హరియాణాలో ఓ కారు నంబరు ఏకంగా రూ.1.17 కోట్లు పలికింది. దీంతో ఇది దేశంలోనే అత్యంత ఖరీదైన కారు రిజిస్ట్రేషన్ నంబరుగా నిలవనుంది. చర్కీ దాద్రి జిల్లాలోని బధ్ర సబ్‌డివిజన్‌లోని ఆర్టీయే కార్యాలయంలో హెచ్‌ఆర్-88-బీ-8888 నంబరు కోసం 30 ఏళ్ల వ్యాపారవేత్త ఒకరు బుధవారం ఆన్‌లైన్ వేలంలో ఈ ధరను కోట్ చేశారు. భివానీ జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన వ్యాపారవేత్తగా బిడ్డర్‌ను గుర్తించారు. రవాణా వ్యాపారంతోపాటు సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉన్న ఆయన మరో జిల్లాలో స్థిరపడ్డారు. ఆయన ఇంకా కారు కొనకపోవడం విశేషం. -చండీగఢ్



అరణ్యభవన్‌లో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్

కళ్ల ముందే పులుల కదలికలు!

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలోని ప్రధాన అటవీ ప్రాంతాలన్నింటినీ ఒకేచోట నుంచి పర్యవేక్షించే టైగర్ ప్రొటెక్షన్ మానిటరింగ్ సెల్ హైదరాబాద్‌లోని అరణ్యభవన్‌లో అందుబాటులోకి వచ్చింది. ఇప్పటివరకు దేశంలో కర్ణాటక, మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఈ తరహా టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. తెలంగాణలో మాత్రం ఒకే కేంద్రం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పెద్దపులులు, ఇతర వన్యప్రాణుల్ని పర్యవేక్షించేలా అటవీశాఖ దీన్ని ఏర్పాటు చేసింది. అరణ్యభవన్ నుంచి సెల్‌ఫోన్ సిగ్నల్ ఉన్న అటవీప్రాంతాల్లో తిరిగే వన్యప్రాణుల కదలికల్ని రియల్‌టైంలో చూడొచ్చు. సిగ్నళ్లు లేనిచోట కెమెరా ట్రాప్‌లో నమోదయ్యే చిత్రాల్ని క్షేత్రస్థాయి సిబ్బంది ప్రతిరోజు అప్‌లోడ్ చేస్తారు. గ్రామాల సమీపంలో పెద్దపులులు కనిపించినా, వేటాడే ముఠాల కదలికలున్నా, గాయపడ్డ పులులకు చికిత్స అవసరమైనా, పశువులపై పులుల దాడులు జరిగినా.. అక్కడికి తక్షణ స్పందన బృందాలను పంపే సౌలభ్యం ఉంటుంది. పులులకు రేడియో కాలర్లు అమర్చే కార్యక్రమం కూడా ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు అటవీశాఖ బుధవారం వెల్లడించింది.

హైదరాబాద్‌లో 8 చోట్ల ఇంటర్‌సిటీ

బస్ టెర్మినళ్లు



100 శాతం విద్యుత్ బస్సులు ● ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా 12 మార్గాల్లో ప్రత్యేక కారిడార్లు

'తెలంగాణ రైజింగ్ విజన్ 2047'కి ఆర్టీసీ ముసాయిదా ప్రణాళిక

ఈనాడు, హైదరాబాద్: వందశాతం విద్యుత్తు బస్సులు.. ఎనిమిది చోట్ల ఇంటర్‌సిటీ బస్ టెర్మినళ్లు.. బస్సుల రాకపోకలకు 12 మార్గాల్లో ప్రత్యేక కారిడార్లు.. నిత్యం కోటి మందికిపైగా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం.. కొత్తగా 134 బస్‌డిపోలు, బస్టాండ్ల నిర్మాణం.. 60 వేల ఉద్యోగాల సృష్టి వంటి లక్ష్యాలతో రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) తెలంగాణ రైజింగ్ విజన్-2047లో తమ వంతు భాగస్వామ్యాన్ని అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రగతిలో రవాణా ఆధారిత అభివృద్ధి కీలకమైన అంశం కావడంతో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ప్రజారవాణా సంస్థను విస్తరించనున్నట్లు ముసాయిదా ప్రణాళికలో పేర్కొంది. గడిచిన రెండేళ్లలో సాధించిన విజయాలను తెలపడంతోపాటు 'విజన్ 2047'లో రవాణా ఆధారిత అభివృద్ధి ప్రణాళికలు, ప్రయాణికులకు మెరుగుపరిచే సేవలను వివరించింది. ముసాయిదాలో అంశాలివీ..

బస్‌టెర్మినళ్లు ఎక్కడెక్కడంటే: హైదరాబాద్‌లో ప్రధాన బస్ స్టేషన్లపై ఒత్తిడి తగ్గించడం, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 8 భారీ ఇంటర్‌సిటీ బస్ టెర్మినళ్లు నిర్మిస్తారు. ఇవి బాటసింగారం, ఇబ్రహీంపట్నం, శంషాబాద్, మొయినాబాద్, మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్, ఫ్యూచర్‌సిటీలో వస్తాయి. ఇందులో ఐదు 2030 నాటికి, మిగతా మూడు 2039 వరకు అందుబాటులోకి వస్తాయి.

● ప్రస్తుతం 9,878 బస్సులున్నాయి. 2030 నాటికి మరో 2,132 సమకూర్చుకోవడం. 2047కి మరో 13,522 పెంచడం లక్ష్యం. ప్రస్తుతం రోజు 60 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. 2039కి కోటి మందికి ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందని అంచనా. పెరిగే బస్సులకు 2047 నాటికి మరో 134 బస్‌డిపోలు, బస్టాండ్లు వస్తాయి. ఫలితంగా 60 వేల కొత్త ఉద్యోగాలు వస్తాయి.

ప్రత్యేక కారిడార్లు: ట్రాఫిక్ సమస్యల్లేకుండా వేగంగా ప్రయాణించేలా 12 డెడికేటెడ్ బస్ కారిడార్లను ఆర్టీసీ ప్రతిపాదించింది. శ్రీశైలం జాతీయ రహదారి-కడ్తాల్/ఆమన్‌గల్లు, నాగార్జునసాగర్ జాతీయ రహదారి- ఇబ్రహీంపట్నం/మాల్, విజయవాడ హైవే- చౌటుప్పల్, ఘట్‌కేసర్-భువనగిరి, కీసర-తుర్కపల్లి, కరీంనగర్ హైవే-గజ్వేల్/ప్రజ్ఞాపూర్, మేడ్చల్-తూప్రాన్, దుండిగల్/నిజామాబాద్ హైవే-నర్సాపూర్, ముంబయి హైవే-సంగారెడ్డి, కోకాపేట-శంకర్‌పల్లి, అప్పా జంక్షన్- చేవెళ్ల, బెంగళూరు హైవే-షాద్‌నగర్. ఇందులో నాలుగింటిని 2030కి, మిగిలిన ఎనిమిదింటిని 2039కి అందుబాటులోకి తేవాలన్నది లక్ష్యం.

▼ కాలుష్యాన్ని తగ్గించడం, పర్యావరణ అనుకూలంగా ఉండేలా డీజిల్ బస్సుల స్థానంలో 2030 నాటికి 30 శాతం విద్యుత్తు బస్సులు తేవాలన్నది లక్ష్యం. 2039 నాటికి ఆర్టీసీలో 100 శాతం బస్సులు ఎలక్ట్రిక్‌వే తిరుగుతాయి.

▼ 2030 నాటికి 51 బస్‌డిపోల్లో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేస్తారు. 2 ఎకరాలకుపైగా విస్తీర్ణం ఉన్న ఖాళీ భూముల్లో 50 శాతం భూములను సౌరవిద్యుత్ ఉత్పత్తి కోసం ఉపయోగంలోకి తేవాలన్నది లక్ష్యం.

ఏఐ సేవలు.. డిస్‌ప్లే బోర్డులు: 2030 నాటికి ఏఐ ఆధారిత ప్రయాణికుల సహాయక వ్యవస్థ అమలు చేస్తారు. తద్వారా సేవలు స్మార్ట్‌గా, మరింత వేగంగా, కచ్చితత్వంతో ఆటోమేటెడ్ పద్ధతిలో అందుతాయి. బస్సుల రాకపోకలు, ఆలస్యం, గమ్యస్థానం సమాచారం వంటి వివరాలు చూపించేలా 2039 నాటికి 335 బస్‌స్టేషన్లలో రియల్‌టైం డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేస్తారు. ఏఐ ఆధారంగా ప్రయాణికుల డిమాండ్‌ను అంచనా వేస్తూ రూట్లు, బస్సులు నడిపే విధానం అమలు చేయాలన్నది ప్రణాళిక.

■ బస్సు డ్రైవర్ అప్రమత్తంగా ఉన్నారా? అలసిపోయారా? అని గమనించేందుకు 2030 నాటికి 200 దూరప్రాంత బస్సుల్లో మానిటరింగ్, సేఫ్టీ సిస్టమ్ ఏర్పాటుకు నిర్ణయించారు. 2047 నాటికి అన్ని బస్సుల్లో అందుబాటులోకి తీసుకొస్తారు.

రెండేళ్లలో సాధించింది ఇదీ..

మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం 2023 డిసెంబరు 9న ప్రారంభమైంది. మహిళలు 243.95 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారు. తద్వారా వారికి రూ.8,235 కోట్ల ఆర్థిక ప్రయోజనం కలిగింది. మహిళా స్వయం సంఘాలు అందించిన నిధులతో 2025 మార్చి 3 నుంచి 152 బస్సులు రోడ్డెక్కాయి. హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధిలో 2,800 ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని నిర్ణయించారు.



మది నదిలో.. పరవశం పరవళ్లు



సోమశిల నుంచి శ్రీశైలం వరకూ దాదాపు 120 కి.మీ. దూరమూ కృష్ణా నదికి ఇరువైపులా అంతెత్తున పెట్టనిగోడల్లా కొండలు. పైగా నల్లమల అడవి. అక్కడక్కడ చేపలు పట్టే జాలర్లు మినహా.. మనుషులకు దూరంగా ప్రకృతి తన నిజరూపంలో దర్శనమిచ్చే అద్భుత దృశ్యకావ్యం అది. కొండలను ఒరుసుకుంటూ ప్రవహిస్తున్న కృష్ణా తరంగాలపై లాంచీలో ప్రయాణం.. ఏదో దివ్యలోకానికి పయనమా అన్నట్లు సాగుతుంది. నాగర్‌కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు కృష్ణా నదిలో తెలంగాణ టూరిజం శాఖ ఏర్పాటు చేసిన లాంచీలో ఈ విహారం యాత్రికులకు జీవితాకాల జ్ఞాపకంగా మిగిలిపోతుందంటే అతిశయోక్తి కాదు. తోటి యాత్రికులతో ఆటపాటలు.. వనభోజనాల్లా.. జలభోజనాలు.. ఈ సందడిలో అప్పుడే ఆరు గంటలు గడిచిపోయాయా? అనిపిస్తుందంటే అతిశయోక్తి కాదు.. – న్యూస్‌టుడే, పెబ్బేరు

కనిపించింది కస్తూరి

70 ఏళ్ల తర్వాత



వేటగాళ్ల బారిన పడి అంతరించిపోతున్న అరుదైన కస్తూరి జింక (మస్క్ డీర్) దాదాపు 70 ఏళ్ల తర్వాత పశ్చిమబెంగాల్‌లోని నియోరా వ్యాలీ నేషనల్ పార్కులో అటవీశాఖ కెమెరాలకు చిక్కింది. ఈ జింక చివరిసారిగా 1955లో సింగాలీలా జాతీయ పార్కులో కనిపించింది. రెడ్ పాండాలను లెక్కించేందుకు వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా నియోరా వ్యాలీ అడవుల్లో సర్వే నిర్వహించింది. సర్వే పూర్తయ్యాక కెమెరా ఫుటేజీ పరిశీలిస్తున్నప్పుడు ఈ జింకల చిత్రాలు బయటపడినట్లు రాష్ట్ర చీఫ్ ఫారెస్ట్ అధికారి జె.వి.భాస్కర్ తెలిపారు. వీటి నాభిలో ఉన్న గ్రంథి ఉత్పత్తి చేసే కస్తూరిని పరిమళ ద్రవ్యాల్లో ఉపయోగిస్తారు. –ఈటీవీ భారత్



వ్యవసాయ మ్యూజియం



అస్సాంలో అంతరించిపోతున్న గ్రామీణ వ్యవసాయ పరికరాలను తరువాతి తరాలకు పరిచయం చేసేందుకు వాటిని నిక్షిప్తం చేస్తున్నారు సోమేశ్వర్ దత్తా. అందుకోసం మ్యూజియాన్ని నిర్వహిస్తున్నారు. పదవీ విరమణ చేసిన ఈ పోలీసు అధికారి.. వ్యవసాయంలో సంప్రదాయంగా వినియోగించే.. నంగల్ (నాగలి), జువోలి (కాడి), ఎడ్ల బండి వంటి వాటితోపాటు చేపలు పట్టడానికి ఉపయోగించే వెదురు తెడ్డు తదితర పరికరాలను నిక్షిప్తం చేస్తున్నారు. ఒకప్పుడు ఈ పరికరాలన్నీ అస్సాంలో ప్రాచుర్యంలో ఉండేవి. క్రమంగా కనుమరుగవుతున్నాయి. దీంతో వాటిని భద్రపరిచి తరువాతి తరాలకు తెలియజేయాలని దత్తా నిక్షిప్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయనవద్ద 50 రకాలకుపైగా పరికరాలున్నాయి. –ఈటీవీ భారత్

త్వరలో.. 'ఖమ్మం జైలు తేనె'




ఖైదీలకు ఉపాధి కల్పనలో భాగంగా ఖమ్మం జిల్లా జైలు ప్రాంగణంలో తాజాగా తేనెటీగల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఇక్కడ ఉత్పత్తి చేసే తేనెను... జైలు ప్రాంగణంలోనే విక్రయించి, వచ్చే ఆదాయాన్ని ఆయా ఖైదీలకే ఇవ్వాలని నిర్ణయించారు. వివిధ స్వయం ఉపాధి కార్యక్రమాలకు నిలయంగా మారిన ఈ జైలు ప్రాంగణంలో ఖైదీల ఆధ్వర్యంలో ఇప్పటికే రాత పుస్తకాలు, బల్లలు, ఫినాయిల్ తదితర ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారు. చేపల పెంపకం చేపట్టారు. రాష్ట్రంలో చర్లపల్లి, సంగారెడ్డి, నిజామాబాద్ జిల్లా జైళ్లలోనే తేనెటీగల పెంపకం చేపడుతున్నారని.. అనేక వృక్షజాతులకు నిలయమైన ఖమ్మం జిల్లా జైలు ఆవరణలో వీటి పెంపకానికి ఎన్నో అనుకూలతలున్నాయని జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ తెలిపారు. – ఈనాడు, ఖమ్మం



రాజ్యాంగ పరిషత్ సభ్యులు వీరు..

పాఠశాల విద్యార్థులకు భారత రాజ్యాంగ రూపకల్పనపై అవగాహన కల్పించే లక్ష్యంతో మెదక్ జిల్లా చేగుంటలోని పీఎంశ్రీ జడ్పీ ఉన్నత పాఠశాలలో వినూత్న ప్రయత్నం చేశారు. రాజ్యాంగ రూపకల్పనకు నాడు ఏర్పాటైన రాజ్యాంగ పరిషత్ (కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీ)లో మొత్తం 299 మంది సభ్యులు ఉండగా... దాదాపు 200 మంది వివరాలను, వారి చిత్రాలను ఇంటర్‌నెట్ నుంచి సేకరించి.. ప్రత్యేకంగా ముద్రించి పాఠశాలలో ప్రదర్శించారు. బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయుడు లక్ష్మణ్ ఈ వినూత్న ప్రయత్నం చేశారు. – న్యూస్‌టుడే, చేగుంట

ఇతరులు మిమ్మల్ని గౌరవించాలంటే..



మీరు ఇతరుల నుంచి గౌరవాన్ని డిమాండ్ చేయలేరు. వారిని బతిమాలో, భయపెట్టో దాన్ని పొందలేరు. ఇతరులు చేయలేక పోయిన పనులను ధైర్యంగా స్వీకరించి పూర్తి చేయడం ద్వారా మాత్రమే మీరు గౌరవాన్ని సంపాదించుకోగలరు. మీరు సాధించిన అద్భుత ఫలితాలను చూసిన తర్వాత ఎవరూ మీ సామర్థ్యాన్ని ప్రశ్నించలేరు. –కులదీప్ వర్మ, మైండ్‌సెట్ మెంటార్